Damage Book

UNIVERSAL LIBRARY
OU_204455
UNIVERSAL LIBRARY

శ్రీ

# మునిత్రయ చరిత్రము.

రచయిత:

కవితాభూషణ, విద్వాన్,

వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

కాకినాడ:

కాకినాడముద్రాక్షరశాల.

1943

కాపీరైటు రిజిష్టర్డు]

[వెల రు. 2—[redacted]—0.

శ్రీగురుమూర్తయేనమః

# మనవి.

శ్రీజగద్గురు శ్రీకళ్యాణానంద భారతీ మహంతాచార్య మహాస్వాములవారు యువ సంవత్సర వైశాఖ శు ౧౩ గురువారమునాఁడు గుంటూరుపురమందలి శ్రీవారి శ్రీసదనమున శ్రీమన్మహా మహోపాధ్యాయ కళాప్రపూర్ణ వ్యాకరణ సార్వభౌమ శాస్త్రరత్నాకర తాతా సుబ్బారాయశాస్త్రులవారికి వ్యాకరణ సామ్రాజ్య పట్టాభిషేక మొనర్చు శుభసమయమున నిమ్మునిత్రయచరిత్రమును గొంతభాగము మాత్రము వినిపించితిని. తరువాత బహుధాన్య సంవత్సర భాద్రపదమున విజయనగరమందలి వేదవిజ్ఞానసంవర్ధినీసభ వార్షికోత్సవమునఁ బూర్ణముగ శ్రీ శాస్త్రులవారికి వినిపించి చరితార్థుఁడ నైతిని. ఆనాఁటి సభయందుఁ జదివిన విన్నపము.

క. ఏయమ్మకడుపు చల్లఁగ
నాయతశాఖాంచితము లనంతము లగునా
మ్నాయములఁ గనియెనో యా
గాయత్రీదేవి పాదకమలము లెంతున్.

ఆ. విజయనగర వేదవిజ్ఞానవర్ధని
సభ తృతీయవర్ష సన్మహోత్స
వమున నన్ను బిలువఁబనుచుట నాభాగ్య
మనుచు సభకు నంజలిని ఘటింతు.

శా. వేదాంగాగ్రిమమైన వ్యాకరణముర్విన్ నిల్పి గీర్వాణభా
షాదేవీలలితాకృతిన్ దెలిపి విశ్వంబోముఖానిత్రయ
స్వాదుశ్లోకవిశేషసంశ్రవణ మిప్పట్లన్ ప్రధానంబె యౌఁ
గాదా తెల్పుఁడు వేదరక్షణసమీత్యాదీక్షితుల్ పండితుల్.

ఉ. గురువులయాజ్ఞ నీకృతిని గూర్చితి భక్తిఁదలంచి కాని నా
తరమగునొక్కొ విశ్వవసుధాపతి పండితమాళి పుష్పరే
ణురుచిరగంధబంధుచరణుండగు రాయఁడుశాస్త్రిసన్నిధిన్
దిరముగనిల్చి నాకవితనేర్పు వెలార్పఁ దలంపుసేయఁగన్.

ఉ. నరులకు నంకితమ్మును బొనర్పనివాఁడనుగాను మున్ను నా
కరమున సింహకంకణము కాన్కఁగఁ బూన్చినకృష్ణరావుభూ
వరుఋణమీఁగనొక్కకృతిఁబల్కియొసంగియయుంటిఁగాని యి
ప్పరమగురూత్తమాంకితము భావ్యమొకో మనుజాంకితం బనన్.

క. గురు వనఁ బరమబ్రహ్మము
గురువుల కెల్లరకుఁ బరమగురువును దగునే
నరుఁడనఁదదంకితము కృతి
నరాంకితం బనఁగఁ జెల్లునా బుధులారా!

చ. సకలకళాప్రవీణులు విచక్షణులుఁ సడిసన్న సత్కవి
ప్రకరములుఁ విరాజిల ధరాతలవైధసలోకమంచు నె
న్నికగను నిమ్మహానగరి నేఁగృతికర్త నటంచుఁ జూపుమా
మకమతిసాహసంబునకు మాన్యులు వేయుగ నెంచఁబోకుఁడీ.

మ. మును గుంటూరుపురిఁ జగద్గురువు లింపున్నింపి సుబ్రాయశా
స్త్రిని శబ్దాగమసార్వభౌమపదసుశ్రీభాసితుఁ జేయు వే
ళన యిక్కావ్యము కొంత విన్పితి సమూలం బిప్డు దస్మత్కృతీ
శునకుఁ విన్పిక్కృతార్థతఁ గనెదఁ బ్రాజ్ఞుల్ సల్పుఁడోంకారముఁ.

## అమలాపుర సభావృత్తాంతము.

ఆ. విజయనగరినుండి వెడలి వచ్చినయంతఁ
ద్రిమునిచరిత వినఁగఁ దవిరినాఁడె
యమలపురము బోర్డుహైస్కూలుపాధ్యాయ
సమితి సంఘటించె సభలు రెండు.

శా. సారాచారవిహారుఁ డాంగలకలాసర్వస్వనిర్వాహకుం
డారాదాశ్రితశిష్యనిష్కుటవసంతాకారుఁ డుద్యద్యశో
భారారాధితరోదసీకుహరుఁ డప్పాద్వేదులోపాఖ్యసీ
తారామార్యుఁడు దేశికోత్తముఁడు సంధానించెనాఁడా సభల్.

గీ. అంది రఙ్గాసనాధిపత్యం బనుక్ర
మమ్మున దినద్వయమ్ము సదమ్ము నడుపఁ
గాశిభట్ట సుబ్బయబుధాగ్రణియు నడిమి
పల్లి శ్రీసుబ్బరాజు విద్వన్నుతుండు.

సీ. క్షత్రియాన్వయవతంసాయిత శ్రీనడిం
పల్లి వంశోత్పన్నమౌక్తికంబు
భావరాణ్ణారాయణావనీశులకు ద్వ్యా
ముష్యాయణుండైన పుత్రరత్న
మగణిత భోగభాగ్యముల భూలోకదే
వేంద్రప్రసిద్ధివహించు మేటి
సాహిత్యప్రియుఁడు రసజ్ఞశేఖరుఁడు వి
ద్వత్కవీంద్రుల కమర్త్యద్రుమంబు

శౌర్యధైర్యసాహసత్యాగచరమసీమ
సత్యశౌచదయార్జవాస్థానభూమి
దేశసేవాసమాత్తకీర్తిప్రపూర్ణుఁ
డాజనుష్పావనుఁడు సుబ్బరాజరాజు.

మ. కలలోనైనఁ బరాంగనాపరధనేచ్ఛాకాంక్ష సేయండు దృ
ష్టులకున్ సోఁకినఁదల్లులంచుఁదృణమంచున్ వాని భావించుఁ గా
ని లవంబేని జలింపఁడంచు బుధులేనిన్ సుబ్బరాజన్న ని
శ్చలతన్మానసమన్న సన్నుతులు హెచ్చున్ మ్రొక్కితీఱున్ వలెన్

సీ. పుత్రచతుష్కంబు పుత్రీచతుష్టయం
బెలమి సేవింప రంజిలెడు సుకృతి
పౌత్రదౌహిత్రసంపన్నసుందరమంది
రముల వసించు పుణ్యముగలాఁడు

రత్నగర్భాఖ్యసార్థకమైన పొలముల
బంగారు పండించు భాగ్యశాలి
యుతగోధేను జాతోత్కృష్టవర్ణకపూర్ణ
గోష్ఠపాళుల నాదుకొనెడు ధన్యుఁ

గీ. దక్షమైశ్వర్యుఁ డాశ్రితపక్షపాతి
మితహితస్మితపూర్వభాషితవిభూషి
తాననుఁడు దీనరక్షైకతానమనుఁడు
రమ్యగుణశాలి శ్రీ సుబ్బరాజమౌళి.

సీ. క్షాత్రధర్మమున మాంధాత్రతానగును బోలుఁ
బరమశాంతిని ఋషీశ్వరుల నేలు
నయమార్గమున యుగంధరు నగు సత్యభా
షణనియతిని హరిశ్చంద్రుఁడగును
ఏకపత్నీవ్రతవృత్తి రాముని మించు
భోగంబుల శచీవిభు హసించు
విశ్రాణనమున శిబిని దధీచిని మీఱు
విత్తసంపత్తిఁ గుబేరుఁ గేరుఁ

గీ. గంటిచూపాను మేర నఖండభూమి
ఖండములు గడించును విరాగము వహించు
శ్రీ నడిమిపల్లి వంశాబ్ధిశీతకరుఁడు
చిత్రచరితుండు సుబ్బరాట్క్షితిపకుఁడు.

ఉ. ఆదయ యాయుదారమతి యాయనపాయనిజాన్వవాయమ
ర్యాదలు నాసుధీజనసమాదృతి యానయనాంచలప్రసా
దోదయ మాకవీంద్రసరసోక్తి చమత్కృతివిస్మితిస్ఫుర
త్సాన్వితసుబ్బరాణ్మణికిఁ దక్క మఱొక్కని కెందుఁ దక్కునే.

శా. ఆమూలాగ్రము నామునిత్రయచరిత్రాఖ్యానమాలించి యా
సామంతాగ్రణి సుబ్బరాణ్మణి రసజ్ఞత్వంబు దీపింపగాఁ,
దా ముద్రాపణవిత్త మిత్తునని వాగ్దానంబు గావించె నాఁ
డామోదంబున సభ్యు లుగ్గడనసేయన్ దత్కవిత్వాదృతిన్.

క. కొన్నాళ్లకు ముద్రాపణ
మున్నెఱపఁ దలంచుకొనియు భూతలమునఁ గీ
ర్తిన్నిలిపి స్వర్గమునకుఁ జ
నె న్నిఖిలజనంబు కన్నునీ రూనంగన్

క. పితృభక్తి మెఱయు తత్సుత
చతుష్టయము జనకు వాక్యసరణిని సఫలీ
కృతముగన్ జేసిరి ప్రజ సం
స్తుతిసేయఁగ రామభీష్మతుల్యు లటంచున్.

సీ. ఒజ్జబంతిగ జనకోదంత మెల్ల సంభావిం
చి వర్తించు భావరాజు
భ్రాతృచిత్తానుసారము కుటుంబఖ్యాతి
నలరించు నారాయణాఖ్యపుంగవు

నైదంయుగికరాముఁ డనఁగ భోగత్యాగ
పరమార్థుఁ డగు రామభద్రరాజు
బాలుఁడై యన్నలు లాలింప విద్యలు
న్నతి నేర్చు వెంకటపతి విభుండు

సుబ్బరాజన్యధన్యుని సుతులు నలువు
రాకృతులఁ దాల్చినట్టి ధర్మార్థకామ
మోక్షము లనంగ దశరథపుత్రు లనఁగఁ
జతురపాంపతు లనఁ బశంసలను గనిరి.

మ. అకలంకమ్మగుశీలమొంది పరిపూర్ణాయుష్యముల్ జెంది పు
త్రకులుల్ బుత్రికలుల్ దదాత్మజులు పారంపర్యముల్ గాంచనె
న్నికఁగంచుల్ ధనధాన్యగోధనసమృద్ధిన్ మించి విద్యాభివృ
ద్ధికిఁ జేదోడయి సుబ్బరాజసుతు లుద్దీపింత్రుగా నుర్వరన్.

మ. వివిధామేయసుఖానుభూతి వసుధావిఖ్యాతదేవేంద్రులై
కవులుల్ బండితులుల్ యశంబువొగడంగా సప్తసంతానహే
తువులై నల్వురుసుబ్బరాణ్మనుపుత్రుల్ తాతలన్ దండ్రి మిం
చివిశిష్టంబగుఖ్యాతి గాంచుత మదాశీర్వాద మన్వర్థమై.

ఇట్లు,
గ్రంథకర్త.

శివాయ గురవేనమః

# పీ ఠి క .

## మునిత్రయ చరిత్రము.

" ఇది వ్యాకరణాగమ మ
భ్యుదయము గాంచంగ హేతుభూతులయి జగ
ద్విదితు లయినవైయ్యాకర
ణదిగ్గజంబులచరిత్ర... ... ..."

అనాదికాలమునుండి నేఁటిదాఁకఁ బ్రపంచమున వందల కొలఁది భాషలకు వేలకొలఁది వ్యాకరణములు వెలసియున్నవి. వానిలో శాస్త్రమనిపించుకొనఁ దగినది. సంస్కృత వ్యాకరణ మొక్కటే. ఇన్ని కట్టుపాటులతో నింత జిగిబిగువులతో నింత లాఘవానురోధముతో నిట్టి క్షోదక్షమత్వముతో నింత సమగ్రతానుసరణితో నేభాషకును నేదేశమునను నేకాలమునను నిట్టి వ్యాకరణ ముద్భవింపలే దనుట సర్వవిదితము. నిర్వివాదము. అట్టి యీ సంస్కృతశబ్దవిద్యకు సంప్రదాయకర్త లగుమహర్షులు పాణినికాత్యాయనపతంజలులు. వీరి చరితము కథాసరిత్సాగర పతంజలిచరితములలోఁ గలదు. అన్వర్థవ్యపదేశమగు నా కథాసరిత్సాగరమున వీరి చరిత, ఏమూలనో యణఁగి యుండి కథాంతరతిరోహితమై మన దేశమునఁ దగినవ్యాప్తి నొందదయ్యె. సిద్ధాంతకౌముదిప్రతులు కొన్నిట 'లఘుత్రిముని కల్పతరు' వనుపేర నీచరితము కొంత ప్రకటితమై కాన నగును.

గాని యందును నేతత్కథానుబద్ధము లగునంశములు రేఖా రూపమున మాత్రమే యుపపాదింపఁబడినవి. కాఁగా నితరుల మాట యటుండ శాబ్దికు లగుపండితులకునయితము పెక్కుమంది కీచరితము పరిచితము కాకుండుట సంభవించినది. ఆలోటు నేఁటితోఁ దీఱినది.

ఈచరితము సర్వజనసంవేద్యము కాఁదగునని వ్యాకరణమూర్తులగు వేదుల సూర్యనారాయణశాస్త్రులవారు కుతూహలపడుటయే యీకృతి యవతరించుటకు మొదటి కారణము. వీరు ప్రస్తుతకృతినాయకులగు మహామహోపాధ్యాయుల యంతేవాసివర్గమునఁ బ్రథమకోటి కెక్కినవారు. శిష్యులతోఁడఁ గూడి శబ్దవిద్యాసాగరము మథించుటయే జీవితపరమార్థముగ నెంచుకొన్నవారు. మునిత్రయమునే మూర్తిత్రయముగ నారాధించుదీక్ష వహించియున్నవారు. తన్నందినవారు తనంత లగునట్లు శిష్యపరంపర ననుగ్రహించుచున్న కృతార్థులు. వీరు తమ కుతూహలమును నాత్మప్రశిష్యులగు వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారికిఁ దెలుపఁగా నట్టి గురుసంకల్పము చెవిని సోఁకినదే తడవుగా మన కవిగారు గ్రంథపరివర్తమునకుపక్రమించినారు.

వీరు గోదావరీమండల పండితులు. సంస్కృతాంధ్రసాహితీరసజ్ఞులు. ఉభయభాషావ్యాకరణప్రవీణులు, బహుశ్రుతులు. సరసకవితాచాతురీసంభావితులు. సూర్యరాయాంధ్ర

నిఘంటు కార్యాలయమునఁ బదుమూఁడువత్సరములు ప్రధాన పండితులుగఁ బరిశ్రమించి యామూలచూడముగఁ బ్రాచీన కవిప్రయోగపరిశోధనము గావించిన యనుభవశాలులు. ఇట్టి విద్వత్కవి యీ మునిత్రయచరితమును గావ్యముగ సంతరింపఁ బూనుకొనుట మిక్కిలి యానందింపఁ దగినయంశము.

ఈపవిత్రచరిత్రము, ఏమూలనో మఱుఁగుపడి యింత కాలముదనుక, ఏకవికంటను బడకుండుట యిక్కవియదృష్టము. ఈయనకంటనే పడుట మన యదృష్టము. ఎందుల కిట్లంటినో యికావ్యము తిలకించిన చదువరులకే తేటతెల్లము కాఁగలదు.

వీరి కవితాస్రవంతి యతినిర్మలమయి మనోహరముగ జాలువాఱుచుండును. గొగ్గిపద్య మొక్కటియుఁ గానరాదు. రచనమంతయుఁ బ్రసాదగుణభరితము. ఆవాసభూమి కోనసీమ. ఆమీఁద వ్యాకరణపాండిత్యము. అయినను వీరికవిత నారికేళ పాకమునకు దూరమయినది. మధురాతిమధురమగు కోమల పాకము నాశ్రయించినది. 'నైవవ్యాకరణజ్ఞ మేవ పితర'మ్మను కొనుచుందుమే. నిత్యమును తక్కుటుక్కులతోను ధుక్కుతుక్కులతోను దంటాలుపడుచుండు నీమనీషికి నింతగా ముద్దులొల్కు పద్దెము లల్లుపాటవ మెటు లబ్బినదా యని నాలో నే నబ్బురపడుచుందును. ఇట్టివే వాసనావిశేషములు. పుణ్యవాసన లూరకపోవు నెట్లు ?

ఈగ్రంథమునఁ గథాంశములు చాలవఱకు మూలాను సారముగనే యనువదింపఁబడినవి. మూలమునఁ గానవచ్చు పున రుక్తులు మాత్రమిందుఁ బరిహరింపఁబడినవి. మఱియు నౌచితీ పరిపోషమునకును స్వభావానురూప్యమునకును నచ్చటచ్చటఁ గావింపఁబడిన యలంతిమార్పులు వీరివిచక్షణతను వెల్లడింపఁ జాలియున్నవి. చదువరులు ముఖ్యముగా గమనింపఁదగినది మఱొక్క విశేషము గలదు. ఈకథాంశములన్నియు దేశకాలము లనుబట్టి మనకు మిక్కిలి విప్రకృష్టములయినను నవియెల్ల నేఁడు మనకన్నులయెదుట జరుగుచున్నటులును నెంతయు మనకను భవసిద్ధములయినటులును గోచరింపఁజేయుటలో వీరి చాతుర్య ము మిక్కిలి మెన్నఁదగినది. చదువరులకుఁ దన్మయత గలిగించి రసావేశము నొదవించి, వారు నిర్భరానందపారవశ్యము నందు నట్లు కావింపఁగల శక్తియే నిజమయిన కవితాశక్తి. ఇదియే మన కవిగారికున్న ప్రధానసంపద. ఈశక్తిసంపద గలవారికవితయే సజీవమై యలరారుచుండును. జీవకళాలాలిత్యముగల పద్యమొ క్కఁడాని నిర్మించినఁ జాలును. నిర్జీవములు వేనవేలు దొంతర లువెట్టినను దానఁ బ్రయోజన మిసుమంతయు నుండఁబోదు. "ఒకరత్నముతో గులకఱాలు గంపెడయినను సరిగావు." ఈగ్రంథ మున-వర్షోపవర్షుల కుటుంబస్థితి-వ్యాడీంద్రదత్తసమాగమము- వరరుచిసమానయనము- వటుత్రయవిద్యాభ్యాసము- పాణిని తపోవృత్తాంతము- పతంజలియవతారము- మహాభాష్య ప్రవచ

నము- మున్నగుభాగములు పరికించు సహృదయులకుఁ బైని నేఁజెప్పిన మాటలన్నియు సమ్మతములు కాక మానవు.

మఱియుఁ బాత్రపరిపోషమే కవితాశిల్పమునకు నికషోపలము. పాత్రము లేదా యొక రూపముతోఁ బాఠకులకు నయనగోచరములగుటయుఁ దత్పాత్రములచేఁ గవి పలికించినపలుకులు పాఠకశ్రుతి గోచరములగుటయు మాత్రమే కాదు. ఆపలుకులవల్లనో తచ్చర్యలవల్లనో యచటి సంవిధానములవల్లనో కవిచే నుపపాదింపఁబడని యాయాపాత్రముల మానసికభావములు నయితము వాని వాని సూక్ష్మపరిణామములతోఁ జదువరుల మనోనేత్రమునకుఁ దేటతెల్లముగాఁ బొడఁగట్టవలయును. ఈశిల్పమునకును నితరశిల్పములకును నిదియే గొప్పభేదము. కవితాశిల్పమనఁగా నీవా నేనాయని సృష్టికర్తతో నెదుర్కొనుట. ఈమాటనే యొక్కచో భంగ్యంతరమున "బళిరశిల్పికులేంద్రబ్రహ్మను మీఱి తేపగిదిఁజేసితిర యీప్రతిమననుచు." (కళా-8-167.) అన్నాఁడు సూరనార్యుఁడు. ఆతావున మనము గ్రహింపఁదగినది దేవతాలయమున ద్వారపాలికా ప్రతిమను బరికించి దానిరామణీయకము నచటి యతీంద్రుఁడు మెచ్చుకొనుటమాత్రమే కాదు. తాను సంకల్పించినరీతిని నెట్టిలోటుపాటులొదవకుండ సృష్టికిఁ బ్రతిసృష్టిగాఁ దనకవితాశిల్పము రమణీయముగా నెఱవేఱిన దని సూరనార్యుఁడు తనలోఁదాను దృప్తిపడి సంతసించుటగా మనము సంభావింపవలయును. అది ప్రసం

గాంతరము- అటుండనిండు. ప్రకృతమున, వర్షోపవర్షులు, తత్పుత్త్రులు, వసుదత్త, చంద్రగుప్తుఁడు, గోపకన్య, మున్నగు పాత్రముఁలను దిద్దినతీఱును బరికించితిరా, కవిగారి శిల్పచాతురి సువ్యక్తము కాఁగలదు.

ఈగ్రంథమున మఱొక్కవిశేషము గలదు. చదువ మొదలిడితిమా తుదదాఁకఁ బోవలయునే గాని నడుమ నడుమ నాఁగుటకు మనసొప్పదు. ఉత్తరకథాభాగము లెట్లు ఘటిల్లినవో యనుమితిమీఱిన కుతూహలము చదువరి నాకర్షించుచుండును. ఇట్టియాకర్షణపద్ధతి మనకావ్యములందు మిక్కిలి యరుదు. అప్రకృతప్రసంగములును ననావశ్యకవర్ణనములును దాఁపురించినచో నట్టికుతూహలము కుంటువడుట సహజము. ఇందట్టి దీర్ఘప్రసంగములుగాని దీర్ఘవర్ణనములుగాని కానరావు. ఉన్నవర్ణనములు చాలవఱకు స్వభావోక్తిసంభావితములై పరిమితముగానుండును. కాని చతుర్థాశ్వాసమున (120—160) మాత్రము వర్ణనఘట్ట మొక్కటిసుదీర్ఘమై కన్పట్టుచున్నది. ఇందుఁ జంద్రగుప్తుఁడనువిప్రుఁడు తనభార్యలకు గర్భిణులకుఁ గావించు పుంసవనసీమంతాదిసంస్కారములు సాంగోపాంగ క్రియాకలాపముతో వర్ణింపఁబడియున్నవి. ఈసంస్కారముల నింతగా వర్ణింపక యవి యెల్ల యథావిధిగ జరుపఁబడినటులు సంగ్రహముగఁ దెలిపి విడిచినచోఁ గథానుసంధానమున కించుకయు నడ్డంకి లేకపోయెడిది. కాని యీగర్భవతులయందు వర

రుచి, భట్టి, విక్రమార్కుఁడు, భర్తృహరి, యనునలువురును నుదయింతురు. వీరు దిగంతవిశ్రాంతమగు ప్రఖ్యాతిగడింపఁదగి నవారు. ఇట్టివారి జననములు మిక్కిలి యసాధారణములనియుఁ గడుంగడుఁ బవిత్రములనియు నిరూపించుట యుచితమని తలంపుతో మనకవిగారు మూలమున లేకున్నను వర్ణనమును విడువఁజాలరయిరని తోఁచుచున్నది. అదియును గాక యిట్టి శాస్త్రీయసాంప్రదాయిక ప్రక్రియలందుఁ గవికిఁగూడ నభిరుచియు నాదరాతిశయమును మెండుగ నున్నయెడ నిట్టివి యుపేక్షింపఁబడుటయు దుర్ఘటమగును. ఏగ్రంథమునయిన సూక్ష్మదృష్టిని బరికించినచోఁ దత్కృతికర్తకుఁ గల యభిరుచులు కొన్నియయిన గోచరింపకమానవు. ఈకృతికర్తకు వ్యాకరణశాస్త్రము పయి నాదరము మెండని యీవఱకు సూచించియుంటిని. నిత్యపరిచితములగు నావ్యాకరణ ప్రసంగములును నిఘంటునిర్మాణ సరణులును గవిని విడువక యెట్లు వెన్నాడినవో యీక్రింది పద్యములు తెలుపఁగలవు.

క. నిపతింపఁ స్త్రీపుంస
ప్రపంచమును ద్వంద్వములుగ రతిపతి; మధుఁడుఁ
నిపుణుండయి రాత్రిందివ
మెపుడును రతిఁగూర్చు నవ్యయీభావముగన్.

(4 —102.)

గీ. జనకశబ్దభవం* 'బన్న'శబ్దమంద్రు
తండ్రి యంతటివాఁడౌటఁ దద్భవాఖ్యఁ
బూను నగ్రజుఁ డాగమంబులుఁ దదర్థ
మే వచింపవె "పితృసమో జ్యేష్ఠ"యనుచు. (1—37.)

శబ్దవిద్యామూలపురుషులగు మహర్షుల కథానాయకత్వమునకును. వైయాకరణసార్వభౌములై కళాప్రపూర్ణులగు మహామహోపాధ్యాయుల కృతిపతిత్వమునకును, గృతికర్త గావించిన శబ్దశాస్త్ర పరిశ్రమంబునకును ననువుపడునట్లుగా నడుమ నడుమ నీకృతియందు నిట్టి వ్యాకరణవిషయములు వర్ణనములందు బాధింపఁబడుటయు మిక్కిలి సముచితముగానే పొడఁగట్టుచుండును. ఈకావ్యమున భాష సయితము పైని జూపిన సన్నివేశమున కనురూపమయినదే. సంస్కృతాంధ్రవ్యాకరణ సాధితములయి యసాధారణములగు శబ్దములు వీరికవితలోఁ దఱచుగ దొరలుచుండును. అసాధారణములని యవి యవ్యవిలోకవ్యవహారదూరములై యప్రసిద్ధములుమాత్రము కానేరవు. వీలు వెంబడి వ్యవహారసన్నికర్షమును నర్థస్ఫురణమును దొలఁగకుండునట్టి ప్రౌఢభంగిని విశేషరూపములఁ బ్రయోగించుట వీరికభ్యాసము. ఈ భాషాపటుత్వము గ్రంథమునం దెల్లయెడలఁ దెల్లమగును.

మఱొక్కయంశము; సాధారణముగాఁ గవులు తమకు ముందు వెలసిన గ్రంథరాజముల సావధానముగఁ జూచుచుండియు,

---

*విశాఖపట్టణమండలమునఁ దండ్రిని 'అన్నా'యని పిలుచువాడుకకలదు.

నందుఁ దమకెక్కుడు మక్కువగలవానిని మరల మరలఁ దిల కించుటయు నట్టి సాదరపునఃపునరాలోకనమునఁ బూర్వకవుల వర్ణనరీతులో కల్పనమార్గములో భావభంగులో భాషాపద్ధతులో యేవో కొన్ని తమతమ యభిరుచులనుబట్టి వీరి బుద్ధికి హత్తుచుండుటయు వీరు తిరిగి కావ్యములనిర్మించుపట్టున నాయా సందర్భములందుఁ బ్రాక్తనసంస్కారమునుబట్టి పూర్వకవుల పోకడలే స్మృతిపథంబునఁ దిరుగులాడి యందుఁ గొన్ని యత ర్కితముగను నప్రయత్నముగను ననివార్యముగను నర్వాచీను లకవితలలోఁ బ్రతిఫలించుటయు సహజము. సర్వసంప్రతిపన్నము. పూర్వకవుల మార్గములనే యున్నవాని నున్నట్టుగ నుత్తరోత్తర కవులు దించుచున్నచోఁ బాడినదే పాటగా నయ్యది రోఁతపుట్టిం పకమానదు గాని సంస్కారబలంబున ననివార్యములయి స్ఫురిం చిన యాపూర్వచ్ఛాయలను నాత్మోత్ప్రజ్ఞాసిద్ధంబు లగుకవితా చ్ఛాయలతో మేళవించి సంతరించినయెడ రామణీయకము పెరుఁ గునే గాని తఱుఁగనేరదు. ఈవివేచనము సేయక కొందఱు విమ ర్శకులు కృతిపరిశీలనముఁ గావింపఁబూని 'అనుకృతులనియో, అనుసృతుల'నియో పేరువెట్టి వానినెల్ల నిరసించుచుండుట యీ నడుమ నొక బాటగా నేర్పడినది. మెచ్చుకొనఁదగినచో నొచ్చు కొనువారి నే మనఁగలము ? సరకు చాలక యెరవు తెచ్చినదా ? లేక యనివార్యమయి కవికి స్ఫురించినదా ? అని వివేచింపఁ దగును గాని సాదృశ్య మగపడినమాత్రాన దోషము నాపాదిం చుట తగనిపని యని నాయభిప్రాయము.

నా యెఱుక కందినంతలో ననితరసాధారణ మగు దగిన విశేషమొక్కటి యీవిద్వత్కవికిఁ గలదు. శాబ్దికముగఁగాని ఆర్థికముగఁగాని యేదే నొకజిజ్ఞాసాప్రసంగము కలిగినపుడు ప్రస్తుత సందేహమునకు నివారకంబుగాఁ బ్రాచీనకవి తల్లజుల మతమెట్టిదోయనుప్రశ్న ముదయించినదే తడవుగా నెన్నిటినో ప్రామాణికప్రయోగములను గుప్పలుతిప్పలుగా వీరు ప్రదర్శించుచుందురు. ఈశక్తి మిక్కిలి యద్భుతావహము. ప్రాచీన కృతులను సూక్ష్మమార్గమునఁ బరిశీలించుటయు నం దెట్టి విశేషమగపడినను సద్దానిని సరసముగా గ్రహించుటయు గ్రహించిన దానిని మఱి విడువకుండ ధారణసేయుటయు నట్టిది సమయమునకు స్ఫురించుటయు నను నిట్టి విశేషగుణములన్నియు నొకేబుద్ధి కలవడుట మిక్కిలి యరుదు. కవితావిషయములం దెట్టి చర్చ యేర్పడినను సద్దానికి సాధకముగనో బాధకముగనో ప్రాచీన మత నిరూపకమగు ప్రయోగపరంపర వెనువెంటనే వీరిబుద్ధికి స్ఫురించి తీఱవలసినదే. ఒక్కొకమేధ యొక్కొకవిషయమున నిశితమైయుండుట ప్రకృతిలక్షణము.

ప్రాచీనకవులలోఁ బింగళి సూరనార్యుని కవితాసరణి యందు వీరికిఁ బ్రీతి మిక్కుటమని యీగ్రంథమునందలి కొన్ని తావులనుబట్టి గోచరించును. ఇందు వర్షుని ధర్మపత్ని గవ్వయేని గడింపఁజాలని భర్తతోఁ బరమమూర్ఖునితోఁ గాఁపురము సేయుచుఁ గడుంగడు బీదతన మనుభవించుచు మరియావ నిలు

పుటకు దనభూషణము లెల్ల నొక్కటొక్కటిగా గృహకృత్యము కయి భర్తకు సమర్పించిన దని నిరూపించుపట్టున—కళాపూర్ణోదయమున నిట్టి సందర్భముననే యిటులే భర్తకుఁదోడ్పడి గృహిణీధర్మము నిర్వర్తించి లోకుల మెప్పు నందిన యలఘువ్రతుని ధర్మపత్నుల ప్రవర్తనము మన జ్ఞప్తికిఁ దగులుచుండును. క్రింది పద్యములు తిలకింపుఁడు.

క. మంగళగళసూత్రము పసు
పుంగుంకుమమాత్ర మఖిలమునకు మిగిలినన్
మంగళరూపమ్మున న
య్యంగన గననా సతీత్వ మట్టిదకాదే. (ముని. 1-24)

సీ. మామగా రొసఁగిన మణికంకణాదుల
జన్నపట్టెను భర్త జడిమ దొలఁగ
నత్త యిచ్చినసువర్ణాపీడ మమ్మి తీ
ర్పదె బంధుభుక్తి కేర్పడినయప్పు
తండ్రి పెట్టిన మణిస్థగితహేమవిభూష
లర్పించెఁ బ్రాణేశుఁ డడిగె ననుచు
తల్లి యొసంగు ముక్తాలలంతిక యిచ్చె
విభుఁడు గోరఁగ దినవెచ్చమునకుఁ
గీ. జిల్లరవిభూష లన్నియు నిల్లుదీర్ప
వెలితిరాకుండ నొండొండు వెచ్చపెట్టె

నేఁటికిని గ్రొత్తకోడ లల్లుటికైన
మాఱుమాటాడ వెఱపొందు మగనిమడికి. (ముని. 1-33)

చ. మగఁడు సిరుల్ గడించుచునుమన్ననఁ నొదలఁదాల్చునాఁటనే
మగువయు మాటఁదాఁటదు సమంచితసేవల నెట్లు దన్న, ది
ట్లగణితనిస్వతాభిహతుఁ డౌపతిఁ బాయ కహర్దివంబు మె
చ్చుగఁ బరిచర్యసల్పుసతిఁ జూచితి మే యెన్నట నేనియెన్నఁ డేన్.
(ముని. 1-35)

ఉ. మంగళసూత్ర మొక్కటియెమాని సమస్తవిభూషణంబులున్
రంగదభంగురప్రణయరమ్యతనొండొరుమీఱ నూహ్చుచున్
బొంగుచుఁ దెచ్చిముందటనుబ్రోవిడుకాంతలయూపుతొంటికం
టెంగరఁగించెఁ గాంతుఁ బ్రకటీకృతభక్తియె సొమ్ముసాధ్వికిన్.

ఉ. సొమ్ములు వేఁడిపుచ్చుకొను చోట్ల సపత్నుల మత్సరంబులో
కమ్మున నెచ్చటం గలదుగాని నిజాభరణంబులెల్లఁ దా
రిమ్మెయినాథు వెచ్చమునకిచ్చుట కొండొరుమీఱుపుణ్యపుం
గొమ్మలు వీరెయంచు జనకోటి నుతించెను వారి నత్తఱిన్.
(కళా. 6-87-89.)

మఱియు నీ వర్షభార్యను నైశ్వర్యగర్వితయగు తోడికో డలు మిక్కిలి యసమ్మతితో నిరసనముతోఁ జులకనసేయుసంద ర్భమున, కళాపూర్ణోదయమున సుగాత్రి తల్లి నిరర్థుఁడయి తన యింటనున్న యల్లుని శాలీనుని నిరసించుచుఁ జులకనసేయు ప్రసంగములు పాఠకుల మనోవీథిని సంచరింపకమానవు.

ఉ. వియ్యపురాలటుల్ తినెను వేళకు వచ్చుటెకాని యింత సా
హాయ్యముసేయ దాఁడుదికదా పసిపాప విలాపమొందఁగా
నుయ్యాల నూఁపరాదొ జలమొక్కపనంటెఁడు తేరరాదొ లే
దెయ్యెడ నిట్టిడంచు గణియించు గరాసయి తోడికోడలిన్.

(ముని. 1-51.)

ఉ. ఇట్టి నిరర్థు నెందుఁగన మేమనఁబోయిన నీవు మిక్కిలిం
దిట్టెను నామసంపదకు దిక్కగుచున్నగ మొల్క నీకిఁకం
బుట్టునొ యాంటిమే నితని పోడిమిఁ గంటిమ వట్టిగొడ్డుతా
కట్టితఁ డెంతయున్న నినుఁ గాఱియవెట్టట వెళ్ళఁగొట్టినన్

ఉ. పూవులతోఁటకైన నటువోయి విచారముచేసి రమ్మనం
గా వలయుంగదాయనుచు గారవమొప్పఁగ నట్లుపిల్చి ము
న్నావిధి కంపియుందుఁ గలయట్టి పనుల్సకలంబుఁ జేయ నే
ర్పావహిలంగఁదా నతని నంతటఁ గట్టడసేసెఁ జేసినన్.

(కళా. 4-74-75.)

మఱియు వ్యాడీంద్రదత్తులు వరరుచిని నేకసంధాగ్రహణశీలుని బ్రహ్మచారి నన్వేషించి తెచ్చి వర్షునియెదుట నిలువఁబెట్టిన సందర్భముఁ దిలకించునపుడు కళాపూర్ణోదయమున శారదాపీఠమున వేదోపాధ్యాయులును మణికంధరుండును నిష్టగోష్ఠి నడపుచుండ నచటికేతెంచి నిలువంబడిన యా బ్రహ్మచారి మన కన్నులకు గోచరించును. చూడుఁడు—

సీ. శీర్షంబునం బంచశిఖలు పొల్పార మే
ధావి బొట్టు నొసంటఁ దళుకులొలుక
నిద్దంపుఁ బసనిజన్నిద మజినంబుతోఁ
బెనఁగి యురోభాగమును భజింపఁ
గటిని మౌంజీబంధకౌపీనముల నును
పసుపురం గపరంజి మిసిమిఁ గూర్పఁ
బాలాశదండ మంభఃపూర్ణ కలశంబు
సవ్యాపసవ్య హస్తముల మెఱయ
గీ. బ్రహ్మచర్యంబు మూర్తమై వచ్చునట్లు
తోడఁ జనుదెంచు వరరుచిఁ దొలుత గురుని
పత్ని కెఱఁగించి యెఱిఁగించి వర్షుఁ డాసి
మ్రొక్కి మ్రొక్కించి రయ్యిద్దఱొక్కమాఱు.
(ముని. 1-148.)

సీ మెఱుఁగారు ముంజయు మేని కోపులికంబుఁ
గడుఁ దిట్టగుణము గుల్కెడు మొగంబుఁ
బసపుగోచుల యొప్పు బ్రహ్మతేజంబును
జారు కృష్ణాజినధారణంబుఁ
దళుకు జన్నిదము మేధావిబొట్టును జిన్ని
పట్టెవర్ధనమును జిట్టితడుపు
మొలవంకయుంగరంబులసొంపు దండపుఁ
గోలయు సన్నపు బ్రేలుసిగయు

గీ. నొప్పు బ్రహ్మచారి యొకఁ డేఁగుదెంచెఁ బు
స్తకముఁ గొంచు మిగుల సంభ్రమమున
నొజ్జ యతనిఁ జూచి యోరి యేమిర కను
నాలసించి తనియె ననిన నతఁడు. (కళా. 4-44.)

మన పూర్వకవులు సామాన్యముగ నాగరపద్ధతులనే గాని జానపదజీవితముల వర్ణింపనొల్లరు. ఐశ్వర్యము నేగాని బీద తనము వర్ణింపఁజాలరు. సార్వభౌముల సౌధరాజము లేగాని పేదగేస్తుల పూరికొంపలు వీరి నేత్రములకు గోచరింపవు నిజ మారసినచోఁ గవి భావనాసంపత్తిగలప్రతిభాశాలియైనచోఁ గావ్యమున నిర్మితంబులగు సౌధరాజములకంటె బీదవారి పూరి యిండ్లే చదువరి నెక్కుడుగ నాకర్షింపఁగలవు. ఉదాత్తవస్తువుల వర్ణించుటకంటె సామాన్యవస్తువులను వర్ణించుటయందే కవికి నెక్కువ ప్రౌఢి యావశ్యకము. యౌవనమును వర్ణించినవారు వేనవేలు కలరు. వార్ధకమును వర్ణించినవారు మిక్కిలి యరుదు. తద్వర్ణనము ప్రసక్తమయినను బ్రజ్ఞాకౌశలము చాలక చల్లగా జాఱవిడుతురు. కళాపూర్ణోదయమున మణిస్తంభుఁడు కలభాషి ణిని మృగేంద్రవాహనాలయంబునకుఁ గొంపోయినతఱిని నచటి మండపమున సుముఖాసత్తిని దొంబదేండ్ల ముదుసలిని స్వభా వోచితముగఁ గలభాషిణికే కాక యామెతోపాటు మనకుఁ గూడ సూరనార్యుఁ డెట్లు సాక్షాత్కరింపఁజేసినాఁడో యా చోటు తిలకింపుఁడు. "పసిమి పోనెండిన... ..."(కళా. 3-83.)

ప్రకృతకావ్యమున సిఱుపేదయగు వర్షోపాధ్యాయుని పర్ణకుటీరమునకు సపరివారుఁడై నందరాజు చేరుసందర్భమునఁ దత్కుటీరము మన లోచనంబుల కెట్లు గోచరించుచున్నదో యీ క్రింది పద్యముం దిలకింపుఁడు.

సీ. చెదపుర్వుగమి గ్రసించిన కప్పునుండి యగ్ని
పాసనానల ధూమపటలి వెడల
ముంజూరిలకు వంగిపోవుట లోనికి
వచ్చి యేఁగెడువారు వంగిమసల
గోడలమూఁడు నాల్గుదెసల నిల్పిన
కంపపెందడికలు గాలిఁ గదల
నుసిరాలి లోపలి పస మాసి నిట్టరా
డొకప్రక్క కొక్కింత యొఱగియుండ

గీ. గోమయవిలేపనంబు ముగ్గులునుమాత్ర
మమర దారిద్ర్యదేవీ విహారసౌధ
మనఁదగిన వర్షగురు ప్రాఁతయాకుటిల్లు
లోచనంబులకెదురుగా గోచరింప.

(ముని. 1-180.)

స్వభావోక్తిమహితముగుచో సర్వమును నాకర్షకముగ నానందదాయకమగుట యనుభవరహస్యము.

మఱియు నిక్కవికిం జిత్రకవితాకుతుకమున్నను నద్దానిని దలుచుగాఁ బ్రసరింపనీక దానికుచితమయి పరిమితమగు స్థానము నీకృతియందుఁ గల్పించియుండుట చదువరులు చూడఁగలరు. ఒక్కవిశేషము; ఇంకఁ జిత్రకవితాచ్ఛాయ లగపడినతావులం దెల్ల మిక్కిలి యౌచిత్యము గోచరించి యీతావున నిట్టిచిత్రరచనము సేయక తప్పదను భావము చదువరులకుఁ దోఁచుచుండును. అది ప్రౌఢులకుఁ జెందఁదగినప్రజ్ఞాకౌశలము.

వ్యాడీంద్రదత్తులు బాలవటువులు వర్షోపాధ్యాయులకుఁ బ్రణమిల్లు సన్నివేశముఁ బఱికింపుఁడు.

క. కని వినయము భయమును మన
మునఁ బెనఁగొనఁ గరయుగమును మొగిడిచి నిటలం
బున నిడికొని యిలఁ బడి నతు
లనఘులు వటు లపుడు సలిపి రపరిమితముగన్.

(ముని. 1-118.)

ఇది సర్వలఘుకందము. శిష్యులు గురువుల సన్నిధికేఁగి నమస్కరించు సమయమున సరళమయిన సర్వలఘుమార్గమే యవలంబింపఁ దగినది. అట్టియెడ శిష్యులు సంకుచితాంగులయి శాంతచిత్తులయి వినయము సూపఁదగును గాని నిలువున నిలుచుండి గడబిడ సేయరాదు. ఈపద్యమున దీర్ఘములుగాని సంయుక్తవర్ణములుగాని వర్ణగురుత్వ సంపాదకములయిన వేఱు గడ

బిడలుగాని లేకుండుట ప్రణామవినయమును దేటతెల్లముగఁ జూపుచుండుట మిక్కిలి రమణీయము.

చ. శివ, పరమేశ, పావన, యజేయగతిక్రమ, దాంతమోహనా
భవ, నగచాప, దేవబలపాలకజన్య, శరీరకాంతివై
భవజితపారదా, వరకృపా, కృతిధర్మపరా, రమాజశా
త్రవ, ధరజామనోవనజరంజదహస్కర, నాగబంధనా.

(ముని. 3-109.)

పతంజలి తపంబునకుమెచ్చి శంకరుఁడు సాక్షాత్కరింప నాపతంజలి పరమేశుని స్తుతించు ఘట్టమున నీపద్యము గలదు. బంధకవితాశ్రయములగు పద్యములు సరళములయి యుండుట సామాన్యము కాదు. అక్కఱమాలిన పదములఁ గూర్చినంగాని యవి యాయాబంధముల కనువుపడుట దుర్ఘటము. ఈపద్యముం జదువునపు డిందేదియో బంధకవితకుఁ జెందినదను భావము శైలినిబట్టి స్ఫురింపనే స్ఫురింపదు. పద్యాంతమున 'నాగబంధనా'యను విశేషణము నారసి సంశయించి పరిశీలించినం గాని యిది నాగబంధమునఁ గూర్పఁబడినటులు తెలియనే తెలియను. బంధకవితలో నిట్టిసారళ్యము సంపాదించుట కెంతటికౌశలముండఁదగునో పరిశీలకులే యూహింపఁగలరు. మఱియు నీపతంజలిశేషావతారమగుటచే నిప్పట్టునఁ బతంజలి నాగబంధనుఁడగు పరమేశ్వరునిఁగూర్చి కావించుస్తుతి నాగబంధగ్రథితమయి యుం

డుటలోని యౌచిత్యమును నానురూప్యమును మెచ్చుకొనఁ దగినవి.

మఱియు శాస్త్రములకలిమికై జీవితములు దారవోసిన మన పూర్వుల విద్యావిషయకంబులగు నాస్థానాస్వస్థ్యములును భారతీయగురుకులముల యౌన్నత్యమును నిందు నిపుణము గా నిరూపింపఁబడినవి భారతీయసంప్రదాయమున గురుభ క్తియు శిష్యవత్సలతయు నెట్లు ప్రవర్తిల్లినవో పెక్కుతావుల విశదపఱుపఁబడినవి. అంతియగాక యాశిష్యులకు గురుపత్నుల యెడ మాతృభక్తియు నాగురుపత్నులకు శిష్యులయెడఁ బుత్ర వాత్సల్యమును నిందుఁ బ్రదర్శింపఁబడినవానిని బఠింపితిమా; యొడలు పులకరించును. చిత్తము ద్రవించును.

ఇందు వాకోవాక్యరూపమ్మున నడచినపద్యములు కొన్ని గలవు. ఒకేవాక్యముగాక చిన్నచిన్న వాక్యములు పెక్కిటితోఁ బద్యముం గూర్చుటలో నొక యందము గలదు. అందును నావాక్యములు ప్రశ్నోత్తరరూపము లయినచో నాపద్యమున కెంతో హృద్యత యేర్పడును. గ్రంథవిస్తరసంకోచముచే నిట్టి వానికి మచ్చులు చూపనయితిని.

ఇక్కవిగారు వేంకటేశ్వరశతకము, శబరశంకరవిలా సము, జీమూతవాహనచరితము, సుబ్బరాయసుధీమణియశశ్చం ద్రిక మున్నగు మఱికొన్నికృతు లీవఱకే ప్రకటించియుండిరి.

ప్రస్తుతము శంకరవిజయము రచించుచున్నట్టులు వినికిడి. దానిం గూడ నవిలంబితముగ సమాప్తినొందించిన సంతసింపఁగలము.

ఈగ్రంథస్వరూపమును నాకుఁ దోఁచినరీతిని సంగ్రహముగ నుపపాదించితిని. సావధానముగఁ బరికించు సరసులు నాకన్న హెచ్చుగా మెచ్చుకొందు రని విశ్వసింతును.

శివాయ గురవేనమః.

గుంటూరు,
15—3—1943.

**దువ్వూరి వేంకటరమణశాస్త్రి,**
ఆంధ్రవిశ్వకళాపరిషత్పండితుఁడు.

శ్రీగురుమూర్తయేనమః.

# కథాసంగ్రహము.

శా. కలమున్ జేతనుబట్టిపద్యమనియే కాసంతయున్ వ్రాయఁగాఁ,
దలఁపుంజెందిన మున్ను మ్రొక్కవలెఁగాదా సంస్కృ
తాంధ్రమ్ములన్
గలమర్మంబులు నాకుఁజెప్పి కవితానైపుణ్యమున్ నేర్పుచా
వలిలక్ష్మీనరసింహశాస్త్రిగురుదేవస్వామికిన్ భక్తితోన్.

ధర్మాత్ముఁడగునందరాజు పాటలీపుత్రమును బాలించుచుండు నాఁడు తత్పురము నంటి యుండునొక యగ్రహారమున మహావిద్వాంసుఁ డగుశంకరస్వామి యను బ్రాహ్మణునకు 'వర్షుఁడు, ఉపవర్షుఁడు' అను నిరువురు కొమరులు పుట్టిరి. వారిలో ఉపవర్షుఁడు మహావిద్వాంసుఁడు, కీర్తిశాలి, ధనవంతుఁడు. పెద్దవాఁడగు వర్షుఁడు జడుఁడు, మూర్ఖుఁడునై యుండెను. తండ్రిప్రసిద్ధి విని వర్షుఁడును నంతవాఁడగు నని యొకబ్రాహ్మణుఁడు వివేకవతియు, మహాసాధ్వియు, రూపవతియు నగు తన పుత్రికనిచ్చి పెండ్లి చేసి సకలవైభవములతో సారె లిచ్చి పంపెను. ఆపెయు బుద్ధిజడిమతక్క నేదోషములేని తనపతిని దైవముగా నెంచి సేవించుచు సంసారయాత్రకుఁ దననగలు భర్త కర్పించి మంగళసూత్రము తానును మిగిలెను. వర్షుఁడును బిత్ర్యమగు

సకలసంపదలు వెచ్చపెట్టి జీర్ణగృహమున భార్యయుఁ దానును గాలము పుచ్చుచుండెను.

ఉపవర్షుని వివాహానంతరము తలిదండ్రులు యశశ్శేషులైరి. అన్న లేవడి గాంచఁజాలక ఉపవర్షుఁడు మంచిమాటలచే భార్యనొప్పించి యన్నను వదినెనుదెచ్చి చిరకాలముభరించెను. ఉపవర్షునిభార్య కిష్టములేదు; కాని భర్తభయమున నంగీకరించెను. ఈరీతిగాఁ బండ్రెండేఁడులు గడచినవి. వర్షాకాలమున నాదేశస్త్రీలు, వేసవి నెండపీడయు, శీతకాలమునఁ జలిబాధయుఁ గలుగకుంటకై బెల్లము పిండి కలిపి గుహ్యావయవరూపముగా నొక భక్ష్యముచేసి దానిని బ్రాహ్మణునకు దానమిచ్చు నాచారము కలదఁట. కాని దానిని బ్రతిగ్రహింప నెవఁడును రాఁడఁట. ఉపవర్షునిభార్య పదమూఁడవయేఁట వచ్చిన వానకాలమున నావ్రత మాచరించి యావ్రతభక్ష్యము సమాయిఁకుఁడను బావగారికి దాన మిచ్చెను. అది యందుకొని వర్షుఁడింటికి రాఁగానే యతనిభార్య యాపరాభవము సైఁపఁజాలక యేడ్చి, మగనిని నిందించి యుపశమించెను. శాంతించి క్షమాపణకోరెను ఆరాత్రి వగచి వగచి వర్షుఁడు విద్య నార్జింపఁ దీవ్రవాంఛ పొడమి హిమగిరికిఁ దపం బొనరింపఁ జనెను. తెల్లవాఱినది, భర్త కనరామిని బెద్దపెట్టున నేడ్చుచుండు వదినె నుపవర్షుఁ డూరార్చి నాతోఁ జెప్పియేవెళ్లెను. కొలఁది కాలమున వచ్చునని చెప్పి భక్తిపెంపున నాయమఁ గాపాడు

చుండెను. అయిదేండ్లకు వర్షుఁడు వచ్చెను. ఉపవర్షుఁడును భార్యయు వదినెయుఁ బూజించిరి. సేదదేఱినతరువాత 'హిమ గిరిపైఁ గుమారస్వామిఁ గూర్చి తపస్సుచేసితి ననియు, నా దేవుఁడు ప్రత్యక్షమై శ్రుతధరుఁడు (ఏకసంధాగ్రాహి) అగునటు నకు ఓంకారపూర్వముగా వేదము చెప్ప నారంభింప సకల వేదశాస్త్రములు నీబుద్ధిని స్ఫురించు నని వర మిచ్చెననియుఁ దెలిపి తనశిథిలగృహముచెంత నొకపర్ణశాల కట్టుకొని తపస్సు చేసికొనుచుండును.

వేశసపురమున మహాపండితులగు దేవస్వామికరంభులను నిద్దఱన్నదమ్ము లుండువారు. దేవస్వామికి ఇంద్రదత్తుఁడు కరం భునకు వ్యాడియను పుత్రులు గలిగినపిదపఁ గరంభుండు మర ణింప నాదుఃఖమోర్వఁజాలక దేవస్వామి మహాప్రస్థాన మొ నర్చి శరీరమువాసెను. అంత వారిద్దఱభార్యలు సహగమనము చేసిరి. పసివారగు వ్యాడీంద్రదత్తులు దిక్కులేక వగచి వగచి తండ్రుల పాండిత్యమువిని సంపాదింపఁగోరుచు గుమారస్వామిని గూర్చి తపముచేసిరి. స్వామి ప్రత్యక్షమై 'పాటలీపుత్రమున నున్న వర్షోపాధ్యాయుఁడు మీరు కోరిన సకలవిద్యలు నేర్పును. పొండని చెప్పి యంతర్హితుఁడయ్యెను. వారు పాటలీపుత్రమున కరిగి వర్షపత్నివలన వృత్తాంతమంతయు నెఱింగి గుహుని దర్శించి కుమారవరమింతవఱకు నెరవేరలేదు గదా! ఆ శ్రుతధరుఁడుమా త్రమేల లభింపఁడని దేశములన్నియుఁ దిరిగి తిరిగి యొకనాఁడు

గానక పసివి వచ్చుచు దారిలోఁ గౌశాంబి యనుపురము కాన రానందు భోజనార్థులై యేఁగి భర్త మరణించి యొంటికొడుకు తోనున్న యొక బ్రాహ్మణియింట భుజించి మార్గాయాసమున దీఱియరుఁగుపైఁ బరుండిరి. అంతలోఁ గొంతదూరమున మద్దెల చప్పుడు వినఁబడునంత నాయింటియావె కొడుకు నక్కునఁ జేర్చుకొని 'నీతండ్రికి మిత్రుఁడగు నందుఁడనునటుఁ డీరేయి నాట్యము చేయుచున్నాఁడు. మీతండ్రి మరణించుటచే మనయింటికి రాలేదు' అని తన భర్తృమరణమువలనఁ గలిగిన లోపము తలఁచుకొని యేడ్చుచుండ నాబిడ్డ 'అమ్మా! నేనాట్యము చూచి వచ్చి యంతయు నీయొద్ద నాడిచూపెదను,' అని యూరార్చుచుండెను. వ్యాడి యదివిని త్రుళ్లిపడి లేచి వచ్చి చూచినదిచూచినట్లు తెలుపఁగలవా ? అని యడుగ; నాయిల్లాలు నాయనా ! వీఁడు శ్రుతధరుఁడనెను. వ్యాడియుఁ బ్రాతిశాఖ్యమొకటి చదివి యప్పగింపుమన వెంటనే యాబాలుఁడు చదివెను. వ్యాడీంద్రదత్తులకుఁ బ్రాణములు కుదుటఁబడినవి. అచ్చెరువుతో నాబాలుని వెంట నాట్యము చూడ వారును జనిరి. చూచిరి. ప్రొద్దుట నా బాలుఁడు తల్లికడ రాత్రిచూచినదియెల్ల నాడిచూప నదియెల్ల సరిపడియుండుటకచ్చెరువడి యాయమతోఁ దమవృత్తాంతమంతయుఁ దెలిపిరి. ఆయమయు అగ్నిశిఖుఁడు, సోమదత్తుఁడను నామద్వయముతో ఋగ్యజుస్సాంబులనేర్చి యీపురాధిపుని పూజలఁ దనియుచుఁ దనభర్త యుండువాఁడనియు, నీబిడ్డ కైద

వయేఁడు వచ్చునంత దినికరిగెననియుఁ దెలిపి—ఏఁడుపుట్టినతో డనే వీఁడు శ్రుతధరుఁడగుననియు, వర్ష శిష్యుఁడై వ్యాకరణశాస్త్రము పెంపొందించు ననియు 'వరరుచి, కాత్యాయనుఁడు' అను నామముల లోకమునఁ బ్రసిద్ధుఁడగుననియు ఆకాశ వాణి వినవచ్చెను. ఈ పలుకులలో వర్షుఁడను గురువున్నాఁడనిరి; ఆతని యొద్దకుఁ గొనిపోయి విద్యలు నేర్పింపుఁడని పలికెను. మఱునాఁడే వానికుపనయనము సేసి వెంటఁబెట్టుకొని వ్యాడీంద్రదత్తులు గురుసన్నిధి చేర్చి వర్షునివలనఁ గుమారాదిష్టప్రకారమున నేక, ద్వి, త్రిసంధలతో వరరుచి వ్యాడీంద్రదత్తులు వేదములన్నియు నేర్చుకొనిరి, శిక్షపూర్తియయినది. వ్యాకరణ మారంభింపనుండ—వారివిద్యాక్రమ మానోట నానోట నందరాజునకుఁ దెలిసి చూడవచ్చి పరీక్షించి చూచి యచ్చెరువడి సశిష్యుఁడగువర్షుని నేనుఁగునెక్కించి యాస్థానమునకుఁ దెచ్చి కనకాభిషేకము సేసి ప్రతిదిన మొక వరహానర్పింతునని చెప్పి సకలవైభవసమృద్ధమగు నొక మందిరమునిచ్చి, కాత్యాయనాదులకుఁ గానుక లిచ్చి యంపెను.

## ద్వితీయాశ్వాసము.

వర్షుఁడు నూత్నగృహమునఁ బ్రవేశించెను. సకలవైభవములతో వర్షపత్ని లక్ష్మివలె గృహమున మసలుచు నిరతాన్నదానమునఁ బేరుమోసెను. ఆయిరువురు శిష్యులే పుత్రులని వారిని దల్లివలెఁ బోషించుచుండెను. వేదాంగములాఱును గా

త్యాయనాదులు పూర్తిసేసిరి. ఆవార్తదెలిసి పెక్కురు విద్యార్థులు వచ్చి వర్షునకు శుశ్రూషసేయ మొదలిడిరి. వారిలోఁ పాణిని యొకఁడు. అతనిది శలాతుర మను గ్రామము. తల్లిపేరు దాక్షి, తండ్రిపేరు పాణినుఁడు, పాణిని సుగుణరాశియేకాని శుద్ధజడుఁడు.

గురుదంపతుల కతనిపై నెంతో దయ; కాని యేమిలాభము ? విద్యరాదు. సహాధ్యాయులు పరిహసించుచున్నారని యహర్నిశము పరితపించుచుండును. ఒకనాఁడట్లు పరివేదన మొందు పాణిని గురుపత్నిగాంచి యేల తపింతువు, హిమగిరి కరిగి కుమారదేవు నారాధించి విద్యలఁ బడయుమని తనపతి వృత్తాంతము చెప్పి తపంబున కంపెను. హిమగిరి కరిగి తపస్సు చేసి కుమారుని బ్రత్యక్ష్య మొనర్చుకొనెను. ప్రసన్నుఁడై యాదేవుఁడు బుద్ధిజడిమతొలఁగి సకలవిద్యలు వచ్చునట్లు వరమొసఁగి నీవలన నూత్నముగా వ్యాకరణశాస్త్రము భూతలమున నవతరింపఁగలదు. సర్వజ్ఞుఁడు నాతండ్రి నీకది యొసంగఁగలఁడు. ప్రయాగమునకేఁగి యటఁ దపంబొనర్చి యావరము నొందుమని శివపంచాక్షరమంత్ర ముపదేశించి యంతర్హితుండగుటయు, జడిమ తొలఁగి కుశాగ్రబుద్ధియైపాణిని తత్క్షణమా ప్రయాగమునకేఁగి యక్షయవటమునొద్దఁ బరమేశ్వరుఁ గొల్చుచున్న సనకాదులఁ గాంచివారివలన యోగవిద్య నేర్చి పరమేశ్వరుఁ గూర్చి తపస్సుచేసెను. శివుఁడు ప్రత్యక్షమై కొంతవడి తాండవిం

చి యనంతరము ఢక్కపై 'అఇఉణ్, ఋఌక్' మొదలుగాఁగల శబ్దములు కలుగఁ బదునాలుగు మాఱులు ప్రయోగించి, వేదాంతవిజ్ఞానము గోరుసనకాదులకును వ్యాకరణశాస్త్ర మొనర్చుమని పాణినికిని నాపదునాల్గు సూత్రములనే వరముగానిచ్చి సంశయములు నందికేశ్వరుఁడు దీర్చునని చెప్పి యంతర్ధానము చేసెను. సనకాదుల సంశయముల నందికేశ్వరుఁడు వ్యాఖ్యానమొనర్చి తొలఁగించెను. కుమారకరుణచేఁ బాణినికి సర్వము నవగతమయ్యెను. తోడనే వ్యాకరణశాస్త్ర మెనిమిదధ్యాయములును, ధాతు గణపాఠములును రచించుకొని, గురువగు వర్షునకుఁ గురుపత్నికిఁ గృతజ్ఞతను దెలుప నరుదెంచి వారి మన్ననలందికొని తనశబ్దశాస్త్రము వినిపించుచుండఁ గాత్యాయనుఁడు వాదమునకుఁ దిగెను. ఎనిమిది దినములు వాదము జరిగెను. ఎనిమిదవ దినమునఁ బాణిని యోడిపోయి యీశ్వరుని బ్రార్థింప నీశ్వరుఁడాకసమున నొకపెద్దహుంకార మొనరించెను. ఆహుంకారముతో నంతకుమున్ను భూలోకమున వర్షాదులు నేర్చుకొనిన యైంద్రవ్యాకరణ మంతరించెను. కాత్యాయనుఁ డాయవమానము సైఁప జాలక తపమున కరిగెను. వర్షుఁడు కుమారస్వామిని బ్రార్థింప స్వప్నమునఁ గనవచ్చి పాణినియమొక్కమాఱు నీవును నీశిష్యులువినుఁడు. మీకందఱకు నావరమున వచ్చునని చెప్ప మేల్కొని వర్షుఁడును వ్యాడీంద్రదత్తాదులగు శిష్యులును బాణినివలన వినివ్యాకరణము నేర్చు

కొనిరి. పాణిని గురునియమమతి నొంది హిమవంతము పొంత
నొక యాశ్రమము కల్పించుకొని శిష్యులకుఁ దనశాస్త్రము
బోధించుచుండ 'సీసు మెప్పించి తన గ్రంథముపై నుక్తానుక్త ను
దుక్తార్థపూరకంబుగ వార్తికములు కాత్యాయనుఁడు రచించు
చున్నాఁడని యెఱింగి యట కరిగెను. ఇరువురకును బ్రచండ
కలహమయ్యెను. అన్యోన్య శాపములచే నిరువురును శరీరములు
విడిచి కైలాసమున కేఁగి శివునిసన్నిధియుండిరి. అంబశాపమువల
నఁ బుష్పదంతుఁడను శివకింకరుఁడు కాత్యాయనవరరుచి నామ
ద్వయంబునఁ బుట్టఁగాఁ దచ్ఛాపవిముక్తికై యీశ్వరాంశము
పాణినియైపుట్టి వ్యాకరణశాస్త్రము రచించి ముక్తులైరని శివుఁ
డు దేవతల కెఱిఁగించెను — వేదరక్షకముగా వ్యాకరణము
రచించి వచ్చినవారిరువురకు దేవతలు శుభాశీర్వాక్యములఁ దుష్టి
నొసరించిరి.

## తృతీయాశ్వాసము.

పాలసముద్రమున శేషాహిపై విష్ణుం డొకనాఁడు పవ్వ
ళించి యోగనిద్రయందుండి క్రమముగా భరింపరానంత బరు
వెక్కెను. దాన శేషుఁ డపరిమితాయాసమునొందుచుండ లక్ష్మీ
దేవి మెల్లగా విష్ణుని మేల్కొలుప లేచి 'ఇంత బరువెక్కఁ గార
ణమేమని యడుగుసర్పస్వామితో తాను యోగనిద్రయందుండఁ
జిదంబరేశ్వరుఁడు నటరాజరూపమునఁ దోఁచి నాట్యాంతమున
వ్యాకరణశాస్త్ర మవతరించుటఁ జెప్పి దానికి మహాభాష్యము

రచింప శేషాహి నంపుమని నాకానతి యిడెను. ఆ యానంద నటనము చూచువేళ సంతోషభారమున నట్లైతినని తెల్పి భూమిపై నవతరింప ననుజ్ఞ యిచ్చి యహిరాజు నంపెను. ఆతండును భూలోకమునకుఁ బ్రచ్ఛన్నరూపమున వచ్చి కొడుకు నిమ్మని సూర్యు నుద్దేశించి తపంబునలుపుచున్న గోణిక యను ఋషి కన్య యాశ్రమంబున కరిగి సూర్యప్రేరితుఁడై యల్పాకృతిని సూర్యున కర్ఘ్యమెత్తిన గోణికయంజలిచొచ్చి యామె విడుచు నంజలినుండి భూమిపైఁ బడుచు మునిరూపమున నిలిచి పతంజలి యను నామముగాంచి యామెను దల్లిగా భావించి పూజించి తలఁచినంత వత్తునని యనుమతి గైకొని దక్షిణసముద్రతీరవనమునఁ దపమొనరించి యీశుని బ్రత్యక్షము సేసికొని తదాజ్ఞఁ జిదంబరక్షేత్రమున కరిగి 'వ్యాఘ్రపాత్తు' మునిని దర్శించి యాతనితోఁ గనకమందిరమున నటరాజు నాట్యముఁ జూచి స్తుతించి యీశునానతి నా చిదంబర చిత్సభయందుండి మహాభాష్యము విరచించి శిష్యులుగ వచ్చిన పండితశతములకు దానొక తెర ఘటించుకొని యందుండి చెప్ప నారంభించెను. తెర యెవ్వరు నెత్తరాదని తొలుతఁ జెప్పిన పలుకుప్రకార మిరువది రెండుదినము లోర్చి, చూడబుద్ధిపుట్టి శిష్యులు తెరయెత్త సహస్రాననములతో సర్పాకారమునను న్న యా శేషుని విషాగ్నిలోఁ బడి భస్మమైపోయిరి. అదిగని మనుజాకారమూని తన శ్రమమంతయు వమ్మయ్యెనని యాశ్చర్యవిషాదక్రోధమూర్ఛితుఁడై యు

న్న యమ్మునినొద్దకు భయపడుచు నొక్క శిష్యుఁడు వచ్చి పాదములపైఁ బడి మ్రొక్కి పాఠము చదువుకొనుచు మూత్ర విసర్జనమునకు నే నవ్వలి కేఁగినపుడు నా సహపాఠులు మిమ్ము లను గాంచఁ గోరి తెర నుత్తరించినారు; స్వామీ నన్ను రక్షింపు మని వేఁడుకొన 'ఓరీ మహాభాష్యము చదువుచు నుత్తర శాంతి చెప్పక యపచారము చేసితివి. కాన రాక్షసుఁడవగు'మని శపించి, శిష్యుని విషాదమునకు మనసు కరఁగి, నా శాపము తప్పదు. రాక్షసుఁడ వైనపిమ్మట 'పచి' ధాతువునకు నిష్ఠయందు 'పక్వ' మను రూపము సిద్ధించునని చెప్పిన వానికి నా భాష్యమంతయు జెప్ప నీకు శాపవిముక్తి గలుగునని తెలిపి, చదువకయే వానికి మహాభాష్యమంతయు బుద్ధిని స్ఫురింప వరమిచ్చి వానినంపి, యోగశాస్త్రమును, వైద్యశాస్త్రమును, శబ్దశాస్త్రమును భూభాగమున వెలయించుచు జననియగు గోణికను శుశ్రూషలఁ దనిపి యామెకు శాశ్వతకైలాసనివాసము చేకూర్చి పతంజలి మహాముని సుఖంబుగ నుండెను.

## చతుర్థాశ్వాసము.

అట్లు పతంజలిచే శప్తుఁడై యా శిష్యుఁడు భయంకర మగు రాక్షసాకారమొంది కాశి కేఁగుత్రోవ యందొక మఱ్ఱి చెట్టుమీఁద నివసించుచుఁ బచిధాతునిష్ఠారూప మడుగుచుఁ జెప్పకున్నను దప్పు చెప్పినను నవ్వానిని విఱుచుకొని తినుచు ఘోరముగఁ బ్రవర్తిలుచుండఁ గొన్నాళ్ల కుజ్జయినీవాసుఁడగు

చంద్రగుప్తుఁడను విప్రుఁడు కాశికేఁగి పాతంజల మహాభాష్యము చదువుకొని నాత్రోవనే వచ్చుచుండెను. రక్కసుఁడు యథాపూర్వము ప్రశ్నింప 'పక్వ' మనురూప మగునని విప్రుఁడనెను. తోడనే వానికిఁ దనకథనంతయుఁ దెల్పి, వానికోర్కె నెఱింగి, అతివేగముగ వానికి మహాభాష్యము పూర్ణముగఁ జెప్పి శాపవిమోచనమొంది స్వర్లోకమునకుఁ బతంజలిశిష్యుఁ డరిగెను. విప్రుఁడు భాష్యమునంతయు మఱ్ఱియాకులమీఁద వ్రాసికొనుచుండువాఁడు. ఆ యాకులను కట్టగాఁ గట్టి శిరమున నుంచుకొని యింటికి వచ్చుచు మార్గాయాసమున నొక చెట్టుక్రింద నా యాకులకట్టను దలాడగా నుంచుకొని నిద్రించుచుండ నొక లేఁగ వచ్చి యామఱ్ఱియాకులకట్టనోటఁబట్టి లాగఁ ద్రుళ్లిపడి లేచి లేఁగనోటనుండిలాగిచూడఁగా బెక్కుచోట్లఁ బండ్లుగ్రుచ్చుకొని యక్షరములు పోవుటకై వగచుచుండెను. అంతలో నొకగొల్లపడుచు చంద్రగుప్తుని సన్నిధికివచ్చి వెన్నభోజనముగాఁ బెట్టివగవకుమని యూరార్చి తనకథ నిట్లు చెప్పెను. నేను గోపకన్యను. ఈయడవి నరుగుచుండు మునుల నాతిథ్యమిచ్చి పూజించుట నా వ్రతము. కొంతకాలముక్రిందఁ గొందఱు ఋషులు నాచేఁ బూజితులై, సంతుష్టులై బిడ్డా! ఈ త్రోవను గొలఁదికాలమునకుఁ బతంజలి శిష్యుఁడగు బ్రహ్మరాక్షసుని గొలిచి మహాభాష్యము నేర్చి యొక బుధుఁడు రాఁగలఁడు. మహాభాష్యము భూమిలో వ్యాప్తమొనర్పఁ బతంజలియే యా రూపమున నవత

రించెను. అతఁడు నిన్నుఁ బెండ్లియాడుమనని మునులిచ్చిన వరము చెప్పి యదిగో మా గొల్లపల్లె. అందు నా తల్లి యున్నది. ఆమె యనుమతినొంది నీ వెంట వత్తునని తెలిపి యాతనిని దనతల్లికిఁ జూపి యనుమతినొంది యతని వెనువెంట నరుగు ఁజుని కేఁగెను. చంద్రగుప్తుఁడును ధర్మయుక్తముగా బ్రాహ్మణక్షత్రియవైశ్య కన్యకలను బెండ్లాడి యీగొల్లపడుచును నాల్గవభార్యగ స్వీకరించి క్రమముగా వరరుచి విక్రమార్క, భట్టి, భర్తృహారులను నలువురు పుత్రులఁ బడసెను. పాతంజలమున వత్సదంతాంతరితములైన వర్ణములను గొన్ని పూరించియుఁ గొన్ని పూరింపనేరక యచ్చటచ్చటఁ గుండలించుచుఁ బూర్ణముచేసి శిష్యులకుఁ జెప్పుచు భర్తృహారిదక్కఁ దక్కినమువ్వురు పుత్రులకుఁ జెప్పుచుండెను. అది గని భర్తృహరి రహస్యమునఁ దండ్రితో 'నయ్యా! వేదపాఠము లేకున్నను వగవను గాని మహాభాష్యము విను నర్హత నాకుఁ గలుగదే' యని వగచుచుండును కావున మీరు చదువుకొను తావున నొక బిలము త్రవ్వుకొని యందుండి వినుట కనుజ్ఞ నిమ్మనుటయు నామహాత్ముఁడు బిడ్డా నీవంటి యుత్తమచరిత్రుల కేవిధినిషేధములు లేవు. తప్పక వినవచ్చును.

కాని మహాభాష్యము పఠించువా రెట్టినియమములఁ బాటింప వలెనో మఱువక జాగరూకతతో నేర్చుకొమ్మని యనుజ్ఞ నొసఁగ నట్లే యొనర్చి యన్నలకంటె మిన్నగఁ బాతంజల మ్మం

తయు గ్రహించెను. పిదప నలువురకుఁ బెండ్లిం డ్లొనర్చి చంద్ర గుప్తుఁడు సంసారమున విరక్తుఁడై సన్యసించి గోవిందయతినామ మున శ్రీ శంకరభగవత్పూజ్యపాదులకు నాత్మజ్ఞానదేశికుఁడై ప్రసిద్ధివడసెను. తదనంతరము విక్రమార్కుని నప్సరోనృత్య పరీక్షకై మాతలిస్వర్గమునకుఁ గొంపోయెను. అతఁ డాస్వశ్వే శ్యలతారతమ్యము లుగ్గడించినందులకు మెచ్చి యింద్రుఁ డొక యపూర్వసింహాసన మిచ్చి దీనినెక్కి భూలోకము వేయియేండ్లు పాలింపు మని పట్టాభిషేకము చేసి పంపెను. అట్లు వచ్చు నన్నను గాంచి భట్టి నాఁటివృత్తాంత మంతయు విని నే నింకొక వేయివత్సరము లాయు విచ్చితి ననుటయు నది యెట్లని విక్ర మార్కుఁ డడుగ నిది యెక్కి వేయియేండ్లు భూమి పాలింపు మని కద యింద్రుని వరము? ఏటి కాఱునెల లిది యెక్కి భూమి నేలుము మిగిలిన యాఱునెలలు దేశాటనము చేయుము. అట్లైన రెండువేలేండ్లు నీవు భూమి నుందు వనుటయు రా జా తని ధీశక్తి కచ్చెరువడెను. పురోహితునిగా వరరుచిని, మంత్రిగా భట్టిని మిత్రునిగా భర్తృహరిని జేకొని విక్రమార్కుఁడు రాజ్యము చేయుచుండెను. వరరుచి జ్యోతిష శాస్త్రమున గ్రంథములు రచించెను. భట్టి వ్యాకరణశాస్త్రమునకు లక్ష్య ములగు పదముల నేర్చి రామకథ కావ్యముగఁ గూర్చెను. భర్తృహరియు నీతి, శృంగార, వైరాగ్యములు తొందడింప మూఁడు శతకముల రచించి గురుపదఁ గూఢ దురువగాహము

లగువత్సదంతఘాతములఁ జెడినయక్షరములఁ బూరించుచు మహాభాష్యమునకు సపాదలక్షగ్రంథ మగువ్యాఖ్య రచించి చూచుకొని కొంచెము గర్వము గలిగి "ఏమి భాష్యము ! ఏమి నేను ! నన్ను నెఱుఁగక పతంజలి స్వర్గమున కరుగుట నెంతయు ధన్యుఁడో కదా" యని యనుకొన నాగురుధిక్కారమున నాగ్రంథము భూమియందుఁ జేరైనలేక మాసిపోయెనఁట. ఈరీతిగా వ్యాకరణశాస్త్రముతోపాటు సకలశాస్త్రములును, వేదప్రపంచమును బోషించుచుఁ బ్రజలను ధర్మబుద్ధిఁ గాపాడుచు విక్రమార్కమహీపాలుఁడు శుభోదర్కముగా భూలోక మంతయు నేలుచుండెను.

సంపూర్ణము.

వాక్యకారం వరరుచిం భాష్యకారం పతంజలిమ్
పాణినిం సూత్రకారంచ ప్రణతోఽస్మి మునిత్రయమ్.

శ్రీగురుమూర్తయేనమః

# మునిత్రయచరిత్రము.

## ప్రథమాశ్వాసము.

శ్రీవాణీలలితాంబికాపుత్త్రుఁడు
జగచ్ఛ్రేణీగురుం డాత్మవి
ద్యావారాశి త్రిమూర్తిరూపుఁ
డగుమేధాదక్షిణామూర్తి తా
తావంశాబ్ధికళానిధిన్
జయవిహార్తన్ సుబ్బరాట్ఛాస్త్రి వి
ద్యావాగీశు గురుప్రసాదకృతికర్తన్
సర్వదా ప్రోచుతన్. 1

ఉ. భానుఁ డనామయం బొసఁగ వారిజసూతి చిరాయు వీయ శ్రీ
జాని సమస్తవైభవవిశాలు నొనర్ప రసజ్ఞ శారదో
ద్యానము గాఁగ శిష్యజనతామరరత్నము సుబ్బరాయవి
ద్యానిధి వ్యాకృతిశ్రుతపతంజలి రంజిలుతన్ సపుత్త్రుఁడై.

ఉ. ఏవిభుతాండవాంతరకృతేద్ధచతుర్దశరూపభేరికా
రావము లాదిబీజ మయి రాజిల వ్యాకరణాగమంబు ధా
త్రీవలయంబునం దవతరించెనో యానటరాజరాజు ప్ర
జ్ఞావధి సుబ్బరాయవిబుధాగ్రణి నోముఁ గృపార్ద్రచిత్తుఁడై.

సీ. ఎవ్వానినాభి శ్రుతీందుముఖీకేళి
సౌధమా నలువకు జన్మగృహమొ
యెవ్వానిపృథువక్ష మిందిరాసుందరి
తాండవించెడి రంగమండపంబొ
యెవ్వాని శిష్యత్వవృత్తి సాందీపని
చిఱుతపాపనికి సంజీవనంబొ
యెవ్వానికరుణ యీరేడుజగంబులు
వర్ధిల్లఁ దోలుకాఱు వానజల్లొ
గీ. అట్టి విజయపురీవరాధ్యాసి యైన
విజయగోపాలదేవుఁ డావిఃప్రమోద
మున మహామహోపాధ్యాయభూరిబిరుద
కలితు శ్రీసుబ్బరాట్సుధీతిలకుఁ బ్రోచు. 4

సీ. పద్మాలయాకృతిఁ బరిఢవిల్లుచు హరి
కేదేవి విభుశక్తి నిరవుకొల్పు
నలపరాపశ్యంతు లన మధ్యమావైఖ
రులన నేదేవివాగ్రూప మెనయుఁ
బరమేశుఁడును బదస్పందనా నర్హుఁ డౌ
నేదేవిసహవాస మింత యెడయ
నఖిలదిక్పాలురం దధికారరూపమై
యేదేవి బ్రహ్మాండ మెల్ల నేలు

గీ. శక్తిశబ్దాభిధేయయై విశ్వమున నేక
రీతి నేదేవి వెలుఁగు నా త్రిపురసుంద
రీమహాదేవి శుభకృపాదృష్టిఁ గాంచు
సుబ్బరాయసుధీచంద్రు సుగుణసాంద్రు. 5

ఉ. యోగివరేణ్యమానసపయోరుహబంభరడింభ మిందిరా
రాగరసాస్పదంబు మిహిరద్యుతిమూర్తి నిరంతరాంతరా
యాగశతార మద్రితనయాస్తనపాయికిశోరమాళి ల
క్ష్మీగణనాయకుండు కృతికృత్యనొనర్చునను స్వభృత్యునిన్.

ఉ. అమ్మరో మత్కృతీంద్రురసనాంచలసీమ వసించి సర్వశా
స్త్రమ్ము లుపన్యసించెడి విచక్షణుఁ జేసినచుట్ట మాటఁ జి
త్తమ్మున నిన్ను నెంతుఁ గవితాఫణితిన్ రసవద్వచోనుగుం
ఫమ్ముల నిచ్చి దేశికులమన్ననఁ గాంచఁగఁ జేయు భారతీ.

మ. సొరిదిన్ బ్రమొకేంద్ర మర్త్యలోకపతితీర్షువ్యాకృతిస్వర్ణదీ
ఝరముల్ బూన శివోత్తమాంగము ఖతౌషాగాచలంబై ఫణా
ధరలోకం బయి తేజరిల్లిన మునీంద్రశ్రేష్ఠులన్ బాణినిన్
వరరుచ్యాహ్వయునిన్ బతంజలి వచోనైపుణ్యపుణ్యార్థినై. 8

శా. తర్కవ్యాకృతిపారదృశ్వ నిఖిలాంధ్రజ్యోతిషాంగ్లోక్తిసం
పర్కున్ సూర్యబుధేంద్రశిష్యమణి దర్భావంశ్యు సర్వేశవి
ద్యార్కున్ వ్యాకరణోపదేశికు ద్వితీయాంతు నెంతున్ శుభో
దర్కత్వంబు కృతజ్ఞతన్ బడసి మత్కావ్యంబు రంజిల్లఁగన్.

మ. సుమనోగుంఫితసూత్రమున్ బరిమళించున్ గాదె యంచున్
నన్
సుమనశ్శేఖర సుబ్బరాడ్బుధయశశ్శోభిప్రబంధప్రణే తృమ
హాస్థాన మొసంగి ధన్యునినొనర్చెన్ బ్రేమ నేదేశికోత్తముఁ
డాసూర్యబుధేంద్రుపాదములఁ జిత్తంబందు హత్తించెదన్.

క. ప్రాచీనార్వాచీనస,
మీచీనకవీనమణిసమితి నుతిగతి స
ధ్రీచీనతఁ గొలిచెదఁ ద
ద్వాచాగోచరకవిత్వవైభవ మొందన్. 11

సీ. విజయరామావనీవిభునిండుకొల్వున
సుకవిత లాడించుసూత్రధారి
గంటమ్ము లేకె కొక్కగడెకు నూఱులు పద్య
ములు సెప్పెద నటన్న పోటుబంటు
కడఁగి తిట్టినతిట్టు కమసాలిసుత్తిపె
ట్టనఁ బేరు మ్రోసినయట్టిదిట్ట
యతిఁ గూర్చుకైపె కవితనేర్పుతెలుపు నం,
చును జాటి కూర్చి చూపినఘనుండు

గీ. నైన సూరన బెడిదంపుటడిదమునకు
ముందుగ సలాము సేయక పోలునొక్క
కవి యయినవాని కెట నైనఁ గాని యనిన
నేఁటినామాట చెప్పఁగా నేటి కింక. 12

క. ఈరీతిగ సుకవిజనా
చారమ్మైన విష్టదైవసమితిఁ గొలిచి నేఁ
డీరచనకుఁ గడఁగినయ
క్కారణ మెఱిఁగింతు వినయగరిమం బెసఁగన్. 13

శా. హూణాంధ్రామరవాక్పయోధుల కగస్త్యుం డాత్మవిద్యా
బుధశ్రేణిన్ వ్యాసమహర్షి నిశ్చలతపశ్శ్రీ గాధిసూనుండు శ
ర్వాణీపాదసరోరుహానవరతార్చన్ శంకరార్యుండు క
ళ్యాణానందజగద్గురుండు వెలయున్ యత్యాధిపత్యంబునన్.

మ. యతిసామ్రాజ్యధురంధరుం డతఁడు శబ్దామ్నాయపారంగతున్
దతకీర్తిన్ బహుశిష్యసేవితుని దాతాసుబ్బారాట్ఛాస్త్రి స
న్మతి నాహూతు నొనర్చి వ్యాకరణసామ్రాజ్యాభిషిక్తున్ బొన
ర్చుతఱిన్ నాకిటు శ్రీముఖం బనిపెఁ గారుణ్యంబగణ్యంబుగన్.

ఉ. వత్స! కనంగఁ గంటిమి భవద్రచితం బగుసుబ్బరాయవి
ద్వత్సితకీర్తిచంద్రికను దత్కృతి యమ్మహనీయుషష్టిపూ
ర్త్యుత్సవకాలమం దొసఁగియుంటయువింటిమివిందుమిప్పుడున్
దత్సుధిపేరఁ గావ్య మొకదాని రచించుచు నుంటి వీ వనన్.

చ. అది నిజమేని యక్కృతిసమర్పణ కియ్యది యుత్తమోత్తమం
బదనుసుమా యుమాచరణహాటకపీఠిక మ్రోల మే మొన
ర్పుదు మిదె సుబ్బరాయబుధపుంగవు వ్యాకృతిసార్వభౌమస
త్పదమున నిల్పి స్వర్ణమయపట్టము గట్టి శుభాభిషేకమున్.

క. రమ్మా గుంటూర్పురికిన్,
దెమ్మా త్వద్రచిత మగుమునిత్రయచరితా
ఖ్య మ్మాకృతి యయినంతయ
యిమ్మా వ్యాకరణమండలేంద్రున కెలమిన్.

గీ. అనుచు నవ్యాజకరుణతో ననుచు నాజ
గద్గురుల శ్రీముఖము కన్నఁగవకు నద్ది
కొని యిది యలభ్యయోగముగను ఘటిల్లె
ననుచు మత్కావ్యము గృతార్థ మయ్యె ననుచు. 19

గీ. మోదమునఁ దేలి గుంటూరుపురిని శ్రీస
దనమునను సుబ్బరాయవిద్వన్మహేంద్రు
వ్యాకరణశాస్త్రసామ్రాజ్యపట్టభద్రుఁ
జేయుతటి కేఁగి గురుల దర్శించి మ్రొక్కి. 20

క. పరమవినీతుని నను నా
దరమేదురవీక్షణములఁ దనుపుచును జగ
ద్గురువులు నారాయణసం
స్మరణపురస్సరము సెల వొసంగిరి యిట్టుల్. 21

మ. భవదాయానము మాకపారముద మాపాదించె నీవెంచుకొ
న్నవిధిన్ రాయఁడుశాస్త్రి కిప్డు కృతికన్యాదానమున్ జేసి "స
త్కవితాభూషణ" లాంఛనాంకితుఁడవై ధాత్రిన్ బ్రవర్ధిల్లుమం
చవిలంబంబుగ శ్రీముఖం బొసఁగి ప్రేమావాప్తి దీవించిరన్.

గీ. వ్యాకరణసార్వభౌమపట్టాభిషిచ్య,
మానుఁ డగురాయుబుధుఁ డసమానవత్స
లత పలుకుపల్కు నందుఁ దొలంకునట్లు
సింహపీఠిక నుండి వచించె నిట్లు. 23

చ. కృతిగొని సార్వభౌములు కవీంద్రులకుఁ మణిహేమభూషణ
ప్రతతులు నగ్రహారము లపారధనంబు లొసంగి రంచు సం
తతమును విందు మట్టితరుణం బిది దీవెన కన్య మేమి స
త్కృతి నొనరించు మైన నివియే సకలం బని కొమ్మటం చొగిన్

క. ఘనసారమిళితతాంబూ
లనవాంబరరాంకవాదులన్ గాన్కగ ని
చ్చి నను గని స్వాములవా రి
చ్చినబిరుదున కేను సంతసించితి మనుమన్. 25

క. "యతిచక్రవర్తులును బం
డితమండలచక్రవర్తి నీవు నొసంగుసం,
చితబిరుద మమూల్యమె కా
ని తలఁప నది దాల్పఁ దగుదునే నే" నంటిన్. 26

క. అనుటయు గురులిరువురు ని,
ట్లని రీబిరు దంద సందియం బేల జగ
జ్జననీప్రేరణ మాప
ల్కినది యమోఘము గొనన్ వలెన్ నీ వంచున్. 27

ఆ. అంత వారియాజ్ఞ కటునిటు ననలేక
కడువినీతి శ్రీముఖంబు గనుల
కద్దికొని శిరంబునం దూని సాష్టాంగ
మెఱఁగి నయము భయము నెనయ నంటి. 28

ఉ. వారు జగద్గురుల్ ప్రబలవైదుషి నీవు జగద్గురుండ వె
వ్వారలయాజ్ఞ కేమి నుడువంగల నైన నొకండు వల్కెదన్
మీ రొనరించు దీవెనకు మించుచుపాయన మన్య మున్నె? యె
వ్వారల కద్ది లభ్య మగుఁ బ్రాక్తనపుణ్యముపండకుండఁగన్. 29

క. క్షితిఁ బాణినికాత్యాయన
పతంజలులచరిత కావ్యఫణితి రచింతున్
బతిఁ జేయ నక్కృతికి న
ర్హతముఁడు గలఁడొక్కొ నినుఁ దొఱంగి బుధేంద్రా. 30

ఆ. అమ్మునిత్రయంబు వ్యాకృతిరాజ్యని
ర్మాత లద్ది యేలు నేత వీవు
కానఁ దద్యశోవికాసి యాకృతి కీవ
నాయకుండ వౌట న్యాయ మెన్న. 31

క. తాతలు తండ్రులు వేదా
ధ్యేతలు షట్ఛాస్త్రపాండితీమండనవి
ఖ్యాతుఁడవు నీవు నీసముఁ
డేతఱి నేకవికి దొరకునే కృతిపతిగన్. 32

ఉ. సాంద్రవలక్షదీధితి దిశల్ తళుకొత్తఁగ దిగ్గతత్వద్యశ
శ్చంద్రికఁ దావకీనకులజన్ములు తొల్లిటినేఁటివారు ని
స్తంద్రరుచిన్ రహింతు ప్రకృతంబొక మాఱదియాలకించి ప్రా
జ్ఞేంద్రశిరోవతంస! కొనుమీ మనసిచ్చి మదీయసత్కృతిన్. 33

ఉ. మా వెలనాటిబాంధవము మాణవకత్వముగోలె నీకు సం
భావిత మయ్యె నీదుగురువర్యుల శిష్యుల నెంచ, నింక మీ
ద్రావిడబాంధవంబొ తొలుతన్ రఘువంశము చేతఁబట్టునాఁ
డే వరియించెనన్ను నిపు డేలతరంబులు గోత్రముల్ గనన్. 34

గీ. అంతదూరము పో నేటికయ్య తావ
కాదిశిష్యుండు సూర్యనారాయణాఖ్య
బుధుని శిష్యుఁడు సర్వేశబుధుఁడు నాకు
వ్యాకరణదేశికుండె నీ వాఁడఁ గానొ. 35

చ. ఇది వెలనాఁటికన్య యగుటే కడుమేలయి వచ్చె నేఁడు నీ
ముదిమికి నన్యకన్యకలు మోముగిఱుక్కునఁ ద్రిప్పుకోరె? యిం
కిది కడు శాంతభావము వహించి యమాయికవృత్తి నీవశం
వదయయి తన్పు నిన్నని త్రివారము పల్కఁగలాఁడ సత్తమా.

క. అని పలికి మ్రొక్కి రాయఁడు
మనీషి కభ్యుదయ మొదవ మది భక్తిని న
ప్పనగావింప రచించిన
మునిత్రయచరిత్ర మెట్లు మురువొందె ననన్. 37

# కథాప్రారంభము.

మ. సిరు లింటింట నటింప వన్నెయుచు వాసిం గాంచి విజ్ఞానబం
ధురమై శౌర్యధురంధర మ్మయి సువస్తుశ్రేణిపూర్ణాపణో
త్కరమై యాజ్ఞికధైనుకప్రవర మై ధాన్యాకరం బై పురీ
వర మొక్కండలరారు నిత్యశుభశోభాస్థాన మై భూస్థలిన్.

ఉ. క్షాత్రవమర్దిరీక్ష్యపటుశౌర్యవిరాజితనందరాజదో
ర్మాత్రసురక్షితం బయి యమర్త్యపథావధికోచ్ఛ్రితాగ్రవ
ప్రత్రయలంఘనోన్నతశిరస్థలసౌధము లొప్పఁ బాటలీ
పుత్రసమాఖ్య నప్పుర మపూర్వవిభూషణ మా ధరిత్రికిన్.

క. అక్షయసుఖసమవాప్తి బు
భుక్షపురసదృక్ష మయి ప్రభూతశ్రీ న
య్యక్షపురిపక్ష మయి భర
తక్షితి కప్పురి వతంసితం బయి మెఱయున్. 3

క. కోటలతో జొంపపువిరి
దోఁటలతోఁ దరుణిమంబుతోడిచెలులస
య్యాటలతో వల పొలికెడు
పాటలతో నప్పురము దివంబు హసించున్. 4

ఉ. సారసువర్ణహర్మ్యగణజాగ్రదమేయవిచిత్రభిత్తికా
ధారనిరంతరద్యుతివితానకిరన్నవరత్నపుంజకి
మ్మీరితవీథికావళి సమీకృతసేంద్రధనుర్మరుత్పథ
శ్రీరమణీయ మై ప్రగుణరీతిఁ జెలంగుఁ బురంబు నల్గడన్.

ఉ. ఆకస మంటి వైరులరహస్యములన్ గనిపట్టి భీరువుల్
రాకుఁ డటంచు సన్నల నిరంతరమున్ బెదరించుమాడ్కి, వా
తాకులితాంబరాంచితము లై ధ్వజముల్ తపనీయకింకిణీ
స్తోకరవంబునన్ నినుచుఁ జూపఱచూడ్కికి విభ్రమంబులన్.

క. అంభోధిలోఁ తెఱింగిన
యంభస్స్తంభనవిదాళి కైనన్ దరమే
కుంభీనసలోకావధి
గంభీరిమ నెనయుపరిఖకలరూ పెఱుఁగన్. 7

గీ. నూటికినినూర్గు రుత్తమర్ణులు సహస్ర
మున కొకనినే నపండితుఁ గనఁ దరంబె
లక్షలుగదా వదాన్యులు బిక్షమెత్తు
నరుఁడు గనరాఁడు కోటి కొక్కరుఁడు పురిని. 8

శా. విద్యాసాగరుఁ డై విచక్షణమనోభీష్టార్థసంపూర్తికే
ళీద్యోపాదప మై విరోధిగళపాళీనాడికాకోష్ణర
క్తాద్యాన్యోగ్రకృపాణలబ్ధజయలక్ష్మ్యాలింగనోల్లాసి యై
యుద్యన్నవ్యసుధాంశుఁడై తనరునందోర్వీంద్రుఁడేలున్ బురిన్.

క. క్రూరులయెడఁ గ్రూరుండు ను
దారులకు నుదారుఁ డరుల కరిధరుఁడు సుహృ
ద్వారము నెడ సుహృదుం డా
భూరమణుఁడు వెలయు ధర్మమూర్తి యనంగన్. 10

గీ. విబుధవృతుఁ డౌచు రాజ్యము వేయికనుల
నరసికొనుచు సుధర్మాశ్రయమున గురున
యోపదేశాప్తి నెంనుఁ బొంపొందు భూమి
లోకదేవేంద్రుఁ డాతఁ డలోకమహిమ. 11

క. ఆనందరాజపాలన
నానందితసకలలోక మై కులధర్మ
శ్రీ నంది,యూప్రగం బుప
మానేందిరఁ బసఁ గుఁ జాల కరయు జగంబుల్. 12

ఉ. అం దొకక్రేవ వైధసకులాభరణంబులు సాంగవేదవి
చ్ఛందిరు లిందుశేఖరపదప్రవణాత్మకు లాహితాగ్ను లిం
పొందఁగ నగ్రహార మొకఁడుం డుఁబయోరుహగర్భలోకముఁ
గ్రిందును మీఁదఁ బెట్టి యసకింపఁ బదక్రమరీతి మిన్నయై.

క. ఉండు నుపవష్టుఁ డన నొక
పండితుఁ డయ్యగ్రహారవాసుఁ డనూచా
నుం డంతర్వాణి కళా
మండనుఁడు శ్రితాంతవాసిమందార మనఁ. 14

క. నిపరప్రీణితబుధుఁ డ
విపశ్చిదగ్రణి చెలంగు విత్తాఢ్యుం డై
విపులవిపుశేంద్రపూజా
భ్యుపగమనిద్రకీర్తిపూరితదిశుఁ డై. 15

క. ఆతనికిఁ గలఁ డగస్త్య
భ్రాత యనం దగినయన్న వర్షసమాఖ్యుం
డాతతదారిద్ర్యగ్రహి
భూతుఁడు మూఢత్వసమభిభూతుఁడు మిగులన్. 16

ఉ. తమ్ముఁడు వేదశాస్త్రములతంద్రమతిన్ సతతమ్ము నేర్వపూ
థ్యమ్మునఁ గాంచుఁగాని యకటా యొకటేనియునబ్బదంచు ఖే
దమ్ము లవమ్ము నెమ్మదిని దాల్పఁడు నిల్పఁడు శ్రద్ధ యెల్లకా
లమ్మును బుచ్చుఁ దజ్జనకులన్ గికురించి యదేమికర్మమో. 17

గీ. వానిజనకుండు శంకరస్వామి దేశ
మునకు సరిషద్ధపండితుం డనఁగఁ బరఁగె
నంబయో శారదాంబ యయ్యాలుమగల
కెట్లు పుట్టెనోకో యట్టిమట్టిబొమ్మ. 18

మ. జనకుల్ శస్త్రయశఃప్రశస్తులగుటన్ సత్సంప్రదాయం బటం
చును ముందేనియు నంత వాఁడగునటంచున్ మూర్ఖుఁడై నట్టివ
ర్షునకున్ బెండ్లియొనర్చె భవ్యుఁడొకవిప్రుం డాత్మజన్ దెచ్చి యి
చ్చి నితాంతోన్నతవైభవం బెసఁగఁ గూర్చెన్ సారెలున్ జీరలున్

క. వాణి సకలవిద్యల శ
ర్వాణి పరివృఢాంతరంగవర్తిష్ణుత గీ
ర్వాణియ సొగసున వర్షుని
పాణిగృహీతికిని సాటిపడఁతులు గలరే. 20

ఉ. చక్కదనాలప్రోవు నెఱజవ్వనపుంగని మేటితెల్వి పె
న్నిక్క పతివ్రతాత్వమున కేలికసాని స్వబంధుకోటిలో
మక్కువ కెక్కు సాధ్వి యభిమానవతీజనతావతంస మా
యక్కకు నక్కటా యెటుల యబ్జజుఁ డట్టిపతిన్ ఘటించెనో.

గీ. మఱఁది కుపవర్షునకుఁ గూడఁ బరిణయంబు
సకలవైభవములతోడఁ జలిపి యత్త
మామలు పరోక్ష మెనయ నమ్మగువ మగని
బాలిశత నెంచ కేఁగించుఁ గాల మెట్లో. 22

క. తలిదండ్రు లత్తమామలు
కలిమి మెఱయ మున్న యిడినకలధౌతవిభూ
షలు పొట్టకై సరిపడ న
చ్చెలువ మిగిలెఁ గట్టుకొన్న చేలయుఁ దానున్. 23

క. మంగళగళసూత్రము పసు
పుం గుంకుమమాత్ర మఖిలమునకు మిగిలినన్
మంగళరూపమ్మున న
య్యంగన గన నాసతీత్వ· మట్టిద కాదే. 24

సీ. సరససల్లాపముల్ జరుపుభాగ్య మెఱుంగ
దనిశ మన్నియు నాస్తి యనుటె కాని
కస్తూరికాదిసౌగంధ్య మెఱుంగదు
మలినకృశాంగి యై మనుటె కాని

ప్రతివేశినీసహభాషణమ్ము నెఱుంగ
దింట నొక్కత పడి యుండెఁ గాని
యనరాదు గాని నాయకుకేళిసౌఖ్య మిం
తెఱుఁగ దాఁకటను నందురు కాని

గీ. కనులలోఁ బ్రాణములు కుతికంటిలోనఁ
జేలకొంగును దాల్చి యవేలతరుణి
మం బడవిఁ గాయువెన్నెలమాడ్కిఁ బుచ్చు
నతనిజోటి కుచేలునిల్లాలిసాటి. 25

గీ. అన్నిగతులఁ గుచేలునిల్లాలిసాటి
యగున కాని యొకందుఁ గాసంతనయము,
పెంచలే కేడ్వ దారిద్ర్యవేళ వర్షు
కాంత సంతతి మాత్రమ్ము గాంచదాయె. 26

ఉ. అట్టివిమూఢుఁ డట్టిజడుఁ డట్టినిరక్షరకుక్షి యట్టివా
కట్టయినట్టిపామరుఁ డొకందును మందునకేని బుట్టఁ డ
ప్పట్టనమందె కా దవనిభాగమునం దెటనైనఁ గాని యే
పట్టున నొక్కగవ్వయు నుపార్జనసేసి యెఱుంగఁ డేటికిన్. 27

ఉ. ఉగ్రత సూపియున్ విడిచియున్ జనకుండు నిరంతరంబు వి
ద్యాగ్రహణక్షమున్ సలుప నందినపాటులు సంస్మరించి య
ట్లగ్రజు నేచుమాధ్యగతి యారయ లే కుపవర్షుఁ డార్తి చే
వ్యగ్రమనస్కుఁ డై యొకపు డాత్మకళత్రముతోడ నిట్లనున్

మ. సకలక్ష్మాపతిసంసదంతరసదర్చాపూర్తి నాకీర్తి మి
న్నక నాకబ్బిన నేమి మూఢుఁడయి యన్నం బేని లేకగ్రజుం
డు కృశింపన్ గనులార నేకరణిఁ గందున్ జ్ఞానవంతుఁడనై
యకటా! యేర్చుఁ దుషాగ్నిరాసు లయి నాస్వాంతంబు నీసం
పదల్.

ఉ. వాద మొనర్చి భూపతిసభాస్థలులన్ బుధులన్ జయించి యా
పాదశిరస్క మంబరసువర్ణజహారాకృతి మున్గువేళ "మీ
సోదరు లెంద?అందఱు బుధోత్తము లే?"యని యెవ్వఁడేని న
న్నాదృతిఁ బ్రశ్నసేయ మన సంతయు నీరయిపోయినిల్చెదన్.

గీ. అని వచించుచు విమలనిజాంతరంగ
మందు దీనాకృతిం దోఁచు ననఘశీల
నుత్తమసతీచయంబున కొజ్జబంతి
యగువధూనికఁ దలఁచి యుదగ్రుఁ డగుచు. 31

చ. మృదులదుకూలకంచుకసమేతము స్వర్ణమణీవిభూషలన్
ముదితలు దాల్చి పేరఁటముపోయెడువేళల వారివెంబడిన్
ముదుగుఁజినుంగుఁజీరపసుపున్ దగుకుంకుమమాత్రఁదాల్చిమా
వదినె సలజ్జయై మనమునన్ గనఁ బ్రాణము పోయినట్లగున్.

సీ. మామగా రొసఁగిన మణికంకణాముల
జన్నెపట్టెను భర్తజడిమ దొలఁగ
నత్త యిచ్చినసువర్ణాపీడ మమ్మి
తీర్పదె బంధుభక్తి కేర్పడినయప్పు

తండ్రి వజ్రమణిస్థగితహేమవిభూష
లర్పించెఁ బ్రాణేశుఁ డడిగె ననుచు
తల్లి యొసంగుముక్తాలలంతిక యిచ్చె
విభుఁడు గోరఁగ దినవెచ్చమునకుఁ

గీ. చిల్లరవిభూష లన్నియు నిల్లుదీర్ప
వెలితి రాకుండ నొండొండు వెచ్చపెట్టె
నేఁటికిని గ్రొత్తకోడల ల్లెట్టికైన
మాఱుమాటాడ వెఱ పొందు మగనినుడికి.

శా. దారిద్ర్యంబునఁ గప్పురంబటు కృశత్వం బొందునే కాని యే
కూరా కన్యల వేడఁబోదు పతిపల్కుల్ వేదవాక్యంబుగా
నారాధించును దత్సతీతిలక మేయబ్జాక్షి యీనాఁ డలం
కారార్తిన్ దలపోయకున్న నుబుభుక్షన్ సైఁచునో చెప్పుమా.

చ. మగఁడు సిరుల్ గడించుచును మన్నన నౌదలదాల్చునాఁట నే
మగువయు మాటఁ దాఁటదు సమంచితసేవల నెల్లుదప్ప, ది
ట్లగణితనిస్వతాభిహతుఁ డౌపతిఁ బాయ కహర్దివంబు మె
చ్చుగఁ బరిచర్యసల్పుసతిఁ జూచితిమే యెటనేని యెన్నఁడేన్.

చ. మనకులమందుఁ బెద్దలు నమాయికులున్ నిఱుపేదలున్ జగ
జ్జననుతశీలు రై నయలజంపతులన్ స్వకుటుంబమట్లు నె
మ్మనమున నెంచి వారి కవమాన మొకండు నొకింతయేని బు
ట్టనియటు సేవ సల్పినయెడన్ మనజన్మము ధన్యమౌఁగదే.

గీ. జనకశబ్దభవం 'బస్న' శబ్ద మంత్రము
తండ్రియంతటివాఁ డౌటఁ దద్భవాఖ్యఁ
బూను నగ్రజుఁ డాగమంబులుఁ దదర్థ
మే వచింపవె "పితృసమో జ్యేష్ఠ"యనుచు. 37

గీ. ఎన్నిదివసంబు లెందఱె ట్లీఁగఁ బెంచి
తిన్న మనసంపదల కొక్క-చిన్నమొత్తు
లోప మొదవునె? యిదియుఁ బరోపకృతిగ
నెంచి మాయన్న వదినెఁ బోషించుచుండె. 38

క. తనవారు కూడుగుడ్డకు
ననిశం బల్లాడుచుండ నన్యులకై చే
సిన దానాదికము ఫలిం
చునె యరయను ధర్మ మెంత సూక్ష్మంబో చెలీ. 39

క. అని యనునయమునఁ బతిప
ల్కినపల్కుల కెల్లఁ బత్ని లీలగఁ దలయూఁ
చెను మదియం దేమున్నదొ
కన బ్రహ్మతరంబె తెలియఁగావలెఁ గ్రియలన్. 40

ఉ. ధీనిధి యాబుధుం డనుమతించెఁ గళత్ర మటంచు హర్షపు
ల్లానముఁడై సభార్యుని నిజాగ్రజుఁ బ్రార్థనసేసి తెచ్చి యీ
శానుని నంబికన్ గొలుచు చందమునన్ రుచిరాన్నపానవా
సోనిలయంబులిచ్చి కొలుచున్ భయభక్తియుతోక్తిఁ దేర్చుచున్

గీ. తోడికోడలు పెట్టెడుకూడు గుడువ
విషముగాఁ దోఁచు వర్షని వెలఁదిమదికి
నాయకుం డప్రయోజకుం డాయెనేని
మానినికి నెల్లయెడ నవమానమె కద. 42

చ. గడగడలాడుచున్ గరయుగంబు మొగిడ్చి వినీతి సోదరుం
డడుగులకున్ మడుంగులిడి యన్వహమున్ భజియించుచుండ వ
ర్షుఁడు జనిమంబునన్ మది నెఱుంగఁడు మోదము ఖేదమారయె
య్యెడఁ గననౌనె భేదలవ మేచిన తామససాత్త్వికంబులన్.

గీ. ఇటుల కొన్నాళ్లు తమ్మునియింట నుండ
నేమి పుట్టెనో యొంటిమై నెటకొ యరిగి
వచ్చి తొల్లిటిజాడ్యంబు వాసి వర్షుఁ
డింట నుండెఁ దపోనిష్ఠ ఋషి యనంగ. 44

ఉ. ఇంటఁ బదార్థముల్ గలవె యింతి భుజించితివే యటంచు వాఁ
ల్గంటిని బ్రశ్నసేసినటు కానఁగ రా దరుణోదయాదిగా
నొంటి దపంబు సేసికొనుచుండుటయున్ సహజన్ముఁడత్ని దో
యింటను బెట్టు దాసిభుజియించుటయున్ వ్రతమయ్యె వానికిన్

శా. ప్రత్యూషంబున లేచుఁ గాల్యవిధులారన్ దీర్చుస్నాతుండగున్
నిత్యం బాశ్రుతిచోదితక్రియల నన్నింటిన్ బచారించు ని
ప్రత్యూహంబుగ నర్ధరాత్ర మగుపర్యంతంబు నీశార్చనా
కృత్యంబందమునింగియుండు నిరతం బేకాంతయోగస్థితిన్

క. తోడఁబుట్టులు మఱఁదండ్రుల వేలా
కుటుంబం గూడేని భార్యనుం బెట్టంజా
లఁడు యే మని పెండ్లాడెను
జడుఁ డితఁ డని దూఱుచుండ్రు జనములు పురిలోన్.

క. అయిన లాతఁ డేఁగి యేశెం
చటుగోలెఁ దదంబుజాక్షిచూపులలోఁ దా
ల్లిటిసౌఖ్యము గనరా ను
త్కటహేతు వెదో యొకంత గలుగఁగ వలయున్. 48

ఉ. ద్వాదశవత్సరంబు లుపవష్టుఁ డటుల్ సకలోపచారసం
పాదన సగ్రజున్ వదినె మన్ననఁ బ్రోచెఁ బ్రతిక్షణంబు న
త్యాదర మగ్గలింప; విమలాత్ముల మైత్రియు భక్తియున్ సము
త్పాదన మొందు టెంతె వితతం బగుఁగాని తనుత్వ మొందునే.

గీ. భర్త కాదర మెచ్చుఁ దద్భార్యకుఁ బ్రతి
నిమిషమును నాదరంబు క్షీణింపఁదొడఁగె
నదిగదా సాజమునకు నాహార్యమునకు
నంతరము; కాన నెదను దత్కాంత వగచు. 50

ఉ. వియ్యపురా లటుల్ తినెను వేళకు వచ్చెను కాని యింత సా
హాయ్యము సేయ దాఁడుదికదా పసిపాప విలాప మొందఁగా
నుయ్యెలనూఁపరాదొ జల మొక్కపనం దెఁడు తేరరాదొ లే
దెయ్యెడ నిట్టి దంచు గణియించు గదా సఖి తోడికోడలిన్.

సీ. ఇంటఁ గాలిడ హాఱియించు నేమే నంచుఁ
గనువెట్టి వెనువెన్కఁ గదిసి తిరుగుఁ
బసిబిడ్డ జోకొట్టఁ బర్యంకమును డాయు
'వలదమ్మ నినుఁ గాంచి యాఘుకు" ననును
వంటసేసెద నన్న వల దనును బదార్థ
పితతి యొక్కట నెప్పపెట్టు ననుచు
ఘనకనకాను లుండినయజుల్ గనపడు
దృష్టి సోఁకినఁ బోవు నేమొ యనుచుఁ
గీ. దోఁడికోడలి నుపవర్షు చేసె యిట్లు
నమ్మినటు పైకిఁ బల్కుచు నమ్మకుండి
పతిభయంబునఁ దప్పవిపనిగ లేని
ప్రేమఁ జూపుచు మది విలపించుచుండు. 52

ఉ. ఇట్టుల తోడికోడలిడు నేవపుఁగూటికి వాయి యొగ్గి యె
ట్టెటులో కాలమున్ గడుపు చింతిని జేశ్వరుఁగొల్చుచుండి యి
క్కట్టులు వాసి సౌఖ్య మని కల్గునె యెన్నఁటికేని యంచు లో
నొట్టినశోకవహ్నిఁ బడి యుండు ననన్యశరణ్యయై సదా. 53

ఉ. అంతట నొక్కనాఁడు కమలాప్తుఁడు ప్రాగ్గిరిఁ దోఁచువేళ న
త్యంతపథిశ్రమప్రచలితాంగకులై ద్విజపుత్రు లిర్వు ర
క్కాంతనుఁ డాసి "వర్ష గురుదర్శనభాగ్యము గూర్పు"మంచుఁ బా
దాంతికమందు వ్రాలిరి యిలాగతచంద్రదినేంద్రులో యనన్.

గీ. ఆసతీరత్నమును బ్రేమ మతిశయిలఁగ
వారి లేవంగ నెత్తి యధ్వశ్రమాప
నోదనార్థంబుగా విమలోదకముల
నిచ్చి మేనులు నిమురుచు నిట్టు లనియె. 55

క. నాయన్నలార మీ రెవ
రేయూ రెవ్వారిబిడ్డ లేటి కిటుల మా
ర్గాయాసముపాలై యతి
హేయం బగుమాగృహమున కేతెంచితిరో. 56

శా. ఆకించన్యభరాభిభూతిఁ బరపిండాదత్వముం గాంచి య
ట్లాఁకంటన్ బడినామరూపములుమాయన్, మాయ కేతత్కుటీ
రాకంబొందినమమ్ము నెట్లెఱిఁగినారో? యేతలం పూని యీ
నాకున్ మ్రొక్కిరొ వర్షు నేల గురుఁడన్నారో విచిత్రంబగున్.

క. అరసిన మము లాభం బెది
పరాన్నభోజులము మేము పట్టెఁడు మీ కో
గిర మేసి బెట్టఁగలమే
కరఁగె మనసు మిమ్ముఁ జూడఁగా సుతులారా. 58

చ. అనుటయు సవ్వటుద్వయమునం దొకరుండు వినీతి మీఱ ని
ట్లను "మముఁగన్నతల్లి! భవదాత్మజులం చుఁదలంచుమా ప్రియం
బున మము వర్షసన్నిధికిఁ బుచ్చినఁ జాలు నితోఽధికార్థ్వాణం
బును గోనమమ్మ; మాకథను ముందుగఁ దెల్పెద నాలకింపవే.

శా. నీ వాలించుము యొండు వేతసమనన్ విఖ్యాత మౌవీ డదే
మావాసస్థల మందు శాస్త్రవిధులామ్నాయాబ్ధిపారంగతుల్
దేవస్వామికరంభుఁ డంచును ప్రసిద్ధిన్ గన్నసోదర్యు లిం
ద్రావిద్వాంసుల కేము నిర్వర మహత్త్వం బైతి మోయమ్మరో.

క. ఇతఁ డల దేవస్వామికి
సుతుఁ డేను గరంభునాత్మజుండను; మాయం
డితఁ డింద్రదత్తనామకుఁ
డతివా! నను వ్యాడి యందు రవ్వల వినుమా. 61

క. బెట్టు పిడు గడఁచినటు నా
పుట్టువుతోఁ దండ్రి చెల్లిపోయెను దొలి నే
నెట్టియఘ మొనర్చితినో
కట్టి కుడుప కద్ది యేప్రకారము విడుచున్. 62

శా. తత్సౌభ్రాత్రవశంవదుం డయి నితాంతక్షుబ్ధచిత్తంబుతో
నుత్సాహంబు త్యజించి మామకపితృవ్యుం డంతఁ దద్భీకరా
పత్సింధూత్తరణాసమర్థత మహాప్రస్థానమున్ సల్పి మే
నుత్సర్జించెఁ దృణంబుగా; నిజసమానోదర్యునిన్ గూడఁగన్.

శా. మాతల్లుల్ పతివిప్రయోగదహనోష్మప్లుష్టభిన్నాంగులై
చేతంబుల్ వగులంగ నేడ్చుచును మాక్షేమంబు వాంఛింప కా
యాతాపవ్రజ మడ్డినన్ మరల కొయ్యన్ ధైర్యులై పావక
స్ఫీతజ్వాలల దేహముల్ విడిచి రాభీలానుయానక్రియన్.

క. ఒకకంట నేడ్చుచును వే
ఱొకకంటను నగుచుఁ బిత్రువియుక్తుల నిజపు
త్రకుల సతు లెంద ఱోమరో
యకటా ! కన మంతమాత్ర మగు భాగ్యంబున్. 65

చ. ఉపనయనాదిసంస్క్రియలనొందులు సేయుటెకాని, పొంగిమా
త్రపిత లొనర్చి యొజ్జలపదంబుల మమ్ములఁ జేర్చి విద్యలన్
నిపుణులఁ జేయుపుణ్య మొకనివ్వరిముల్ గొనయంత గల్గ దం
చపరిమితార్తిఁ గూరి సగమైతి మనాధుల మైతి మత్తఱిన్.

క. మాతంద్రులపాండిత్యము
ఖ్యాతియు విజయములు లోకు లపుడప్పుడు సం
ప్రీతిఁ గథలుగ వచించుట
మాతలఁపులఁ బొడమె నాగమజిఘృక్షు పొరిన్. 67

ఉ. అంతట మేము ధైర్యమె సహాయముగాఁ గొని విద్య నేర్వ దే
శాంతరదేశికాంతరసమాశ్రయ మొందియుఁ దృప్తి లేక దు
ర్దాంతతపంబు సేసితి ముదారదయానిధిఁ గార్తికేయుఁ జే
తోంతరవర్తిఁ జేసి యశనాంబులు మాని యనేక వబ్దముల్.

సీ. మూడుకన్నులవేల్పుమ్రోల నాటల నాడి
వచ్చి న ట్లధికనిశ్వాస మొలయ
నాటు శాస్త్రములకేదారంబు లగుమోము
దమ్ముల లేనవ్వుతళుక్కు లీనఁ

బదిరెండుబాహులరయుడుటునద్వాదశ
భాస్కరుల్ పగటిదీపములు గాఁగ
నిరువదినాల్గుగాఁ బరఁగుతత్త్వముల క
వ్వలఁ దోఁచుతేజంబు వలకొనంగ

గీ. నెలమి ద్విగుణీకృతోత్సాహ మెసఁగ శతము
ప్రమథగణములు వేవృడు పరమమునులు
బలసికొలువంగ ముగ్ధులబాలుఁ డగుచు
సౌరసేనాని యంత సాక్షాత్కరించె. 69

గీ. అట్లు ప్రత్యక్ష మైనషడాస్యపాద
కమలముల వ్రాలి యోలి స్తోత్రము లొనర్పు
చున్నమమ్ముఁ గృపామృతం బుబికి పాఱ
లేవ నెత్తి వచించె నీలీల గుహుఁడు. 70

ఉ. బాలకులార! యిట్టిపసిపాయమునన్ గడుఘోర మైనయీ
శైలతటంబునన్ దపము సల్పుచు నీక్రియ వాఁడి వత్తులై
జాలి పడంగ నేటికి నొసంగెద మీయభిలాష మొద్ది యో
వైళమ తెల్పుఁ డన్న భయభక్తులు సంతసమున్ దొలంకఁగన్.

క. నిటలతటీఘటితాంజలి
పుటుల మగుచు దేవ! వేదముల శాస్త్రములన్
బటిమం బాసించెద మ
క్కటికముఁ జూపింపు మనుడుఁ గంధుఁ డిటు లనెన్. 72

ఉ. శ్రోత్రియవంశులార! వటురూపఖరాంశుసుధాంశులార! తా
పత్రయముక్తులై తపసిపద్ధతి వర్షసమాఖ్యఁ బాటలీ
పుత్రపురంబునన్ బుధవిభుం డొకఁడుండు నతండు మీమనః
క్షేత్రమునన్ శ్రుతిశ్రుతవిశేషము లన్నియు నాటుఁబొందికన్

ఆ. అనుచు నింద్రజాలమా యనఁ గనుచుండఁ
మాయ మయ్యె బాహులేయుఁ డప్పు
డేము విస్మరించి యెల్లతపఃక్లేశ
మెలమి వచ్చినార మీనగరికి. 74

క. ఆయనఘుఁ డెచట నుండునొ
కో యనుతపాంతిపాను సద్వగుల నడుగుచు, న
మ్మా యే మందుము పరిహా
సాయత్తుల మైతి మీపురాంతికమునన్. 75

క. ఓయన్నలు వర్షోపా
ధ్యాయు నెఱుఁగుదురె తద్గృహం బెటఁ దెల్పుం
డా యనఁ బౌరులు హాసము
సేయుచు నోయమ్మ! యిటు వచించిరి వింటే. 76

గీ. వర్షుఁ డనమూర్ఖుఁడే కాని వర్షనామ
మున నుపాధ్యాయుఁ డొకఁ డీపురిని వసించు
టెఱుఁగ మిది వింతగా నుండె నెచటివార
లతనితో మీకుఁ బని యేమి యయ్య యనిరి. 77

చ. అది విని గుండె జల్లు రన నావిని గల్గుముదం బొకింతగాఁ
బ్రిమలఁగ వారిఁ గాంచి వివరింపఁగ వర్షుఁడెవండొ యాను ద
త్పదనము త్రోవఁ జూపుఁ డొకసారి కనుంగొని పోదుమన్న న
వ్వాదవెనుమోముతోఁ దెలిపినొక్కఁడు వారలలోని వాఁడిటుల్.

శా. ఈఘంటాపథ మూని యిట్టటుల పో కేఁగంగ సంబాధమై
ద్రాఘీయం బగువీథి దోఁచు దదగ్రంబాను వర్షోదక
ప్రాఘూరప్రవిశీర్ణకుడ్య మనిలోగ్రక్షేపభిన్నచ్ఛది
వ్యాఘూతాపసరత్కవాట మొకగేహం బుండు జీర్ణాకృతిన్.

క. తజ్జీర్ణాలయమున మీ
కొజ్జలుగా నున్నవర్షుఁ డుండుం బొండా
యజ్జమని గొల్చి యంతటి
మొజ్జలు కండీకు నవిరి యుత్త్రాపగతిన్. 80

ఉ. ఆవెసమాటలన్నియు వనాశ్వతిఁ బుచ్చియమోఘమూర్తి యా
దైవతసైన్యనేతభణితం బనృతం బగునే యటంచు నా
త్రోవనెవచ్చివారము గురుండు గృహంబున నున్నవాఁడె త
త్పావనపాదపద్మశుభదర్శన మబ్బునె మాకుఁ దల్లిరో 81

క. ఏలా వర్షగురుని జను
లాలీలం దూలనాడి రగజాపుత్రుం
డేలా వర మటు లొసఁగెనొ
యాలోచింపఁగ మహాద్భుతావహ మయ్యెన్. 82

క. అనవుడు నవ్వటువుల క
వ్వనితామణి మామయశము వల్లభుమాహాత్మ్యం
బును దనపెండిలిచరితం
బును మఱఁది విచక్షణత్వమును దెలిపి మఱిన్. 83

చ. అనుపమభక్తిమై మఱఁది యన్నము వస్త్రము నిచ్చి నిచ్చ త
మ్మునరయుగాథఁ జెప్పి మునిమ్రుచ్చునఁ జెల్లినతోడికోడ లే
యనువున నీసు పూని కపటాకృతిఁ దమ్ముఁ బరాభవించెనో
మును మిడిచెప్పఁ జొచ్చెవగపుల్ దిగమ్రింగుచు గద్గదోక్తులన్.

క. ఈపౌరులపల్కులు నిజ
మే పసితన మాది నాదుహృదయేశుఁడు మా
ధ్యాపన్నవృత్తియే సుఁడి
నాపాపఫలంబు కారణం బింతటికిన్. 85

శా. అమ్మూర్ఖత్వమె హేతువయ్యెనుపవర్షార్ధాంగిమమ్మున్ నికా
రమ్మున్ జేయఁగఁ, దత్కథన్ దలఁచి నిర్లజ్జంబుగా మీసము
క్షమ్మం దెల్లు వచింతు; నైనను దనూజప్రాయులౌ మీకును
త్తమ్మున్ జేయుటయేల సెప్పెద దురంతం బయ్యెదంతంబిఁకన్.

గీ. పార్వతీపరమేశు లన్యావ మూని
మఱఁది నన్ను నాకాంతు నేమఱక ప్రోవఁ
దోడికోడలు మదియందు దుఃఖ మూని
దలఁచు శ్రావణభాద్రపదంబు లనుచు. 87

క. మగనిం గా దన నోపక
వగచుచు విధి లేక యన్నవస్త్రంబులు మా
కొగి నిచ్చి యోముచుండ న
రిగె నాలుగువత్సరములు కృతము విశాగా౯. 88

క. అంతట వర్షాకాల మ
నంతాంబుదసంతతావృతానంతము దు
ర్దాంతతటిత్కాంతావి
క్రాంత మశనిపాతరవభురంతము వచ్చెన్. 89

క. సీతునఁ జలియును; వేసఁగి
నాతపమును బీడపెట్ట వని యీదేశ
స్త్రీతతి సల్పు నొకవ్రతం
బాతరుణమున౯ జుగుప్స మగుమార్గమున౯. 90

గీ. గుడసహితపిష్టకృతము జుగుప్సితంబు
గుహ్యరూపంబు భక్ష్య మొక్కండు దానఁ
బాఱునకు దాన మిచ్చునాచార ముండెఁ
గాని రాఁ డేద్విజుండు తద్దానమునకు. 91

ఉ. అత్తఱిఁ దోడికోడలు నిరంతరమూఢత నుండునాపతి౯
మెత్తనిమాటల౯ బలికి మేకొనఁ జేసి గ్రహింప; దక్షిణో
దాత్తముపీడియంబొసఁగి తద్వ్రతభక్ష్యము దానమీయ వా,
యెత్తక దానిఁ గొంచుఁ బఱియింటికివచ్చెఁ బ్రఫుల్లవక్త్రుఁడై.

చ. అటువలె వచ్చు నాయకు నహార్యవిమూఢత కాత్మఁ బుట్టు ను
త్కటతమశోకకోపములఁ గంపమునొందుచు లేచివచ్చి యి
ట్లటు గన కెంతయేని జెడనాడితి నే నరకానఁ బోదునో
కటకట! శాంతి యత్తఱిఁ గకాపికలై చనె నేమి సెప్పుదున్

గీ. బావగా రనుగౌరవభావ మెల్ల
వీడి యీపాడుభక్ష్య మచ్చేడె యిచ్చె
నిచ్చెఁబో యెల్లు దీనిగ్రహించి తినియు
నాయభాగ్యఫలంబొకో నాథ యనుచు. 94

క. చెడనాడి యాడి యంతట
నుడు కాఱఁగ మగనిపాదయుగమునఁ బడి నా
దుడుకుఁదనము క్షమియింపఁగ
నడిగి వగతుఁ జేయి కాల నాకు గొని నటుల్. 95

ఉ. ఎవ్వరి నేమి యన్న ఫల మేమి మదీయలలాటరేఖ తా
నివ్విధి నుండ నంచు శమియించితి, వంచినమోము నెత్త లే
కవ్వలి కేఁగి యొంటిమెయి నాసిసి నేమి దలంచెనో మదిన్
రివ్వున భర్త శీతగిరిక్రేవకుఁ బోయెఁ దపం బొనర్పఁగన్. 96

ఉ. ప్రొద్దుట మేలుకాంచి పతి బోయినజాడ నెఱుంగఁజాలమిన్
దద్దయుఁ గుందుచున్ మఱఁదిదాపున కేఁగి వచింపఁ "దల్లి నా
యొద్ద వసింపు దుఃఖపడ కొక్క నెలన్ జనుదెంచు నగ్రజుం
డుద్దవిడిన్ జనెన్ హిమశిలోచ్చయసీమఁ దపంబు సల్పఁగన్.

క. ఎల్లరు దను మూర్ఖుఁ డనుచు
నుల్లసముల నాడ సైఁప నోపక తప ము
ద్యల్లీలఁ జేసి విద్యా
వాల్లభ్యముఁ గాంతు ననుచు వాక్రుచ్చె నిసిన్. 98

శా. సత్సంకల్పము మాన్పనే లని తపోఽసాధ్యంబులే దెందు నం
చౌత్సుక్యంబు ఘటిల్లఁ బ్రాలి తుహినాహార్యంబునన్ భక్తసం
సత్సేవ్యుం డగుషణ్ముఖుం గొలిచి సంపాదింపుమా విద్యలం
చుత్సాహించితి నేవ యం చతఁడు న న్నోదార్చె నర్హోక్తులన్.

చ. అక్కట! యాఁడుబుద్ధి యన నాసురబుద్ధియటండ్రు నిందకున్
దక్కఁగ నెంతధార్ష్ట్యమునొనర్చితియాత ఘటించు యాతనన్
స్రుక్కి పతివ్రతానియతి చూఱలు వుచ్చితి నాఁటిరే విభుం
డెక్కటినుండి నన్ను మది నేమని యెంచి తపించెనో కదే.

చ. అని యిటు కంటికిన్ నిదుర యాఁకటికిన్ గడి యంచెఱుంగకే
ననిశము గుందుచుండ నయి దబ్దము లేఁగిన;వంత భర్త వ
చ్చెను స్మితసూచితాభిమతసిద్ధిముఖుం డయి మాధ్యకంచుకా
పనయనజాతనూతనశుభద్యుతి దేహము నిండఁ బర్వఁగన్.

క. ఎదు రేఁగి సమ్మదాశ్రులఁ
బదాంబుజమ్ములను గడిగి పాప మనక నాఁ
డదయత నిను వదరిన త
ప్పిదమును క్షమియింపు మనుచు వేఁడితి నాథున్. 102

ఉ. అంతట నర్ఘ్యపాద్యసహితాసనభుక్తుల సోదరుండుఁ ద
త్కాంతయు నేను భర్తకుచితక్రియఁ గూర్పఁ శ్రమంబు వాసి యే
కాంతమునందు మమ్ముఁ గని కౌతుక మొప్పవచించెఁ దత్తపః
క్లాంతియు స్కంధుదర్శనఫలంబుఁ దదీయమహానుభావమున్.

చ. పలికి నిజస్తవంబులకు భావమునన్ గడు నుబ్బి యాగుహుం
డలఘుకృపన్ గనుంగొని "బుధాగ్రణి వేదశ్రుతిశ్రుతంబుల
గ్గలముగ నీమఖంబుఁ బ్రకాశము నొందును, దాని కీవు మ
ర్త్యులఁ బరీక్షింపుమీ శ్రుతధనుం డెవఁడో యనివాఁడు చిక్కెనన్.

క. ఆశ్రుతధరు నోంకృతిపూ
ర్వశ్రుతిపాఠమునఁ బూన్పఁ గ్రచ్చఱ నీకున్
సశ్రుతికముగా శాస్త్రము
లశ్రమమున నబ్బు సంశయము పొరయ నటుల్" 105

చ. అని వర మిచ్చి నిర్జరబలాధిపదేవుఁడు కన్మొఱంగె నం
చును వచియించి మమ్ము హితసూక్తులఁ దేలిచి నాఁటఁ గోలె నిం
దు నుటజ మొందు కట్టుకొని దుర్భరదీక్షఁ దపంబు సేయుచుం
డు నది జనుల్ గనుంగొని జడుండని యందఱు తొంటివైఖరిన్.

ఉ. తల్లిరో చూచితమ్మ వితథమ్ముగునే పురుషప్రయత్నముల్
మెల్లన యుక్తవేళల ఫలింపక పోవు, కుమారదేవుప
ల్కెల్ల యథార్థమౌ నచట నేనియు నచ్చతురుండునుండు నేఁ
డెల్లి లభించి తీరునని యొన్ననుఁ గాంచి మఱంది యత్తఱిన్.

ఆ. అనియెఁ గాని యింతదనుక సూత్రశ్రుతధరుం
డనుగుదేరఁ డెవరు నరయ లేదు
కలఁడొ లేఁడొ కాని కలిగినమాయాశ
తెఱుఁగకుంట కాను విఱుఁగుచుండె. 108

ఆ. అన్నలార! విద్యకై యమ్మహాత్ము సే
వింప మీకు మదిని వేడ్కయేని
వినుడు కెల్లచోట్లు వెదకి యేకశ్రుతి
ధరుని దెచ్చి ధన్యతను గనుండు. 109

చ. అనియిటుపూసగ్రుచ్చినక్రియన్ వనితామణి భర్తృవృత్తమున్
వినిచిన విస్మయంపడుచు విప్రకుమారులు "మాకు నాజ్ఞ కి
చ్చినవరయుగ్మ మిప్పటికిఁ జెప్పినరీతి ఘటిల్లి యుండె స్కం
దునికృప నేలయ మ్మతియుతుండు లభింపఁ డటంచుఁ బూన్కితో

క. పర్ణకుటి కరిగి యందు న
పర్ణాసుతుఁ దూప మాత్మఁ బదిలపఱచి సం
పూర్ణసమాధిమునిఁగి జి
తూర్ణుండగు వర్షుఁ జూచి పొంగిరి మదిలో. 111

సీ. ఆర్జవోన్నమితోత్తరాంగసంగత యజ్ఞ
సూత్రోత్తరాసంగశోభి యగుచు
ననశనపానశుష్యద్రక్తమాంసస్ఫు
టాస్థివారావశేషాంగుఁ డగుచు

నశిథిలపద్మాసనాభ్యంతరోద్గత
పదపల్లవద్యుతిపటలుఁ డగుచుఁ
బూరకరేచకపూర్వక్రమ పరి
కుంభితపవనసంరంభుఁ డగుచు
శమదమాదికసంపత్తిసముపలబ్ధ
నిరుపమబ్రహ్మవర్చసభరధగద్ధ
గితకుటీరాంతరాళసంస్థితకుశాస
నస్థుఁ డై యున్నవర్షవ్రతస్థుఁ గనిరి. 112

క. కని వినయము భయమును మన
మునఁ బెనఁగొనఁ గరయుగమును మొగిడిచి నిటలం
బున నిడికొని యిలఁ బడి నతు
లనఘులు పటు లపుడు సలిపి రపరిమితముగన్. 113

గీ. సర్వలఘువృత్తి నటు మ్రొక్కి సద్గుసేయ
కవలి కేఁగి తద్గృహిణికి హైమశతము
భక్తి నర్పించి శ్రుతధరుఁ బట్టి తెత్తు
మనుమతి నొసంగు మని కాంచి యపుడ చనిరి. 114

చ. శ్రుతధరుఁ డెవ్వఁ డౌనొ యని చూచినవారల నెల్ల సూక్ష్మప
ద్ధతినిబరీక్ష సేయు మన్పథాశ్రమమానొకాయ ంచుఁగొంకుచున్
ధృతిగొను చెల్ల దేశముపు ద్రిమ్మరి రవ్వటువుల్ మరీచికా
ప్రతతి జలంబు గ్రోలుమతిఁ బాఱుమృగంబులకన్న దమ్ములై.

క. తిఱిగినదేశమె తిరుగుచు
సరిగినపురి కరిగి యేఁగినట్టి జనపదం
బరయఁగ నేఁగియు నింటికి
మరలిరి వగచుచు వృథాశ్రమం బగుట కెదన్. 116

ఆ. మరలివచ్చువారు మధ్యేపథంబు కౌ
శాంబి నాఁగ నొకపురంబు గాంచి
యందుఁ జొచ్చి యొక్కయవనీసురావస
థమున కరిగి రతిథిధర్మ మొనసి. 117

ఉ. ఆగృహమం దనాథ యొకయంగన పుత్త్రినితో వసించు, న
భ్యాగతులై నయవ్వటువు లాయమ వెట్టినకూడు మెక్కి వే
దీగతనారికేళకటదేశమునన్ శయనించి యుస్సరం
చాగమనశ్రమంబున రవంత కనుంగవ మోడ్చు నంతలో.

క. బంధురజలముగ్గర్జా
బాంధవమై మథ్యమానపటురవవిచల
త్సింధుసఖంబయి మర్దళ
ధింధిమిరవ మొకటి తచ్ఛ్రుతిగతం బయ్యెన్. 119

ఉ. అంతట నింటియామె సుతు నక్కునఁ జేర్చి యవార్యబాష్పవా
స్సంతతి చెక్కిళుల్ గమిచి జాఱఁగ వెక్కుచు "నృత్తగీతవా
ద్యాంతము నాట్యముల్ గఱచినట్టిప్రవీణుఁడు నందనాముఁడ
త్యంతహితుండు నీపిత కతం డిపు డీపురిఁ జేయునాట్యముల్.

ఉ. ఎన్నఁడు గాని నాట్యమున కీపురి కాతఁడు వచ్చెనేని మీ
యన్నను దోర్తిఁగాంచి సుఖమారయకుండ మృదంగనిస్వనం
బు న్నెఱయింపఁ డట్టిహితముఖ్యుఁడు నేఁడిట కేఁగుదెంచి య
స్మన్నిలయంబుఁ జేరఁ డొకమాఱు చునీజనకుండు క్రుంగుటన్.

ఉ అనిదయితున్ స్మరించుకొని యార్తిమునుంగఁగ, నామెఁ గాంచి త
త్తనయుఁడు "తల్లి యేటికి వెతన్ గుదువన్? క్షణమోర్చి యుండు మేఁ
జని యలనాట్య మెల్లఁ గని సర్వము నీకడ నాడి చూపువాఁ
డననుచు మాతృదుఃఖము నడంప వచించెఁ బ్రముగ్ధవాక్కులన్.

క. పతిహీనతఁ దనయింటికి
హితులు నహితు లరయరామి కేడ్చెడుతల్లిన్
సుతుఁ డూఱార్చును నటనము
మతిఁ జూడఁగఁ గోరి యట్లు మఱఁగు నటంచున్. 123

క. మాతాపుత్త్రిల భాషణ
మా తెఱఁగున భిన్నగతుల నడరుచు నుండన్
జేతమ్ము పొంగ వ్యాడికి
నాతనయుని శ్రుతధరత్వ మగపా టొందన్. 124

క. త్రుళ్లిపడి లేచి ముఖము ప్ర
ఫుల్లముగాఁ దొంటిశ్రమము బ్రుంగుడువడ న
ప్పిల్లనిదరి కరిగి కనిన
దెల్లన్ వివరింప నేర్తువే యని యడుగన్. 125

క. వినినది వినినవిధంబునఁ
గనినది కనినట్లు తెలుపఁగలఁ డీబాలుం
డనఘా శైశవ మాదిగ
నని తజ్జనయిత్రి పలుక వ్యాడియుఁ దమితోన్. 126

ఆ. ప్రాతిశాఖ్య మొకటి పఠియించి యొకమాఱు
చెప్పఁగలవె యనిన శిశువు నగుచుఁ
దడయ కించుకయు యథాశ్రుతంబుగ దానిఁ
దప్పు వోరయకుండ నప్పగించె. 127

క. ఎచ్చట "ఆఁ ఊఁ" యనె మఱి
యెచ్చట వాక్యంబు నిలిపె నెటఁ దగ్గెనో య
ట్లచ్చట నచ్చటఁ జూపుచు
నచ్చొత్తినపగిదిఁ జదివె నాశిశు వెలమిన్. 128

క. ఏకశ్రుతిధరుఁ డితఁ డౌ
నేకద యని యుబ్బి నాట్యవీక్షణకుతుక
శ్రీకలితు లగుచు వారపు
డాకుఱ్ఱివెంట నరిగి యరసిరి యెల్లన్. 129

శా. ప్రాతర్వేళ గృహంబు చేరి యతఁ డంబన్ బిల్చి యానందుఁ డే
రీతిన్ నాట్య మొనర్చెనో యటులె నర్తింపంగ భాషింప సం
గీతంబున్ వినిపింప వా రరసి యత్యంచిత్తు భేదింపమిన్
జాతామోదమునన్ ద్యజించి రెద దేశభ్రాంతిభూక్లేశమున్.

ఉ. తజ్జనయిత్రి మ్రొక్కి "సుకృతంబులు పండెను నీసుతుండు మా
కొజ్జగుఁ గాక" యంచుఁ దమయుద్భవముల్ బితృనాశనంబుఁ దా
మొజ్జలకై భ్రమించుటశరోద్భవుఁ గొల్చి వరంబుగొంట యా
వజ్జగతీప్రచారమును వర్షునివాంఛయుఁ దెల్పి యాదటన్.

క. ఈతనిఁ గొని చని వర్షుని
ప్రీతుం గావించి యఖిలవిద్య లతనితో
నేతుము కంటికి ఱెప్పటు
గాతుము వీనిని నొసంగఁగదె మా కమ్మా. 132

గీ. అమ్మ యీవృత్త మాద్యంత మాలకించు
వేడ్క నున్నార మటుగాన వినుతె యనుడుఁ
గన్నునీ రొత్తుకొనుచు గాద్గద్య మడర
నీరెలుంగున నిటు వచియించె నామె. 133

క. తరతరములనుండియు నీ
పురమున నాభర్తవంశము ప్రశస్తి గనున్
జరమం బగుతరమున నా
వరుఁడుదితుండయ్యె నస్వవాయశరణమై. 134

గీ. అగ్నిశిఖసోమదత్తసమాఖ్యయుగళి
విశ్రుతి వహించి ఋగ్యజుర్వేదవేత్త
మై యజస్రమ్ము గఱపు శిష్యవ్రజమున
కద్రిజాకాంతుఁ గొల్చు నిత్యంబు భక్తి. 135

ఉ. ఈనగరీంద్రచంద్రుఁ డది యెల్ల నెఱింగి సమస్తసంపదల్
పూనిచి పెద్దసేసి గురుబుద్ధి భజించుచు బండితవ్రజం
బానతమౌళిపంక్తులఁ బదాంబుజముల్ గయిసేయుచుండు రి
ట్లానియతాత్ముఁ డగ్నిశిఖుఁ డన్నిటఁ బేరుప్రతిష్ఠలన్ గనెన్.

క. అంత 'వసుదత్త' యనుననుఁ
గాంతగఁ గైకొని పదేండ్లు గార్హస్థ్యసుఖా
క్రాంతస్వాంతుండై మగ
సంతతి పేఁ డుద్భవింప సంతస మొందెన్. 137

గీ. పుత్రునకు నాలు గేండ్లేనిఁ బూర్తి కాక
మున్న పతి దుఃఖవార్ధి మమ్ములను ద్రోచి
చనియెఁ దద్వైభవం బెల్లఁ జనియె వెంట
నొంటిసుతుతోడ దిక్కు లేక కుంటి నిట్లు. 138

క. మీతల్లులు ధన్యచరిత
లాతీరున ననుగమించి రాత్మేశ్వరులన్
బాతకురాల నగుటఁ బతి
నాతెఱఁగున మ్రింగి కాకియటు చిర ముంటిన్. 139

చ. మఱచితిఁ జెప్ప నొక్కటి కుమారుఁడు వీఁడు జనించువేళ నం
బరమున దివ్యవాణి వినవచ్చె "శ్రుతం బెది యైనఁ దెల్ప నే
ర్పరి యగు వర్షశిష్యుఁడగు వ్యాకరణంబును బెంపొనర్పుఁ దా
వరరుచి నామధేయమున వాసికినెక్కు" నటంచు బోరునన్.

గీ. వర్షుఁ డెవ్వండో వాని నెవ్వం డెఱింగి
తెలుపునో కద యని మదిఁ దలఁచుచుండ
నరుగుదెంతురు మాయింటికి కాడఁబోవు
తీర్థ మెవరైనటుల మీరె తిఱిగి వెదకి. 141

క. మీకుం దమ్ముఁడు వీనిం
జేకొని యవ్వర్షశిష్యుఁ జేసి నిగమముల్
వ్యాకృతి నేర్పింపుఁడు సు
శ్లోకులు మీమేలు మఱవఁజూతునె యెపుడున్. 142

క. అనవుడు వారలకోర్కెయు
వనితామణివాంఛ యేకభావ మగుటం వా
జ్మనసాగోచరహర్షాం
బునిధి నిమగ్నాత్ములైరి మువ్వురు గూడన్ 143

ఉ. పెన్నిధి యింటఁ దోఁచినటు వేలుపురత్నము కాలిక్రింద నే
యున్నటు కల్ప మంగణము నొందినయట్టుల వేల్పుగిడ్డి పే
రన్ననఁ ద్రోవఁదప్పి స్వగృహాశ్రయనిష్కుటసీమఁ జిక్కిన
ట్లన్నపుణార్భకాప్తి హృదయంబుల నుబ్బిరి వారలిర్వురున్.

క. వ్యాడీంద్రదత్తులపు
డామ్రేడితవరరుచిలసచ్చరిత్రులగుచు నా
నాఁడచట నిలిచి యమ్మఱు
నాఁ డతనికి వడుగు సేసినారలు ప్రీతిన్. 145

క. ఆసనసత్కారము పూర్ణము
సేసి తదంబానుమతిని జేకొని వారిన్
గాసి వొరయకుండ గురుని
వాసమునకుఁ దోడుకొనుచు వచ్చిరి వేగన్. 146

గీ. వచ్చునమ్మునివర్యను వర్ణిపత్ని యంత
దూరమునఁ గాంచి యెదురేఁగి కోరికలు స
మస్తము ఫలించె ననెడుసమ్మదము హృదయ
మందు నుప్పొంగఁ దత్క్షేమ మడుగుటయును. 147

సీ. శీర్షంబునం బంచశిఖలు పొల్పార మే
ధావిబొట్టు నొసంటఁ దళుకు లొలుక
నిద్దంపుఁబసనిజన్నిద మజినంబుతోఁ
బెనఁగి యురోభాగమును భజింపఁ
గటిని మౌంజీబంధకౌపీనములునును
పసుపురంగపరంజిమిసిమి గూర్పఁ
బాలాశదండ మంభఃపూర్ణకలశంబు
సవ్యాపసవ్యహస్తముల మెఱయ

గీ. బ్రహ్మచర్యంబు మూర్తమై వచ్చునట్లు
తోడఁ జనుదెంచువరరుచిఁ దొలుత గురుని
పత్ని కెఱిఁగించి యెఱిఁగించి వర్ణి డాసి
మ్రొక్కి మ్రొక్కించి రయ్యెద్ద ఱొక్కమాఱ. 148

ఉ. పూర్ణసమాధినుండి గురువున్ విరతుండయి బాహ్యవాసనా
భ్యర్ణగతేంద్రియుం డయి రవంత గనంగ శరీరకాంతులన్
బర్ణకుటిన్ సువర్ణము నొనర్చు త్రిమూర్తులఁ బోనిమువ్వుర
వ్వర్ణులు గానరా నిజతపఃఫలదాత లటంచు నెంచుచున్.

క. దారవలన నవ్వటువుల
చారిత్రము వినుచు నొడలు జల్లనఁ బ్రమదా
ర్ణోరాశి మునిఁగి కొండొక
వారిం దీవించి క్షేమవార్తల నడిగెన్. 150

చ. అనుగుడు వ్యాడి ఫాలఘటితాంజలియై యిటువల్కె "నీకృపన్
జడిమ మెఱుంగ కిద్ధరణిచక్రము నంతయుఁ జుట్టిచుట్టి యి
వ్వడు గొకఁ డేకసంధ వినవచ్చినసర్వము దెల్పఁ గాంచి నీ
యడుగులఁ జేర్చి కోర్కెఁబడయన్ గొని వచ్చితిమయ్య చెచ్చెరన్.

క. ఆసేతుహిమనగం, బా
సాసల భ్రమియింపఁ గాన నయ్యె నొకం డీ
భూసురసుతుఁడు శ్రుతధరుం
డేసీమలఁ గానరాఁ డిఁ కెవ్వఁడు దేవా. 152

చ. అని తమదేశయాత్రను సమగ్రముగా వినిపించి దేవ! యె
వ్వనికిని బొంద నందనిభవద్దయఁ గాంచిన మాకు "సేమమా"
యనఁబునరుక్తిగాదొకొ మహాత్మ! త్వదాజ్ఞ యమైనఁ గ్రిందమీఁ
దను గలలోకముల్ శ్రమమెదన్ గణియింపక చూచిరా మొకో.

గీ. అయ్య నీకృప యీమె మాయమ్మ సేయు
దీవెనలు నంగరక్షలై తేజరిలఁగ
మాకు సేమంబు గాకేమి లోకమం ద
సాధ్య మగువాంఛితంబు లేశము గలుగునె. 154

గీ. అనెడివ్యాడిని నింద్రదత్తుని బ్రియంబు
మీఱఁగా బల్కి వరరుచిఁ జేరఁ దీసి
వర్షుఁడు తదాగమనసుఖవార్త లడిగి
బుజ్జగించి మనోభయం బుజ్జగించె. 155

చ. మఱియుశుభాస్పదంబయినమంచిముహూర్తముగోచరింప న
మ్మఱుదివసంబునంద యహిమద్యుతి ప్రాగ్గిరిమౌళిఁ దోఁచున
త్తఱి శ్రుతిపాఠముల్ జదువఁ దప్ప దటంచు వారి నం
దఱ నరయన్ సతిం బనిచిధ్యానమునందెను వర్షుఁ డంతటన్.

సీ. విప్రదత్తార్ఘ్యోదబిందునికృత్తమం
దేహమధ్వము దాఁటెఁ దిగ్మరోచి
హరిదంతరోత్థదంతురతమస్సంతాన
మలమె నాచూడ మనంతవీథి
మేచకోల్లోచగుంఫిత తారముక్తాఫ
లాకృతి మెఱసెఁ దారాకదంబ
మాకాశభూమ్యంతరైధమానతమంబు
లడఁగ వెన్నెలలతోఁ బొడిచె విధుఁడు

కుముదముదము చకోరకకోరకలును
గామునామును బెంపారె గంధబంధు
రముగఁ బ్రమదలుఁ బ్రమదావనములు వెలసెఁ
బాల ముంచియెత్తినలీలఁ గ్రాలె జగము. 157

చ. కదలనియట్లు కానఁబడుఁ గాని కనుంగొనుచుండ మెల్లగా
నదె యిదె యంచుమింటిసగమంతు వెలింగెను రేవెలుంగు; త
త్పదమునమాత్రముండెనొకొ పశ్చిమమార్గము పట్టియస్తశై
లదరుల డాసె నెవ్వఁడు వలంతి నిశాచరమాయ లారయన్.

ఉ. కాయము గ్రుంగఁ గాళ్లుముడుఁగన్ నిదురించెడికుక్కుటవ్రజం
బాయెడఁ గన్నువిప్పికలయంగనిముక్కుచుఱెక్కలార్చి మా
కాయితలోకముల్ దెలివిగైకొనఁబల్కెడుపోల్కిఁ గొక్కొరో
కో యనికూసెఁగంఠమునఁ ఘుటియిల్లఁ ద్రివక్రభావముల్.

ఆ. మాకరందధార మాధురిఁ దల దన్ని
కూజితామృతంబు గురియఁ జొచ్చెఁ
జెట్టు చెట్టునను వసించి భారద్వాజ
వితతి శ్రుతిహితార్థవృత్తి మెఱయ. 160

సీ. వెన్నెలపాలు దృప్తి నెఱుంగక చకోర
ములు త్రావిత్రావి తేన్పులను బుచ్చెఁ
నానునాసికరవం బామ్రేడనముసేసె
గువ్వలకవ లేఁజిగుళ్లడాఁగి

నిద్రాళుచేతనానీకంబు జోకొట్టు
చౌషసగంధవాహములు మలసె
యదె పనిగాఁ దేనె లాను భృంగమ్ముఁ బో
నంపి కైరవిణి నిద్రింపఁ బూనె
దిగ్వధూటీముఖంబులఁ దెలివి మించెఁ
గావుకా వని కాకి మూఁకలు ధ్వనించె
వికసదంభోజము మరందవృష్టి చిందె
నుదయశైలంబుపై రవి యుదయ మందె. 161

క. అంతకు మును వర్షగురుం
డంతేవాసిత్రయం బహర్ముఖవిధు ల
త్యంతనియతిఁ దీర్చి కుటీ
రాంతరదర్భాసనస్థులై రభిముఖులై. 162

క. సుముహూర్తము వేళ కె స్నా
నము సంధ్యావందనం బొనర్చికొని ప్రమో
దమున నుపవర్షుఁ డరుదెం
చి మ ఱొక్క కుశాసనంబు చేరి వసించెన్. 163

సీ. పసిమి యొల్కఁగఁ జాయపసు పాడి నొసటను
బ్రొద్దసఁ గుంకుమబొట్టు దిద్ది
యుదికి యాటార్చినముదుకకోకను గట్టి
చిఱువేరురంగు కంచెలను దొడిగి

మినుకుఁగాటుక రేఖ కనుఱెప్పలం దీర్చి
పూఁపుఱెత్తులను గొప్పునను దుఱిమి
శాంతిపాతివ్రత్యసౌభాగ్యచిహ్నముల్
చూపులం దచ్చొత్తి చూఱవిడిచి
మాటికి నుమాకుమారునామము స్మరించు
కొనుచు నుత్కంఠ దీపింపఁ గొదికికొనుచు
వర్షసహధర్మచారిణి వచ్చి నిలిచెఁ
బతికిఁ బార్శ్వంబునందుఁ గంబంబు నూ.ది. 164

గీ. ప్రాగభిముఖుం డయి పవిత్రపాణి యగుచు
గురులకుఁ గుమారునకు మ్రొక్కి వరరుచిఁ గని
దేశికుం డంత వేదవాచాశిరంబు
ప్రణవ ముచ్చైస్స్వరంబునఁ బల్కుటయును. 165

క. తెరఁ దీసినకరణి మదిని
స్ఫురియించె సశాఖముగను శ్రుతులును శాస్త్రో
త్కర మాచార్యునకుఁ జిరం
బరపారయక కఱచుకరణి హారసుతుకరుణన్. 166

క. స్ఫురియింప "నగ్నిమీడే
పురోహిత" మ్మనెడుబుక్కు పూర్ణమ్ముగ స
స్వరముగ సుస్వరమున వా
రరుదందఁగ నేకవార మతఁడు పఠింపన్. 167

క. వినినది వినినటు కాత్యా
యనుఁడు చదివె, దాని వినుచు వ్యాడి చదివె దా
నిని వినుచు నింద్రదత్తుఁడు
వెనువెంటఁ బఠించె గురుఁడు విభ్రమ మొందన్. 168

చ. వరరుచి యేకసంథఁ జనువంగ ద్విసంథల వ్యాడి నేర్చుఁ జె
చ్చెర నలమూఁడుసంథల కశేషము నేరను నింద్రదత్తుఁ డి
క్కరణిని జూచుచుండ ఘటికాద్వయినిర్వదిసూక్తముల్ పఠిం
చిరి గురుదేవవక్త్రసరసీజవినిర్గత మాటె జాగుగన్. 169

శా. బ్రహ్మానందసుధాపయోనిధిరసాప్లావస్ఖలద్దుర్వృత్తిభాఁ
జిహ్మాంతఃకరణప్రతిక్షణసముత్సేకోల్లసద్భక్తితో
బ్రహ్మణ్యుం డుపవర్షుఁ డన్నకు నమోవాకంబు గావించి త
ద్వాబ్హ్మీతాండవమున్ నుతించెనుగళద్బాహ్యేంద్రియజ్ఞానుఁ డై.

క. మ్రొక్కి సెల వంది చని తన
యిక్కకు సతి కన్నమహిమ మెల్లఁ దెలిపి పెం
పెక్కనతనచిత్తవ్యథ
నక్కామినిహృదయసీమ నతిదేశించెన్. 171

ఉ. ఆదిన మాది వత్సరసమాప్తి కొఱంతగ నవ్వటుల్ క్రమం
బేది త్రయీప్రపంచము గ్రహించిరి శాఖలతో; విశాఖుపూ
ర్ణాదరమేదురేక్షణమహాసుకృతాతిశయంబు గాంచుటన్
సాదరసాధ్వసాద్భుతమనోంబుజమై ప్రజ సన్నుతింపఁగన్.

మ. ఉపవర్షుండు మహాముదంబునిధియం దోలాడుచుణ్ భ్రాత త
న్నుపమింపం గలిగెంగదే యనుచు లో నుబ్బంగఁదద్భార్యవె
ల్లుపతాపించును బావగారిమొఱ మున్నొక్కప్డు గావించున
య్యపరాధంబు ప్రతిక్షణంబు నెదమూల్లో యేఁపలజ్జించుచున్

క. ఎదురఁ బడి తొంటితనత
ప్పిదమును క్షమియింప మ్రొక్కి వేడఁ దలఁచు; నె
ట్లెదుటికిఁ జనఁ గల నని మా
నఁ దలఁచు నుపవర్షసతి మనం బూఁగాడన్. 174

సీ. ఓరిచినమ్మకుఁ దేఱినసిరు ల
భించుఁగా యని కు స్తరించుచుందు
రెవ్వారి కెఱుఁగ నా నవ్వినయూళ్లె ప
ట్టనము లౌఁగద యని యనునయింతు
రాఁడుదాని దదృష్ట మందు రీసౌభాగ్య
మెల్ల నీ దని నుతియించుచుంద్రు
మునుపటివదినె కా దని లేనివావి క
ల్పించి నర్మముల నవ్వించుచుంద్రు
పేరఁటంబున కరిగిన నీరు దేర
సరసి కరిగిన నవ్వర్షసతిని గాంచి
చంచలాక్షులు మున్ను లక్ష్యమ్ము సేయ
నట్టితె ప్పెంచి లజ్జించి యావరించి. 175

శా. మూఢుం డంచుఁదలంచి వర్షసతతంబున్ గేలి గావింతు మీ
గాఢప్రజ్ఞయు వేదశాస్త్రమయవాగ్గ్రంథంబు నెన్నంతు నా
రూఢిన్ జూపక మాకె మూఢతసమారోపించెనంచున్ జనుల్
గూఢప్రక్రియఁ బల్కుచున్ గనెద రత్నుల్ విచ్చివిభ్రాంతులై.

శా. ఆపౌరుల్ పురి నట్లు చెప్పుకొను వర్షాచార్యునాశ్చర్యచ
ర్యాపూర్ణం బగు వేదబోధనవిధం బానోట నానోటఁ ద
త్క్ష్మాపాలుం డగు నందరాజు చెవి సోఁకన్ దద్విచిత్రక్రమే
క్షాపేక్షన్ జను దెంచె వేష్టితపురోధోమాత్యభృత్యాప్తుఁడై

శా. వందుల్ బాహుపరాక్రమక్రమకథల్ పాడన్ భటుల్ ద్రోవలన్
గ్రందున్ మాన్పి బరాబరుల్ సలుపఁ జేరన్ వచ్చి సామంతరా
డ్బృందంబుల్ మనవుల్ వచించుకొన భేరీడిండిమాదిస్వనం
బాందోళింప నజాండమున్ వెడలె మత్తానేకపాధ్యాసియై.

క. చను దెంచి యంతదూరం
బునఁ బరివారమును నిలిపి ముఖ్యసచివులన్
దనవెంటఁ గొనుచుఁ గాల్నడఁ
జని యెదుటికిఁ జూపొకింత సాఁగించుటయున్. 179

సీ. చెదపుర్వుగమి గ్రసించిన కప్పునుండి యా
పాసనానలధూమపటలి వెడల
ముంజూరిలకు వంగి పోవుల లోనికి
వచ్చి యేఁగెడు వారు వంగి మసల

గోడలమాఱు నాల్గుదెసల నిల్చిన
కంపపెందడుకలు గాలిఁ గదల
నుసి రాలి లోపలిపస మాసి నిట్టరా
డొకప్రక్క కొక్కింత యొరగియుండ
గోమయవిలేపనంబు ముగ్గులును మాత్ర
మమర దారిద్ర్యదేవీ విహార సౌధ
మనఁ దగినవర్ష గురు ప్రాఁతయాకుటిల్లు
లోచనంబుల కెదురుగా గోచరింప. 180

సీ. పండువెన్నెలవన్నె పట్టాంబరముకొంగు
చికిలి రత్నాలపాదుకల నొరయ
హొంబట్టుసంవ్యాన ముదిరిపువ్వులతోడి
యఱచట్టనునుగాంతి నతకరింప
హురుమంజి ముత్యాలసరము నెన్నడిమి తు,
మ్మెదతాళి వెడఁదయానెద నటింప
మణికుండలంబులఘృణులఁ గిమ్మీరితం
బయి చెక్కిళులు మోము నందగింప,

నగ్రతస్సరు లయి వేత్రహస్తు లలర
బలసి పరివార మింతంత కొలిచి రాఁగ
మోడ్పుఁజేతుల సామంతముఖ్యు లొదుఁగఁ
దరలె నానందరాజమందార మటకు. 181

క. పరిమితపరివారముతో
ధరణీపతిరాక వర్ణితమ్మఁడు విని 'య
ట్లరుదేఁ గత మే మని సో
దరుఁ డెటు మన్నించెనో కదా యని వగతోఁ. 182

క. వచ్చి యట కెదురు సని నృపుఁ
దెచ్చి సముచితాసనములఁ దె మ్మని శిష్యుల్
జెచ్చెరఁ దనధామమునకుఁ
బుచ్చి యనామయము నడిగి భూధవుఁ దనిపెఁ. 183

గీ. జీర్ణకుటి కేఁగి వర్ణనిచిత్రచరిత
మరయఁ గౌతుకపడుభూమివరు నెఱింగి
ముందు తా నేఁగుచును మార్గమును దెలుపుచు
నక్కుటీరంబుముంగిటి కల్లఁ దెచ్చి. 184

ఉ. లోనికి మంత్రిపుంగవులు లోనగుభృత్యులతోడ ధారుణీ
జానిని దోడుకొంచుఁ జని శస్త్రకుశాసనసంస్థుఁ డౌచుఁ ద్రే
తానలమూర్తులన్ ముగుర నవ్వటులన్ జదివించువర్ణు వి
జ్ఞాననిదానుఁ జూపఁగ విశాంపతి పాఁగిలి మ్రొక్కె వారికిన్.

గీ. అంత నిజశిష్యు లటఁ దెచ్చినట్టియుత్త
మాసనము లుపవర్ణుఁ డంతంత నిలిపి
నందరాజేంద్రుఁ బ్రెగడల నందుఁ గూరు
చుండఁ బెట్టి తానును గూరుచుండు నంత. 186

క. వేదోక్త మ్మగు నాశీ
ర్వాదముతోఁ గుశల మరసి వర్షగురుం డ
త్యాదరమునఁ మీరాక ప్ర
మోదప్రద మయ్యె ననుచుఁ బొగడుచు మఱియున్. 187

చ. స్వయముగఁ బాదచారి వయి సంకులగొందుల దాఁటి జీర్ణమై
భయ మొదవించు మామకనివాసకుటీరముఁ బొంతకున్ నృపా
ప్రియముకుటీమణీరుచిపరీతపదాంబురుహుండ వైన నీ
వ యిటుల వచ్చి సిగ్గుపఱుపన్ దగునే మముఁ బోంట్ల నావుడున్.

శా. దేవా దేవరచిత్రవృత్తము జనుల్ దెల్పంగ నాలించి యం
తేవాసిత్రయయుక్తు నిన్నుఁ గనుకంటెన్ జన్మసాఫల్య మొం
డేవంకన్ గన నంచు వచ్చితిని నీభృత్యున్ ననున్ బ్రేముడిన్
దీవింపం దగు దంచుఁ గేల్మోగిచి యర్థిన్ భూధవుం డిట్లనున్.

క. ఏదేశమందు విబుధుల
నాదృతులై పేదలై మహార్తి గుడుతురో
యాదోషము తద్దేశము
హీందారుని దంచుఁ దెల్పవే యాగమముల్. 190

మ. అపరాధంబు తలంప నాయది యె కాదా దేవ నారాజ్యమం
దపరాంభోరుహసూతియ ట్లలరు నీ వన్నంబు వస్త్రంబు లే
క పరాన్నత్వమునన్ గృశింప నరయంగా రానిరాజన్యశ
బ్దపరుండన్ క్షమియించి యర్థపరతన్ బ్రాపింప నన్నేలుమా.

ఆ. ఈపట్టుత్రయంబు నేకసంధాగ్రాహు
లనుచుఁ దెల్పి రిది యథార్థ మౌనె
యని నృపాలుఁ డడుగ నవ్వర్షుఁ డి ట్లను
నీతఁ డొకఁడ నేర్చు నేకసంధ. 192

క. ఆరెండుమూఁటులకు వీఁ
డారీతిఁ బఠింపఁజాలు నవుల నితఁడు ము
మ్మాఱు ఆలకించి నేర్చు మ
హీరమణ ! పరీక్ష సేయుమీ యిం తేలా. 193

చ. వరరుచి యన్నవాఁ డితఁడు వ్యాడి యితం డితఁ డింద్రదత్తుఁడ
చ్చెరు వగు వీరిమేధఁ బరిశీలనసేయుకొలంది వత్సరం
బరిగెనొ లేదొ వేదముల నన్నియు నేర్చిరియొక్కముక్కయుఁ
మఱవ రపస్వరం బనెడుమాట నెఱుంగ రొకప్పుడేనియుఁ.

క. వేదాంగషట్కియంబున
నాదిమ మగుశిక్షఁ జదివి రామూలాగ్రం
బాదివిమత్సేనానిద
యాదిప్రకటాత్మవీక్షణాసారమునఁ. 195

గీ. సకలవిద్యాముఖం బగుశబ్దశాస్త్ర
మెల్లి యారంభ మొనరింప నెంచి కొంటి
మంగుళీమోటనమునఁ గుశాగ్రబుద్ధు
లైనవీ రద్దియు గ్రహింతు రని తలంతు. 196

ఉ. నా విని యావిశాంపతి మనంబున నుబ్బి వటుత్రయంబుతోఁ
బావనులార ! నాచదువు ప్రాకృతవాఙ్మయపద్యముల్ వినుం
డీ వచియింత్రుగా” కని పఠింపఁగ వా రవధాన మేర్పడం
గా విని యట్లె యొక్కొకరుగాఁ బఠియించిరి ప్రస్ఫుటంబుగన్.

గీ. నృపతి యచ్చెరువడుచు నదృష్టపూర్వ
మశ్రుతచరంబు నగు నంచు నాత్మఁ దలఁచి
ప్రాకృతశ్లోకమును జదువంగ నదియుఁ
జదివి రొకమాఱు వినుచు మజ్జారె యంచు. 198

శా. తన్మేధాద్భుతశక్తి సారెకు ననంతాకాంతుఁ డగ్గించుచున్
దన్మాణవ్యముతోడ వర్షగురు వేదండంబు నెక్కించి తా
ను న్మంత్రుల్ పదచారులై పురపురంధ్రుల్ సేసల్ జల్లఁగా
సన్మానించుట కంచుఁ దెచ్చెను నిజాస్థానాంగణక్షోణికిన్.

క. తెచ్చి కరి నాఁగి కే లం
దిచ్చి గురు సశిష్యు డించి యిటు రం డనుచున్
మచ్చికఁ గొని చని సభయం
దుచ్చైఃపీఠిక వసింప నొనరిచి భక్తిన్. 200

మ. కవులున్ గాయనగాయనీగణముసంఖ్యావన్మణుల్ మంత్రిపుం
గవులున్ బౌరులుఁ దత్సభాంతర మలంకారించి తత్ప్రాజ్ఞ సం
స్తవముల్ జేయఁగ వర్షదేశికునకున్ స్వర్ణాభిషేకంబు సే
సి విభుం డంబరరాంకవాభరణభాసిన్ జేసి యుల్లాసియై.201

చ. మఱియు నొసంగె స్వర్ణమణిమండనమండితమున్ సుధాపరి
స్ఫురదురుభిత్తికంబు పరిఫుల్లలతాంతలతానికుంజపుం
జరుచిరనిష్కుటం బమృతసారసమానజలోదపానమున్
బరమసుఖాస్పదంబు నగుమందిరరాజము రాజవీథిలో. 202
చ. ప్రతిదిన మొక్కనిష్కము నుపాయనమంపెద శిష్యకోటికిన్
శ్రుతులు శ్రుతంబులున్ గఱపుచున్ నిరతాన్నవితీర్ణిసంధమై
నతిథులఁ దన్పుకొంచుసుఖమందుచువత్సలతన్ ననున్ ద్వదా
శ్రితునిగ నెంచి దీవెనలు సేయు మటంచును వేఁడెనాదటన్.
క. అపరిమితహర్షుఁ డగున
య్యుపవర్షు బహూకరించి యుచితవిధుల న
న్నృపుఁ డవ్వరరుచిముఖ్యుల
కుపాయనము లిచ్చి యనిపె నొజ్జను వారిన్. 204

ఆశ్వాసాంతము.

శా. దర్భాంగక్షితినేతృ పండితసభాంతఃప్రాప్తశాస్త్రార్థసం
దర్భాపాదితసర్వరాడ్భ్రమలలత్తద్భావదత్తార్ఘ్యవా
గ్గర్భానర్ఘ్యబహూకృతిగ్రహణదక్షప్రస్ఫురత్ప్రేక్ష ! యా
గర్భాంభోరుహగర్భదారకరుణా! గర్వాంధకారారుణా. 205
క. మందారసుమమరంద
స్యందిమధురశాస్త్రవాఙ్ముఖానందిత స
ద్బృందా ! బృందారకగురు
నిందేయామేయబుద్ధివిభవాస్పందా ! 206

మాలిని. ప్రథిత నిగమశాఖాప్రాతిశాఖ్యార్థఘంటా
పథవిహరణశీలా ! బ్రహ్మవిద్యాధ్వఖేలా !
మథితవిపుల ధర్మాంభస్స్మృతిక్షీరవారాం
నిధిజనితసుధాసంతృప్త భూదేవజాలా ! 207

ఇది శ్రీగురుకరుణాసమాసాదిత కవిత్వ వెంపరాల
సూర్యనారాయణ నామధేయ ప్రణీతంబయిన
మునిత్రయ చరిత్రంబునఁ
ప్రథమాశ్వాసము.

శ్రీగురుమూర్తయేనమః

# మునిత్రయ చరిత్రము.

## ద్వితీయాశ్వాసము.

రుచిర విజయనగరమ
హారాజామరగవీకళాగారసుధీ
వారశిరోలంకారిత
ధీరపదా ! సుబ్బరాయధీమద్వరదా. 1

గీ. అవధరింపు మాలీల నందావనీంద్ర
పూజితుం డయి వర్షుఁ డాపుణ్యదివస
మంద శుభవేళ నూత్నగృహంబునందుఁ
దాఁ బ్రవేశించె హితబంధుతతులు గొలువ. 2

సీ. చిరకాలబంధువు జ్యేష్ఠామహాదేవిఁ
బొ మ్మంచు నుద్వాసనమ్ము చెప్పెఁ
బ్రాణధారణమునకై నిత్య మగుభీతి
కంతిమతర్పణం బాచరించె
సరివారినగుఁబాట్లఁ బఱచినలజ్జకు
నపసరిల్లంగ విడాకు లిచ్చెఁ
జెవులు చీములు గట్టఁ జిన్నలు పెద్దలు
నలుపునిందల కెల్ల స్వస్తి చెప్పెఁ

గీ. నందరాజేంద్ర దత్తాభినవవిశాల
మందిరానంతధనధాన్యమణివిభూష
ణాంబరాదికసంపదాలంబన ప్ర
హర్షు డగువర్షు డధిగతోత్కర్షు డౌచు. 3

సీ. ఎటువైపు గనుగొన్న గిటకిటలాడుచు
బాంధవుల్ పరిజనపటలి మసల
నేవంక గాంచిన నిల్లుపట్టనియట్లు
ధాన్యరాసులు కన్నుదనియ మెఱయ
నేదెస నరసిననేని గల్లని వెండి
బంగారములు తాండవంబు సలుప
నేమూల జూచినక్షౌమముల్
తలిమముల్ సకలలోహామత్రనికర మమర

గీ. నిది గలదు లే దిది యటంచు నెన్న రాక
సకలసంపత్తిపూర్ణ మౌసద్మమందు
శ్రీమహాలక్ష్మివోలె వర్తించు వర్షు
పొలతి యేడువారాలసొమ్ముల ధరించి. 4

క. కొసరదు కసరదు మఱి వె
క్కసమన దతిథులును బంధుగణములు నడిగే
ల స హస్రము వచ్చిన న
య్యసమచరిత వారి కొసగు నన్నోదకముల్. 5

మ. తమసంపత్తికి హేమభూతు లగుతద్వర్ణిత్రయంబే యప
త్యముగా నెంచుచు వారికిష్టమగుమృష్టాహారముల్ పెట్టుచున్
రమణుల్ వైశేషిక విద్య లెల్లఁగఱపన్ బ్రార్థించు, స్త్రైణం బప
త్యమునీ కెందఱనంగఁజూపు ముగురంచాయమ్మయమ్మాపురన్

చ. వదినియ నగ్రజన్ము నుపవర్షుఁడు తొల్లిటికంటె భక్తిసం
పద భజియించుఁ; దత్సుదతి మానవితీవ్రపరాఙ్ముఖత్వమున్
వదలి ఋజుప్రవర్తనమునన్ బరిచర్య లొనర్చుచుండు న
మ్మదిని నపత్రపాభయవిమర్దనదుర్దశ పా లొనర్చుచున్. 7

క. అంత నొకశుభదినంబున
నంతర్వాణిప్రవేశుఁ డగువర్షుం డ
య్యంతేవాసులకును జం
భాంతకకృతశబ్దశాస్త్ర మారంభించెన్. 8

క. మాఘవనశబ్దవిద్యా
మోఘరహస్యార్థబోధమునఁ దచ్ఛిష్య
శ్లాఘాభాజనుఁ డయ్యె ని
రాఘాటవచఃప్రసారుఁడై గురుఁ డంతన్. 9

మ. క్రమమున్ బాయకముప్పరవ్వటువు లేకద్విత్రివారంబు పా
ఠము నాలించి పఠించుచొక్కనలగాధజ్ఞాన మార్జించి ఛం
దముజ్యోతిష్కళయున్ నిరుక్తముశిరత్వాదంబుకాలంబునన్
రమణన్ నేరిచి కల్పమున్ గఱచి రేన్నాళ్ళన్ సమగ్రంబుగన్

సీ. కత్తులపైఁ బరీక్షల నీయఁజాలున
ట్లొకనాఁడు శ్రుతిపాఠ ముగ్గడింతు
రొకనాఁడు చదువుదు రన్నములై శిక్ష
యెల్ల శలాకాపరీక్ష కాఁగ
వరుస నొకప్పు డావర్తించెదరు నిరు
క్తము స్వప్నమందేని దప్పకుండ
నొకవేళఁ గల్పము జ్యోతిరాగమము తూ
చా తప్పిపోని దీక్షను బఠింతు
రింక నది యేమి వెట్టిరో యెల్లవేళ
శబ్దవిద్యారహస్యవిచారణావ
ధానమతు లయి భోజనం బేని మఱచి
యుందురు గురుండుఁ బత్ని యానంద మొంద. 11

ఆ. ఇంద్రచాంద్రకాశకృత్స్నాపిశలిశాక
టాయనాదు లైనయాదిశాబ్ది
కేంద్రసూక్తు లెల్ల నేకాగ్రమతి విమ
ర్శించుచుంద్రు గుణము లెంచుచుంద్రు. 12

క. ఆ యనఘులసాంగస్వా
ధ్యాయాధ్యయనంబు నెఱిఁగి యవనిసురకుమా
రాయుత మవ్వర్షోపా
ధ్యాయుని సేవింపవత్తు రహరహము తమిన్. 13

సీ. ఆధ్వర్యవమునకై యజురాగమము నేర్వ
వచ్చితి ననుచు వాక్రుచ్చు నొకఁడు
ఔద్గాత్ర మాసించి యరుదెంతు నని సామ
నిగమ మొక్కవటుండు నేర్పఁ వేఁడు
హౌత్ర మ్మపేక్షణీయమ్మ నా కని యొక్కఁ
డర్థించుబుగ్వేద మధిగమింప
నాథర్వణముల రహస్యముల్ తెలిసికో
నేఁ తెంతు నని వచియించు నొకఁడు

గీ. తర్కవేదాంతములు మంత్రతంత్రశబ్ద
శాస్త్రముల వేఱువేఱుగాఁ జదువఁ గోరి
వచ్చెదరు వర్ష గురుని నివాసమునకు
బ్రహ్మచారి సహస్రముల్ ప్రత్యహంబు. 14

గీ. తన్ను మించినవ్యాడీంద్రదత్తు లుండ
నందఱను మించినట్టి కాత్యాయనుండు
గలుగ వర్షున కధ్యాపకతఁ గొఱంత
కలుగునే శిష్య లోకలక్ష క్రమ్మకొనిన. 15

ఉ. ఎల్లరఁ బిల్చి యెవ్వరికి నేచదు విష్టము చూచి తాను శి
ష్యు ల్లలితక్రియన్ గఱప నోపిన వర్షుఁడు నుత్యుఁ డౌను కా
కల్లవటుప్రజంబునకు నన్నము వేళకుఁ బెట్టి ప్రోచు నా
తల్లిని వర్షపత్నినిగదా మునుమున్న నుతింపఁగాఁ దగున్.

క. ఆవర్షాచార్యునియం
తేవాసిసహస్రమందు ధీజడుఁ డొకఁ భూ
దేవకుమారుఁడు పాణిని
నా వెలయును మివుల ధారణారహితుండై. 17

గీ. ఉర్వి గాంధారదేశమం దుల్లసిలు శ
లాతురగ్రామ మభిజనం బై తనర్చు
నట్టిదాక్షికిఁ బాణినాహ్వయునకును సు
తుం డనూచానతాంచత్కులుం డతండు. 18

క. సహపాఠు లహరహంబును
బహువిధశాస్త్రార్థపాఠపారంగతులై
విహరింప నవ్వటుఁడు ప్ర
త్యహ మార్దిన్ జనుపాఠమందే యుండున్. 19

సీ. పరిపూర్ణచంద్రబింబమువోలె శాంతమై
కలకల లాడు మొగంబువాఁడు
ఆజానుబాహువై యాయతోరస్కుఁడై
చూడంగఁ దగుమేని సొబగువాఁడు
అమృతరసం బొల్కునట్టి యమాయిక
విమలాతిమృదుభాషణములవాఁడు
మృత్యుదేవత నేని మెడ వట్టి తిగిచి తే
నను వైనమేటి సాహసమువాఁడు

ఆప్రభాత మాసాయ మాయాన మనక
గురువరపదాబ్జశుశ్రూష నెఱపువాఁడు
కాని గ్రహచారమదియేమొ కడఁగి యొక్క-
పారమే నొప్పగించు పాపముసఁబోఁడు. 20

క. 'ఆకారసదృశముగఁ బ్ర
జ్ఞాకౌశల మమరు' ననెడు సజ్జనులనుడుల్
వైకల్య మొందుఁ బాణిని
యాకారప్రజ్ఞలారయం గలుగునెడన్. 21

క. జలలిఖితలిపికి ఝంఝా
నిలపథగతదీపమునకు నేనిన్ స్థైర్యం
బలవడుఁ గాని యతనిమది
నిలువద యొకపాఠ మొక్కనిముసంబైనన్. 22

ఉ. పూర్ణవినీతిమంతుఁ డని పొంగి దయన్ గురుఁ డెల్లవేళ న
భ్యర్ణనివాసిఁ జేసి యొకపాఠము పల్మఱు చెప్ప శ్రద్ధ నా
కర్ణనసేసి బోధపడెఁగా యన దిక్కులు సూచి బాష్పసం
పూర్ణవిలోచనుండగుచుఁ బొక్కుమదిన్ నిజమూఢతాప్తికిన్.

గీ. అట్టియెడ వర్షపత్ని తా నరసెనేని
యల్లఁ బాణినినూరార్చి హాస్యమాడు
వటువుల నదల్చి ప్రార్థించుఁ బ్రాణనాథు
ననునయోక్తులఁ గారుణ్య మడర నిట్లు. 24

క. తల్లిగఁ దండ్రిగ మనలనె
యుల్లంబున నమ్మి కొలుచుచుండెడువీనిన్
బిల్లనిగఁ దలఁచి ప్రోవఁగఁ
జెల్లదె మీవంటివిబుధశేఖరుల కహో. 25

ఉ. నాయన పాణినీ వగవ న్యాయమె? నీగురువుల్ దయన్ సహా
ధ్యాయుల మించునట్లుహృదయంబున హత్తెడుదాఁకఁబాఠమా
మ్నాయమొనర్పఁ జేయుదురమాయికుఁడంచునువీరుహాస్యమున్
జేయునెడన్ ననున్బిలిచి చెప్పుమి యెల్లరత్రుళ్ళడంచెదన్.

క. అనునప్పుడు వర్ష గురుం
డును బత్నిం బలుకుచుండు "నూత్నముగాఁ జూ
తునె వీనిని నీ వేటికి
ననయం బనయముగ నిట్టు లాడెద వబలా. 27

సీ. పక్షపాతంబు నావలన నెట్లింతి యుం
దఱ కొక్కగతి విద్యఁ గఱపుచుందు
నందు నీపాణినియంద దృష్టిని నిల్పి
వేమ యొక్కటియె చెప్పించుచుందు
నేమి కర్మమొ కాని యెంత వల్లించిన
మఱచు నాక్షణమె నాకఱపు చదువు
పరమేశ్వరుఁడు బుద్ధిపటిమ మీయఁడె యిట్టి
శ్రద్ధధానున కంచు సంతపించు

గురు వైనవాఁడు శిష్యుఁ డై కొలుచువాని
కెన్ని వెరవుల బోధించు నన్నిగతులఁ
జెప్పి చూచితి ఫల మింత చిక్కదయ్యె
నింక నే నేమొనర్తు నేణాంకవదన. 28

శా. ప్రత్యూషంబున లేపి పాఠముల నావర్తింపఁగాఁజేసియున్
మత్యుద్దీపకమంత్రతంత్రజపహోమప్రక్రమున్ సల్పియున్
నిత్యం బీక్రియ నెన్నిపాట్లు పడినన్ లేశంబు ధీజాడ్యనై
యత్యంం బాఱదు వీని నింక నెటు లధ్యాపింతు నింతీ! యనున్

గీ. ఇట్లు పాణిని జడిమచే నిడుమపడుట
గురుఁడు బోధనవిఫలతఁ గుందుటయును
బత్ని యనుకంప యుదయింపఁ బల్కుటయును
నెన్నిమార్లయ్యెనో చెప్ప నవనిశరము. 30

క. ఒకనాఁ డటుపాణిని గురు
నికటంబున శబ్దశాస్త్రనిపుణమతులు న
ర్భకు లగువరరుచ్యాదులు
పకపక నగి రెటనో తప్పఁ బలికె నటంచున్. 31

చ. అది గని వర్షదేశికుఁ డుదగ్రతరాగ్రహుఁ డౌచు వారి య
య్యెదు టడంగించి ఖేదపడుచుండెడుపాణిని బుజ్జగింప "ని
ర్మలుఁడవు గాన విద్యలు సమస్తము నేర్తువు నాఁడు వీరు ప్ర
ల్లదములడంగినీపదములన్ భజియింతు"రటంచుఁ బల్కుడున్.

క. పక్కు మని నగుచు శిష్యులు
ప్రక్కకు మోములు మలంచి పాఱుటయును ద
న్యక్కారద్విగుణీకృత
శుక్కుం డయి దాఁటిపట్టి చొచ్చె గృహంబున్. 33

చ. చొచ్చిమనంబునన్ రవులుచున్ బెనుమంటలగాయమేర్చుచున్
బెచ్చగు నప్పరాభవవిభీషణవహ్నిని గూలి తత్ప్రభూ
మోచ్చయపీడితం బయిన యొప్పునఁ గాల్వలరీతిఁ గన్నులన్
వెచ్చనియశ్రు లుట్టిపడ వెక్కుచు వేఁగుచు నుండు నయ్యెడన్.

క. గురుపత్ని యరసి యేమిర
దురపిల్లెద వొంటి నింటఁ దూఱి పరిహాసిం
పరుగద వటువులు కోపిం
పరుగద గురు లనుచు నడిగెఁ బరిపరిగతులన్. 35

ఆ. వెక్కు లుక్కుమీఱఁ జెక్కులఁ గన్నీరు
వెల్లివిరియ నంగ మెల్ల వణఁక
నంగలార్పఁ దొడఁగె నాతఁ డామెయుఁ జూచి
వగపు సుడి నడంప వలఁతిగాక. 36

ఉ. అట్టు లొకంత సేపడలి యామెయుసాంత్వనవాక్కులన్ మదిన్
గట్టిగఁ జేసికొంచు గళగద్గదికన్ వచియించు నిట్లు నా
యట్టిదురంతపాపభరితాత్ముఁ డిఁకన్ క్షితిఁ బుట్టఁ బోఁడు నీ
విట్టుల నాకునై వగవ నేటికిఁ జీటికి మాటి కంబరో. 37

మ. తొలిజన్మంబునఁ జేసికొన్న యఘమెందుఁ బాయునే? తల్లిదం
డ్రు లుపాధ్యాయులు మీరయైకరుణఁ గూడన్ గుడ్డయుఁ బెట్టివి
ద్యలహర్త్రింపశ్రమంబునొందెదరుగాకయ్యయ్యొ నాఫాలమం
దలివ్రాఁతల్ సవరింపఁగాఁగలరె యెన్నాళ్లుండి వేధించినన్.

గీ. ఏ మనంగను జాల నింకే మనంగఁ
జాలఁ బ్రజ మోము చూడఁగఁ జాల మాల
దైవ మేటికి నన్నుఁ జిరంజీవిఁ జేసి
విడిచెఁ జిరజీవియటు లుండు పుడమి ననుచు. 39

శా. అస్మద్వంశ్యు లనాదిగా నఖిలవిద్యావేత్తలై పండితా
పస్మారుల్ భయమొంది డాఁగ జయులిప్సన్ ధాత్రిగాలించిమం
దస్మేరాననులైనజెట్టులు సుమీ తత్కీర్తులన్ నేఁ డిటుల్
భస్మంబున్ బచరింపఁ బుట్టితినె యీబాలంబు గ్రేణింపఁగన్.

చ. చిఱుతలు నన్నుఁ గన్గొని హసించుట వారలతప్పుగాదు దు
ర్భరజడిమోపలబ్ధి నయి వారలు వీరలువోలె విద్యలన్
గఱపుఁ డటంచు నొజ్జలను గాఱియఁబెట్టుచు నెంతచెప్పినన్
మఱచుట నాదుతప్పిద మనన్వలెఁ గాని తలంపఁ దల్లిరో.

గీ. పుడమిఁ గలవిద్య లెల్ల నాపోశసంచి
తనకుఁ బట్టంబు గట్టెద నని తలంచి
పొంగుచుండెడు నాతల్లి చెంగటికి నేఁ
కెట్లు పో నేర్తు నెవి వచియింప నేర్తు. 42

ఉ. వాద మొనర్ప వచ్చి బుధవర్గము నామఖదీప్తిఁ గాంచి బ్ర
హ్మాదులఁ ద్రోసిరా జనుమహామతి యంచుఁజలించి యెట్టులో
వాద ముపక్రమించి మదవక్రవిమూఢత కబ్ర మొందుచుఁ
మోదుగుఁబువ్వువీఁడనుచుమోముపయిఁ నగిపోదు రంబరో.

క. ఆసాయము గురువుల కా
యాసమ్ము సతీర్థ్యులకు నిరంతరవిఘ్నం
బోసాధ్వరో మద్విద్యా
భ్యాసశ్రమ మెవరు మోద మందిన దహహా. 44

ఉ. బుద్ధి వహింకికి ప్రాజ్ఞజనపూజ్యత పూజ్యము పల్కఁబో వచ
శ్శుద్ధి యబద్ధ మూర్జితయశోగతి మించుట మున్నసున్న యీ
పద్ధతి శుద్ధమూర్ఖునవప్రథ జీవము దాల్చి యెందు నా
పద్ధతిఁ జెందుకంటె మెయిఁబాసి దివిం సుఖియించుటొప్పదో.

క. అని దుర్ధర్షమమూర్షా
జనితత్వర లేవ నొజ్జసాని కనికరం
బును గని కరమున నాఁగుచు
ననియె మనోదుఃఖ మఖల మపుడ ఖలమగా. 46

ఆ. ఆత్మహత్య కొగ్గు టన్నన్న యెంతపా
పంబు ప్రాజ్ఞలక్షణంబు గాదు
పౌరుషంబు విడక పలుయత్నముల దైవ
మాశ్రయించి సఫలుఁ డగుట నీతి. 47

ఆ. బ్రదుకు మని సృజించుభగవంతునానతి
ద్రోసి చచ్చుకంటె ద్రోహమెద్ది
యిపుడు కలుగుదుఃఖ మపనయింపఁ దలంచి
కల్పకోట్లు నారకమున నుండె. 48

ఉ. పండితుఁ డీతఁ డౌ నితఁ డపండితుఁ డౌ ననరాదు నేఁడు దాఁ
బండితుఁ డయ్యు నెల్లి యొకవాదునఁ బామరుఁడౌ నొకప్పుడో
క్కం డొకవిద్య మూఢుఁ డయి క్రన్నన వేఱొకవిద్యఁబండితా
ఖండలుఁ డౌను ప్రాగ్జననకర్మగతుల్ గహనాకృతుల్ సుమా.

క. అందఱకు నన్నివిద్యల
యందుఁ బ్రవీణత గడించునభిలాషమ యుం
డుం దైవగతిని జేకుఱుఁ
గొందఱ కొకవిద్య రాదు కొందఱ కొకటిన్. 50

ఉ. దేశము కాలమున్ సదుపదేష్టయు నన్నమువస్త్రమున్ మఱి
క్లేశసహత్వమున్ గ్రహణలిప్సయు ధారణయున్ వధాన మ
య్యాశదయావిశేష మను నెన్నియొ కూడినఁ గాక విద్యలన్
లేశము నెవ్వఁడున్ దెలియనేర్చునె యెంత శ్రమంబుఁబొందినన్.

గీ. పూర్వభవకృతదుష్కృత మూలమున ని
రోధ మలవడఁబోలు నీమేధ కకట
తన్నిరోధాపనుత్తికై దైవతార్హ
ణంబుగా కన్య మగునౌషధంబు లేదు. 52

ఉ. ఆననకంజషట్కవసదాగమసంచయచంచరీకుఁ డీ
శానమనోనురాగరససాగరపార్వణశర్వరీశుఁ డ
మ్లానపరాక్రమక్రమవిమర్దితరాక్షసచక్రుఁ డైనసే
నాని శ్రితామరద్రుమ మనంగ వెలుంగఁ గలంగ నేటికిన్.

ఉ. అన్న వినంగ లేదె యొకయప్పుడు నీగురుదేవుఁ డిట్లె నీ
కన్నను మూఢుఁ డంచు శ్రుతికంటకదుష్ప్రథ కగ్గమై తపో
భ్యున్నతిఁ గార్తికేయుపరిపూర్ణకృపామృతపాత్రమై గ్రహిం
చె న్నిఖిలశ్రుతిస్మృతివిశిష్టము వ్యాకరణాది వ్రేల్మిడిన్.

క. అంచుఁ దెలిపెఁ దొంటినిజా
కించన్యము యాత్మకృతవగీతవ్రత దు
ర్వంచనము భర్తృతపము ను
దంచితకృప గుహుఁడు వరము లందిచ్చుటయున్. 55

క. తెలిపి నిరుత్సాహుఁడవై
కలఁగక తుహినాద్రి కరిగి గాఢతపోని
శ్చలదంతఃకరణుఁడవై
కొలువుము గుహు సతఁ డొసంగుఁ గోరినవిద్యల్. 56

ఉ. దైన్యముమానుమాత్మవితతంబుగధైర్యముపూనుమవ్వహం
బన్య మెఱుంగ కోరిమి షడాననదేవు భజింపు తత్కృపా
జన్యమతిప్రకాశమున శాస్త్రము లన్నియు నాకళింపు సా
జన్యమునన్ జగంబున యశఃకుసుమంబుల నింపు మింపుగన్.

గీ. అనుచు దీవించి తగునుపాయంబు సెప్పి
పోయి రమ్మన్నఁ బాణిని పొక్కు టుడిగి
క్రమత నుత్సాహ మూని యారాత్రి యెవ్వ
రికిని జెప్పక వెడలె దైవికము నెంచి. 58

క. పల్లియలు పత్తనంబులు
పల్లంబులు పర్వతములు పక్కణములు కం
పిల్లక కడచి కడచి సెల
యేళ్లును నేళ్లును దరించు చేఁగును వేడ్కన్. 59

చ. కతిపయవాసరంబులకు గౌరరుగంచితతుంగశృంగసం
పతదురునిర్ఝరాంబుకణభారసమేధితనాకవాహినీ
ప్లుతమఖభుఙ్నివాసము విలూననభోభ్రమకృత్తటీవనీ
క్షితిరుహనీలిమాగ్రమగుశీలగిరిన్‌గని యాత్మఁ బొంగుచున్.

సీ. గోరూపధారిణి యారత్నగర్భకుఁ
జేఁపు పుట్టించిన చిఱుతలేఁగ
లోకపావని స్వర్ణదీకుమారిక మేన
నంతయుఁ బ్రాఁకంగ నలరుసుకృతి
సోమలతాజనుస్సీమమై బుధులకు
సత్రముల్ నెలకొల్పు సజ్జనుండు
సచరాచరప్రపంచము గర్భమునఁ దాల్చి
కని పెంచునాజగజ్జననితండ్రి

గాఢతమతుంగ శృంగశృంగాటకాగ్ర
దిగ్భ్రమభ్రమదభ్రగా దిత్యశుభ్ర
కరముఖగ్రహతారకోత్కరముదిరము
వ్యాప్తభూవలయం బీహిమాలయంబు. 61

గీ. అని నుతించుచుఁ గేకివాహనుఁ దలంచు
కొనుచు నాచలిమలకొనకొమ్ము దాఁక
నెట్టులో యెక్కి యందలియెల్లచిత్ర
ములను గని యొట్టకేలకు నిలకు డిగ్గి. 62

శా. తత్పాదాశ్రయుఁడై స్వయంపతితగోత్రాజచ్ఛదోద్భాసిత
క్షుత్పీడుండయి ప్రాంతనిర్ఝరపయస్సుల్ గ్రోలు చందాశ్రమం
బుత్పాదించి తదంతరస్థుఁడయి ధ్యేయున్ గార్తికేయున్ సదా
హృత్పద్మాలయుఁ జేయుచున్ దప మొనర్చెన్ దుష్కరప్రక్రియన్.

సీ. పంచాగ్నిమధ్యసంవాసియై తపియించుఁ
గటుకుటెండలనాఁటి బిఱుసువేళ
నోసరిల్లక నిల్చు నుదధారలకు మిన్ను
చిల్లి వడ్డటుల వర్షించుతఱిని
గంఠదఘ్నంబు మగ్నశరీరుఁడై పుండు
వంటిసీతున నుండు వడఁకకుండ
నశనంబు జలపాన మనిల మ్మొుఁగకుండు
నేకాల మింద్రియాతీతవృత్తి

ధ్యానపథగతపార్వతీ సూనుదివ్య
రూపపీయూషపానప్రరూఢ నిశ్చ
లామితానంద గళితబాహ్యార్థవాస
నుండయి యతం డొనర్చు నుద్దండతపము. 64

గీ. అమితవిజ్ఞానుఁ డయ్యు సుం తైనభక్తి
లేనియెడ వానితప మేల గ్లాసి మిగులు
మూఢుఁ డయ్యును భక్తి సంపూర్ణుఁడేని
యంతయును మానె ఫలము కొంతైనఁ గనఁడె. 65

ఆ భక్తి డెందమందుఁ బ్రబలుచో నజ్ఞాని
కైనఁ దపము సిద్ధి నందితీరు
నెఱుఁగ కేని మంచునింగలమ్ము ద్రొక్కఁ
గాలు కాలకుండు టేల గల్గు. 66

ఉ. కన్నులఁ దోఁచెఁ దేజ మధికంబయి మోమున బ్రహ్మవర్చసం
బన్నుకొనెన్ మనంబున నుమాత్మజపాదసరోజముల్ దలన్
బన్నె నిరంతరం బయినభక్తి శమంబు దమంబు గూడి సం
పన్నతఁ గాంచెఁ బాణిని కపారతపోబలపుణ్యసంపదన్. 67

క. భానూదయాస్తమయముల
నేని యెఱుఁగ కొక్కరీతినే యుండును ద
త్కాననశరారుజంతువి
తానము సేవింప సౌహృదయ్యా మెలర్పన్. 68

మ. అతిఘోరం బగుతత్తపఃక్రియ కవిద్యామూర్తు లావన్యస
త్వతతుల్ సైతము నిరుగాఁగరఁగ విద్యామూర్తి యుమాశాంకరీ
సుతుఁ డత్యంతకృపార్ద్రుఁ డౌటరుదె? యస్తోకప్రభావుండు సం
శ్రితరక్షాధృతకంకణాంకణుఁ డుపేక్షింపన్ దలం పూనునే.

సీ. ఇంద్రచాపసహస్ర మీనుబర్హమునఁ బొ
ల్పారుబర్హిణము వాహనముగాఁగ
సాంగమ్ములై వేదజాతమ్ము విజయాంక
గాతలౌ వందిమాగధులు గాఁగ
నుపనిషత్తులు రూప మొంది సందడి యూడి
గము సేయుకింకరీగణము గాఁగ
వ్యూఢకంకటులై దివౌకోవిభులు తన
యానఁ బ్రవర్తిల్లుసేన గాఁగ

ముకుళితకరాబ్జభూషితాలికసురర్షి
జయజయధ్వానకబళితాశావసుంధ
రాంబరుం డయి కరుణావలంబనుఁ డయి
యంబికాత్మజుఁ డపుడు ప్రత్యక్షమయ్యె. 70

మ. అటుసాక్షాత్కృతుఁడైనదేవునకు సాష్టాంగంబుగా మ్రొక్కి నై
కటికస్థానమునందు నిల్చి నిటలాగ్రం బంజలిన్ జేర్చి ప్ర
స్ఫుటకంఠధ్వని వేదమంత్రములచే స్తోత్రంబు గావించు న
జ్జటి నీక్షించి కుమారదేవుఁ డను వాత్సల్యంబు దీపింపఁగన్.

క. విక్రీతదాసుఁ డైతి న
వక్రభవత్కృతతపఃప్రభావమున కిలా
చక్రమున నీ కలభ్యం
బే క్రియఁ గలదయ్య! యడుగుమీ వర మొయ్యన్. 72

గీ. అనినఁ బాణిని భయభక్తు లతిశయిల్ల
నిట్టు లను దేవ! జడుఁడనై యెల్లవారు
నవ్వఁ బొగిలితి జిరము నానొవ్వ దీర్చి
వేదశాస్త్రజ్ఞతఁ నొసంగి యాదరింపు. 73

క. నావుడు విశాఖుఁ డి ట్లనుఁ
దావకధీజాడ్య మిదె యథాయథ లగు "మే
ధావీ భూయాస"మ్మని
యీ వృషనయనమునఁ గోరు టిపుడ ఫలించున్. 74

క. స్ఫురియించు వర్షుకడమును
గఱచియు మఱచినశ్రుతుల్ సకలవిద్యలు వ్యా
కరణంబు దక్క నదియును
దొరకొను వెరవును వచింపుదును వినుమనఘా.

క. ఈక్షణము యేఁగుము ప్రయా
గక్షేత్రంబునకు నచటఁ గలదు వటకుజం
బక్షయనామక మటఁ బం
చాక్షరమున శివు భజింపుమా పరమార్థన్. 75

క. సర్వజ్ఞుఁడు మజ్జనకుఁ డ
ఖర్వకృప నతం డొసంగఁగలఁ డావర మీ
యుర్వి వెలయు నీకతము న
నర్వాచీనముగ మేటి వ్యాకరణ మిఁకన్. 76

మ. అవిలంబంబుగ సిద్ధి గాంచెద వటం చయ్యంబికాసూతి ప్రే
మవశుం డై సకలార్థసాధకము సన్మౌనీంద్రసంసేవ్యమౌ
శివపంచాక్షరమంత్రరాజ ముపదేశించెన్ రహస్యంబుగాఁ
జెవి నప్పాణినికిన్ నవీనమతినైశిత్యోల్లసద్వాణికిన్. 77

క. సాంగోపాంగము మంత్ర మె
ఱుంగఁ బలికి యాగుహుఁడు తిరోహితుఁడయ్యెన్
నింగిఁ బెనుమబ్బులను సా
రంగాంకుఁడు కప్పువడు తెఱం గెసఁగంగన్. 78

క. కాదంబినీవిముక్తసు
ధాదీధితిబింబ మటు లుదస్తజడిమమై
మోద మెనసి పాణినిముఖ
మాముకొనె క్షణక్షణోదయం బగు తెలివిన్. 79

శా. దాక్షేయుండు విలక్షచిత్తుఁ డగుచున్ దాక్షాయణీపుత్రవా
గ్ద్రాక్షాస్వాదనపారవశ్యమునఁ దద్దాక్షిణ్య మగ్గింపుచున్
విక్షేపించి తపోక్షయక్లమముఁ దా విచ్చేసె నాస్థన్ బ్రయా
గక్షేత్రంబున కాక్షణంబ మదిఫాలాక్షున్ సమీక్షించుచున్.

ఆ. ఆ ప్రయాగమున కతి ప్రయాసంబునఁ
జేరునాక్షణంబ చిత్ర మతఁడు
విస్మరించె శ్రమ మభీష్టార్థసిద్ధిసూ
చ్యార్థసూచకం బ దన్నయట్లు. 81

సీ. రవిసుతాగంగాసరస్వతీసంగమ
జలవేణిఁ ద్రిషవణస్నాన మాడెఁ
బితృదేవతలకుఁ దృప్తి ఘటించె యవసక్తు
పిండప్రదానాదివివిధవిధుల
క్షేత్రపాలకమాధవత్రిణేత్రాది దై
వతపట్టభద్రుల వరుసఁ గొలిచెఁ
దైర్థికులను జేరి తత్తీర్థమాహాత్మ్య
మామూల మాచూడ మవధరించెఁ

గాంచెఁ బరమమునీంద్రసంఘాతములను
జేరె సకలతపశ్శీఘ్రసిద్ధిదాయ
కమగునక్షయవటవృక్ష మమరుకడకు
శిష్టజనసన్నుతుండు దాక్షీసుతుండు. 82

గీ. ఆత్మవిద్యాప్రభావంబు నధిగమింప
శశికళాశేఖరుని మానసమున నిలిపి
యచట సనకాదిమౌను లుపాసనం బొ
నర్చుకొనుచుండెదరు పెక్కునాళ్లు గాఁగ. 83

చ. సనకసనందనాది ఋషిసత్తములన్ గని భక్తి మ్రొక్కి దీ
వెనలఁ బరిగ్రహించి వినిపించి స్వకీయచరిత్ర మెల్ల శి
ష్యునిగ గ్రహింపవేఁడి నిగమోత్కరమధ్యయనించి వారియా
జ్ఞ నెనసి యచ్చటన్ దప మొనర్పఁ గడంగె నలంఘు దీక్షతో.

క. తపముల శివపంచాక్షర
జపముల నతిభీష్మకృచ్ఛ్రచాంద్రాయణసాం
తపనాదివ్రతముల నతఁ
డుపమాతీతముగఁ జేయుచుండెను దీక్షన్. 85

శా. సాంగోపాంగము యోగవిద్యల నతం డార్జించెఁ దన్మౌనిరా
ట్సాంగత్వంబున నొక్కవేల్మిడి నుమాసంతానకారుణ్యపూ
రాంగోద్వర్తన ధౌతసాంద్రజడిమోద్యచ్ఛేముషీసూక్ష్మతా
శృంగారాంచిత నూత్నకాంతివిలసద్దృష్టి ప్రకృష్టాస్యుఁడై.

శా. జాగ్రత్స్వప్నసుషుప్త్యతీతము జగజ్జన్మాదిబీజంబు స
ర్వాగ్రీయం బజ మక్షరం బగుశివాఖ్యబ్రహ్మమున్ మానసై
కాగ్రత్వంబునఁ దా నుపాసనము సేయం జొచ్చె నయ్యక్షయ
న్యగ్రోధాధరదేశవాసుఁడ ఋబ్రహ్మణ్యుల్ నుతుల్ సల్పఁగన్.

సీ. హృదిని శివుఁ గూర్చి భువిఁ జేర్చి యేకపాద
మూర్ధ్వబాహుండు వాయుమాత్రోపజీవి
యగుచు సనకాదిమునులట్లు యమ్మహాత్ముఁ
డాచరించెను దప మొక్కహాయనంబు. 88

ఉ. అంతట నొక్క సాంధ్యసమయంబున హేళికి నర్ఘ్యమిచ్చి య
ద్దాంతులొకంటఁ గూడుకొనితన్మయులై నటరాజరూపముల్
స్వాంతములన్ ఘటించికొని వైదికవాక్సరణిన్ స్తవంబు లం
తంత నొనర్చుచుండఁ దదుదారతపఃపరిపాకశక్తిచే. 89

క. ఆటోపమ్మున నింపుకి
రీటుఁడు దోఁచెన్ నటేశ్వరితరూపమున నిరా
ఘాటముగఁ ద్రయస్త్రింశ
త్కోటిసురలు పారిషదులు గొలుచుచునుండన్. 90

సీ. చరణవిన్యాస దుర్భరభారమున నథో
లోకంబు లొండొంటి డీకొనంగ
బాహువిక్షేపణోద్భ్రాంత సూర్యాదిగ్ర
హంబులు బంతుల ట్లదరి యెగుర
నుచ్చలద్గ్రైవేయకోరగేశ్వరఫూత్కృ
యానిలాహతి దిగ్గజాళి ద్రెళ్ళ
జాటజూటోన్నమజ్జాహ్నవీకల్లోల
మగ్నమై తేఁజందమామ గలఁగ
మంధరాచల నిర్మథ్యమానవార్ధి
ఘుమఘుమారావధిక్క్రియాక్రమ సమర్థ
పటహచటుల ధింధింక్రియాస్ఫుటులు సెలఁగఁ
దాండవముసేసెను మహానటుండు ప్రీతి. 91

సీ. నందికేశ్వరుఁ డభినయము దిద్దికొనంగ
భృంగి భ్రూభంగవిభేద మెఱుఁగఁ
జండీశ్వరుఁడు తాళసంగతుల్ నేర్వంగ
మురజవాద్యవిశేష మరయ శౌరి
తుంబురునారదాదులు గానభేదముల్
గఱవ నింద్రుఁడు కళాగతులఁ దెలియ
స్వానసంవిధానంబు సవరించుకొన బ్రహ్మ
యచ్చరల్ నృత్తరహస్య మెఱుఁగ

మునిజనంబు నాదబ్రహ్మముగఁ దలంచి
యంతరంగమ్ములందు నృత్యమ్ము సేయఁ
దాండవించె మహీరంగమండపమున
నఖిలవిద్యాగురుండు మహానటుండు. 92

గీ. గరుడగంధర్వ యక్షకింపురుషకిన్న
రాప్సర స్తతి తతసుషిరాదివాద్య
ముల సమన్వితలయముగా నులివ్రుకొలుప
నుల్లసిలె ఖండపరశునాట్యోత్సవంబు. 93

ఉ. ఆనటరాజరా జటు మహాద్భుతవై ఖరిఁ గొంతసేపు వై
జ్ఞానికు లై నపారిషదసంఘముతోడ నటించి దేవతా
మానిసమాజముల్ ప్రమదమగ్నులఁ జేసి తపఃకృశాత్ములై
ధ్యాన మొనర్చుచుండు సనకాదులఁ బాణినిఁ దన్నుబుద్ధితో

గీ. ఒక్కకంటను సనకాదియోగివరుల
నొక్కటఁ బాణినిం గాంచు చోద్ద నున్న
ఢక్కఁ బదునాల్గుతేపలు దిక్కు లద్రువ
శబ్ద మొనరించె నానటేశ్వరుఁడు పెలుచ. 95

క. అచ్చటివియచ్చరవ్రజ
మచ్చటుల చతుర్దశారవార్థ మెఱుఁగ లే
కచ్చెరువడి కొంతొక జీ
వచ్చిత్రము లై రిదేమి వరమో యనుచున్. 96

ఉ. ఆపరమేశ్వరుండు పటహప్రభవం బయి వర్ణరూప మౌ
నాపదునాల్గుశబ్దముల కంతమునన్ ణకజాదివర్ణ సం
ప్రాపణ మూన్పఁగా 'అ ఇ ఉ' ణాదికసూత్రములైన వాని నీ
హాపరిపూర్తి కిచ్చె సనకాదులకున్ మఱి దాక్షిపట్టికిన్. 97

గీ. దేహళీదత్తదీపికాదీప్తికరణి
నవుల వ్యాకృతి కివల నధ్యాత్మవిద్య
కొక్కసూత్రమ్మె బీజమై యొప్పుమిగిలె
నహహా ! పరమేశులీల లెమనఁగవచ్చు. 98

గీ. అపుడు పాణిని సనకాదియమిచతుష్ట
యము మహాదేవుఁ డరసి సూత్రముల శంక
లొదవునెడ నందికేశుఁ డిం దుండి తీర్చు
నని తిరోహితుఁడయ్యె గణాళితోడ. 99

సీ. స్తవమొనర్చుచు నుండెఁ దత్పరత్వమునఁ బా
ణిని యంజలిని మస్తమున ఘటించి
కొండాడుచుండి రఖండభక్తిని సన
కాదులు ఋగ్యజు రాదికములఁ
నుతియించుచుండి రద్భుతగతి గంధర్వు
లలరి వీణెల గీతములను గూర్చి
ధ్యానించుచుండి రంతర్ముఖులై సవా
చంయమేశ్వరులు విశ్వాస మొప్పఁ
గను మొఱంగిన నైన శ్రీకంఠుఁ డెదుట
నున్నయటు లెంచి మది సాక్షి యొక్క రీతి
బ్రణతులం జేసి చేసి బ్రమాన్పాటు నొంది
సమితి కొండొక సేపు నిశ్శబ్దమయ్యె. 100

క. శివసూత్రజాల మెల్లను
శ్రవణపథము సోఁకఁ శబ్దశాస్త్రనిదానం
బవు నని పాణిని యెఱిఁగెను
శివసుతకరుణాత్తశేముషీసూక్ష్మతచేఁ. 101

క. ఆసూత్రజాలమున కే
యా సనకసనందనాదు లధ్యాత్మపరం
బౌ సరణి నందికేశద
యాసంపదఁ దెలిసి పొంగి యరిగిరి యెందేన్. 102

ఆ. ఇష్టసిద్ధి గాంచి తుష్టిమైఁ బాణిని
యచటనే వసించి వ్యాకరణము
రచనసేయఁ బూనె విచికిత్స లించుక
పొడమ కుండుసరణి మృదునికరుణ. 103

గీ. అల్పవర్ణం బసందిగ్ధ మమితసార
వంత మస్తోభ మనవద్య మై కనంగ
విశ్వతోముఖమై సూత్రవితతి వెలయు
ననెడుసూత్రలక్షణమున కనుగుణముగ. 104

సీ. సంతరించెను సూత్రసమితి నాల్గేసిపా
దము లొప్ప నెన్మి దధ్యాయములుగ
రచియించె దశవికరణి పరిచ్ఛిన్న మౌ
ధాతుపాఠము బుధాధారముగను
నిర్మించె సూత్రసందితగణంబులకుఁ బా
ఠము దర్పణంబు చందమున మెఱయ
నలిపె లింగానుశాసనము శబ్దస్థగు
ణాపచయోపచయంబు లెఱిఁగి

కరతలామలకముగ నక్షరకదంబ
కోదయము దెల్పుశిక్షను బాదుకొలిపె
సకలవైదికలౌకికశబ్దములకు
శాసన మొనర్చె నిట్టు లా శమధనుండు. 105

క. ప్రాచీనులపరిభాషల
నే చేకొని రచియించె నెల్లశాస్త్రము గానీ
వాచాగోచర మగురచ
నాచతురిమ నెఱపె నందునఁ గన నొకచోటన్. 106

క. పాయక సపాదసప్తా
ధ్యాయీదృష్టిని ద్రిపాది యందును బూర్వం
బౌ యోగము దృష్టిని బర
మౌ యోగ మసిద్ధ మగు నటంచు రచించెన్. 107

ఉ. ఏ శ్రుతమందు నశ్రుత మదృష్టము తాదృశసూత్ర మద్ది చ
త్పుశ్రుతినాయకుం డెపుడు శూలిపదాబ్జములాశ్రయించి ధీ
విశ్రుతుఁడై తదర్థమును వేయిమొగంబులఁ జెప్పనేర్చెఁగా
కేశ్రమమూనియేనిరచియింపఁగలాఁడొకొయట్టిదొక్కటిన్.

మ. అనిదంపూర్వ మనన్యసాధ్య మతులం బౌఫక్కి శబ్దాగమం
బు నుమానాథువరప్రసాదమున సంపూర్ణమ్ముగాఁ జేసి జే
యనుచున్ వర్షగురున్ గనుంగొనసముద్యన్మానసోత్కంఠ నేఁ
గెను జంఘాకరికత్వ మేర్పడఁగ దాక్షీనందనుం డంతటన్.

క. ఎప్పుడు గురువులఁ గాంచెద
నెప్పుడు వివరింతు గురునియిల్లాలికి నా
త్రిప్పులు కుమారశర్వుల
మెప్పులు నని మదిని సంభ్రమించున్ జనుచున్. 110

క. చని గురుదంపతులకు వం
దనముసలిపి వారిదీవెనలఁ గొని సహపా
ఠినికరపరిరంభణముల్ గని
వినియె సతీర్థ్యసుప్రలాపము లెలమిన్. 111

సీ. ఇన్నాళు లెచ్చోట నున్నావొ జాడ రవ్వం
తేని వినఁగరా దనియె గురుఁడు
గురు వెవ్వరయ్య నీకు నటంచు గుర్వ్వకో
ల్గొనిసతీర్థ్యశ్రేణి గూర్మి నడిగె
నిప్పు డేపాఠమోయీ నీది యని చేరి
యడుగఁ జొచ్చిరి సహాధ్యాయసమితి
సేమంబుగా వచ్చితే ముందు సెప్పుమా
యనిరి చూడఁగ వచ్చినట్టివార

లెప్పు డేయూరిలో భుజియించినావొ
లెమ్ము సంసిద్ధ మయ్యెఁ బాకమ్ము భోజ
నోత్తరము చెప్పవచ్చుఁ బ్రత్యుత్తరములు
వీరల కటంచు గురుపత్ని వేగిరించె. 112

ఉ. అందఱు నొక్క రొక్కరుగ నల్లన నేఁగుడు నొజ్జమందిరం
బందున నిత్యకృత్యవిధు లాతఁడు దీర్చి భుజించుచున్ శివా
నందనుఁ గొల్చి తద్వరమునన్ మతిసూక్ష్మతఁ గంట శంభుభ
క్తిం దరిసించి వ్యాకరణకీలకముల్ గఱికొంటఁ దెల్పఁగన్.

క. గురుఁ డమ్మాటలు విని మది
పరమానందమున నుబ్బి పాణినిఁ గనె, నా
దరణమునఁ దత్సతి "యథా
గురు స్తథా శిష్య" యనుచుఁ గొంసరి హసింపన్. 114

క. కుడిచినపిమ్మట గురుసతి
యడుగులఁ బడి యతఁడు నీదయను బ్రదికితి న
ప్పుడు నీ వుపదేశింపని
యెడ శంకరుఁడేని జేయునే యీమేలున్. 115

శా. అమ్మా! నీయుపదేశమూలమునఁ గాదా కార్తికేయాంఘ్రిపో
తమ్మున్ గైకొని నిస్తరించి జడిమోదన్వంత మీశాంతరీ
పమ్మున్ జేరి తదంతరస్థ మగు దివ్యచ్ఛబ్దసచ్ఛాస్త్రర
త్నమ్మున్ గొంటినిగంటి ధన్యజనమాన్యం బైనసౌజన్యమున్.

గీ. ఈ వుపాధ్యాయని వను టెట్లు తల్లి
కన నుపాధ్యాయవే కాని కార్తికేయ
శంకరులు నాకు విద్యలొసంగఁగా ని
మిత్తమాత్రులుగద నసుమితి నొనర్చ. 117

క. అనుచుఁ బునఃపునరభివా
దనములు గావించువాని దళితాంహుని న
మ్మని నాచార్యాణియు దీ
వన లొనరిచె వత్సలత్వవైభవ మొలుకన్. 118

చ. వరరుచియింద్రదత్తుఁడును వ్యాడియుమున్నగుశిష్యు లంతటన్
వరుసగ వచ్చి వాని నలువంక సమాదృతిఁ గూరుచుండి ని
ర్భరపరిహాసవాక్కులఁ బురాగతిఁ బల్కుడు వారలన్ నిరు
త్తరుల నొనర్చెఁ బాణిని విదగ్ధవచోవిసరప్రసారుఁడై. 119

క. క్రమముగ వర్షువలనఁ ద
త్క్రమ మెల్ల నెఱింగి ప్రాగ్విధవ్యాహార
క్రమము విడిచి గౌరవభా
వమునఁ బలుకసాగి రపుడు వరరుచిముఖ్యుల్. 120

ఉ. పాణినియున్ జెలంగి గురువర్యులయానతిమీఁదఁ దాను ని
ర్మాణమొనర్చువ్యాకృతి సమగ్రముగా వినిపింపఁ బూనె ని
స్సాణధణంధణానుగుణసౌవరపాటవుఁడై సదావిని
ద్రాణమతిప్రభావదళితప్రతివాద్యురువిప్రలాపుఁడై. 121

క. అంతర్వాణివినుత్యము
లంతర్బహిరర్థయుతము లగునప్పాణినిసి
ద్ధాంతము లెల్ల వినుచు ధీ
మంతుఁడు కాత్యాయనుఁడు విమతమత మూనెన్. 122

ఉ. తీఱనిదొంటిజాడ్యమె మతిన్ స్ఫురియించును గాని నేఁడు గౌ
రీరమణున్ భజించి కృతకృత్యతఁగాంచె నటంచు సుంతయున్
గౌరవభావ మాతనిమనంబునఁ బుట్టకపోయె గౌరవా
గౌరవభావముల్ సెడ వొకంటఁ జిరంబుగ రూఢ మానెడన్.

గీ. అచ్చటచ్చట శంకించి యట్టు నిట్టు
తప్పుఁద్రోవలఁ బెట్ట నుద్యమము సేయు
నతనిఁ బాణిని మాఱుమాటాడ నీయఁ
డదను దొల్లింటియవమాన మెచ్చుకతన. 124

ఆ. గురుఁడు 'వల' దటన్నఁ గొంకక వరరుచి
యడ్డుదవులుచుంట యరసి పాణి
నాత్మజుండు గ్రంథ మంతయు నెట్టెట్లొ
వినిచి మదినొకింత కినుకఁ బూని. 125

క. ఏకశ్రుతధరుఁ డైంద్ర
వ్యాకృతిపారంగతుండు వాదవిధాని
ర్భీకుఁ డగువరరుచి నెవా
చాకలహంబునకుఁ బిలిచె సాహస మెసఁగన్. 126

ఉ. అంతట వారి కిద్దఱకు నయ్యెను వాదము పూర్వపక్షరా
ద్ధాంతసమర్థనప్రకటితప్రతిభారుచిరంబు వాఙ్ముఖా
నంతరఝుకీపరీతము నుదగ్రతరాగ్రహమున్ బరస్పరా
రుంతుదవక్రభాషణనిరూఢమునై యొకసప్తఘస్రముల్.

శా. ఆదిన్ బాణినిమీఁదుచేయియగువాఁడానాఁటనానాఁటవా
గ్వాదప్రక్రియఁ గ్రిందువట్టుటయునక్కాత్యాయనుండల్లనన్
మీఁదై యష్టమఘస్రమందుజయలక్ష్మిన్ గొంచుఁబ్రత్యర్థి కా
పాదించెన్ మితిలేనిభంగమధరస్పందంబు లేకుండఁగన్. 128

ఆ. కొండ విఱిగి మీఁదఁ గూలినయట్టులై
గుండె చెదర వదన మెండఁబాఱి
బెండువడి యొకంత నుండెను బాణిని
చండశోక మాత్మ నిండుకొనఁగ. 129

ఉ. అట్టుల విన్నఁబోయియొకయంతటఁదెప్పిఱియక్కటా గుహాం
డట్టుల విస్మరించె శివుఁ డిట్టు లుపేక్ష యొనర్చె భక్తిమై
నట్టుల కొల్చునాఁడ యడియాస యిదేటికిఁ బొమ్మ టన్న ని
ప్పట్టుననిట్టియార్తిఁబడు వాఁడ నెతొల్లిటియట్లయుండనే. 130

క. ఆకసమున కెత్తి యఘో
లోకమునకుఁ ద్రోసె విషమలోచనుఁ డయ్యో
వ్యాకరణకర్తఁ జేసియుఁ
బైకొనురిపుఁ దెచ్చి శృంగభంగము గూర్చెన్. 131

ఉ. ఈయవమాన మేగతిసహింతుదహించుచునుండెనెంతయుఁ
గాయము; గాయమయ్యెనుమనంబు;జనంబులునవ్వ నెవ్విధిన్
జేయుదు జీవయాత్ర మును చెందనె మందుఁడనై పరాభవా
గ్నేయకలంబఘాత మది నేఁ డొకచందనచర్చ యయ్యెడున్.

గీ. శివ మహాదేవ శంకర శ్రితజనావ
నవ్రతధురీణ తావకీనపదభక్తు
న న్నుపేక్షింపఁదగునె నీకన్న నాకు
దిక్కెవరు పాహి మాం దేవదేవ శర్వ. 133

క. అని యిటు దైన్యము దోఁపఁగ
మనమునఁ బాణిని కృపాసనాథు నుమానా
థునిఁ బ్రార్థన గావించుచుఁ
గనుదోయి మొగిడ్చి యుండఁగా నబ్రముగన్. 134

సీ. కల్పావసాననిర్గత పుష్కలావర్త
కస్తనయిత్నూగ్ర గర్జ యనఁగఁ
ప్రబలఝంఝానిలాస్ఫాలనవిదళిత
బ్రహ్మాండకర్పరధ్వని యనంగ
సకల సంహరణ దీక్షాదక్షవిలయకా
లోదితాంతక సింహనాద మనఁగ
బంధవిస్రంసనపతదూర్ధ్వభువనాభి
హతనాకలోకనిర్హ్రాద మనఁగ
ధుర్య హరిదంతదంతి బాధిర్యఘటక
మఖిల జంతుచైతన్యాపహరణ కరణ
భారికం బాచు భవుని హుంకార మొకటి
బూరటిలె నంబరమునఁ గఠోరలీల. 135

గీ. కోటిపిడుగులరసితంబు మీటఁజాలు
కఠినతరకాలకంఠహుంకారరవము
చెవులఁ బడ జంతుజాలము లవనిఁ జాఁప
కట్టుగాఁ ద్రెల్లె నంగవైకల్య మొంది. 136

క. అచ్చటఁ బాణిన్యాదులు
నచ్చటులధ్వనికి వివశు లయ్యుఁ గ్రమముగాఁ
జచ్చి బ్రదికినటు లూర్పులు
పుచ్చుచు లేచిరి శరీరములు వడఁకాడన్. 137

క. శాంభవగళ హుంకారము
జంభాలంభనుని శబ్దశాస్త్రం బెల్లన్ !
గుంభజుఁ డంభోధులవలె
గుంభిని లే కుండ నొక్కగ్రుక్కఁగఁ గ్రోలెన్. 138

సీ. రామశబ్దంబు ప్రారంభింపఁగా నయ్యె
వర్షనంతటి లబ్ధవర్ణ పతికి
హరిశబ్ద మన నకారాంతమో మఱి యి
కారాంతమో సందేహమయ్యె వ్యాడి
కొక్క ధాతువు వినియున్నలై లేదాయెఁ
దఱచి చెప్పిన నింద్రదత్తునకును
వ్యాకృతి యని శాస్త్ర మని యొండు గలదను
తలఁపె నశించెఁ గాత్యాయనునకు
గీ. తక్కగలవారిమాటేల వక్కణింపఁ
బాణినిపరాభవాగ్ని నార్పంగ శివుఁ డొ
నర్చుహుంకారమున వసుంధరను నైంద్ర
మైనవ్యాకృతి యొక్కమా ఱంతరింప. 139

శా. సంకల్పోద్భవఘస్మరుండు హరుఁడీవత్పోర్కుఁడైనన్ జగం
బంకూరంబులతో నశించుఁగద పూర్ణామస్ఖఁడయ్యుఁదయన్
హుంకారంబున నింద్రుఁ వ్యాకరణమే యుత్పన్నముం జేసి ప
త్యంకుర్వాణులుగాననిల్వ నుధరిత్రిన్ వారిఁ గుట్టూర్పుతోన్.

క. వరరుచి తొల్లిటిపాణిని
పరరూపం బయ్యె; నల్ల పాణినిప్రతిభన్
వరరుచి నతిక్రమించెన్
బరిణతి గను టగుదె యీశునుహిమ సకలమున్. 140

క. తా నోటఁబుచ్చుజడమతి
చే నోడుట తొంటిదైవీమహిగరిమము పె
న్గానఁ గలియుటయు నాదల
పై నాకాశంబు విఱిగి పడ్డట్లైనన్. 141

ఆ. అయ్యుపద్రవోపహతుఁ డౌచు వరరుచి
మానసార్తిఁ గ్లిశ్యమానుఁ డగుచు
నపుడ గురుల కెఱఁగి యైశ్వరం బగుశబ్ద
శాస్త్ర మెనయుబుద్ధిఁ జనియె నెందొ. 142

ఉ. అందఱకుఁ గురుండగుమహాత్ముఁడువర్షుఁడునాఁటిపాటునన్
డెందమునందుఁ గుంది వికటించినదైవముచెద్దు నెంచి న
క్తందివ మీశ్వరీసుతుపదంబుల ధ్యానమొనర్చుచుండ నా
కంముఁడె యొక్కరేయి కలఁ గానఁగ వచ్చివచించెనిట్టులన్.

ఉ. పండితవర్య ! చింతిలకు పాణిని నాఁగఁ బినాకపాణి యా
తండు రచించు వ్యాకృతి సదాశివదత్తము దాని మించి యె
వ్వండును గూర్పఁజాలఁడదిభద్రముగా వినుఁడొక్క మాట చే
కొందురు నీవు శిష్యులు నకుంఠితవైఖరిఁ దొంటిపాండితిన్.

క. అని వర మొసఁగి యపుడ తలఁ
గిన మేల్కని వర్షుఁ డాత్మకీలితమోదం
బున శిష్యుని గురునిగఁ జే
కొను భాగ్యము గూర్చె నాకు గుహుఁ డని పొంగెన్. 145

శా. ప్రాతఃకాలము పాణినిన్ బిలిచి స్వప్నం బెల్ల వాక్రుచ్చి సం
ప్రీతిన్ "వ్యాకరణంబు త్వత్కృతము విన్పింపంగదే" యన్న న
ప్పూతాత్ముం డతిభక్తి నొజ్జలకు సంపూర్ణంబుగా విన్చె వి
ఖ్యాతంబై తదుపజ్ఞమై వెలయు నష్టాధ్యాయి యా వ్యాకృతిన్.

క. క్రమముగ దేశికు నాదే
శమున సతీర్థ్యులకు నొక్కసారియ యుపదే
శ మొనర్చి వారి వ్యాకర
ణమహారాజ్యానుభవచణమతులఁ జేసెన్. 147

క. తరమే తెలియఁగఁబరమే
శ్వరుతంత్రము శుద్ధజడునిఁ బాణినిని జగ
ద్గురుఁ జేసి వ్యాకరణమున
కరయ నతం డిడినభిక్ష యనిపించెఁగదే. 148

చ. పరమవినీతిమంతుఁ డయి పాణిని వర్షమనీషికిన్ దదీ
యరమణికిన్ బ్రణామము లనంతముగా నొనరించి వారిసా
దరపరిపూరితానుమతి దామమటుల్ తలఁదాల్చి శిష్యులెం
దఱో తనుఁ గొల్చి రాఁ జనె ముదంబునశీతనగాంతికోర్వికిన్.

సీ. ఎచ్చోటఁ బ్రవహించు హృదయంగమాకృతి
గంగాతరంగిణి నింగిముట్టి
తృణకాష్ఠజలసమృద్ధిని మించి యేతావు
భూమిలోకస్వర్గముగఁ దనర్చు
నెందు నుందురు విజితేంద్రియుల్ కర్మందు
లధిగతవేదవేదాంగు లగుచు
నంతర్విపక్షకామాదిషట్కంబున
కెన్నంగ నేపాలం బెమరుచుక్క
యట్టిహిమభూమిధరసమీపాటవీస్థ
లమున ననుకూలముగ నుటజమును గట్టి
యందు వసియించి శిష్యుల కనవరతము
గఱపుచుండు నతండు వ్యాకరణవిద్య. 150

ఉ. కాయలు గూర లాకులును గ్రాసము వాసము పర్ణశాల యా
దాయము సత్తపోధనము దాంతియు శాంతియు బంధువర్గమా
మ్నాయనిపాఠమే వ్రతమనన్ విలసిల్లుబుుషుల్ గుహూత్తముల్
గా యతిసేవ్యమౌ గురుకులంబుల వెన్నియొ నాఁడు చూడఁగన్.

సీ. కౌపీనమే సూక్ష్మకౌశేయ మరసభి
క్షాన్నభోజనమె మృష్టాన్నభుక్తి
యుద్ధూళితవిభూతి యొసపరియంగరా
గము సమిదాహరణమె వినోద
మాచార్యశుశ్రూషయ యమూల్యదక్షిణల్
బ్రహ్మచర్యంబె నిర్భరతపంబు
విషయాభిలాష లే వికృతులు ధర్మర
క్షాతత్పరతయె నైజప్రవృత్తి

గాఁగ నెసలారువిద్యార్థిగణము గల్గి
పరమఋషు లొజ్జ లగునాఁటి గురుకులముల
మేటిసౌభాగ్యమే కదా నేఁటి కైన
భరతఖండోన్నతికి వజ్రపంజరంబు. 152

ఆ. అట్టిగురుకులంబులం దెల్ల మిన్నయై
నివ్వటిల్లెఁ బాణినీయ మాత్ర
మంబు వ్యాకృతిశ్రుతం బెన్న విద్యాము
ఖంబు గౌరవంబు గనుట యరుదె. 153

శా. ఆహారంబును నిద్ర లేక స్వకృతం బౌశబ్దశాస్త్రంబునన్
బాహాబాహిఁ గచాకచిన్ గెలుచుచందంబొంద నంతేవస
ద్వ్యూహంబున్ నిపుణంబొనర్చి సభలందున్ దేశదేశంబులం
దోహోహోయనమించెఁ బాణినిద్వితీయోద్యత్సుధాధాముఁడై.

మ. పరమేశుండె జగద్ధితార్థ మవనీభాగంబునం దీమునీ
శ్వరుఁడై పుట్టెడయే నవాఙ్మనసభాషారూపదృగ్గోచరీ
కరణాతిక్షమశబ్దశాస్త్రఘటనాకౌశల్యసంపన్నతన్
వరలం జాలునె యంచు నెంతురఖిలాంతర్వాణు లప్పాణినిన్.

క. ఈరీతి హరిన్నారీ
హారాయితకీర్తి యగుచు నప్పాణిని భ
ట్టారకుఁ డుండఁగ నొక్కపు
డారసి పో శిష్యుఁ డొక్కఁ డరుదెంచి తమిన్. 156

ఆ. మ్రొక్కి గురుని సేమము నెఱింగి తనసేమ
మతని కెఱుకపఱచి యచట నచటఁ
తా నెఱుంగు నయ్యుదంతముల్ సెప్పి చె
ప్పం గడంగె నిటుప్రసంగవశత. 157

క. మీయొజ్జలు వర్షోపా
ధ్యాయులకుం బ్రథమశిష్యుఁడఁట వటువఁట కా
త్యాయననామాంకితుఁడఁట
ధీయుత మీ రెఱుఁగరే సుధీమణి వానిన్. 158

క. ఆయన మీయెడ నొకపు డ
సూయ వయి పరాభవించి శూలికినుకమై
వైయాకరణఖసూచిగ
నామెనఁట వచింప రది యొకప్పుడు మీరల్. 159

మ. హరకోపజ్వలనేంధనీకృతమనీషాగణ్యనైపుణ్యుఁడై
శరణం బన్యము గాన కప్పుడ యవశ్యాయాద్రికిం బోయి సు
స్థిరభక్తిన్ శ్రితలోకరక్షణకళాచింతామణిన్ జంద్రశే
ఖరునిన్ హృద్గతుఁ జేసి చేసెనఁట యుగ్రంబాతపం బెంతయున్.

శా. తత్తాదృక్షతపోవిశేషమునఁ బ్రత్యక్షాకృతిన్ బార్వతీ
చిత్తేశుం డటఁ దోఁచి "కోరుము వరశ్రీపూర్ణుఁ గావింతు నా
నత్తేజస్వియు శబ్దశాస్త్రపటిమం బర్థింపుడున్ దద్వత్కృతో
దాత్తవ్యాకృతి నే యొసంగి యభవుం డంతర్హితుం డాటయున్.

గీ. తావకగ్రంథ మాద్యంత మావరరుచి
గని యనుక్తార్థపూరకంబు నయి మఱిదు
రుక్తపునరుక్తవిషయనిరోధకముగ
నమర వార్తికతతిఁ గూర్చె నంట వింటె. 162

క. అనుడు శమధనుఁడు పాణిని
యను నన్నా! యీశ్వరాజ్ఞ యట్టిద యేమో
మనగ్రంథ మ్మామాత్రన
పొనుఁగుపడున బుధులు సత్యమును దెలియరొకో. 163

గీ. గొడ్డువోయెన క్షితి మంచిచెడ్డ లరసి
వేయిమొగముల సత్యంబు వెల్లడించు
కుండలీంద్రుం డొకండు లేకుండునొక్కొ
యిపుడు గాకున్న మఱియొకయపుడు నేని. 164

క. నావుడు శిష్యుఁడు పలుకును
దేవర వచియించినట్టిదే సత్యము; గా
నీ వరముగ నొసఁగుమహా
దేవుని యాదేశమునకు ధిక్కృతి దగునే. 165

మ. స్తుతినిందాసమదృష్టిఁద్వాదృశమునీంద్రుల్వర్తిలన్ ధర్మస
మ్మతమే కాని మహేశదత్తవరమున్ మత్తిల్లి దూషించుట
ర్మతిసైఁపన్ దగునయ్య? యయ్యమటుమీరల్ మాన్పకున్నన్ జగ
న్నుత! మీ వ్యాకరణంబు మీతపము నెందున్ వంధ్యమైడిందవే.

క. సుగుణులయెడఁ గానీ క్షమ
విగుణులయెడఁ దగునె శక్తివిరహితుఁ డనుచున్
నగరి గుణదోషములఁ జ
క్కఁగఁ దెలియఁగ నెంతవాఁడు గావలెఁ దేవా! 167

ఉ. పండితు లెందఱో సహనభావవిదూరులు పామరౌఘమ
ప్పండితశౌండికీర్తులకు బద్ధులు కావున శాంతిహీని రా
కుండఁబరాక్రమంబునయమూఁదివెలార్పుముమిన్నకున్న రా
నుండిన యయ్యకీర్తిమలినోద్గతికిన్ బ్రతికార ముండునే. 168

క. మనమే మన కేమిటి కను
కొనుచు నుపేక్షింపఁ బరులకున్ వలయునె యి
ప్పని లేనివిచారము గా
వున వరరుచి కీవు చెప్పఁబోలును బుద్ధుల్. 169

చ. అనునుడులాలకించియనహంకృతియయ్యుమమత్వశూన్యుఁడ
య్యునుమునివరాళిభుగ్నహృదయుండయుత్క్షణమే ప్రయాణమ
య్యెను బ్రతిపక్షుఁడున్నయెడ కెక్కటిఁ ద్రంపులమారిమాటలన్
వినవిన శంభువంతటివివేకికినేనియు వెఱ్ఱిపుట్టదే. 170

చ. అదరెను సవ్యలోచనభుజాంసము లంచెలు గట్టి ఫేరువుల్
రొద యొనరించెఁ గాకము విరుద్ధగతిన్ బలితెంచెనోతు వాం
డెదురయి పాఱెఁ దుమ్మెనొకఁడీగతిఁ బెక్కులు దుర్నిమిత్తముల్
గదిరెను బర్ణశాల వెడలంగను బాణినికిన్ గ్రమంబుగన్.

క. దుశ్శకునములు గణింపక
నిశ్శంకముగా వడిన్ జనెన్ బాణిని యం
తశ్శోషణపరిభవబ
హిశ్శుష్మశిఖాచ్ఛటాపరీతతనుండై. 172

మ. అడుగొక్కొక్కటిమానిముందటికిడన్ స్వాంతంబునన్ మున్నుపొ
ల్చెడుస్వాభావికశైత్యమంతయుఁ గ్రమక్షీణత్వముం గాంచనం
దుడుకించించుకవృద్ధిచెందితనువందొక్కుమ్మడిన్ గ్రమ్మియున్
నుడిముట్టన్ దలఁచున్ ద్రివిక్రముని చెన్నుంగన్న చందంబునన్

క. అఱిగియరిగి వరరుచిముని
వరునాశ్రమ మెట్లో యెఱిఁగి త్వర హెచ్చఁగఁ జ
ద్వారసీమఁ జేరి నిలిచెను
సురమార్గమునుండి రాలుచుక్క యనంగన్. 174

మ కనియక్కై వడివచ్చినిల్చుఋషినక్కాత్యాయనుండున్ మహా
వినయస్ఫూర్తిఁ గుశాసనంబిడియటన్ నిచ్చేయుమంచున్ రయం
బునఁ బాద్యంబును నర్ఘ్యమున్ గొనుచు రాఁ బూర్ణాహుతిప్రజ్వల
ద్ఘనకీలజ్వలనోగ్రరూపుఁడయి తద్దాక్షీసుతుం డంతటన్.

క. ముట్టక కుశాసనమ్మును
బట్టక యర్ఘ్యంబు గొనక పాద్యము నటనే
యట్టె నిలిచి యుండి యతం
డిట్టుల యనెఁ గనుల నిప్పు లిలపై రాలన్. 176

శా ఓరీ మత్తిలి మత్కృతం బని సుధాంశూత్తంసదత్తంబు వి
శ్వారాధ్యం బగుశబ్దశాస్త్రమునకీ వాక్షేపముల్ వన్ని వా
క్యారత్వంబు వెలార్తే యఖిలవాక్యాలంకషామేయవై
శారద్యంబున మించుమత్కృతిని నెంచన్ నీవు దక్షుండవే.

శా. దక్షత్వంబు గలాఁడవే నొరులగ్రంథం బేల భాషాప్రపం
చక్షోదక్షమ ఫక్కి వ్యాకరణశాస్త్రం బొందు కూర్పంగ రా
దో క్షేమం బది కాదొ వ్యర్థము శివద్రోహంబుగావించి వై
చక్షణ్యం బెది కాంచినాఁడవుర నాశాపంబు గా కస్యమున్.

మ. అడుగన్ రాదొకొ మైత్రిమద్గ్రథితసిద్ధాంతాంతరార్థంబు లా
క్కఁడు గేఁ తెంచియొనన్నుఁ రాఁ బిలిచి యోయా పాటియుజ్ఞేయ కి
ట్లడిగా త్రైతివె ప్రాజ్ఞసేవ్యమయి వేదాంగోత్తమాంగంబునై
మృడదత్తం బగుశబ్దశాస్త్రమునరున్ మీఁ దెంచ కిట్లుద్ధతిన్.

క. పరమేశ్వరార్పణముగా
విరచించినమత్కృతికి వివిధనిందల నే
ర్పఱచిననీశిర మీరా
తిరి శతధా భిన్న మయి క్షితిన్ బడుఁగాతన్. 180

క. అని యిటు ప్రాణాత్యయముగఁ
గనలునఁ బాణిని శపింపఁ గాత్యాయనుఁడున్
వినయంబు నడఁచి హస్తం
బునఁ గలయర్ఘ్యాదికంబు భువి విడిచి వెసన్. 181

క. కటము లదరంగ నిటలము
చటులభ్రుకుటికము గాఁగ జడ విడఁబాఱన్
బటపటఁ బండ్లు గొఱుకు చు
త్కటరుట్చలితోష్ఠుఁ డయి యుదగ్రతఁ బలికెన్. 182

సీ. బ్రహ్మచర్యవ్రతోపార్జితవిజ్ఞాన
పటిమ యెక్కడఁ జట్టుబండ లయ్యె
నాచార్యసేవాపరాయణతాయాత
శమ మెల్ల నెచ్చోటఁ జచ్చిపోయె
వేదవేదాంగాదివిద్యల నబ్బిన
పాండిత్య మేకాట మండిపోయె
వెలయ సత్యాసత్యముల నెఱింగెడుదూర
దృష్టి సమస్త మేయేట గలసె

వచ్చితివో రావో నే నీయ వచ్చినట్టి
యర్ఘ్యపాద్యముల్ నాహస్తమందె యుండఁ
బిడుగుపాటుగ నన్ను శపింతు వోరి
పండితంమన్య! సర్వతాపసజఘన్య! 183

క. వ్యాకృతి రచింప వరముఁ
నీ కిచ్చినశివుఁడె త్వత్ప్రణీతగ్రంథా
లోకితలోపనిరాసక
మాకృతి విరచింప నాకు నానతియిచ్చెన్. 184

ఉ. అంధకవైరి యాజ్ఞ తలయందు ధరించియ యేను వార్తిక
గ్రంథ మొనర్పఁబూనఁగనుగానక నన్ను వృథాశపించి మో
హాంధతఁ దుచ్ఛశీలము బయల్పడ నింకను మండెదోరి దు
ర్గంధ! వసుంధరన్ బ్రదుకఁజాలెదెనాశిరమట్లు వ్రెల్కుచో

మ. శివవిద్రోహి నటంచు నాశిరము విచ్ఛిన్నంబుగాఁ దిట్టునో
శివవిద్రోహి! శివాజ్ఞ నీకృతి విమర్శింపం దొరంకొన్న నా
కవుశాపం బది నీకుమాత్ర మెటు పాయంగల్గు నీరాత్రియే
యవనింగూలుఁద్వదుత్తమాంగముసహస్రాంశంబులై బిట్టుగన్.

క. అని యిటు క్రోధనులై య
మ్మునివృషభులు శాపశృంగముల నన్యోన్యం
బును గ్రుమ్ములాడుకొని ర
వ్వన మంతయు సద్దుమాని వడవడ వడఁకన్. 187

సీ. సాంగచతుర్వేదయాదసాంపతితతిఁ
జుళికించినట్టివిశుద్ధమతులు
ప్రబలతపోగ్నిహోత్రమున మాధ్యమ్ముపూ
ర్ణాహుతి సేసినయట్టియజ్వ
లష్టమూర్తిదయామృతాస్వాదనంబున
మి న్నందుకొన్నట్టిమేటిబుధులు
శమదమార్జవదయాసత్యశౌచాములఁ
గాణాచిగా నేలఁ గనినధీరు
లంబుజాసనవంశాంకురంబు లట్టి
పూతచరితులు మాత్సర్యమునఁ బరస్ప
రంబు శపియించుకొనిరి లయంబు నొందఁ
గ్రోధమునకంటెఁ గలఁడె శత్రుండు దలఁప. 188

సీ. జమదగ్నిసుతుగర్వసర్వస్వము హరింప
నెది రాము నెదుటికి నీడ్చి తెచ్చె
నంబరీషునిపదాబ్జంబుల కెఱఁగించె
నెద్ది దుర్వాసు నెల్లెడలఁ ద్రిప్పి
దక్షునంతటిజగత్స్రష్టకు మేషశీ
ర్షంబును ఘటియింపఁ జాలె నెద్ది
బహువారములు తపోభంగంబు గావించి
గాధేయు నెద్ది యిక్కట్లఁ బెట్టె

బుద్ధిఁ బఱిమార్చి చైతన్యమును హరించు
నట్టియాక్రోధభూత మావంత సోఁక
మునులకే కాదు కడకుఁ ద్రిమూర్తులకును
జావుబ్రదుకులు సంశయాస్పదము గావె. 189

మ. మమతాదూరు లహంక్రియారహితు లాత్మజ్ఞానపాథోధు ల
య్యమిసింహుల్ ప్రతిఘాభిభూతు లయి యన్యోన్యంబుబ్రమం
దించుయ
త్నమునన్ జిక్కుట కెన్న హేతువు జగత్కళ్యాణసిద్ధ్యర్థమై
తమనిర్మించుకృతుల్ వితాయగుటకు తత్పాత్ము లౌటయగున్.

ఉ. శాప మొసంగి యట్లు ప్రతిశాపముపాలయిదాక్షిపుత్రుఁడా
లాపము లేక దేహ మఖిలంబు మనంబు వడంకుచుండ సం
తాపమునన్ మునింగి తనుఁదావ ధృతింగొని చేరెనాశ్రమం
బూపిరి బిగ్గఁగట్టి పటుయోగబలంబునఁ దక్షణంబునన్. 191

క. చేరి నిజచ్ఛాత్రసమితిఁ
జేరఁ బిలిచి యాత్మకథ యశేషము వినిచెన్
సారెకుఁ బశ్చాత్తాపము
కాఱుకొనన్; వారు నెడఁదఁ గళవళ మొందన్. 192

క. అచ్చుటఁ గాత్యాయనుఁడున్
హెచ్చిన చింతాభరమున హృదయం బగలన్
వెచ్చనినిట్టూర్పులతో
నచ్చోఁ జదికిలఁ బడెన్ గుశాసనమందున్. 193

ఉ. అంతట వేదమూర్తి యగునంబుజమిత్రుఁడు భావిఘోరవృ
త్తాంతము గాంచఁజాలనివిధంబునఁ బశ్చిమవార్ధిఁ గ్రుంకె శా
కుంతకులంబు సద్దుడిగి గూండ్ల నడంగె వినీలవారిము
క్సంతతి నాఁగ నంధతమసంబు జగమ్మునఁ గ్రమ్మె ఘోరమై.

గీ. భవునియవతారమూర్తు లౌపండితద్వ
యంబు నేఁ డస్తమించు నంచాలకించి
చకితుఁ డగుకాలపురుషుమైఁ జాలుకొనిన
చెమటబొట్లనఁ జుక్క లభ్రమునఁ దోఁచె. 195

సీ. తతమహీరసవిలిప్తం బైన తేవ రో
దోంతరం బలమెను సంతమసము
దావపావకశిఖా దందహ్యమానవృ
క్షచ్ఛటారవము నల్గడ నెసంగ
శ్రుతికటు ఝిల్లీ వితతరావములఁగూడి
ఘూకఘూత్కారముల్ గొనలునిగిడ
వ్యాఘ్రతరక్షు హర్యక్షాదులు బుభుక్ష
గర్జింపఁ దొడఁగె దిక్కాండ మద్రువఁ
బ్రాణ భయవిద్రుతాజసారంగముఖమృ
గవ్రజపదాభిహతి లుఠద్గండశైల
ఘణఘణ ధ్వని భీకరగ్రావము లయి
కాననము లెల్లఁ బొలిచె నక్కాళరాత్రి. 196

క. అటఁ గాత్యాయనఋషి యి
చ్చటఁ బాణినిముని శరీరసంబంధము వా
యుటకుఁ బటుయోగముద్రా
ఘటితానందమునఁ దేలగని రనురక్తిన్. 197

ఉ. ఎందులకై ధరిత్రి జనియించితిమో యది పూర్ణమయ్యె నిం
కిందు వసింప నేమిపని యెన్నిదినంబులు మన్న జావులే
కుందుమె శాపకైతవసముజ్ఝిత మర్త్యశరీరులై సుఖం
బందెద మంచు నిశ్చయము నందిరి యారయ నంతయేకదా.

ఉ. ఆసనబంధధీరు లయి యాదృతయోగరహస్యులై నయా
భూసురవంశభూషణులు పూరకరేచక కుంభకాదులన్
శ్వాసము నాఁగి యల్లన సనాతనతేజముఁ జేరి యేకతన్
భాసిలి రేకతానమతిమత్త నివృత్త బహిర్వివేకులై. 199

గీ. అనిలఘాతంబుచే సహస్రారచక్ర
సహితముగ బ్రహ్మరంధ్రముల్ శాపములకు
ననుగుణంబుగ భిన్నంబు లయి యిరువుర
కాయముల నుండి జ్యోతిర్యుగంబు వెడలె. 200

క. అటువెడలిన తత్తేజః
పటలద్వయి భిన్నదేశభవ మయ్యును నొ
క్కటఁ గూడి యొకవిమానం
బట కరుదే నెక్కె దివ్య మగునాకృతితో. 201

సీ. తప్తహాటకరుక్సధర్మ జటాజూటు
లవతంసితకిశోర కువలయాప్త
లురగాధినాథ కేయూరులు వైయాఘ్ర
చర్మోత్తరీయు లాజానుబాహు
లమల రుద్రాక్ష మాలాలంకృతోరస్కు
లతిశాతశూలాయుధాగ్రహస్తు
లభ్రంలిహోన్నతోక్షాధీశ కేతను
లంచితైశ్వర్యాష్టకాభిరాము
లగుచు నాదివ్యతనులు పశ్యల్లలాట
మూర్తి కామ్రేడితంబులై ముక్తికామి
నీస్వయంవరపతు లన నెగడి రెలమి
నద్భుతం బంది ఖచరు లొయ్యనఁ గనంగ. 202

క. దివ్యాంబరానులేపన
భవ్యాకృతు లగుచు మిత్రభావ మెనసి వా
రావ్యోమయానమునఁ జని
రవ్యాహతగతుల రాజతాచలమునకున్. 203

సీ. స్వస్తివాచనికులై సనకాదిమునిచంద్రు
లింత నంతన కాంచి యెదురు రాఁగఁ
బ్రమథగణం బిరువంక వేష్టించి ఛ
త్రము పట్టి వింజామరములు వీవ

సారూప్యముక్తులు జయజయధ్వనులతో
వందిమాగధవృత్తి ముందు నడువ
దోలిహజారమున స్కంధుఁడు గజాస్యుఁడు నిల్చి
రారం డటంచు గౌరవము సూపఁ

గుసుమవిసరంబు దేవతల్ గురియుచుండ
నప్సరస లాడ గంధర్వు లలరి పాడ
నలమిఁ గైలాసనగరి నూరేఁగి యేఁగి
జనిరి వారిద్ద రీశుప్రాసాదమునకు. 204

ఉ. అచ్చట నిండుకొల్వయి యుమాధిపుఁడుండఁగ వారలిద్దఱుఁ
జెచ్చెరఁ దత్పదంబుల స్వశీర్ష వతంసితపారిజాతపు
ష్పోచ్చయ మాకరంద ఝరయుక్తిని క్షాళన మాచరించి పై
యచ్చర దుందుభిస్వనము లాఁపినుతించిరకృత్రిమోక్తులన్.

సీ. వీ రెవ్వరో యంచు విష్ణుదేవుండు ప
ద్మాసను నడిగె రహస్యముగను
మనకంటె వీరి మన్ననసేసె భవుఁ డని
తుంబురుతో నారదుండు పల్కె
నేతపం బొనరించి యిటకు వచ్చిరో వీర
లని యింద్రు నర్థేశుఁ డడిగెఁ దమిని
మంతనంబున సర్వమంగళ వారియు
దంతంబు తెల్పు మం చడిగెఁ బ్రియుని

భవునిగ్రైవేయకం బయి పరిఢవిల్లు
నహికులేశుండు భోగసహస్ర మొక్క
మాఱు విచ్చి సదాశివు వీరిచరిత
మించు కెఱింగింపు మనుచుఁ బ్రార్థించె నర్థి. 206

శా. అంతన్ శంకరుఁ డాననంబు దరహాసాలంకృతిన్ గాంచఁగా
దంతాచ్ఛద్యుతు లుల్లభం బయి తదాస్థానోపరిన్ గ్రమ్మ శ్రీ
కాంతాదిన్ ద్రిదశావళిన్ సదయవీక్షామాలఁ గైసేయు చ
య్యంతర్వాణులవృత్తమున్ దెలిపె నిట్లత్యంతసూక్ష్మాకృతిన్.

క. ఈతఁడు పాణిని యనుముని
యాతఁడు కాత్యాయనర్షి వ్యాకరణంబున్
భూతలమున నెలకొలిపి
యేతెంతురు చారితార్థ్య మొనసినకతనన్. 208

గీ. పుష్పదంతసమాహ్వయమునఁ దనర్చు
నస్మదీయకింకరుఁడు వాఁ డంబశాప
మంది పుడమి జనించెఁ గాత్యాయనవర
రుచి సమాఖ్యాద్వయిని మర్త్యరూప మూని. 209

ఉ. ఆతని శాపముక్తి కుపాయముగాఁ దలపోసి దేవసం
ఘాతము వేదరక్షకముగా మును కోరినశబ్దవిద్య సం
భూతికి హేతు వౌ నని యుఁ బొమ్మని వానికిఁ దోడ్పడంగ దా
క్షీతనయాకృతిన్ బొడమఁ జెప్పి మదంశము వీనిఁ బుచ్చితిన్.

చ. ఇతఁడు రచించు వ్యాకరణ మెల్లఁ బఠించినఁ బుష్పదంతుఁ డ
ద్వైత దొఱఁగుఁగదా యని వివేచనసేసియు పంచినాఁడఁ ద
ద్గతి రచియించె సూత్రము లితం; డీక వానికిచేసె వార్త్తికం
బితఁడు జగద్ధితంబు ఫలియించె నటంచుఁ దలంచునంతటన్.

క. తినతన చేసిన గ్రంథము
లను జనులకుఁ గఱపి యవి యిలాస్థలి వ్యాపిం
ప నొనర్చు వ్యసనమునఁ బడి
మునులై యాయుష్య మెనయుపూనిక నుండన్. 212

ఉ. మమ్ముఁ గనంగ వత్తు రనుమాటయె పుట్టమి వీరియంతరం
గమ్ములఁ గ్రోధ మేన కలుగన్ బురికొల్పఁ బరస్పరంబు శా
పమ్ము లొసంగికొంచునసువర్గము యోగమునన్ ద్యజించిమ
త్సమ్ముఖవర్తు లాటకు ముదంబున వత్తురు నేఁడు ముక్తులై.

క. వీరు త్రయోదశితిథి నవ
తారము చాలించుకతనఁ దద్వ్యాకృతి నె
వ్వారున్ బ్రతిద్రయోదశి
నారూఢి నొనర్పకుందు రధ్యయనంబున్. 214

క. ఎందాఁకఁ దారకాసూ
ర్యేందులు వెలుఁగుదురొ శబ్ద మెందాఁక జగం
బందలరునో నిత్యంబై
యందాఁక వెలుంగు వీరివ్యాకరణ మిలన్. 215

చ. అనుమ సదాశివుండు పరమాదృతి వాని యనంతమంతయుఁ
విని తదీయవైదుషి సవిస్తరతఁ వివరించి గౌరవం
బున నిజసన్నిధిఁ సతతముఁ వసియింపుఁ డటంచుఁ బల్కఁ న
య్యనిమిషులొక్కపల్కుగ "దథాస్తుతథా" స్తనిపల్కిరయ్యెడఁ.

సీ. వేదాంగమకుటమై వెలయు నాచంద్రతా
రక మంచు దీవించె బ్రహ్మదేవుఁ
డబ్జనాభుం డుబ్బి యనియె నింక నపాణి
నీయ మాశబ్దము హేయ మనుచుఁ
బ్రత్యక్షరము పరబ్రహ్మరూపం బగుఁ
గాక యంచనెఁ గృత్తికాసుతుండు
తనశబ్దశాస్త్ర మంతర్థి నొందుట కింద్రుఁ
డీసెయుంగక నుతియింపఁ దొడఁగె
నఖిలసభయు యథోచిత మైనఫణితిఁ
బలికి రాదివ్యమూర్తు లాపాణినివర
రుచియుగంబు రచించినప్రచుర శబ్ద
శాస్త్రము దలంచి మంగళాశాసనములు. 217

ఉ. ఆతపసుల్ మహేశ్వరపదాశ్రితులై వెలుఁగఁ సవార్తిక
వ్రాతముఁ బాణినీయమును బాణినిశిష్యుఁడు వ్యాఘ్రభూతిప్ర
స్ఫీత మొనర్చె నవ్వరరుచిప్రతి కాపెమశిష్యుఁ డైన శ్లో
భూతివిధంబునఁ సతతమున్ బహుశిష్యులఁగూర్చి నేర్పుచుఁ.

గీ. అపునరావృత్తిశాశ్వతత్రిపురమథన
లోకసంవాసులై వారలోకమహిమ
నాత్మకృతశబ్దశాస్త్రము వ్యాప్తి గనుట
కమితమోదాబ్ధి నేఁడు నోలాడుచుంద్రు. 219

ఆశ్వాసాంతము.

మ. శరదంభోదరతారహారదివిషత్స్వంబేరమోచ్చైశ్శ్రవ
స్స్వరుపీయూషరసారవిందహిమరుక్స్వర్వాహినీశారదా
మరగోచందనచంద్రపాండురగరున్మల్లీసుమక్షీరసా
గరకైలాసవిలాసభాసురయశఃక్రాంతాఖిలాశాంతరా! 220

క. ప్రోద్ధతవిబుధంమన్యస
మిద్ధహిమానీనిదాఘమిహిరా! భక్తి
శ్రద్ధాయుతశిష్యోద్ధృతి
బద్ధాదర! శాంకరీకృపాలబ్ధవరా! 221

పంచచామరము.

ఇలాప్రపూర్ణశిష్యమండలీడితాప్రమేయకౌ
శలాప్రపూర్ణ! "శబ్దశాస్త్రచక్రవర్తి" సద్యశః
కులాప్రపూర్ణభూరిభూమిగోళ! సార్థకీభవ
"త్కలాప్రపూర్ణ!" లాంఛనప్రకాండమండితాహ్వయా. 222

ఇది శ్రీగురుకరుణాసమాసాదితకవిత్వ వెంపరాల
సూర్యనారాయణ నామధేయప్రణీతం
బయిన మునిత్రయ చరిత్రంబున
ద్వితీయాశ్వాసము.

శ్రీగురుమూర్తయేనమః

# మునిత్రయ చరిత్రము.

## తృతీయాశ్వాసము.

శ్రీవాణీతాండవలీ
లావసథాయితరసజ్ఞ ! యచలాధిపపు
త్రీవిహరణసౌధాయిత
భావా ! శ్రీసుబ్బరాడ్విపశ్చిద్దేవా ! 1

గీ. అవధరింపు సవార్త్తిక మైనశబ్ద
శాస్త్రసూత్రము లట్టు లాశమియుగంబు
చేసి శివుసన్నిధానము చేరి యుండ
భువిని దచ్ఛాస్త్ర మెటు వృద్ధి పొందె ననిన. 2

సీ. శ్రీచంద్రమస్సుధాచింతామణీసుర
క్ష్మాజాతసంతతిఁ గన్నతండ్రి
ప్రాజ్యవిశ్వంభరావలయాభితస్సంవృ
తాతిపాండురదుకూలాంబరంబు
బహిరుద్గతాహిరాడ్భ్రమకృద్వరుణపురీ
ధేనుపయోధునీదీప్రముఖము
మధువిరోధినిషేవ్యమాణానుప మమాధు
రీధురీణపయఃపరీతమూర్తి

కందరాంతశ్చరద్భూతబృందరాజి
తాద్రిధీకారిశంఖోదరాచ్ఛవారి
పూరితప్రావృషేణ్యాబ్దధారితోర్ధ్వ
భాగరుచిరం బలరు దుగ్ధసాగరంబు. 3

క. గిరగిరఁ దిరిగెడుతరిమల
యురవడి నప్పాలవెల్లియుదకణముల యు
ప్పర మెగసి వేల్పుగరితల
యటితిసుపాణులో యనంగ నయ్యెను రిక్కల్. 4

క. ఉదితైరావణపుష్కర
మదధార నొకంట నీలిమం బెనయుచు న
య్యుదధి గనుపట్టుఁ దీరా
స్పదుఁ డయి విషమానుభవునిభాతి సురలకున్. 5

గీ. ఉదయదిందుసందర్శన మొందఁగాంచి
నింగి ముట్టినపాలమున్నీట నాఁడు
మందరాచలశృంగాగ్రమందిరుఁ డగు
శివుఁడు క్షణ మొందె క్షీరాభిషేకమహము. 6

చ. పొడమెడులక్ష్మిహస్తమునఁ బూనినతమ్మిఁ దొరంగుపుప్పొడుల్
గడలుకొనంగ నొక్కక్షణకాలము తజ్జలరాశియూర్మి యే
ర్పడె నగకన్యకాకుచనిరంతరకుంకుమపంకలిప్త మా
మృడునిడుబాహుదండమును మేలములాడఁ దలంచియున్నటుల్.

క. ఆపాలవెల్లియందు
దీపించు ఫణాసహస్రదీప్తమణిఘృణీ
వ్యాపారశబలితద్యా
వాపృథివీకుం డనంతఫణివిభుఁ డెపుడున్. 8

సీ. మందరాచలమథ్యమానఘటాంబోధిఁ
బొడమినపెనువెన్నముద్ద యనఁగ
సతతపరస్పరాహతదుగ్ధకల్లోల
నివహమ్ము గట్టుతెట్టువ యనంగఁ
బరిపక్వమౌక్తికోత్కరముతోఁ దెప్పనఁ
దేలి యాడెడుశుక్తిజాల మనఁగ
నాయకు నెదలో నణంగి మణంగి యు
న్నట్టిగంగాప్రవాహం బనంగఁ
జుట్టగా భోగ మెల్లను జుట్టుకొని ప్ర
ఫుల్లఫణమణిదీప్తిప్రపూరితాశుఁ
డై వెలుంగు సహస్రాస్యుఁ డగుననంతుఁ
డాకలశవారిరాశిమధ్యంబునందు. 9

ఉ. అద్రిసముద్రకాననవృతావనిగోళము మౌళిఁ దాల్చి య
క్షుద్రజగచ్చతుర్దశకగోత్రపిచండు నుపేంద్రు రేఁబవల్
భద్రముగా వహించి యవలంబనశూన్య మగాధ మైనసా
ముద్రజలోపరిన్ నిలిచి పొల్చుఫణీంద్రుమహత్త్వ మెట్టిదో

శా. ఆశేషాహివిశాలభోగశయనంబం దాగమాన్తాటన
క్లేశం బాఱ నిమీలితాక్షుఁ డయి నాళీకేక్షణుం డాత్తసం
వేశుం డై సుకుమారవారిధిసుతోర్వీదత్తసంవాహన
శ్రీశామ్యచ్ఛ్రమపాదపద్ముఁ డగుటన్ జితౌసౌఖ్యైకవశ్యుఁడై.

శా. కల్లోలోద్గతవాయుతూలవిలసద్గర్భంబు సంఫుల్లభో
గోల్లోచంబు పటచ్ఛదీకృతనిసర్గోల్లాసనిర్మోక ము
ద్యల్లోలద్యుతిరత్నదీపకళికాంతం బైన చక్షుశ్శ్రవో
మల్లానర్పవిశాలమంచముపయిన్ బన్నుండు వెన్నుండు దాన్.

క. ఆరీతి నొక్కనాఁడు ర
మారమణుఁడు భోగిరాజమంచమునఁ బయో
వారిధివీచిక లూఁప సు
ఖారూఢిన్ యోగనిద్రయం దున్నతఱిన్. 13

ఉ. శ్వాసము హెచ్చ ఘర్మజలసంభృతమై మయి వాఁడుదేఱ ను
ల్లాసము వాయఁ గన్నుల జలంజల నెత్తురుఁబొట్లు రాల సం
త్రాసము పుట్టి గుండె లదరంగ నకారణ మిట్లు గల్గె నా
యాసము భోగిశేఖరున కప్పు డనుక్షణవర్ధమానమై. 14

క. అమితౌజఃపదము భుజం
గమవిభుఁ డిటు వాఁడి కలువకాడ యగుట కు
ల్లమునం దరుదంది విహం
గమవిభుఁ డిటు లడిగె మెల్లగాఁ జెవిపొంతన్. 15

చ. ఫణికులసార్వభౌమ! పసిపాయముగోలె నొకప్డు నంటుజే
తుఁ ణుపరిచర్యలం బడలికన్ గనకుండెడునీవు నేఁ డకా
రణముగ మేనుడయ్యెరుధిరంబిటుగ్రిక్కఁగఁ బ్రాణవాయుధా
రణపటిమంబు సైతము తొలంగు తెలంగు గనంగ నేలయా.

సీ. బ్రహ్మాండభాండపరంపరఁ బూలమా
లికవోలెఁ దలను దాల్చెడుబలంబు
పరమేశుమేరుచాపము బెండు నా వంప
నారియై వెలసిననాఁటిశక్తి
ఘటవార్ధి మథియింపఁ గవ్వంపుమలతరి
త్రాడైననాఁటిసారంబుకలిమి
శాత్రవదుర్నిరీక్ష్యప్రతాపమున ర
సాతలం బేలఁగాఁ జాలుచేవ

కటకటా! యెందుఁ బోయె నేఁ డిటు లపూర్వ
ముగ నెటు ఘటిల్లె నాయాసమును భయంబు
కారణము తెలుపు మెట్లొ వైక్లబ్య మొదలి
దందశూకాధిరాజ! నిర్ద్వంద్వతేజ. 17

ఉ. ఆలమునన్ మదంబున సురాధిపుఁ బైఁ బడి కొట్టి కట్టి కా
రాలయమందుఁ బెట్టినమహాఃఖుని రావణి లక్ష్మణుండవై
కూలిచి రామచంద్రునుపగూహనసత్కృతి స్వర్గమర్త్యపా
తాళజనస్తుతుల్ గనునుదారచరిత్రుఁడ వీవ కాదొకో 81.

సీ. మ్లానమయ్యెను మేను మదకలవారణేం
ద్రకరాహతమృణాళనాళలీల
భ్రాంతమ్ము లయ్యె నేత్రసహస్రయుగళంబు
వ్యత్యస్తతారకాపటల మగుచు
వెడలు సహస్రాస్యవీథుల ఫూత్క్రియా
నిలము విషాగ్నిపాణింధమముగ
వ్రేలఁ బడ్డవి రెండువేలజిహ్వలు నరు
ణారుణపల్లవాంకూరఫణితి
తావకమహోగ్రరూపసందర్శనమునఁ
ద్రస్తులై సనకాదు లపాస్తులైరి
యమరదానవభుజగవిహంగు లబ్బ
ముగ నరయుచుండి రిది యేమి పుట్టెనొక్కొ. 19

క. ధైర్యాబ్ధి వమితబలధీ
ధుర్యుఁడ వౌదార్యఖని వధోక్షజసేవా
చార్యుఁడ వప్రతిమక్రమ
చర్యుఁడ వీ వేల యిట్లు శ్రమపడి పోవన్. 20

క. అని గరుడుఁ డడుగ నెట్టులొ
మనమున ధృతి నూని నోట మాట వెడల క
ల్లనఁ గ్రేటుకొనుచు నహిపతి
యనియెన్ గాద్గద్య మడర నాయాసమునన్. 21

ఆ. వైనతేయ! తొంటివైఖరి గా కీవు
రారితనువు నేఁ డపారభార
మగుచు నాకె దుర్వహం బయ్యె నాశక్తి
నరయ స్వామి యిట్టు లయ్యె నేమొ. 22

క. అని నుడువుచు శ్వాసంబ
ల్లన నాఁగ ఫణావళీవిలాస మెడల సో
లిన శేషాహిని గరుడుఁడు
తనకరములు రెండు సాచి తటుకునఁ బట్టెన్. 23

గీ. ఈయుపద్రవ మేమొ కదే యటంచు
సిరియు లీలాంబుజము విసర్జించి యబ్జ
సదృశ మగుపాణిఁ బ్రాణేశుజలజసదృశ
మగుకరమ్మ స్పృశించె భయంబు నొంది. 24

శా. ఆలక్ష్మీమృదుపాణిపల్లవము హస్తాబ్జంబునన్ సోఁకన
వ్వాళీకాక్షుఁడు విచ్చె నేత్రము దళన్నవ్యాంబురుణ్మిత్రమై
వ్యాలీఢప్రమదాశ్రుపాత్రమయి యుద్యద్భానుమద్గోత్రమై
గ్రాలన్ జృంభితజృంభణావసరనిర్యాతాంగుళీస్ఫోటుఁడై.

క. అది యేమి మాయయో వ
ద్మదళాక్షుఁడు మేలుకొనుఁడుఁ దను వతిలఘుతా
స్పద మయి సుఖమయ్యె ఫణికి
నెద ముద ముదయించె రమకు నెప్పటివోలెన్. 26

సీ. సాంగభంగమ్ముగాఁ దద్భుజంగశయ్య
నొత్తగిలి లేచి కూర్చుండి యూర్పుపుచ్చె
మదనజనకుండు; సిరి గోళ్లతుదల దువ్వి
చెదరుధమ్మిల్లమ్మును జక్కఁజేయుచుండ. 27

ఉ. అంత ననంతభోగి వినయంబున నంబుజనాభునంఘ్రుల
శ్రాంతఫణాంతరత్ననికరద్యుతిరాశి నివాళిసేసి యా
చాంతసుధారసం బగువచస్తతిఁ దత్తనుభారహేతువృ
త్తాంతము సాంతముల్ దెలుపఁ బ్రార్థనసేసెను వేయిమోములన్.

క. దేవర ప్రసాదమున కీ
సేవకుఁ డర్హుండయేని సెల వీయఁ దగున్
దావకశరీర మెందుల
కీవేళను నాకు దుర్వహీకృత మయ్యెన్. 29

ఆ. మామకీనశక్తి మాయ మయ్యెనొ తావ
కీనమూర్తి గురుత గీలుకొనెనొ
పుట్టి బుద్ధి యెఱిఁగి యిట్టి వైరుధ్యంబు
గాంచి యెఱుఁగఁ గీలకం బదేమొ. 30

చ. అని తను వేఁడువన్నగకులాధిపుపైఁ గరుణాకటాక్షముల్
నినుచుచు మందహాసరుచిలిప్తరదచ్ఛదుఁడై ముకుందుఁడా
య్యనఁ గర మెత్తి మేఘురసితాతిగభీరశుభస్వరంబుతో
ననిమెహ సావధానమతులై విన సర్వసురర్షిబృందముల్.

ఉ. ఓయురగేంద్ర ! కన్మొగిచి యూరక నిశ్వసితంబు నాఁగి చి
త్తాయతచంచలత్వమెడయన్ బటుయోగముఁ బూనియుండునా
కాయెడ నృత్తకేళిముదితాకృతితోఁ బరమేశ్వరుండు ని
ర్మాయికవేషుఁడై పరమహానివృతుండయితోఁచెఁ గంటికిన్.

ఉ. అంతట నింద్రు వేణునినదానుగుణంబుగ మ్రోయుశారదా
కాంతునితాళసంగతిప్రకారము నేన మృదంగవాద్యవి
క్రాంతికిఁ బూన; భారతి నిరంతరమాధురితో విపంచికా
త్యంతమృదుస్వనం బొలుకనయ్యభవుండొనరించె నృత్తమున్.

మ. జడలన్ గాంగతరంగరింగణమునన్ జాబిల్లి తూఁగాడ న
ల్గడలన్ దేహగళద్విభూతి చెదరంగా నున్నతోరస్స్థలిన్
బడలన్ క్షిప్తములై భుజంగనికురుంబం బెంతయున్ భీతిమై
సడలన్ బాణికురంగమీశ్వరుఁడు లాస్యం బాడెనబ్రమ్ముగన్.

మ. అనిమేషత్వము సార్థకంబుగ నమర్త్యశ్రేణి బాలేందుమౌ
ళి నటింపన్ గని ప్రీతచిత్తులయి తల్లీలావినోదంబులన్
వినుతుల్ సేసి యనల్పకల్పసుమనోవృష్టిన్ సభామంటపం
బునకున్ గూర్చిరి హైమహాటకపుడామోదంబు పైపెచ్చుగన్.

గీ. అయ్యది చిదంబరక్షేత్రమనియుఁ గనక
మండప మటంచు నటరాజు తాండవించు
టనియు బాహ్యస్మృతి తొలంగ నాత్మఁ గలుగు
ననుపమానందభరమున నట్టులైతి. 36

క. అన రోమహర్షణాంచిత
తనువై యానందబాష్పధార లురల న
క్కనువినుకులదొర తన్మా
ట్యనిరీక్షణపర్వ మెనయ నానతివేఁడన్. 37

క. మురహరుఁ డిటు లనెఁ బురఘ
స్మరుఁడు నటనకేళిఁ బూర్తి సలిపి కళాసిం
చి రుచిరగతి శబ్దాగమ
చరితము నెఱిఁగించె నచటిసభ్యులు వినఁగన్. 38

సీ. పాణిని వరరుచుల్ క్షోణిఁ బుట్టుటవర్షు
దయ నైంద్రశబ్దశాస్త్రము గఱచుట
బుద్ధిజాడ్యమ్మునఁ బొందినపాణిని
పరిభవంబును దపశ్చరణరీతి
సూత్రనిర్మాత యాామను వరరుచినోటఁ
బుచ్చుట యవ్వాఁడు పోయి తపము
సేసి వార్తికముల్ రచించుట యన్యోన్య
శాపంబులును దనూత్సర్జనంబు

వరుసఁ గైలాసగమన మైశ్వర్యలబ్ధి
శాశ్వతానందమయత విశాలకీర్తి
నంది మించుట వినిపించి యాదరమున
నన్నుఁ గనుఁగొని యిట్టు లానతియొసంగె. 39

ఉ. ఓ కమలాక్ష ! యాగతి ననుత్తమనిర్మితి వెల్గుపాణిని
వ్యాకరణంబ శేషవిబుధాకలనప్రవణంబుగా మనీ
షాకుశలత్వ మొప్పఁ బెలుచన్ వివరింపఁగ దక్షుఁడొక్కఁడ
ర్వాకరమాళి వాఁ డవతరింపఁదగున్ నరుఁడై ధరిత్రిపై. 40

గీ. అవతరించి మహాభాష్య మనువుపఱచి
వ్యాకరణశాస్త్ర ముద్ధరింపంగవలయుఁ
బండితాభాసు లుర్వరామండలమున
నిప్పటికె తప్పుఁద్రోవకుఁ ద్రిప్పినారు. 41

సీ. పార్థివేంద్రావలంబనసముద్భూతగ
ర్వావాసమానసు లైరి కొంద
ఱాక్రాంతసంసారయాతనాధూత చే
తోఽనుసారవిహారు లైరి కొంద
ఱంగనాద్యూతాదికాఖిలవ్యసన ని
రస్తశస్తవివేకు లైరి కొంద
ఱవనీశపాటచ్చరాద్యుపద్రవపీడ
లలమ జీవన్మృతు లైరి కొంద

ఱిట్లు కలియుగమహిమ మనీషు లెల్ల
రనభిముఖు లౌట వేదవేదాంగసమితి
పఠనపాఠనములు మాలి ప్రక్రమక్ష
యంబు గని భూమి నామమాత్రంబ నిలిచె. 42

ఉ. అన్యముమాట కేమి యఖిలాగమవక్త్రము శబ్దశాస్త్ర మ
న్యోన్యవిరుద్ధమార్గముల వ్యాఖ్య లొనర్చు ననేకపండితం
మన్యుల వాతఁ జిక్కి విషమస్థితి నున్నది దాని సర్వరా
జన్యుఁడుదక్కనన్యుఁడు వెసన్ బ్రకటింపఁగఁజాలఁడియ్యెడన్.

క. అని గిరిశుం డానతి యి
చ్చెను గానఁ జిదంబరమున శితిగళునానం
దనటనదర్శనమున నీ
జననము సాఫల్య మొందఁ జనుము ధరణికిన్. 44

ఉ. నావుడు రోమహర్షణఘనంబయి దేహము దోఁప హర్షబా
ష్పావృతలోచనద్వయసహస్రముగాఁ బ్రణమిల్లి శేషుఁ డ
ద్దేవుననుజ్ఞ మాల్యముగతిన్ ఫణమండలిఁ బూని క్షోణిపై
నేవగ నుద్భవింతు నని యెంచుచు వెల్వడె నించుప్రీతితోన్.

మ. తనసంస్పర్శమునన్ ధరిత్రికిఁ బవిత్రత్వంబు చేకూర్చుచున్
జననార్హం బగునార్ష వంశ మెచటన్ సందర్భమౌనో యటం
చనుమానించుచు వచ్చివచ్చి కనెసీమాతీతమాహాత్మ్యమున్
మునిసంసేవ్యము నొక్కయాశ్రమము నామోదంబుతో నొక్కెడన్.

సీ. బిసనాళశంక నిర్విచికిత్సముగ సింహ
దంష్ట్రి లాకర్షింపఁ దాపసంతి
మధ్యందినార్కభీమప్రతాపార్తాహి
శిశువు లెక్కలనీడఁ జేర్చు నెమిలి

తృణఖాదనగతమాతృకము వత్సతరంబు
నెలమి నాకుచును జాలిచ్చు వ్యాఘ్రి
బిలము వెల్వడి శీతభీత మౌమూషి కా
ర్భకము నోముఁ గడంగు వనబిడాలి

వెలయ నన్యోన్యసహజవిద్వేష మొకట
మచ్చునకు లేక శాంతిసామ్రాజ్య మగుచుఁ
బ్రాజ్యఫలపుష్పభూజరారజ్యమాన
మగుతదాశ్రమమహిమఁ గొండాడి యాడి. 47

క. చూచెదఁ గా కని యత్యక
గోచర మగుతూప మలముకొని యాశ్రమమున్
వే చొచ్చి యందుఁ గనె నొక
వాచాగోచరము బ్రహ్మవర్చస మెదుటన్. 48

సీ. కృష్ణసారంబు లందిచ్చుదర్భాంకురం
బులఁ గొంచుఁ బుడుకుచు ముద్దుచెప్పి
హావ్యార్థమై తెచ్చి యవలు హస్తంబునం
దుంచుకీరంబు మన్నించి పుచ్చి
యభిషేకమున కాపగాంబువుల్ పుష్కరా
గ్రమునఁ దెచ్చెడువారణమును మెచ్చి
సారసాప్తస్తవసహపాఠి యగుశారి
కకుస్ఫుటోచ్చారణక్రమము దిద్ది

యనఘకృష్ణాజినాసీనయై స్థిరముగ
దృష్టిఁ బ్రత్యక్షదేవు నాదిత్యుఁ జేర్చి
సావయవ మైనయోగవిద్యయ యనంగఁ
గ్రాలు నాతేజ మొకమునికన్య యయ్యె. 49

ఉ. ఆయమ శుద్ధతాపసకులాంకుర మంచును గన్యయాచుఁ బు
త్రీయమ దారచిత్త సుచరిత్ర యటంచును గోణికాఖ్య యం
చాయన దివ్యదృష్టిఁ దదుదంతము సాంతమెఱింగి పొంగి దా
క్షాయణి శుద్ధి యైనయలసాధ్వి నెతల్లిగఁ గోరె నాత్మలో.

ఉ. అత్తఱి నత్తపస్వినియు నర్ఘ్యము నర్కున కిచ్చుకోరికన్
జిత్తసరోజపీఠిఁ దరణిన్ నెలకొల్పి కరాంజలిన్ జలం
బెత్తి నిమీలితాక్షియయి యింతయుసంచలనంబుమాని, పు
త్రోత్తమునీయుమాయని సముత్కలికన్ మదిఁగోరునంతటన్.

మ. నళినీనాయకచోదితుం డయి వెసన్ నాగేంద్రుఁ డల్పాకృతిన్
దళదబ్జద్వయసంపుటప్రతిమమౌ తద్గోణికాకన్యకాం
జలిగర్భంబునఁజొచ్చె జ్ఞానిహృదయాబ్జంబునన్ బ్రబోధంబటుల్
జలజాతోదరకోటరం బళియటుల్ బ్రచ్ఛన్నరూపంబునన్.

క. ధ్యానావసానమున న
మ్మానిని కనుదెఱచి ఫణిసమంచిత మని యిం
తే నెఱుఁగక యర్ఘ్యాంజలి
భానునిదెస నెత్తి భూమిపైఁ బడ విడిచెన్. 53

క. విడిచిన యర్ఘ్యజలాంజలి
పుడమిఁ బడక మున్న మానిపుత్రాకృతి శే
షుఁడు దోఁచి క్రమముగా ధర
నడుగూఁదె నిజాంగకాంతు లలమఁగ దెసలన్. 54

సీ. శరదిందుచంద్రికాసంకాశమై దేహ
మున లిప్తమైనవిభూతి మెఱయ
హృదయస్థసత్వావకృష్టరజస్తమం
బు లన జటాజినంబులు వెలుంగ
దక్షిణశ్రవణసందానితస్ఫటికాక్ష
మాల తారావళీలీల నమర
రోలంబమాలికారుంతుదం బైనరుద్రా
క్షదామము కంఠ మంటియుండ

మేరుగంభీరరూపుఁడై మేదినీత
లంబు నిజపదయోగపూతంబు సేయు
చెదుట నిలుచుండె గోణికాహృదయనిబిడ
సాధ్వసాద్భుతహర్షాబ్ధిచంద్రుఁ డగుచు. 55

క. నిలుచుటయుఁ దత్తపస్విని
గళితతపఃక్లేశ, ఫలితకామితయునునై
పులకితతనువై పుత్రకు
నలఘుమహిమఁ బొదివికొనుచు నక్కునఁ జేర్చెన్. 56

క. ఈపావకతేజం దగు
పాపం డే నాతపంబుఫల మనుకొని యా
తాపసకుమారుశీర్షం
బాపోవక మూరుకొనుచు నల్లే నిలువన్. 57

ఆ. పాలు చేపువచ్చి బాష్పధారలతోడఁ
దపములను గృశించుతనువు ముంపఁ
బుత్రలాభసుఖసముద్రమం దోలాడు
నంబపాదయుగళి కతఁడు మ్రొక్కె. 58

ఆ. అట్లు మ్రొక్కునప్పు డాయమ యయ్యతి
బాలశశికి నిడెమె భాస్కరునకు
నర్ఘ్య మీయ నెత్తునంజలిఁ బకుటఁ 'బ
తంజలి'యను సార్థకాహ్వయంబు. 59

ఉ. అంత నతండు తల్లికి సమంచితభక్తి నమస్కరించి నీ
స్వాంతమునన్ ననున్ దలఁచునంతనవత్తుఁ దపోర్థమేఁగ వాం
ఛింతు ననుజ్ఞ నిమ్మని వచింపఁగ గోణిక ఖేదమోద సం
క్రాంతనిజాంతరంగ యయి కన్నుల నశ్రులుగ్రమ్మ నిట్లనున్.

క. పుట్టితివో లేదో నను
నట్టడవిని విడిచి యెటో చనన్ జూచెద వి
క్కట్టులఁ బడి నినుఁ గాంచఁగ
నెట్టు తపించితినో యించు కెంచవు పుత్రా ! 61

సీ. కలవు దీఱఁగ రెండుకన్నుల నాసేచ
నిక మైన నీరూప మకట కాంచ
నాలకింపను జెవులార సుధల్ చిల్కు
నోపు నీ మంజులాలాప మింత
యిష్ట మారీతి నోయిరము నాచేతితో
బట్టఁడేనియు వండి పెట్టనైతి
సింహాసంహాననమై చెలఁగునీమేని కం
గోద్వర్తనము సల్ప నొక్కపటియు

గీ. కటకటా! నిన్నుఁ గాంచ నుత్కటతపంబు
సేయుశ్రమమేని మాయకే పాయ నెంతు
నిన్నుఁ గని యేమి సుఖము గంటిని గుమార!
తల్లిఁ బోషించున్యాయంబు దలఁపవౌర. 62

మ. సరసీజాప్తవరప్రసాదమున సంసారార్ణవోత్తారకున్
బరమర్షిఁ బుధశేఖరుఁ సుతుఁ నరఁ వాంఛించియేకాదె మా
తరపిత్రాజ్ఞలఁ ద్రోసి పెండ్లిపయి నాస్థఁ బాసి యిక్కానదు
ష్కరభక్తిఁ దపమాచరింతును సదాకన్యాత్వమాన్యస్థితిఁ.

గీ. తరణికృప భవవారిధితరణి వీవు
కలిగితివి కన్యకాత్వంబు కలఁగకుండ
నింక నీపాండితిని వగ లింకఁ బోవు
ననుచుఁ దలఁప ననుఁ బాసి చనుచు నుంటె. 64

చ. అనియిటులంపఁజాల కనయంబు విషాదమునన్ మునుంగు నం
బను వినయానులాపగరిమంబునఁ దేర్చి మనుష్యుఁడై ధరి
త్రిని జనియించుకారణము దెల్పి తపంబొనరింప నాజ్ఞ గై
కొని చనె దక్షిణాంబునిధికూలవనంబున కాక్షణంబునన్. 65

క. ఫలకుసుమోత్కరనతమం
జులవిటపిలతాక మగునచోట నిలిచి మదిన్
నెలకొలిపి యిందుశేఖరు
సలిపె నఘోరముగఁ దప మచంచలదీక్షన్. 66

శా. ఊర్ధ్వోత్తంభితబాహుఁడక్షియుగలక్ష్యోష్ణాంశుఁడంతర్నిరు
ద్ధోర్ధ్వాధశ్శ్వసనప్రచారుఁడు హృషీకోద్రేకనిర్ముక్తుఁ డం
తర్ధ్వాంతాతివిదూరమానసుఁడహంతాశూన్యుఁడద్వంద్వుఁడున్
నిర్ధ్వస్తాంతరరివ్రజుం డశనపానీయానపేక్షుండు నై. 67

క. ధరణిన్ జరణాంగుళి నిడి
తరణిస్థితతరుణచంద్రధరు నిజచేత
స్సరణి నెలకొలిపి యతఁ డి
క్కరణిన్ దపమాచరింపఁ గడఁగెఁ గడంకన్. 68

క. ఆడినదే యాట మఱియుఁ
బాడినదే పాట యనినపగిది నిజతపః
క్రీడయ యోగీశ్వరస
ప్రమోదాదర్తవ్యశాస్త్రరాజం బయ్యెన్. 69

క. యమనియమాద్యష్టాంగ
క్రమ మగుతద్యోగవిద్య కరగతముగ శా
స్త్ర మొనర్చె స్వానుభవబిం
బముఁ బాతంజలము నాఁగ మహి నుతి కెక్కన్. 70

చ. పరిహృతకందమూలఫలపర్ణజిఘత్సుఁడయ్యు మారుతాం
కురభుజిధాతుకర్తృతను గోల్పడ నేరఁడు పూర్వవాసనన్
దరణికరప్రసారరహితప్రథితోరగలోకవాస శు
గ్విరహితుఁ డాటకోయనఁదపించునుబంచమహాగ్ని వేసఁగిన్.

గీ. హరికిఁ బాన్పైననాఁ డబ్ధియలలతాఁకు
సంతతము నోర్చుశమధనశాలి కిప్పు
డచ్చుసీతుననే నభయముగ శీత
లోదవాసము సలుపుట యొక్కలెక్క. 72

సీ. స్వస్తికాద్యాసనాభ్యాసపాటవ మూనె
దా బిలేశయుఁ డాటఁ దలఁచుమాత్ర
లఘుతఁ బ్రాణాయామలాభ మొంచె నిజాని
లాశనతానైపుణాప్తి మెఱయ
నుదితకర్ణకరాంఘ్రియుతుఁ డౌట మాతృకా
క్షరగణన్యాససాకల్యమెనసెఁ
జక్షురాదీంద్రియసమితి నిరుద్ధమ
య్యెను దినాంతనిరుద్ధహేళివోలె

యబ్బురమె కుండలిని వశమాట కుండ
లీంద్రుని కనంగ వెలసె; బాలేందుమౌళి
చరణయుగచింతనామృతాస్వాదవిమల
ధిషణుఁ డైనపతంజలి ఋషివరుండు. 73

ఉ. అంతట గోణికాసుతనిరంతర తీవ్రతపఃప్రకారవృ
త్తాంతము నాలకించి త్రిదశాధిపముఖ్యులు నాకులాకుల
స్వాంతతఁ దత్తపంబు గెడపఁగ వెసఁ బంచిరి యప్సరోవధూ
సంతతి జైత్రచైత్రసుమసాయకనాయక మాబలంబుతోన్.

క. జన్నములు సేయువారిన్
గన్నఁ దీవ్రముగఁ దప మొనర్చెడువారిన్
విన్నఁ రణహతశూరుల
టన్నఁ మతి చెదరుఁగద సురాధ్యక్షునకున్. 75

ఉ. కామితదాత లౌనమృతకామగవీహరిచందనాగచిం
తామణు లింట నుంట సుఖతన్మయుఁ డై విలసిల్ల నాసుర
స్వామికి నిత్యదుఃఖ మెడఁబాయద; శ్రీ పెను పోకాలందిఁ ద
త్త్వ మరిరక్షఁ జింతలఁగృశించుటె కాని సుఖించు టబ్బునే. 76

మ. రణదుర్దాంతులు దైత్యులొక్క యెడవీరస్వర్గకాంక్షఁ రణాం
గణమందున్ హతులైనశూరు లొకవంకన్, యజ్వలున్, దాపసా
గ్రగణు లింకొక్క యెడన్ బదచ్యుతినొనర్పన్ వత్తురంచున్ బ్రతి
క్షణమున్ గంపిలునింద్రుఁ డేలునదిస్వర్గంబైన నేమయ్యెడిన్.

క. ఆక్రియ శక్రునిపంపున
వక్రాలక లుజ్జ్వలాంగవైభవలై లీ
లాక్రమణంబుల వెడలిరి
విక్రమమునఁ గుసుమధన్వ వెనుకొని చనఁగన్. 78

గీ. సాంగ మగుకల్పలతికలో యంగజాత
జంగమపతాకలో యన శక్రశాస
నమునఁ జేరిరి తపసియాశ్రమమునకు వన
కేళినెపమునఁ దెఱగంటివాలుఁగంట్లు. 79

ఉ. పాటలు పాడుచున్ రసికపర్వము లాచటుసూక్తు లాడుచున్
దేఁటులఁ దోలుచున్ మధుధునీఝరిఁ ద్రెప్పఁగఁ గ్రోలుచున్ దడం
బాటులఁ గోసి పూలు కచభారమునన్ గయిసేసి యవ్వని
వాటి లతాకుడుంగముల స్వైర్మహిళల్ విహరించిరీహతోన్.

ఆ. నీవి ప్రిదిలి వలువ నిలువున జాఱ గు
బ్బలు బటాన బయలుపడఁగఁ గాను
నిక్కి గొమ్మ వంచి మొక్కలత గోసె లేఁ
జిగురుటాకు కేలితొగరు నిగుడ. 81

ఉ. సంపఁగిపూవుటెత్తు లోకబాన కచాన ధరించుకోర్కి సి
వ్కంపత బాహువెత్తఁగ నఖక్షతదీపితమూలమున్ సఖుల్
గుంపయిచూడఁగాఁగనియళుల్ గఱచెన్ జుఁడియంచుబొంకఁగా
నంపఁగి తేంట్లకేటి యనుచుఁ జప్పటలన్ నగి రొక్కపెట్టుగన్.

చ. వకుళసుమంబులన్ బయఁట పాదములన్ బడవంగి యేఱుచో
సకియలు ఱూఁగి యివ్విరిస్రజం బెటఁదాల్తు వటన్న యట్టులే
యొకటొక టెత్తుచున్ బయఁటయున్నటె యెంచి యిటన్ ధరింతునం
చొకకమలాంక్షి నిట్టనిలుచుండి హసింపఁగఁ జూపెఁ జన్గవన్.

క. చనుఁగవ దాడిమఫలయుగ
మనుకొని శుక మాన రా భయంబున నొకకా
మిని పరువులెత్తఁజొచ్చె జ
ఘనచేలము జాఱి నాభి కనఁబడునట్టుల్. 84

క. ఒక్కత వలయక్వణనము
రెక్కొన వారించుచున్న భృంగ మొకటి దాఁ
గ్రక్కునఁ దరువు విడిచి చిర
మక్కట! చుంబించె వ్రాలి యాయకమోవిన్. 85

క. చెమ్మటబిందులు చెక్కులఁ
గ్రమ్మఁగ నూర్పులకుఁ గుచభరంబు నటింపన్
గొమ్మ యొకత యిల జానువు
లిమ్ముగ నిడి యాడె బంతి యిరుగేలఁ దమిన్. 86

సీ. వేణిఁ బట్టినబర్హి వ్రేసి చేఁదమ్మిచే
నొచ్చెనా యని ముద్దు లిచ్చె నొకతె
ముక్తాస్రజము బిసంబునకు మాఱుగఁ జూపి
యంచ దాదాల రప్పించె నొకతె

యెడ కేలిశారికఁ గుడికేల దువ్వుచుఁ
గలపఁ జొచ్చెను మంజువిరుతు లొకతె
నను విడంబింతె యంచును గంకణ మ్మొక్క
కూయుపావురఁ దమ్మిఁ గొట్టె నొకతె
యిట్టు లమ్మునిచంద్రుని కెట్టు లేని
స్మరవికృతిఁ గూర్ప నెద నెంచి సన్నిధాన
వర్తనముఁ బూనెఁ బ్రౌఢయౌవనమదంబు
స్మరపికవిలాస మప్సరస్త్రైణ మపుడు. 87

సీ. గాజు లుంగ్రములు మ్రోఁగ నొకర్తు మురజంబు
వాయించెయువధైర్యభంజకముగఁ
గంచుకస్థగితవల్గదురోజయై తాళ
ముల మీఁటెఁ గటకమ్ము లులియ నొర్తు
జంత్రిగాత్రము లొక్కసరి లీనముగఁ బాడు
చొకరితె వాయించె నుదిరివీణె
బింబోష్ఠమున నొర్తు పిల్లఁగ్రోవిని జేర్చి
మృగకర్ణముల మధువృష్టిఁ గురిసెఁ
గొప్పు విడఁబడఁ జిఱునవ్వు కొనలు నిగుడఁ
జెమట లూరంగ మకరికాశ్రీ కరంగ
భావమును గేలఁ దెలుపుచుఁ బడఁతి యొకతె
యందె లులియంగ హారమ్ము లాడ నాడె. 88

క. అమ్ముని సోఁకెను నునుగా
డ్పమ్మహిళల కేశమాలికామితమధుశీ
తమ్మై మ్మ వీటీగంధా
ఢ్యమ్మై మ్మ తత్కుచతటాభిహతిఖంజనమై.

గీ. ఇటుల తత్స్వేదవ్వలాసిను లెన్ని యేని
లీలల నటింప నమ్మౌని లేశమేని
జలనమొందఁడ యహహా! ఝంఝూప్రభంజ
నమ్మునకు నేని గిరి చలనమ్ము గనునె. 90

క. ఇది గాదని యమ్మదవతు
లుదితత్వరత్వరఁ జలించి యొండొరుఁ గడవన్
బదములు దొట్రిలఁ జని ముని
కెదుర నిలిచి నెఱపి రెన్ని యేని జతురిమల్. 91

చ. ప్రమద యొకర్తు బిగ్గఁబరిరంభ మొనర్చె మదాతిమాత్రద
ర్ప మగుకుచద్వయంబునఁ దపస్విఁదటాలున; నైన నే మర
ణ్యమున నజస్రముఙ్ గలుగునట్టికిశోరకరీంద్రకుంభకా
షమ యని లోఁదలంచి గతచంచలవృత్తివసించెమౌనియున్.

ఉ. కాంత యొకర్తె యత్తపసికమ్రతనూస్థలి నల్లగుచ్చె ర
క్తాంతము లైనవక్రనఖరాంతములన్ బళిరా యవెల్ల శా
కుంతకులంబు లాడుకొనుకోర్కి నజస్రము మీఁదవ్రాలిన
ట్టంతట నింతటన్ గనుతదంఘ్రినఖార్పణభంగి రంజిలెన్.

ఉ. ఒక్క మృగాక్షి యాననపయోజము తాఁబసిచెక్కు సేర్చి, తా
సొక్కుచు ముద్దువెట్టుకొనుచుండఁగఁ బుట్టమి తెల్లవోయె న
మ్మక్క యటంచు నమ్మునికి నయ్యదియెల్లఁ గురంగడింభస
మ్యక్కృతలేహనప్రతిమమై స్ఫురియించె విభేదశూన్యమై. ౧

గీ. ఋషిమనోజితుండై మరుం డెడపడంగ
స్వారమణుల ప్రయత్నముల్ నీరుగాఁగ
శాత్రవుఁడు బలవంతుఁడై సమరమందుఁ
దమన్నృపతిఁ గూల్ప భటు లెట్లు తలఁగి పోరు. 95

గీ. ధరఁ గుశాసనాసీనుఁడై కరమునందు
సక్షమాలికఁ దాల్చి నాసాగ్రనిహిత
దృష్టియయి చంచలింపని ఋషిని గాంచి
విస్మితస్వాంతలైరి స్వర్వేశ్యలెల్ల. 96

క. తమబిబ్బోకము లిటు వ్య
ర్థము లౌటను మూర్త మగువిరాగ మనియు శా
ప మొసఁగు నేమో యని యా
శమధనుకట్టెదుట నిలువఁ జడిసిరి పడఁతుల్. 97

ఉ. అంతట నీసుఁ బాసి యమరాధిపుఁ డానతి యీయ ఖేచర
త్సంతతి పారిజాతవికసత్సుమవృష్టుల మౌనిఁ దేల్చి ర
త్యంతగభీరనాద మొలయన్ సురదుందుభికోటి మ్రోసె వి
భ్రాంతు నొనర్ప మౌనిఁ గనవచ్చినకాంతలె పాడియాడఁగన్.

ఉ. అమ్మునిశేఖరుం డటు లనన్యగతిన్ దపమాచరించువృ
త్తమ్ము నెఱింగి; కామిత మతంద్రత నీయఁ బినాకి గిర్యప
త్యమ్ముఁ బ్రమేన వెల్గ రజతాద్రిసమంబు వృషంబు నెక్కి చి
త్తమ్ము ప్రసన్నమై వఱలఁ దన్మునికిన్ బొడసూపె నత్తఱిన్.

ఆ. శైలకన్యతోడఁ జంద్రార్ధకోటీరుఁ
డెట్టయెదుట వెలుఁగ ఋషి కుశాస
నంబునుండి సంభ్రమం బొప్పఁగా లేచి
మ్రొక్కి శిరసు వంచి మోడ్పుఁగేల. 100

క. సాష్టాంగనమస్కారము
లష్టోత్తరశత మొనర్చి యానందరయ
క్లిష్టాలాపముల శివు న
భీష్టదు నుతియింపఁ దొడఁగె నిగ్రిచినభక్తిన్. 101

క. శ్రుతులె యసమర్థములు నిను
స్తుతియింపఁగ నినిన మాదృశుల మా కేలా
సతతపవిత్రాకృతి నిను
స్తుతియించుట మద్వచోవిశుద్ధిఁ బడయఁగన్. 102

గీ. సచ్చిదానందలక్షణ వణము నేక
మద్వయ మ్మగుభవదీయ మైనమూర్తి
నైజమాయామహిమ విభిన్నత వహించు
బ్రహ్మవిష్ణుమహేశ్వరాహ్వయము లూని. 103

ఆ. కర్మముల నొనర్పఁగా యథార్థము లగు
తావకోక్తితతులె తావలములు
నిను సుమేధసులు గణింతురు 'సుఖబోధ
మయపరాత్మరూపమ' యని దేవ. 104

ఉ. బాలశశాంకమండన! భవత్కమనీయవపుర్విలాస మే
వేళ మదీయమానసనివేశనివాసము గాంచఁ గోరుదుర్
శైలిసుతామనోజ్ఞనళినప్రియ! నీతనుదర్శనాప్తి ను
న్మీలితనామరూపుఁ డయిపోఁడె రతీశ్వరుఁడొక్కవ్రేల్మిడిన్.

క. ఎటు భేదించితొ దేవ! త్రి
పుటభేదనిఁ దొల్లి యెక్కఁ బోవఁగఁ గురథం
బఁట యొకచక్రంబు జడం
బఁట యన్యము ద్వాదశాంశమఁట చిత్ర మగున్. 106

క. భవదాశ్రయమున మార్గణ
నివహము లక్ష్మీశు లగుచు నెగడుదు రనుటన్
భవ! భవదాశ్రితుఁ డయి శ్రీ
ధవుఁ డటు మార్గణత నొందఁ దలకిం దయ్యెన్. 107

చ. అభవ! యనేకశాఖలకు నాశ్రయమయ్యు భజించువారికిన్
శుభఫలదాతవయ్యుఁ గనఁ జోద్యము స్థాణువవైతి; తారకా
విభుమకుటుండ వయ్యు రణవీథిని నంధకుఁ గూల్చి లజ్జ లే
క భువిఁ జరింతు పౌరుష మఖండముగాఁ గనకుండుటన్ గదా.

చ. శివ పరమేశ పావన యజేయగతిక్రమ దాంతమోహనా
భవ నగచాప దేవబలపాలకజన్య శరీరకాంతివై
భవజితపారదా వరకృపా కృతిధర్మపరా రమాజశా
శ్రవ ధరజామనోవనజరంజదహస్కర నాగబంధనా. 109

సీ మందాకినీలసమానజటాజూట !
చంద్రకిరీట ! పశ్యల్లలాట
పార్వతీప్రాణేశ పత్రీకృతవృషేశ
భూమీధరనివేశ వ్యోమకేశ
సమవితాఖిలలోక జ్ఞానాంజనశలాక
నృకరోటిమాలాక ధృతపినాక
భస్మసాత్కృతమార భసితలిప్తశరీర
హాలహాలాహార విద్యావిహార !
కాలకాల శయాగ్రసంఘటితశూల
భక్తమానసఖేల కృపావిశాల
యాదిమధ్యాంతదూర వేదాంతసార
పాహి మా మీశ్వర మయి కృపాం విధేహి. 110

క. మేనఁ బులకోద్గమము మది
లోనఁ బ్రచురభక్తి కనులలోఁ బ్రమదాశ్రూ
త్థానము పలుకుల నుతులుం
గా నిటు విలసిల్లుతపసిఁ గని శివుఁ డనియెన్. 111

ఉ. మెచ్చితి నీతపంబునకు మించ వరంబు లొసంగుపూన్కిమై
వచ్చితిఁ గోరుకొమ్మనఁ దపస్వియు వ్యాకృతిభాష్యగుంఫనా
భ్యుచ్చయ మిచ్చుటొక్కటి ప్రమోదమునన్ నటరాజరాజవై
యిచ్చ నటింపఁ గాంచి కృతకృత్యుఁడ నౌటొకఁ డిమ్ము నావుడున్

మ. చిఱునవ్వొప్పఁ ద్రిలోచనుం డటుల యాశీఘ్రంబ శ్రీమచ్చిదం
బరసుక్షేత్రముఁ జేరి కాంచుమ చటన్ ద్వద్వాంఛితం బంచుఁ గ
న్మొఱఁగెన్ శివమౌనియుఁ బడ్డపాట్లకు ఫలంబున్ గంటిఁ గాయంచు నన
త్వరయానంబున నాచిదంబరపురిన్ బ్రాపింప నడ్డే చనెన్.

ఆ. అటవి దాఁటి యటవి యుటజంబు గడచి యొం
డుటజమును భజించు చొంటిఁ జనుచు
దలఁచె నప్పవిత్రదర్శనుం డవి యెల్ల
గాంగసలిలభరసఖంబు లనుచు. 114

సీ. ఫలపుష్పములు సమర్పణసేసి వనపాద
పమ్ములు జన్మసాఫల్య మొందెఁ
బదశాస్త్రవిత్కవిభణిత మట్లనుపద
రస సుసమృద్ధమై యొసఁగె సరణి
గిరిఝరీశీకరోత్కరములై సుమసార
భాంచితమ్ముగ గాడ్పు లల్ల వీచె
మృగశాబకములు సౌహృదమునఁ దరిఁ జేరుఁ
దాటస్థ్యమున మృగాదనము లేఁగు

నపఠిత వ్యాకరణశ్రుతు లైనకవు ల
సాధుపదములఁ బాడితశ్రవణము లటు
కవు లసాధుపదముల వృక్షములఁ గాసి
పఱుపఁ బూనె మునీంద్రుఁడం దరుగువేళ. 115

క. సరసుఁ డగుసుకవిగీఃక్రమ
మెఱుఁగని దుర్ధీకులట్ల యేఁగెడుతదృషీ
శ్వరు నారసి పక్కణకు
ర్కురములు బుక్కక్రియానురుద్యమ మూనున్. 116

సీ. గిరినదీఝురములఁ గెరలి కేళి యొనర్చు
చక్రాంగకలకలస్వనము వినుచు
నభ్రంకషోర్విధరాగ్ర నిస్సృతనిర్ఝ
రాంభఃకణవ్యాప్తి నళుకుకొనుచుఁ
గర్తనిర్యద్భుజంగమఫూత్క్రియాచకి
తైణచంచలదృష్టు లరసికొనుచు
నచ్ఛప్రసూనారుణచ్ఛదచిరిబిల్వ
వనరమాంచితనగవ్రజము గనుచు

దాననిష్యందమలినవర్త్మ ధ్వనన్మ
ధుకరవిజ్ఞాపితాబ్జినీతోయమగ్న
దంతి యగుచు శాంభవకంఠకాంతికిఁ బున
రుక్త మగుబుఱుక్షముల కళ్కు నొందు చరిగె. 117

క. హరిఖరనఖరవిపాటిత
కరికుంభవిశీర్ణమౌక్తికస్థగితం బౌ
సరణిఁ దారామధ్యం
బురుచిఁ గనె నశ్వపోధనుం డవ్వలనన్. 118

చ. కుతుకము మీఱ నిప్పగిదిఁ గోనలు కాన లతిక్రమించి య
య్యతిమణి చేరె నంతటఁ జిదంబరపత్తనరాజమున్ సుధా
సితిమవిలీన విష్ణుపదసింధుమహోచ్ఛ్రిత సౌధరాజమున్
సతత నటేశతాండవ రసగ్రహణోత్సుక సత్సమాజమున్.

క. అందుఁ గనె నటేశు లస
న్మందిరముఁ దదీయనాట్యదర్శన కుతుకా
మందప్రచారు లగుముని
బృందము బృందారకేంద్ర బృందము నెలమిన్. 120

గీ. బానకడుపులు కఱిమైలు బాకి నోళ్లు
ముడి వడినదీర్ఘజానువుల్ గడువిశిష్ట
గళములును జేఁటచెవ్రులును గలుగుప్రమథు
లొక్కకరణి యచ్చటికి వచ్చుచుంటఁ గాంచె. 121

సీ. కేతకీసంపర్కపీత మౌఁపూఁదోఁటఁ
గొనర కుమ్మొత్తపూల్ గోయువారు
ప్రీతిఁ బరేతభూమీతలంబునకు భూ
త్యనులేపములఁ దేర నరుగువారు

మలయద్రుమవల్మీకములఁ ద్రచ్చి ఫణులను
దిగిచి భూషార్థమై తెచ్చువారు
పరమేశకంకణ ఫణికుక్షిపూర్తికై
పిల్లతెమ్మెర లాఁకపెట్టువారు
త్రిపురమథనంబు మన్మథదేహదాహ
మంతకనిపాతనము గరళాస్వదనము
దంతిరక్షోవధంబు మోదమునఁ బాడు
వారునై తోఁచి రెటుగన్నఁ బాఁమదులు. 122

క. సాక్షాత్కరించి రట రు
ద్రాక్షకిరీటోత్తమాంగు లగుపరశివపం
చాక్షరమంత్రోపాసకు
లక్షయసంఖ్యల నిరంతరానందధులై. 123

గీ. నిరతము ప్రదక్షిణక్రియాపరులు భక్త
తండము గణింప సాధ్యమే తచ్ఛరీర
గళితభసితంబు పెద్దప్రాకార మన్య
మందు రచియించి రనుభంగి నగపడంగ. 124

గీ. భక్తుఁ డగునెల్లవాఁ డనుభవము గాంచ
శ్రీచిదంబర విభుఁడు సృష్టించి యిచ్చు
స్వర్గములు లక్ష్ములును సరస్వతులు ముక్తు
లిన్ని యని లెక్క యిడి వచియింపఁ దరమె. 125

ఉ. ఎచ్చట గన్న బిల్వముల నెచ్చిఱుభక్తిని గోసి తెచ్చువా
రెచ్చటు చూడ శంకర నటేశ్వర యంచు స్మరించు చేఁగువా
రెచ్చటు గాంచినన్ నటనవీక్షణకౌతుక మానువారునై
వచ్చుచుఁ బోవు చుండుశివభాగవతుల్ గనవత్తు రందులన్.

ఆ. అట్టి యప్పురంబు నం దెట్టులో చొచ్చి
తొలుతఁ గాంచె మానితిలక మెలమిఁ
బరమశమిని వ్యాఘ్రపాన్ముని మాధ్యంది
నుని మహేశసముని వినతియుక్తి. 127

ఉ. అమ్మునియున్ బతంజలియుదంతము నంతయు నంత జ్ఞాననే
త్రమ్మునఁగాంచిసంభ్రమమొదన్ గదురన్ ద్వరలేచివచ్చి య
ర్ఘ్యమ్మునుబాద్యమిచ్చి కుశలాగమనంబునుబృచ్ఛసేసి మో
దమ్మునఁ దేలెమైత్రివితతంబయిసాఁగఁగఁ బల్కుపల్కునన్.

గీ. అప్పతంజలియును బూజ లంది కుశల
మడిగి తనవచ్చినట్టికార్యంబు తెలుప
వ్యాఘ్రపాత్తును మున్న యవ్వాని శేష
భోగిరా జని యెఱుఁగుటఁ బొంగిపోయె. 129

క. ఆ యమలచరితు లిరువురు
నాయతసౌహార్ద మాత్మలం దలముకొనన్
ద్ర్యక్షతాండవోత్సవ
మాయెసఁ గనఁ గనకసభకు నరిగిరి ప్రీతిన్. 130

క. ఆకనకసభకు నెన ము
ల్లోకంబులయందు నావలోకిత మనఁగా
శ్రీకంఠుఁడు చిరవాసం
బౌకైలాసమ్ము మఱచు టది సాక్షి గదా. 131

ఉ. ప్రేరకు లింద్రముఖ్యసురబృందములంట వినిర్మితిక్రియా
ధారుఁడు విశ్వకర్మయఁట తప్పక నిచ్చలు నాడ నాడఁగా
గోరెడువాఁ డవాఙ్మనసగోచరుఁ డీశ్వరుఁ డంట; యింక నె
వ్వారికిఁ దత్సభామహిమవర్ణనకుఁ బచరింప సాధ్యమే.

సీ. ఆణిపేరులు ప్రేలుహాటకవలభులు
కుముదబాంధవశిలా కుడ్యములును
గమలరాగవినిర్మితము లైన వేదికల్
కురువిందమాణిక్యకుట్టిమములు
నాయతస్వర్ణ వాతాయనమ్ములు హరి
న్మణివికారములు స్తంభములగములు
వజ్రోపలములసోపనములు శాతకుం
భమయంబు లగుద్వాఃకవాటములును.
స్వర్ణమయమై యపూర్వమై చదల మెదలు
ఛదియుఁ దదుపరివినిహితస్వర్ణకుంభ
రాజి రాజిల దేవతారాధ్యమహిమఁ
గనకసభ మించు విశ్వమోహనము గాఁగ. 133

మ. పటలస్వర్ణవిభావిభాకరకరప్రాగ్భారసంపర్కవి
స్ఫుటితాకాశధునీహిరణ్యకమలస్తోమంబునన్ ఖేల న
స్ఫుటరూపంబుఁ సప్తతాపసిసభన్ బూజించె నానొప్పును
త్కటరుజ్ఝండితహేమకుంభగణ ముత్తాలధ్వజోదీర్ణమై.

క. దూరముననె శిఖరసమ
ప్రాకారము గావించి దరియఁగాఁ జనుచున్ బ్రా
కారాదు లరసి యభవున
గారము గనెఁ గనులు చల్లగా ముని తొలుతన్. 135

గీ. తోడ నరుదెంచువ్యాఘ్రపాన్మునివరుండు
తద్విశేషంబు లెఱిఁగింపఁ దవిలి వినుచుఁ
గాంచుచుఁ బ్రదక్షిణముగ శ్రీకంఠుకనక
దివ్యభవనంబు సొచ్చి నుతించి శివుని. 136

శా. ఆకాశంబున రాయుహాటకపతాకాళిన్ రణత్కింకిణీ
శ్రీ కేళిన్ గని జన్మమిప్పుడు తరించెంగా యటంచున్ నమో
వాకంబుల్ పచరించి యల్లఁ జనె శ్రీపత్యంబుజాపత్యనా
కౌకోనాయకపూర్వకామరఘనంబై వెల్గునాస్థానికిన్. 137

గీ. ఇసుక చల్లినరాలన గ్లెసఁగు త్రిభువ
నాగతసురర్షిముఖశివభాగవతచ
యంబునం దెట్లొ యాసీనుఁ డయ్యె నొకట
నాపతంజలి వ్యాఘ్రపాదనుగుఁ డగుచు. 138

ఉ. ఎప్పుడు శ్రీచిదంబరనటేశ్వరులాస్యము గందు మంచు నే
చప్పుడు మాని యాసద మచంచలమానసవృత్తినుండు చోఁ
గప్పెఁ గకుప్పులన్ ముదిరగర్జితపద్ధతి మర్దళస్వనం
బప్పరమేశునాగమన మందఱకున్ దెలియంగఁజాటె నాన్.

సీ. వినవచ్చె శంఖనిస్వనములు దుందుభి
మర్దళధ్వనుల సమ్మర్దమందు
నాలింప నయ్యెఁ దదంతరాంతరములఁ
బ్రమథుల జయజయధ్వానవితతి
చెవుల సోఁకె మహర్షినివహంబు పచరించు
సామగానస్వానసమితి యంత
వీనులఁబడె దివ్యవేశ్యలతౌర్యత్రి
కాద్భుతమృదురవం బంత నంతఁ
గ్రమతఁ దోఁచిరి వల్లకీక్వాణనప్ర
వీణు లగునారదాదు లవ్వేనుక వృషభ
వాహనంబున సోముఁడై వామదేవుఁ
డక్కనకసదమందుఁ బ్రత్యక్ష మయ్యె. 140

క. మస్తధృతాంజలు లగుచు స
భాస్తారులు జయజయారవములఁ బ్రణతులన్
బ్రస్తుతులను సేవించి ర
హాస్తబహిర్జాను లయి మహానటదేవున్. 141

సీ. చందనద్రవసముత్తుణలసత్సుమములఁ
జల్లిరి సిద్ధులుఁ జారణులును
మర్దళధ్వనితోడ మంజీరరుతి గూడ
నాడిరి మేళమై యప్సరసలు
వల్లకీరుతిఁ జెంపవైచె గజాస్యగం
డమదోదలోలాళి నాదగరిమ
ప్రమథడిండిమనిస్వనమున కాడఁ దొడంగె
స్తనిత మంచుఁ నుమాత్మజన్మవాహ
మంతఁ గైలాససంకాశ మైనవృషభ
వాహనమునందు నెలకొని వామదేవ
కలితశుద్ధాంతుఁ డగుచు రంగమున మెఱసె
శ్రీనటేశుండు మేను చంద్రికల నీన. 142

ఉ. అంబుజసూతియున్ హరియునవ్వలనివ్వలనిల్చి మొక్కఁబా
ర్శ్వంబులఁ గృత్తిమేతరవచస్తుతులన్ సనకాదు లుగ్గడిం
తుంబురునూతుఁడర్ఘ్యమును బాద్యమొసంగుచునుండవీణియల్
దుంబురునారదుల్ పటిమతో మొరయించుచునుండనయ్యెడన్.

ఆ. చక్రపాణిపాణిసాయంబునఁ వృషాధి
రాజు డిగ్గి భవుఁడు రంగసీమ
నిలుచునంత సభ్యనివహమ్ము న_ర్తింపఁ
గోరుటయుఁ దదిష్టపూరకముగ. 144

సీ. చల్లడంబుగ వ్యాఘ్రచర్మాంబరము దాల్చి
వాసుకిఁ గాసెగాఁ జేసి బిగిచి
జాహ్నవిఁ గ్రొమ్ముడి జాఱకుండఁగఁ జెక్కి
కదలకుండ శశాంకకళను జెరివి
కంకణీకృత భుజంగశ్రేణి సవరించి
పుఱియపేరులు చిక్కుపుచ్చి మెలిచి
డమరుఖట్వాంగశూలమృగంబులను నాల్గు
కేలుఁదమ్ములయందుఁ గీలుకొలిపి
నూపురీభూతఫణిశిరోనూనరత్న
కాంతి డాకాలికి నివాళిగాఁ దళుక్కు
మనుచు మెఱసినయట్టులై యప్పు డంధ
కారి నటరాజనేపథ్యధారి యయ్యె. 146

చ. పులకితగాత్రుఁ డశ్రుకణముగ్ధవిలోచనుఁ డాన్మస్యసం
చలదఖిలాంగకుండు విలసచ్ఛ్రమభారికుఁ డాచు నప్పుతం
జలి తలయందు నంజలి వెసన్ నలకొల్పి యనల్పకల్పనో
జ్జ్వలరసవత్ప్రసాదగుణసంభృతసూక్తి నుతించె నర్మిలిన్.

క. కరుణాతీతకటాక్షో
త్కరమునఁ గను చభవుఁ డప్పుతంజలికిన్ నీ
వరయఁగఁ గోరెడునటనము
తెఱఁగున్ గను మనుచు దివ్యదృష్టి యొసంగెన్. 147

క. చక్షుష్మంతుల కెల్లర
కాక్షణమ యొసంగె దివ్య మగుదృష్టిని ఫా
లాక్షుఁడు నిజనటనమహం
బీక్షింప మునీంద్రుకోర్కె నెద సదయుండై. 148

చ. భ్రమితజటాహతోడునికరంబు రణత్ఫణినూపురేద్ధప
త్కమలసమర్పణప్రచలితక్షితికం బురుఘర్మవాఃపృష
చ్ఛమితవిభూతిపుండ్రకవిశాలలలాటకమున్ హరాక్షదా
మమిళితకంఠహారమయి మన్మథజిన్నటనంబు భాసిలెన్.

సీ. పాదతాడనమునఁ బటబటస్వనముతో
భూతలం బెల్ల నుఱ్ఱూఁత లూఁగె
మండలభ్రమణసంభ్రాంతగంగాశీక
రంబులు చక్రవాళంబు ముంచె
బాహువేగమహానిలాహతిఁ గులశైల
దరుల సారెకుఁ బ్రతిధ్వనులు వొడమె
నిశ్వాసగతమాతరిశ్వస్యదంబున
దిగ్భిత్తితతి విభేదిల్లఁ జొచ్చె
నుద్ధృతైకపదాంబుజద్యుతివిరచ్య
మానపరివేషవిగ్రహం బైనకతన
గోత్రకన్యావిలోచనమాత్రగోచ
రం బయి నటేశులాస్యమహం బెలర్పె. 150

ఆ. ఈశదత్తదివ్యవీక్షణు లగుటఁ బ
తంజలిప్రభృతిమహర్షిగణము
తన్మహేశు నద్భుతం బగునటనంబు
కాంచి పారవశ్యకలితు లగుచు. 151

గీ. జగము మిథ్య యటంచు శాశ్వత మొకండ
సచ్చిదానంద లక్షణశాలి బ్రహ్మ
మనుచు మది దృఢనిశ్చయ మంది రభవ
నాట్యసంవీక్షణోద్భవ జ్ఞానమహిమ. 152

క. నుతియించె వ్యాఘ్రపాన్ముని
పతంజలికిఁ దోడుగాఁ దపస్విలతోడన్
శతరుద్రీయాదుల సం
తతభక్తిలతాసుమాయితము లగుశ్రుతులన్. 153

ఉ. ఈక్రియ నప్పతంజలికి నృత్తమహోత్సవ దర్శనప్రదా
నక్రియఁ దుష్టి సల్పి కరుణాపరిణాహసమంచి తోక్తులన్
జక్రివిభూషణుం డనె నొనర్పు నవార్తిక మైనపాణిని
వ్యాక్రియకున్ మహత్వదవిభాసితభాష్యమటంచుమెచ్చుచున్.

గీ. పాణినీయమ్మునకు మహాభాష్యమునకు
భాష్యభూషణభావంబు పొందువఱచి
స్థిరయశంబున భువిఁ గయిసేసి దివికి
నరుగుము శుభాస్పదుఁడవై యటంచు బలికె. 155

క. వందారువమాన్విదైవత
బృందమ్ము ననుగ్రహించి దృక్పాతములన్
జందిరమాళి కను మొఱం
గెం దుర్గయుఁ దాను ద్రుహిణకేశవయుతుఁడై. 156

క. నృత్తదిదృక్షాగతదివి
జోత్తమసభ యింద్రజాలమో యన నటరా
జత్తఱిఁ బరోక్షు మెనయ వి
యత్తలమున కెగసె వ్యోమయానకరణమై. 157

శా. తత్తాదృఙ్నటరాజరాజ నటనోద్యన్మూర్తి నేకాగ్రమా
చిత్తంబందుఁ దలంచి వ్రాసిరి తపస్విద్వంద్వ మాచిత్సభా
భిత్తిన్; దానఁగదా కలిన్ సయిత మిర్వీమానవుల్ పాపవి
చ్ఛిత్తిన్ గాంచుటకగ్గెఁ దత్ప్రతికృతిశ్రీఁ గాంచి నాఁడాదిగన్.

క. తదనంతరము పతంజలి
చిదంబరేశాన నాట్యచింతనలోల
హృదయుఁ డయి యుండి కొండొక
మొదలిడె నట నుండి భాష్యమును రచియింపన్. 159

గీ. సూత్రకారునిదృష్టిని జొరనిదాని
మతికిఁ దవులనిదాని సమ్మతి ఘటించె
వాక్యకారుండు తదదృష్టభాగ మెల్ల
భాష్యకారుండు నొడివె సంపన్నముగను. 160

క. అని నెగడు లక్షణంబున
కనుగుణముగ నొనరిచెను మహాభాష్య మ్మ
మ్మునిపుంగవుం డహంతా
వినివృత్తచిత్రుఁ డఘదవీయుఁడు గడిమిన్. 161

ఉ. అమ్మహనీయుఁ డట్టుల చిదంబరచిత్సభ శబ్దశాస్త్ర భా
ష్యమ్ము రచించువార్త విని యర్థి మరందపిపాసఁ గూరి పు
ష్పమ్మునఁ గ్రమ్ముతేంట్లవగ భాష్యజిఘృక్షు సుధీసహస్ర మొ
క్కుమ్మడి వచ్చి వ్రాలెఁ సముజ్జ్వలభక్తిఁ దదంఘ్రిసన్నిధిన్.

క. తరియింపఁ దరమె గురుపద
పరిచర్యాప్లవము లేక పారశ్రుతసా
గర మెట్టిసూక్ష్మబుద్ధి
ప్రరోచనునకేని యెట్టిశ్రద్ధాళునకేన్. 163

గీ. అటుల వచ్చిన శిష్యుల నరసి మౌని
పలికె మీ కిచ్చు దీక్ష మద్భాష్య మెల్ల
యవనికాభ్యంతరస్థితి నంది కఱపె
దను బహిర్గతులై మీరు వినుట వలయు. 164

ఉ. అంతియ కాని యెత్తఱిని నత్తెర నెత్తఁగరా దెవం డప
క్రాంతమొనర్చునన్నుఁగను కాంక్ష నతండగు నాకు నప్రియుం
డింతయు బుద్ధినిల్పుకొనుఁడీ యని యొక్క తెరన్ ఘటించి య
ద్దాంతుఁ డనంతభోగవితతం బగునాకృతిఁ జొచ్చె నందులన్

గీ. శాంతిమంత్రజపము ద్వాదశప్రణతులు
శిష్యులను బిల్చి పాఠాదిఁ జేయఁ బనిచి
మఱి సమాప్తిని సైత మివ్విరున సల్పు
వలయు నిచ్చలు నని గురువర్యుఁ డనుఁడు. 166

మ. చకితాత్ముల్ బహుభక్తిసంయుతులునై చట్టుల్ సశాంతిప్రణా
మకపూర్వంబు కుశాసనంబులపయిన్ బద్ధాసనం బొప్పఁగా
తుక మార్గన్ వసియించియవ్విమలబోధుండౌ సహస్రాస్యసూ
క్తికి నేకాగ్రమనస్కులై కఱతు రర్థిన్ దన్మహాభాష్యమున్.

క. దురవగమ పదార్థప్ర
స్ఫురణాచణ మమల మైన భోగీంద్రమనో
హరభణితి యమృతరుచిభా
స్వరచంద్రిక యన హరించె ఛాత్రులతమమున్. 168

ఉ. కొన్నివిభాగముల్ సలిపి కొన్నిటి సర్వముఁ గొంచుఁ గొన్నియ
చ్ఛిన్నసదర్థపుష్టిఁ గయిసేయుచు వార్తికమండలంబునం
దెన్నఁగ రానిస్వేష్టి వెలయించును భాష్యవచోనుగుంఫ మ
స్కన్నదరాక్రముం డగురసాపతి దా భటమండలింబలెన్.

శా. ప్రాలేయాచలతుంగశృంగనిపతత్స్వర్ణిమ్నగా భంగభం
గాలీఘుంఘుమరావధిక్కరణదీక్షారంభముల్ మంథకు
త్క్ష్వేలత్క్షుబ్ధతరంగసంఘకలితక్షీరోదనిర్హ్రాదజం
ఘూత్కారోజ్జృంభము లగ్గలించెను భుజంగస్వామి వాగ్గుంభముల్.

గీ. ఇట్టుల యనర్గళరఘురీ సద్భుజ్మునీంద్ర
వాఙ్మఖంబులు యవనికాబాహ్యధరణిఁ
జుట్టుకొని యుండుసకలశిష్యులకు నొక్క-
సరణి నాలింప నయ్యె విస్పష్టముగను. 171

గీ. పంచశతవక్త్రములఁ బూర్వపక్షములును
నన్యముఖపంచశతిని సిద్ధాంతములును
నొక్క-పటి చేయుగురువచోయుక్తి శిష్యు
లపుడు విస్మాపితస్వాంతు లైరి పెలుచ. 172

ఆ. అటుల భయము వింత యాత్మలఁ గదుర ము
ప్పదియు రెండు వాళ్లు చదివి యవుల
సొరిది 'వాసరూప'సూత్రమ్ము చదువుచో
వారి కెడఁద వింతభావ మొదవె. 173

ఉ. అందఱు చుట్టువాఱి యిటు లచ్చట నచ్చటఁ గూరుచున్న నే
సందియ మందకుండ నొకసారిగఁ జెప్పఁగనొక్క-మోమె యై
నం దర మౌనె యిమ్ముని కనంతముఖంబులు గల్గఁ బోలు నం
చుం దురదృష్టపాకమునఁజూచుతమిఁ దెర యెత్తు నంతటన్.

చ. వివృతఫణాసహస్రము విభీషణదంష్ట్రము కుండలీకృతాం
గవృతధరాతలంబు శిఖఖండవమున్నయనంబు వక్త్రగం
ధవహకనద్విషంబును బునఃపునరుద్గతజిహ్వ మౌ భుజం
గవిభుమహోగ్రమూర్తి లయకాలశివాకృతిఁ దోఁచెఁ దగ్గనన్.

ఉ. త్ర్యంబకలోచనజ్వలన దగ్ధసుమాంబకదేహయష్టిసా
మ్యంబుఘటిల్లనాబుధసహస్ర మజస్రఫణీంద్రఫూత్క్రియా
లంబవికీర్యమాణగరళజ్వలనోషితదేహులై రస
ర్థంబునకుఁ నిదానముగదా గురువాగ్వ్యతిలంఘనక్రియల్.

క. కాలిన కచ్చికకుచ్చెల
పోలిక నుసు తెడలి రూపములు భస్మమయం
బై లక్షింపఁగ వారలు
కాలి రహీంద్రాస్యవిషశిఖావచ్ఛిఖలఁ. 177

చ. ఫణిపతి శిష్యసంచయము పాటునకుఁ మది డిల్లఁబోయి కా
రణ మెది యా నొకో యని దురంతవిషాదచలాచలాత్ముఁడై
ఫణనివహమ్ముఁ బాసి నరభావముఁ బూని దశాశలుఁ నిరీ
క్షణ మొనరించియొక్కతుఁ డా కాలము కార్యవిమూఢుఁడై మదిఁ.

ఉ. ఇక్కడ కార్య మెల్లఁ జెడెనే తొలి దెల్పనె నా ప్రతిజ్ఞ మీ
రెక్కరణిఁ దిరస్కరిణి నెత్తఁ దలంచిరొ యొక్కఁడేనియుఁ
ద్రిక్కక గ్రుక్కుమిక్కనక తీటిరేచ్ఛాత్రులు పుత్రులంద్రు నా
కక్కట "పుత్రహంత్రి యురగావళి" యన్ సడి తప్పదా యెఁగా.

క. గురువాగుల్లంఘనదు
ర్భరదురితఫలంబుగాఁ బరాసువు లయి మీ
రరరే నామెడఁ జుట్టిరె
యురయమిఁ గడలేని బ్రహ్మహత్యామంబుఁ.

చ. అని వెత నున్నపన్నగకులాధిపుసన్నిధి కొక్కశిష్యుఁ డో
య్యనముఖమెండఁబాఱనఖిలాంగకముల్ వడఁకాడమోడ్పుఁగే
లను జనుదెంచి యింగలములం గురియించువిలోలరక్తలో
చనసృతి కోరమై నిలిచి సంభృతగద్గదికోక్తి ని ట్లనున్. 181

క. క్షమియించి దేవ! రక్షిం
పుము వెలి కరిగితిని జలవిమోచనమున కా
సమయమున నాసతీర్థ్యులు
మిముఁ గనఁ దెరఁ జిమ్మి పడిరి మేదిని హతులై. 182

చ. అనుటయుమౌని మండిపడి యద్దిర! యుత్తరశాంతిమంత్రపా
ఠనికృతి సేసి భాష్యనిపఠక్రమమధ్యమునన్ దొలంగి తీ
అనియము మాచరించితివె రక్కసిరూపముతో మెలంగు మం
చునశపియించివ్యాకరణసూత్రమహత్త్వముఁబూనెఁజెప్పఁగన్.

ఉ. వేదము బ్రహ్మరూపమని వెంగలి! యీవు వినంగ లేదె తద్
వేదచయాదిమాంగ మయి విశ్రుతి కెక్కినశబ్దశాస్త్రముల్
గాదొకొ బ్రహ్మ,మద్దికనఁగావిజితేంద్రియులైనఁ గాక దు
ర్వాదు లరిష్టవర్తను లరాళమతుల్ పతితుల్ వలంతు లే.

గీ. శబ్దమే బ్రహ్మ మనియు శాశ్వతము ననియు
నక్షరాకృతి యని పస్పశాహ్నికమున
లాఘన మొనర్పమే తదీయోపదేశ
మును నుపాసనమును దపం బనియెఱుఁగవె. 185

ఆ. అనఁగ శిష్యుఁ డామహామునిచరణంబు
లందు వ్రాలి మీఱ లానతిచ్చు
నఖిల మెఱిఁగి యుండి యయ్యెడ నాబుద్ధి
గడ్డి గఱచెఁ బూర్వకర్మవశత. 186

ఉ. వ్యాకరణశ్రుతం బన స్వయంప్రభవం బని యీశ్వరాస్యనా
ళీకవినిర్గతాద్భుతమిళింద మటంచుఁ ద్రికాలవృత్తివి
త్తాకలితాత్మపాణినసుతగ్రథితామితసూత్రగుంఫన
శ్రీక మటంచు మీఁకరుణచేత నెఱింగినవాఁడనే సుఁడీ. 187

క. సూత్రవిరోధము సలుపం
బాత్రుఁడఁ గాఁజాల కవులఁ బ్రాయశ్చిత్తం
బేత్రోవ మీరు నుడువుడు
రాత్రోవ నొనర్చువాఁడ ననుకొని చనితిన్. 188

శా. ప్రాయశ్చిత్తముగా శపించితిరె ఘోరం బైనరక్తస్వ మే
చాయంబొందఁగఁ జాలెదన్ బ్రదుకు వైచక్షుర్యముల్ వ్యర్థమై
పోయెన్ దీని మరల్చి కావరె భవత్పుత్రుండ నన్నిమహా
పాయోత్తీర్ణు నొనర్పు మూఘుఁడఁ గృపాపాథోధి సంవిన్నిధీ.

క. అని యనుతప్తుండగుశి
ష్యుని పయి ననుకంప యుదయమొంద మునీంద్రుం
డనుపమశీలతభాషల
ననియెను నిను మసల కస్మదాలాపంబుల్. 190

మ. దనుజాకారముఁగాంచఁదప్పదిఁకమచ్ఛాపంబమోఘంబు చ,
య్యన రా నున్నది దానికై మనమునం దావంత చింతింప కో
యనఘా! పూర్వజనుస్స్మతిన్ బడసి క్రవ్యాదుండవయ్యున్ మదా
జ్ఞను జెల్లించినతత్క్షణంబతొలఁగున్ శాపంబుహృత్తాపముల్.

గీ. బుధుల నడుగుము "పచిధాతువునకు నిష్ఠ
యందు రూపం బ దెట్టు లౌ'నంచు నందు
"పక్వ" మనురూప మా ననువాని కెల్ల
భాష్యమును జెప్పఁ దొలఁగు శాపంబు నీకు. 192

క. వ్యాకరణమహాభాష్యము
నీకు మదాదేశమున వినిద్రత దోఁచుం
గాక శుభంబగుఁ గా కని
కాకోదరనాథుఁ డనిపెఁ గరుణన్ వానిన్. 193

గీ. యోగశాస్త్రంబు మును చేసి యుండె నిపుడు
వైద్యశాస్త్రమునకుఁ గూర్చె వార్తికములు
వ్యాకరణభాష్యసహిత మువ్వాని నప్ప
తంజలి ప్రచార మొనరింపఁ దలఁచి తరలె. 194

క. యోగమునఁ జిత్తమలము ప
దాగమమున వాఙ్మలం, బుదారం బగుపై
ద్యాగమమునఁ దనుమల మ
య్యోగీంద్రుఁ డడంచి జగము నోమెఁ ద్రిశుద్ధిన్. 195

క. క్రమముగ గోనర్ద్దజనప
దమునకుఁ జని గోణికాఖ్యఁ దనరుజననికిన్
నమితోత్తమాంగుండై మో
దమునం దోలాబ్ధి సేవఁ దనుపుచు నుండెన్. 196

శా. అంతన్ గొన్నిదినాల కాయము జరాయత్తాంగిమై యాత్మజా
నంతబ్రహ్మరహస్యబోధవిధృతానందామృతాంభోధియై
శాంతిం బూని త్రివిష్టపస్థితిఁ గనన్ శాంతిప్రియంభావుకుం
డంతర్వాణి యతండు రంజిలె శుభోదర్కక్రియాధారుఁడై.

గీ. బాహుపర్యంతపూరుషదేహ మూని
శంఖచక్రగదాసిహస్తప్రశస్తి
వేయిశిరముల వెన్నెలల్ గాయుమేన
వెలయు భగవత్పదుని బతంజలిఁ దలంతు. 198

ఆశ్వాసాంతము.

శా. సంతానీకృతశిష్యవార! నిగమజ్ఞ ప్రాజ్ఞసంసత్సవా
క్రాంత శ్రౌతరహస్యవిచార! స్మృతిమర్మశ్రావణామోదిత
స్వాంతానేకపురీమిళత్పరిషదానంజల్పభాస్వార! య
శ్రాంతోన్మీలనశీలధీబలపరిష్కారా! యుదారాదరా! 199

క. ఏకముఖపతంజలిరూ
పా! కాత్యాయనమహర్షివర్యసరూపా!
శ్రీకరపాణినిపరరూ
పా కుతలగతాద్రిచాప! యమృతాలాపా! 200

ఉ. శుభ్రకరోద్గతామృతవిశుద్ధరుఘుక్రిప్రతిమప్రసన్నశా
చాభ్రమణావధీరితయశఃపదవారణపీపురీబుధా
దభ్రవిరుద్ధపద్ధతికృతక్రమభవ్యగురుప్రసాదనా
మాభ్రగవాక్ప్రదశ్రుతమహాకృతిగుంఫనకీర్తిభాజనా. 201

ఇది శ్రీగురుకరుణాసమాసాదికవిత్వ వెంపరాల
సూర్యనారాయణ నామధేయప్రణీతం
బయిన మునిత్రయ చరిత్రంబునఁ
దృతీయాశ్వాసము.

---

శ్రీగురుమూర్తయేనమః.

# మునిత్రయ చరిత్రము.

## చతుర్థాశ్వాసము.

శ్రీత్రిపురసుందరీమను
పాత్రీకృతరసన! యఖిలపండితపరిష
త్స్తోత్రపదా! యాత్రేయస
గోత్రా! శ్రీసుబ్బరాయకోవిదనేత్రా! 1

ఆ. అవధరింపు మప్పతంజలిచే నటు
శప్తుఁడై వ్యథాతితప్తుఁ డగుచుఁ
దీవ్రరాక్షసాకృతిం గాంచెఁ దచ్ఛిష్యుఁ
డగ్గిఁ బడినకట్టెబొగ్గువోలె. 2

సీ. అభ్రంలిహోత్తమాంగభ్రాంతబభ్రుకే
శక్షిప్తవారిముక్చక్రుఁ డగుచు
ఘోరదంతకూలంకషాభీలదోర్వాతి
కాందిశీకదిశేభబృంద మగుచు
నుష్మలలాటంతపోష్ణాంశుసంకాశ
లోచనోషితజీవలోక మగుచు
నంఘ్రిఘట్టనవిపర్యస్తభూధూర్వహా
ణాంధంభవిష్ణునాగౌఘ మగుచు

గీ. ఘుర్ఘురస్వనగళబిలాగ్రప్రదీప్త
దంష్ట్రికాక్రకచాంతర్విదారిసత్వ
జిహ్వికాశోణితాపూర్ణసృక్వ మగుచుఁ
గలిగె వానికి రాక్షసాకార మపుడు. 3

క. ఆరక్కసి చని యొకఘో
రారణ్యాధ్వమున నిబిడ మగునొకవటధా
త్రీరుహము వాసముగఁ జే
కూరిచికొని దనయవస్థకుఁ విలపించున్. 4

చ. కటకట ! యేల యొజ్జకు నికారము సూపి. వికారరూపసం
ఘటనముగంటి? నెందుఁ గడగాననిశాపము తీర్చుకొంట యె
న్నఁటికొ పవిత్రవిప్రజననంబును గాంచియు బుద్ధిపూర్వకం
బెటు నరమాంసముఁ దినెద నేవము లేకనికంటిదైవమా!

ఉ. నే నొనరించుతప్పిద మణీయము శిక్ష గరీయ మయ్యె నెం
దేని గలండొ లేఁడొ ననుఁ దేల్చుకృపానిధి యున్న నేల యీ
కానకు వచ్చు వచ్చినను గర్చురు నన్నటు చేరఁ జేరినన్
వానిఁ బరీక్షఁ బట్టు నెటు పట్టిన భాష్యము నెట్లు చెప్పెదన్.

గీ. చెప్పుటకు నాకథ యొకింత చెవులఁ బడినఁ
గలఁగ కెవ్వాఁడు పఠియింపఁ గలఁడు ధీరుఁ
డైనఁ గడముట్ట విఘ్నము లలమవే క
నంగఁ దేజస్తిమిరమేళనం బి దెల్ల. 7

ఉ. ఇచ్చినశాప మప్డు లభియించెఁ దదీయవిముక్తిఁ గూడ వా
క్రుచ్చెఁగదా లభింపదనుకోఁదగ దొజ్జయమోఘభాషణుం
డెచ్చట నెప్పు డేబుధుఁ డభీష్టము దీర్చునో యేమివాకొనన్
వచ్చు నటంచు నిచ్చలు నొనర్చు వితర్కము నెమ్మనంబునన్.

సీ. వల్లించు నొకవేళఁ బ్రళయాభ్రగర్జిత
ప్రతిభకంఠధ్వనిన్ శ్రుతులనత్తి
గానంబు సేయు నుద్గాత యట్లొకవేళ
సామవేదంబు నుచ్చైస్స్వరమున
నావృత్తిసేయు నష్టాధ్యాయి నొకవేళ
వార్తికపాఠసర్వంకషముగఁ
బాతంజలము పూర్వపక్షసిద్ధాంతర
హస్యమ్ము లొకవేళ వ్యాఖ్యసేయు.

నిట్టు లాయాతుధానుం డధీతసకల
విద్యలు పఠించుకొనుచుండు విశ్రమార్థ
మవ్వటద్రుమమూలమ్ము నాశ్రయించి
యుండుపాంథులు పఱవ మొఱ్ఱో యటంచు. 9

సీ. ఎటుపోవఁ గాల్లాడ కింతుల బిడ్డలఁ
బరిరంభ మొనరించి యఱచువారు
నులికి మేల్కొని లేచి యుబ్బెత్తు పాఱుచు
నరయరే యని యంగలార్చువారుఁ

గట్టుబట్టలు జాఱ జుట్టులు విడఁబాఱ
వెను చూడకుండ ధావించువారుఁ
గొంత దవ్వరిగి తేఱ్పోని కూర్కుతమవార
లేమయిరో యంచు నేడ్చువారు

నై యథాయథలగుచుందు రర్ధరాత్ర
మున వటద్రుమవిటపాగ్రమున వసించి
వేదశాస్త్రంబులను వల్లెవేయుబ్రహ్మ
రాక్షసుం గని పథికులు ప్రాణభీతి. 10

ఉ. అయ్యది కాశి కేఁగుతెరువౌటను బాంధులుబోవుచుంద్రు గా
కియ్యవనీజమందు వసియించు నొకం డసురుండు రాత్రులం,
దియ్యెడ నుండ మోస మని యేఁగుదు రించుక సంజ వడ్డ, రే
లయ్యెడ నుండు వేల పగలైనభయంపడ కేఁగఁ డెవ్వఁడున్.

చ. ఎవఁడవయా? ద్విజుండవగుదే? పఠియించితె వేదశాస్త్రముల్
ప్రవిమలరీతి వ్యాకరణలక్ష్యము లన్నియు బుద్ధి నిల్పితొం,
టివె? పచిధాతువున్ వినవొ? నిష్ఠను దానికి రూప మెట్టిదో
వివర మెఱింగి చెప్పఁగలవే యను రక్కసి పిల్చి పాంథులన్.

గీ. అం దెవండేని శాబ్దికుం డైన ధైర్య
మెడసియో తత్క్షణమ స్ఫురియింపకో చ
లించుచు వచింపకున్న బాధించు ననుచుఁ
బచిత మనియొ పక్తమనియొ పల్కనంత. 13

ఉ. పండులు దీసుకొంచు విటపంబున నుండి గుభిల్లు మంచు భూ
మండలి డిగ్గఁగా నుఱికి మండుచు దైత్యుఁ డసాధుశబ్దమె
వ్వండు వచించు వాని వడి వ్రచ్చును గ్రచ్చఱ వజ్రరూపమై
యందురు ప్రాజ్ఞు లద్ది వినవా కనవా నిగమంబు బాలిశా. 14

క. ఓరీ యిట్లపశబ్దో
చ్చారణ మొనరించి తింకఁ జావు మని మహా
ఘోరాకృతిఁ బైఁబడి యా
హరించును వాని నపుడ యాఁకలి దీఱన్. 15

క. ఆరీతి నసుర వటధా
త్రీరుహముననుండి పథిచరిష్ణువిపశ్చి
ద్వారముఁ గబళించుచుఁ గాం
తారమ్ము కలంగఁ బెద్దతడ వేఁగించెన్. 16

ఉ. ఆగతి నుండ నొక్కపు డహస్కరుఁ డస్తనగాగ్రలంబియై
రాగము దిక్కపోలతలరాగరసాప్త మొనర్చునత్తఱిన్
వేగమ యేఁగుచుండునొకవిప్రకులుం బుధుఁగాంచి రక్కసుం
డాఁగుమి యంచు నవ్వటకుజాయతశాఖ వసించిపల్కుడున్.

క. పోయెదు నాద్విజుఁ డది విని
యేయెడ నెవ్వానిఁ గనక యెప్పటిఁ జనుచో
నాయాలాపమె వినఁబడ
నీయద్భుత మేమొ యని నిరీక్షించి దిశల్. 18

శా. కానన్ రాఁ డెవఁడున్ దిశల్ గనిన నాకర్ణింపనౌ మాటయో
కానన్ స్త్రీనవితాన ముండు నని పల్కన్ విందు నీమఱ్ఱియం
దేనిన్ బొంతలనేని యుండరు గదా యే మానొ యన్భీతిమైఁ
బోనెంచన్ వినవయ్యె నప్పలుకు కెయూభూజాగ్రమం దొయ్యనన్.

ఉ. ఆవచనంబు వించు ద్విజుఁ డాతఁడు భీతిలి కాశి కేఁగుపెం
ద్రోవను మఱ్ఱిమీఁద నసురుం డొకరుండు వసించి శబ్దవి
ద్యావిదుఁ డేఁగుదే నఁగుగునంట యెవో యని చెప్పకొన్నన
ద్ధీవరు మ్రింగుచుండు నని తెల్పిరి యధ్వగు లద్ది కాదుగా. 20

క. రక్కసి యే మడుగునొ యది
వక్కాణింపం డెవండుఁ బ్రత్యుత్తరమున్
జక్కఁగ వచించి ప్రాణము
దక్కినవాఁ డొక్కఁడేని ధర నున్నఁ గదా. 21

క. ఆవట మిది యగునో కా
దోవృథ వ్యథ నొంద నేల దుష్టులు చోరుల్
గావలయు ననుచు నుండఁగఁ
బోవకు మనుకూయి వచ్చెఁ బూర్వపురీతిన్. 22

ఉ. అంతట భీతి మాని ద్విజుఁ డౌనటు లయ్యెడు నంచు నిల్చియే
కాంత మ దేల వచ్చి యడుగం దగు నెవ్వరి కేది కోర్కెయో
యంతయు నిచ్చువాఁడను మదర్థములియ్య వెయుంచు నంసనం
క్రాంతపటీనిబద్ధనిగమశ్రుతపుస్తకరాశి ప్రోవిడెన్. 23

క. ప్రో విడి కోరెడి వియ్యవి
గా వీక నీప్రాణములనె కాంక్షింతు మటం
డ్రే వైళమ గొం డిదిగో
దైవార్పణముగ నొసంగెదను దను వసువుల్. 24

చ. అనుటయు రాక్షసుండు విటపాంతరితాకృతియై ద్విజాగ్రణీ
ధనములు పుస్తకంబులు ముదంబు ఘటించు నెనాకు నెన్ని యో
దినములుగా వసింతు నిట దీర్పఁ డొకండు మదీయవాంఛితం
బనుదిన మేఁగుచుండు విబుధాగ్రణులన్ బనిపూని కోరినన్.

గీ. నీ వొనర్చెద నంటివి నిజమె యనుచు
నామహీజాగ్రమున నుండి యడిగెఁ దొంటి
పచతిధాతువునిష్ఠలోఁ బడయురూప
మది విని ధరామరుఁడు 'పక్వ' మనుచు నుడివె. 26

క. శాపోన్మోచన మగు నని
యాపోవనియుత్సుకత్వ మాత్మ నలమ న,
లాపముల ద్విజుని దనుపుచు
నాపాదప మప్పలాశుఁ డవరోహించెన్. 27

క. అటు డిగి యాత్మోదంత మ
కుటిలఫణితి నసుర పూసగ్రుచ్చినయటు ల
ప్పటికిఁ దెలిపి బుధుఁ గనుఁగొని
యిటు లను ననుతాపతప్తహృదయుం డగుచున్. 28

ఉ. సంచితపుణ్యలేశము వశంబున శాపమునన్ గురుండు రా
త్రించరతన్ ఘటించినను దేరకుఁదేర గ్రహింపఁగాఁ బ్రసా
దించెను భాష్యమున్ మహామదీర్ణపురాకృతపుణ్యనైష్యమున్
బ్రాంచితసార్వభౌమపదపాలనభాగ్యకశాభుజిష్యమున్. 29

సీ. మూత్రబాధను బారమున కేల శాంతిచె
ప్పకపోయితిని గురుప్రతినయెటఁగి
పోయితిఁబో సహాధ్యాయులత్తఱిఁ దెర
యెత్తి దేశికుఁ గాంచ నెంచ నేల
యెంచిరిపో సాహసించి యెత్తి మహోగ్ర
గరళాగ్నిశిఖ బూదిఁ గలియ నేల
కలిసిరిపో వ్యథాకలితుఁ డౌగఁరునకుఁ
గనలు నాపై నంత గలుగ నేల
గలిగెఁబో పాచితం జేదొ పలుక కకట
ఘోర మగుబ్రహ్మరాక్షసాకార మొంద
శాప మొసఁగంగ నేల నాపాప మేమొ
యవధి గనరా దుపాయమ్ము నరయరాదు. 30

గీ. భూమిసురవంశరత్న ! నాపుణ్యమునను
దావకసమాగమమున దుర్దాంత మస్మ
దీయశాపంబు వాయునుపాయ మబ్బె
నిన్నినాళ్లకుఁ గాని రావన్న యేల ? 31

గీ. అనుచుఁ "దనపాలిభగవంతుఁ డైనగోణి
కాప్రసూతియ" యని యనేకప్రకార
సంస్తుతుల భీతిలుద్విజన్ముఁ జక్కఁ బఱుప
జరిగెఁ బ్రశ్నోత్తరము లిట్టు లిరువురకును. 32

సీ. ఎవ్వాఁడవయ్య మహీసురుండను; పేరొ ?
చంద్రగుప్తుం డంద్రు జనులు నన్ను
నెట నుందువో ? యుజ్జయిని నెట కేఁగెదు ?
కాశికిఁ బాతంజలాశఁ జేసి,
చదివితే వార్త్తికసహితపాణిన్యప
జ్ఞము గ్రంథమయ్య సాంతముగఁ గంటి
నాతోడఁ జదివెదే బీతిల్ల కహిభాష్య
మింతకంటె వరం బిఁ కెది మహాత్మ ?
యని పరస్పరాశయవిదు లైనతోన
యాతుధానుఁడు ద్విజకులసూతి కపుడ
చెప్ప మొదలిడె భాష్యము శేషకృత మ
శేషశేముషీశక్తివిశేష మొప్ప. 33

చ. అనశనుఁడై యసుప్తుఁ డయియయ్యసురుండుశుచిప్రవృత్తి గై
కొని దృఢదీక్షఁ రెణ్ణెలలకుఁ గఱపెఁ ఫణిరాజభాష్య మె
ల్లను నిజశాపమోక్షణఫలగ్రహణత్వర; శిష్యుఁడుఁ గ్రహిం
చె నఖిలముఁ లిఖించుకొనెఁ జెచ్చెరగోటనెమఱ్ఱియాకులన్.

క. ఎందును సందియ మొదవని
చందంబున భాష్యకారుచతురిమ మద్దం
బందుఁ జూపినటుల ద్విజు
డెందము హత్తించె నివ్వటిలుబోధమునన్. 35

గీ. అతిగభీర మపార మహార్యపూర్వ
పక్షసిద్ధాంత మగుమహాభాష్యవార్ధి
మంథగిరివోలెఁ ద్రచ్చి తన్మథ్యసుధ యొ
సంగి శిష్యుని విబుధుఁగా సల్పె నసుర. 36

ఉ. శిష్యుఁడు చంద్రగుప్తున కశేషము శేషఫణీశ్వరోక్తమా
భాష్యము సెప్పి యయ్యసుర భాసురదివ్యశరీర మూని వై
దుష్యమునన్ జగంబునబుధుల్ వొగడన్ బ్రచురింపుమిమ్మహా
భాష్యమునం చుఁబల్కి త్రిదివంబున కేఁగె విమానయానుఁడై. 

క. నిజనఖరాంచలవిలిఖిత
భుజగేశ్వరభాష్యనిబిడమును వటపత్ర
వ్రజమును వలువ ముడిఁచి యా
ద్విజుఁ డౌదలఁ దాల్చి మరలె వెసఁ దనపురికిన్. 38

క. అవిపినవీథిఁ గడవం
బోవుచు నిష్టార్థసిద్ధిఁ బొందుట సీతా
దేవిఁ గని వనధి దాఁటెను
పావనిక్రియ నుబ్బు శ్రమము పాటింపఁ డెదన్. 39

చ. చనఁ జన మింటి నెన్నడిమిచక్కటికిన్ రవి యెక్కి దిక్కులన్
గనగన మండునిప్పు లొలుకన్ ఖగముల్ నిబిడచ్ఛదాంతరం
బున విరుతం బణంగఁ దరుమూలము లధ్వగు లాశ్రయింపఁ జే
ర్చె నరిది మధ్యమాహము సతృష్ణమృగాకులనిమ్నగౌఘమై.

ఉ. చండమయూఖధాటికి ద్విజన్ముఁడు డస్సి కలంగుచున్ గళం
బెండఁగ సైఁపఁజాల కొకయేటికి నేఁగి శుచిప్రవాహత
త్కాండములారఁ గ్రోలి మెయిఘర్మజలంబులు గ్రమ్మఁ దీరమం
దుండెను చెట్టునీడ కెటులో చనెఁ దెమ్మెర సేద దేర్పఁగన్.

క. వికసితసలిలరుహాకదం
బకసురభికచగ్రహంబు మధురశిశిరవా
రికణగణగళగ్రహ మ
ర్భకగంధవహంబు వొలసె బ్రాహ్మణుమీఁదన్. 42

క. మార్గాయాసపిపాసా
దార్గత్య మ్మార్చి సుఖము దాల్చినతటినిన్
స్వర్గంగగ మదిఁ దలఁచి ని
సర్గమధురసూక్తి నిటు ప్రశంస యొనర్చెన్. 43

సీ. నిద్దంపునుగ్గుల నెఱిక దాల్చినరేవ
వెలసె వీచీఘటాలలితఝురము
ముక్తాస్రజము దాల్చుమురువున నలరెఁ బ
ద్మకుడుంగసుప్తహంసవ్రజంబు

హృదయేశుఁ గన నోడ తెల్లఁ గన్నులు దాల్చె
నటు తోఁచె నవవికచాబ్జగణము
తనరూప మితరులు గనకుండ వెలిపట్టు
గప్పుకొన్నటు లొప్పె గొప్పనురువు
లహహా ! యభిసారికానాయికాభిరూప్య
మెనసి పట్టపగంటనే యీనదీల
లామ యబ్ధీశుఁ గవయు లీలాప్రచార
మున వెడలునట్లు పొడసూపె మురిప మొలుక. 44

గీ. భృంగముల కాటపట్టు రథాంగములకుఁ
బూవుఁదోఁట మరుత్పోతములవయాళి
తా వయినయీతరంగిణి దాసెనేని
విరహిలోకము క్షణము జీవించునొక్కొ. 45

ఆ. అనుచు సరసఫణితి నన్నది వర్ణించి
యుత్తరీయ మొయ్య నుర్విఁ బఱచి
యందుఁ బవ్వళించె నలభాష్యవటదళ
గ్రంథమును దలాడగా ఘటించి. 46

ఉ. కన్నులు మూయుటే తడవుగా నిదురించె హృషీకసంధు లె
ల్లన్నిరుపాశ్రయం బయి చలత్వము వీడ మనఃప్రచారముల్
సన్నగిలంగఁ జేతన ప్రశాంతిగనంగను శ్వాసవాయు వ
త్యున్నతి గుఱ్ఱుసూపవిబుధుండ తఁ డధ్వమహాశ్రమంబునన్

క. తత్తటినీశాద్వలతటి
నత్తఱి మేయుచును వత్స మది యొకఁ డవ్వి
ప్రోత్తము నుపధానంబగు
నత్తలిరుల నోటఁ గఱచి యాకర్షింపన్. 48

గీ. త్రుళ్లిపడి లేచి ద్విజుఁ డంగ మెల్ల వణఁక
నయ్యయో నామహాభాగ్య మనుచు లేఁగ
డాసి తన్ముఖమున నుండి తద్వటదళ
గణము రభసంబునన్ లాగి కాంచు నంత. 49

క. పలుతాఁకుల నక్షరములు
పలుతావుల రూపుమాయ బ్రాహ్మణుఁ డెదలోఁ
గలఁగుచుఁ నాఁకట సోలుచు
ములుగుచు గ్రమ్మఱుచు ఖేదమును బొందుతఱిన్. 50

చ. నవనవనీతముల్ గరమునన్ గొని దివ్యపురంధ్రిరూపవై
భవమున కిక్కయైనయొకపల్లవపాణి బుభుక్ష వేఁగు భూ
దివిజునిసన్నిధిన్ వెలసె దేవసదస్యులకున్ సుధాప్రదా
నవిధిని దృప్తి గూర్ప శరణం బగుమోహిని కీడుజోడనన్. 51

ఉ. గిల్లినఁ బాలుగాఱుతులకింపులచెక్కులు మల్లెపూవులన్
జల్లెడుపిన్ననవ్వు శ్రవణంబుల ముద్దిడువాలుఁగన్నులున్
గల్లరికాను క్రొంజిలుగుఁగంచెల మీటఁగ నుబ్బుగుబ్బలున్
జల్లనిచూపులున్ మెఱయజవ్వనిమొప్పెననంగలక్ష్మినాన్. 52

సీ. పరిపూర్ణ తారుణ్యభరమునఁ బూచిన
తంగేడు దలదన్నఁ దలఁచుబెడఁగు
చెంగావిచీర దాల్చినహారంగునఁ జిగి
ర్చినగున్నమావి హసించుఠీవి
చతురస్రశోభి యూశారీరరుచుల బం
గారుకుండ నదల్చఁగఱువతనము
నవనీతమృదులావయవసౌష్ఠవమునఁ జొ
క్కంపుఁబూబంతిని గసరుహొయలు

నచ్చుపడ మేఖలాకంకణాంగదాది
మణిఖచితహేమభూషణక్వణన మొలయ
వచ్చి నిలుచుండె భూసురప్రవరు నెదుటఁ
గొమ్మ మన్మథుగజ్జెలగుఱ్ఱ మనఁగ. 53

సీ. కామినీవిజిగీషుకామఖడ్గ మనంగ
సంపంగిపూల నెసంగువేణి
శశి గెల్చి కనినయశఃకందళం బన
ముక్తాలలంతిక మురియునొసలు
మృడునిచిచ్చుఁగంటఁ బడినపచ్చనివిల్తు
బ్రదికించుఫాలచిత్రకముశోభ
తాటంకమణిఘృణుల్ దపిలి పత్రాంకురం
బులతోడ నలరుకపోలయుగళి

రామణీయకనీరాకరమునఁ బొడము
కంతుపీరశంఖముకీర్తి గన్నగళము
గలిగి యయ్యంబుజాక్షి సంకల్పజన్మ
నిరవధికరాజ్యలక్ష్మి నా మెఱయుచుండె. 54

చ. అడుగులరక్తకాంతికి నలక్తరుచుల్ పయిపెచ్చుగాఁ బథం
బడరెడుసాంధ్యరాగరుచిరాంబరవీథి నగన్ విలాసపు
న్నడకలఁ జేర వచ్చి ద్విజనందనుసన్నిధి వెన్నపాత్రమున్
బడఁతుక నిల్పి మ్రొక్కి యిటుపల్కె నుబల్కులఁ దేనెలొల్కఁగన్

ఉ. ఓసుకుమారరూపవిజితోత్పలచాప! సుధీకలాప! యా
యాసమునొందియుంటివి దెయర్ఘ్యముపాద్యముగొమ్మునై చికీ
భాసురదుగ్ధమంథనభవన్నవనీతము దీని నాని సం
తోసము నొందు మంచుఁగనుదోయిని లేనగ వంకురింపఁగన్.

ఆ. కొప్పు చక్కఁ జెక్కి గుబ్బలఁ బయ్యెద
జాఱకుండఁ దార్చి నీరజాక్షి
యాకుమారవిప్రు నడుగులఁ గడిగి త
జ్జలము శిరమునందుఁ జల్లుకొనియె. 57

గీ. మఱి పిపాసానివృత్తి కత్తరుణి సురభి
శిశిరమధురాంబు వొసఁగి యాశీరతాల
వృంతమున వీచుచును నిల్చె విప్రుమోహ
రసము గ్రోలించి మదనాగ్ని విసరుకరణి. 58

ఉ. ఆఁకొని యుంట నాబుధుఁడు నాచెలి పెట్టెడువెన్నముద్దలన్
జేకొని యాగళంబుగ గ్రసించి జలంబులఁ ద్రావి త్రేన్చి యా
పోక తదాననాంబురుహముగ్ధవిలాసరసంబు జుఱ్ఱి న
న్బ్రాఁకలఁబెట్టుచూపుల నొకంతట నేరఁడు గ్రమ్మఱింపఁగన్.

శా. గోవత్సద్విజవిక్షతాక్షరవృథాకుగ్రామణీప్రోక్తభా
షావ్యావస్థాకులచిత్తనిర్గళితకన్యారత్నబిబ్బోకహే
లావిచ్ఛిత్తివిలాసకుట్టమితలీలామాధురీముఖ్యచే
ష్టావేగుం డయి భూసురుం డను విలాసాభాసదీనోక్తులన్.

శా. చంచల్లోచన! యేమి చెప్ప మదవస్థల్ దుర్లభం బైన భా
ష్యాంచద్గ్రంథదళమ్ము లారయు మివే యంతంత వర్ణక్షతిన్
గాంచెన్ బూరణమొట్టుకల్లు శ్రమమున్ గంగాప్రవేశంబుగా
వించెన్ దుర్విధి వత్సరూపమునఁ దా విచ్చేసి పై పాటునన్.

ఉ. అక్కట! జీవనంబువయి నాసదొటంగి ఫణీంద్రభాష్యమున్
జక్కఁగ నొక్కయక్కరమునన్ గొఱలేకలిఖించి తెచ్చి నే
డిక్కడ లేఁగ నోటనిడి యేఁగఁగ నయ్యె నెయీనఁగాచియున్
నక్కలపాలొనర్చురమణన్ రమణీ గతి యేది దీనికిన్. 62

క. అని యిటు లాప్తుఁ డెవఁడొ భ్రమం
దినగతిఁ గుందెడుబుధేంద్రుఁ దేర్పఁ దలఁచియున్
దనకోర్కి యుందె సుబ్బఁగ
వనితామణి దలఁచి యిటుల వక్కాణించెన్. 63

ఉ. నేనొకగోపకన్య జననీవశవర్తిని నయ్య యియ్యర
ణ్యాని వసింతు నీతెఱువునన్ జనుత్వాదృశు లైనవిప్రసం
తానముఁ గందమూలఫలదర్భసమిత్సలిలార్పణాదిస
న్మానముచేతఁ దృప్తుల నొనర్చువ్రతంబున సంచరించెదన్. 64

మ. ఒకనాఁ డిట్టివిపినాధ్వమందుఁ బడి యెండోపోవుచున్నట్టివా
నికలాపంబునుగాంచి మ్రొక్కినను మన్నింపంగఁ బ్రార్థించి వా
రికి నంభఃఫలకందమూలముల నర్పింపన్ ననున్ బ్రేమపూ
ర్ణకటాక్షంబులఁ గాంచి యిట్లని రుదారం బావరం బాగతిన్.

శా. బాలా నీయొనరించుపూజ ముదమాపాదించె మాకున్ శుభ
శ్రీలన్ గాంతుసుమీ పతంజలిమహర్షిచ్ఛాత్రు రాత్రించర
వ్యాళున్ భక్తి భజించి వ్యాకరణభాష్యంబందు నిష్ణాతుఁడై
వైళం బొక్కబుధుండు రాఁగలఁడు సేవల్ సేయుమ వ్వానికిన్.

క. అతని నరుఁ డనుకొనకుమ
హ్పతంజలియ పొడమె భూమిభాగమునఁ దదా
కృతిని మహాభాష్యమ్మును
వితతంబుగ వ్యాప్తిసేయ వేడ్కఁ గుమారీ. 67

క. అని మును లాడినదానికి
ననువుగ నీపల్కులను మహాభాష్యము నే
ర్చినయటుల విందు నీ వతఁ
డనుకొందుఁ దొలంగు ఖేద మమలవిచారా. 68

ఉ. మౌను లమోఘవాక్కులుసుమా తదుదీరితరీతిభాష్యముల్
బూనిక వ్యాప్తి సేయునెడఁబూరణ మీవ యొనర్పఁజాలె ది
ద్దైనియుఁ జేయ శక్తుఁడవ యేచినఖేదమునన్ యథాస్థితిన్
మానస ముండకుంటవిసుమానవుగాఁ దలపోసెదోసుధీ. 69

గీ. నీవు పూరింప కెటు ధరణీతలమున
నమ్మహాభాష్యమునకు విఖ్యాతిఁ దెత్తు
విది మునీంద్రుల వరమె నెమ్మదిని నమ్ము
కలవు మఱి కొన్నివారివాక్యములు వినుము. 70

క. తావకవినీతివిలసిత
సేవావశుఁడై యతండు చెచ్చెర నిను శో
భావహవిధిఁ బెండిలి యగు
భావిని ! యని తెలిపిరయ్య భావిని వారల్. 71

ఉ. అమ్మను లట్లు పల్కు చను టాదిగ నారయుదున్ జనున్ గళ
త్రమ్మగ నేలుపండితవతంస మెవం డగునో యటంచు ని
త్యమ్మ ననన్యచిత్త నయి, తద్వరదానఫలంబు నీవ యే
నిమ్మగనన్నుఁగొమ్మనుట కెంతయుసిగ్గగుచుండె నావుడున్.

క. రోమాంచకంచుకితతను
వామోదాశ్రువులఁ దోఁగ నదరఁ గరపదం
బామహితుఁ డైంద్రజాలికుఁ
డామదనునిమాయ వింతయై చూపట్టెన్. 73

చ. మనసుకు జిక్కఁబట్టి విషమప్రదరప్రసభప్రచారముల్
గనఁబడ నీక మాటి పలుకన్ గలఁకన్ గళకంప మెచ్చ వి
న్ననువొనరించి తెప్పలొరయన్ సరయుం బరయుంగఁ బాఱు దృ
ష్టిని జెలిలోలదృష్టుల ఖచించి వచించు జలించు వాతెఱన్.

క. కాంత ! పతంజలిమునివరు
నంతేవసదేకతముఁడ యగురక్కసి శే
నంతేవాసిని సత్య
మ్మింతేటికి నీకటాక్షవీక్షార్థి ననన్. 76

చ. అది విని యమ్మృగాక్షి యలసాలసక్రమకటాక్షపంక్తిఁ ద
త్పదము లలంకరించుచు స్మితద్యుతి వెన్నెల గాయు జిల్గుప
య్యెద తుదఁ బాణిపల్లవము నంటఁ బెనంచుచు ప్రౌధరంబునన్
గొదుకుచుఁ జిల్కఁ బోల్కిఁ బలుకున్ రదనచ్ఛవి మోవిఁ గ్రిమ్మఁగన్.

క. ధన్యనైతి నావ్రతములు
మాన్యత నెనసెను మునీంద్రమండలపూజా
జన్యసుకృతములు సర్వ మ
నన్యాదృశరీతిఁ బండె నన ద్విజుఁ డనియెన్. 78

శా. నీరేజానన నీసుధామధురవాణీస్తబ్ధమై చిత్త మే
దారిం గానక తావకాధరసుధాధారాభిలాషంబునన్
జేరన్ రా దయినన్ నినున్ గొనఁగ వాంఛింపన్ మదీయాన్వయా
చారం బడ్డముసొచ్చెఁ గోకమిథునాళిన్ గూల్చు రేయుం బలెన్.

ఉ. ఆత్రము నొందఁ గాదు లలనా నెలనాళులు తాళు మేచు వ
ర్ణత్రయకన్యలన్ విధిఁ గరగ్రహణం బొనరించి వచ్చి నా
క్షేత్రముగాఁ దురీయకులసింధుకళానిధిరేఖ వౌ నిను
మైత్రి దలిర్పఁ గైకొనెద మన్నన నన్నునుపంగదే యనన్.

ఆ. దీనవదన యౌచు నానెలంతుక పల్కె
నిన్నుఁ బాసి యొక్కనిముసమేని
నిలువఁగలనె మున్ను నినుఁ గన నపుడెట్లు
జీవ మెనసితినొ వచింపఁ జాల. 81

సీ. భవదాగమనశుభావసర మెన్నఁడొయంచు
శకునపరీక్షలు సలిపిసలిపి
భవదభిలాష నాపై నిల్పుటకును గం
గాభవానికి మ్రొఁదు గట్టిగట్టి
భవదనురాగసంభాషణామృతమాన
మునులకు దీవింప మ్రొక్కిమ్రొక్కి
భవదీయపాణిసంపర్కసుఖాప్తికై
నోము లెన్నియొ భక్తి నోచినోచి
'చింతితాత్మమనోరథసిద్ధిరస్తు'
టంచుఁ బెద్దలు దీవింప నపుడ నిన్ను
మానసము చేర్చి యుత్కంఠ మఱఁగి మఱఁగి
పొగయు నను నెట్లు వీడెదు చూచిచూచి. 82

ఉ. పుణ్యమొ పాపమో విడిచిపుత్తున నిన్నిఁకని,ంతదాఁకఁ దా
రుణ్యము నెట్లొ కాచితిఁ బరుల్ గనకుండఁగ నీది కాన, నా
రణ్యకభామ నాగరకరాములతోఁ దులఁదూఁగ దంచు నై
ర్ఘృణ్యమునన్ దృజించిన భరింపఁగ రానియఘంబునీకగున్.

క. అని లేఁతనవ్వు నగి య
వ్వనితామణి విప్రుమోముపై వాల్జూపుల్
చినుకుచుఁ గ్రమముగ ననుఁ జే
కొనవచ్చును గాక తోఁడుకొని పొమ్మనుచున్. 84

క. అదె మాఘోషం బం దు
న్నది నాజనయిత్రి నను మనఃపూర్తి సతీ
పదముగ నీ కొసఁగు భవ
త్పదములఁ గొల్చుచును వెన్నుబడి వత్తుఁ బ్రియా. 85

గీ. అనుచు నాచంద్రగుప్తు నిజాలయంబు
చేర్చి తనకథ నంతయుఁ జెప్పి తల్లి
యనుమతి ద్విజున్మ నడుగులో నడుగు వైచి
నడచి చనె ఛాయ రవివెంట నడచుమాడ్కి. 86

క. వడచిన యట్లే లేదని
పడఁతుక యనునట్లు సరసభాషలఁ జిత్తం
బొడలు మఱపించు చాతఁడు
నడచు సతీముగ్ధభాషణములఁ గరఁగుచున్. 87

సీ. వల దన్న వినక మోవఁగఁ బుస్తకంబుల
మూట గొన్నతఱి సోఁకు బోటినఖము
పంకిలస్థలి నడువఁగ భుజాలంబాబు
వలచుకోమలి కరస్పర్శసుఖము
చెక్కుఁజెమ్మట లాఱఁ జెలి చేలకొంగున
విసరుచుఁ గురు లొత్తువిభ్రమంబు
వనశరారుమృగధ్వనిని లేమ యులికి యొ
సంగు స్వయంగ్రహాలింగనంబు.
దలఁచి పెడద్రోవఁ బడుచు నవ్వోలయఁ గాంత,
గనఁగ మరలుచు నడచు నక్కాననమున
నెప్పు డెప్పు డటంచు రతీశ్వరుఁడు హా
శాహాళి యొనర్ప మనసు కలంగి ద్విజుఁడు. 88

గీ. శంభు సేవించి యభయుఁడై జగము గెలుచు
వేడ్క రతిదేవి వెనుకొన వెడలుసాంగ
మగు ననంగుని యవతార మనఁగ నరుగుఁ
దన్మహాశూద్రిసహచరత్వమున బుధుఁడు. 89

మ. తనుఁ గాలొ్త్రిక్కఁగ నిచ్చ వల్లవవయస్థ్రవాత మేఁ తేరఁ“గా
దని“తామార్గోగమాటలున్ బొరువు వారాఱ్ఱిల్ల పాల్సేఁతలున్
జననిన్ ధీర నొనర్చుటల్ శకునముల్ స్వప్నప్రకారంబులున్
వనితారత్నము చెప్ప నూఁకొనుచుఁ ద్రోవన్ బోవుచున్
బాఱుఁడున్. 90

శా. స్వాధ్యాయాధ్యయనశ్రమంబును దదంగాధీతిఖేదంబు భా
ష్యాధ్యేతవ్యవహోతిపాతజనితాయాసంబు కాశీనగ
ర్యధ్యావాసనిమిత్తనిర్గమ మసాహాయ్యంబు ఘోరాటవీ
మధ్యేమార్గగతాసురాశ్రయణకామప్రాప్తులన్ వాకొనున్.

గీ. ఒండొరులకష్టసుఖముల నూఁకొనంగ
వాకొనంగ సుదూర మధ్వం బదూర
మైనకైవడి గోచరం బయ్యె నుజ్జ
యిని సమస్తపురీ శిరోహీరకళిక. 92

ఉ. అజ్జగతీసురుం డటు మృగాక్షి పిఱుందన రా ముదంబుతో
నుజ్జనిఁ జేరి యాత్మగృహ మొద్దికఁ జొచ్చి విధిప్రయుక్తియా
వజ్జనముల్ నుతింపఁగఁ ద్రివర్ణజకన్యల నోలి పెండ్లియై
యజ్జలజాక్షి నాలుగవయాలుగఁ జేకొనె వైభవంబునన్. 93

క. అటు నలువురఁ బెండిలియై
పటుగతి గార్హస్థ్యధర్మపరిపాలకుఁడై
కటకటపడు నెద భాష్యపు
వటుదశముల కిట్టిపాటు వచ్చెనె యనుచున్. 94

గీ. వత్సదంతక్షతోత్పన్నవర్ణములను
పార్శ్వవర్ణసహాయత వ్రాసెఁ గొన్ని
కొన్ని యూహింప రాకున్న నన్నెలవులఁ
గుండలించుచు వచ్చె నప్పండితుండు. 95

మ. నిజగేహస్థితుఁడై పతంజలికృతిన్ ధీశక్తి శోధించి య
క్కజ మౌనాట్టుల శిష్యసంతతికి వక్కాణించుచున్ నల్వురన్
ద్రిజగన్మోహనమూర్తులన్ సతుల భూదేవుండు చేపట్టి చి
త్తజసామ్రాజ్యసుఖానుభూతినిరవందన్ దేల్చుఁదుల్యంబుగన్.

చ. అటు లొకకొన్నినాళ్లు చనునంత వసంతము రంజిలెన్ మదో
త్కటరుషలాంఛనద్విపరదాయితకౌసుమగుచ్ఛఘాత వి
స్ఫుటితకటీవిటప్రణయపూర్ణ మనశ్చ్యుతహావభావసం
కటితలతానిశాంతము పికస్వరభిన్నదిశాంత మెంతయున్. 97

సీ. తలలెత్తెఁ జివుళులు తరుణదంపతులస్వాం
తముల జనించురాగములతోడఁ
బొడసూపె మొగ్గగుంపులు పాంథలోకచి
త్తములఁ బుట్టుమనోరథములతోడ
వికసించెఁ బూపు లుత్సుకులై కనుంగొను
కామినీకాంతులకనులతోడ
వెలసెఁ బుష్పరసంబు విటజనాపాంగశృం
గారరసోర్మికాఘటలతోడఁ
గెరలె మధుకరపాళి ఝుంకృతులతోడఁ
బరభృతము గేరెఁ బంచమస్వరముతోడ
రంజిలె శుకంబు కిలకిలారవముతోడ
వరలె వనలక్ష్మి పూర్ణయౌవనముతోడ. 98

గీ. ఆకు రాలిచి శిశిరర్తు వపసరిలఁగ
మొలిచె నిగిరిచె ననిచెను బూచెఁ గాచెఁ
బండె నవనీజవల్లికాకాండ మొక్క
నిమసమున నవ్వసంతు నిర్ణిద్రమాయ. 99

ఉ. ఆకులు డుల్చి లేఁజివుళు లట్టిటు చిమ్మి ననల్ గదల్చి య
స్తోకపరాగముల్ గొని మధుద్రవ మూని రతాంతతాంతబి
బ్బోకవతీకపోలతలభూరినిదాఘము లార్చి తావులన్
జేకొని దాడివెట్టుకరణిన్ విరిదోఁటల నాడెఁ దెమ్మెరల్. 100

గీ. సకలవిటపిలతావికాసము ఘటించు
మధుఁడు జాతి నలర్చ సామర్థ్య మెడసె
భువనరంజకుఁ డయ్యు నేపురుషుఁ డాత్మ
జాతికిని జ్ఞాతికిని గూర్పఁ జాలు హాళి. 101

క. నిపతింపన్ స్త్రీపుంస
ప్రపంచమును ద్వంద్వములుగ రతిపతి; మధుఁడున్
నిపుణుండయి రాత్రిందివ
మెపుడును రతిఁ గూర్చు నవ్యయీభావముగన్. 102

సీ. మాకందఫలరసశ్రీకరంబై మించెఁ
ప్రస్ఫుటాశోకాలవాలపంక్తి
ప్రస్ఫుటాశోకపరాగసంపూర్ణ మయ్యె
దళితమల్లీసుమస్తబకరాజి

దళితమల్లీసుమస్తబకగంధిల మయ్యె
నంకురల్లవలీలతాగ్రదళము
లంకురల్లవలీదళాచ్ఛకాంతుల మున్గెఁ
బరిపక్వదాడిమప్రసవరుచులు
దాడిమీఫలరసధారఁ దనిసెఁ బనస
భూజములు తత్ఫలాంతరాపూర్ణమాధు
రీధురీణరసాసారమ్మృదితధరణి
తలము లమరంగ నుపవనోత్కరము లలరె. 103

చ. మదనుఁడొకండెచాలుయువమానలయక్రియ కందుపై మహా
భ్యుదయముతోవసంతుఁడఖిలోర్విఁ గ్రమ్ముటయాకసంబునన్
మదమునఁ జందమామసుషమాఝరిముంచుటపుట్టెనిక్కఁకె
య్యది యొకో విప్రయుక్తలలనావళికిన్ బధికాళి కత్తఱిన్.

క. భోగులును వియోగులు నొక
లాగున సేవింత్రు కోమలకిసలశయ్యా
భోగము మిళితసితాభ్రప
రాగపటీరద్రవాంగరాగము వగలన్. 105

సీ. క్రొందేనె కైగాన్క లందిచ్చి మధుప మం
గన జుమ్మురనుచుఁ జుంబనమొనర్చెఁ
గలకంఠరుతిఁ గాంతు వలపించి కోకిలా
బల పట్టువడియు బిట్టలఁచుఁ గవయ

రతిపరిశ్రాంతకీరముఁ దేర్పఁ శుకి ఫల
రసము గ్రోల్చెను బునారతిఁ దలంచి
పద్మాతపత్త్రంబు పట్టె హంసంబు భా
ర్యకును రాజోపచారములు సేసెఁ
గరి కరిణి కిచ్చె సల్లకీతరుణపర్ణ
వీటి; మృగిమోము మూర్కొన లేటి యలయు
మదనరాజన్యశాసనమహిమ నఖిల
జగము శృంగారరసరంగముగ వెలింగె. 106

చ. తలిరులఁ బందిరుల్ వయిచి తళ్కులఁ గ్రొన్ననయాణిపూసలన్
దళముగఁ గూర్చి కీరమిథునవ్రజతోరణముల్ ఘటించి తే
నెలఁ గలయంపి చల్లి హవణించె సమస్తవనుల్ వసంతుఁ డిం
పొలయఁగ జైత్రయాత్రచనుచున్న రతీశు బహూకరింపఁగన్.

సీ. కర్పూరకస్తూరికాకుంకుమద్రవా
భ్యంచితాంబులఁ జల్లు లాడువారు
ఘుసృణకేసరమిళత్కుసుమపరాగముల్
గొని నర్మముగఁ జిమ్ముకొనెడివారు
మల్లికాచంపకోత్ఫుల్లవల్లరులఁ జే
కొని నవ్వులకు రువ్వుకొనెడివారు
ఫలరసమిళితపుష్పమరందధారలఁ
దలిరుదొన్నెలఁ బట్టి త్రావువారు

గీ. నగుచు నుద్యానముల రసాలాదితరుల
చాయల నికుంజముల మద్రసప్రయుక్త
భోజనమ్ముల దనిసి యుప్పొంగుచుండ్రు
యువయువతు లత్తఱిని వసంతోత్సవముల. 108

ఉ. అత్తఱిఁ జంద్రగుప్తుఁడు నవాంబరభూషణసూనచందనో
దాత్తపరిష్క్రియారుచిరుఁడై స్మరకేళిఁ గఠోరయౌవనా
యత్తలఁ జిత్తజన్మనిగమాధ్యయనోత్కల రాగమత్తలన్
బిత్తరులన్ గరంచు సుమవిస్తృతకోమలశయ్యలన్ రతిన్.

చ. మణిమయసౌధసీమల సుమప్రచురం బగుసెజ్జలన్ వధూ
మణులను నల్వురన్ వివిధమండనదీప్రల వీటికాసమ
ర్పణమున నంగరాగవిభవంబున భూరితరార్థపూర్తినై
పుణి నలరించు చష్టవిధభోగము లాతఁడు చూఱగాఁగొనెన్.

మ. అనుకూలుం డని నల్వురున్ మనములం దౌద్ధత్యమున్ బొందుటన్
గనుచున్ దక్షిణధర్మ, మయ్యబల లేకత్రస్థితిన్ గాంచువే
ళను గుట్టెల్ల నెఱింగికొంచు శఠలీలన్ జూపెదే యంచు న
ల్లను జిల్కంగ నతండు లే దనుచు ధిక్కారించుధార్ష్ట్యంబునన్.

క. నవ్వించును నర్మోక్తుల
రువ్వించును జెండ్లఁగొని యారుంతుదసూక్తిన్
ద్రవ్వించును దనదప్పులఁ
ద్రెవ్వించును నరము లుపరతిన్ సుదతులచేన్. 112

క. పాలయలుకలఁ బావురప
ల్కులఁ గుల్కులఁ బ్రార్థనములఁ గుచకచగండ
స్థలసంస్పర్శనముల న
చ్చల మగువేశ్యల నలర్చుఁ జతురత సతుల౯. 113

ఉ. అయ్యవనీసురుండు హృదయజ్వలదంగజవీతిహోత్రునం
దాయ్యన యాావత్తిర్ద్విజనయుక్తి లసన్మణితాగమోక్తి సా
హాయ్యముస౯ దృతీయపురుషార్థము చేపడ హావభావసా
న్నాయ్యమ్ము వేల్చుచుండు మదనక్రతుదీక్షను బూనియామని౯.

గీ. ఇంచుమించుగ నొకనెల యెడమువడఁగ
నలువురు కళత్రములు గర్భములను దాల్చి
రాచరితమాన్మథాధ్వరాయాత మగు న
పూర్వఫలములనంగ నపూర్వముగను. 115

క. అంతట సీమంతినులు ల
తాంతాయుధకేళి నలసి నటు బడలి జర
తాాంతలు 'నిజమే' యని నగ,
నంతర్వత్నీప్రతీతి నందిరి పురిలో. 116

సీ. ఏవస్తువును రుచియింప దేమే యంచు
నడిగి నవ్వినబోటి నలుకఁ జూచుఁ
జెలియరో చెక్కు వెల్వెలఁ బాఱె ననుసకి౯
ముసిముసి నగవుతోఁ గసరికొట్టుఁ

దరుణి రేవగలు నిద్దుర యేలె యనిన నె
చ్చెలి నెట్లొ కనువిచ్చి యలఁతఁజూచు
నెదియో విశేష మున్నది యనునాళిపై
విరిబంతి విసరి యుస్సు రని యలయు
నెక్కుడించిన మదనుపుండ్రేక్షుచాప
వల్లు లనఁ గేళి మూని వైవశ్య మూని
లాలితాకృతి బాహ్యదలక్షణముల
దొరయుద్విజమాళి దారచతుష్టయంబు. 117

సీ. నడతు రుద్యానంబునను బోటికై తండఁ
గోని యంచ లనఁగ నల్లన నొకింత
నలయు చుందురు కొప్పునందలివిరి జాతి
తనువల్లి సోఁక ను స్సనుచు సోలి
యోకిలించెద రమృతోపమానములు భ
క్ష్యము లేని కసిగాటుగాఁగఁ గొఱికి
లజ్జించుచుందు రేలాలతాడోలావి
హృతికినై మొనసియు నెనయలేక
గర్భభరములు నానాఁటఁ గానరాఁగఁ
జీర చిక్కంగఁ జిట్టుముల్ గాఱుకొనఁగఁ
జూచుకమ్ముల మేచకరోచి యలమ
నల్లచూలాండ్రు నల్వు రంతంత సొగసి. 118

క. బంధుగులు సూడిదల నా
సుందరుల బహూకరించి సుతులఁ గనుం డం
చుం దీవించుచునుందు ర
మందానందమున విప్రమహాళి ముసుంగన్. 119

ఉ. అందఱకంటెఁ బెద్దదియు నాద్యము నాదిమగర్భశాం
నందితనాథ యైనద్విజనందిని సుందరమూర్తి గన్నదో
యిం దనివారఁ గాంచి విబుధేంద్రుఁడు సంస్కృతులొప్పఁ గూర్పని
చ్చం దలపోసి లజ్జ పెలుచన్ వెనుదీయఁగ మాన కంతటన్.

క. కరబదరసమముగ శ్రుతో
త్కర మరసినవాఁ డగుట నతం డపుడు స్మృతుల్
పరికింపఁ బుంసవనసం
స్కరణమున మతద్వయంబు గనఁగా నయ్యెన్. 121

గీ. ఒక్క రని రప్రహాతభూమి నొకట సంస్క
రింపఁగఁ దదాది యుర్వరీకృత మగునటు
ప్రప్రథమగర్భసంస్క్రియాద్వార మున స
మస్తగర్భశోధకము పుంసవన మనుచు. 122

ఆ. కన జనిష్యమాణగర్భమ్ము పుంరూప
మొనసి శుద్ధి బొందుననువు పుంసు
వనము గూర్పఁ గావునను బుంసవన మది
కాద యనిరి కొంద ఱాదిమునుల. 123

క. శ్రుతిహితముగఁ దత్స్మృతిస
మ్మతి గలుగ సమన్వయించి మాహూర్తికస
మ్మతి శుభముహూర్త మారసి
మతిఁ బుంసవనంబు నడపుమార్గ మెఱింగెన్. 124

క. నాలుగవనెల చేరంగా
వాలుంగంటికిని బుంసవనసంస్కార
శ్రీ లొందఁ జేయుతలఁపు త
దాళీముఖముననె తెలిపె నఖిలాప్తులకున్. 125

సీ. కైసేసి రాళు లంగణము లంతర్గేహ
ములు రంగవల్లుల ముద్దు లొలుక
వచ్చి రాప్తులు బాంధవప్రజ లాహూతు
లై తదీక్షోత్కలికాత్ము లగుచు
సాధించె మున్న పురోధసుం డను వగు
తదుచితమంగళద్రవ్యములను
నిలిపిరి సదళద్విఫలవటశాఖ స
న్నికలు పొత్తరము వేదికను బోట్లు

గీ. పల్లవాంచితపూర్ణకుంభంబు లైదు
వలు నెలవుకొల్పి రందంద నలువుమీఱ,
దంపతులు గూరుచుండ రత్నాలగద్దె
లమరిచిరి చేడె లగ్నిహోత్రాంతికమున. 126

గీ. అచటఁ బూర్వేద్యురాచరితాంకురార్ప
ణమున సర్వౌషధులు నాననములుసూప
నున్నజాజాలపాలెల లయ్యెవిధ 'లిట్టి
కులము మొలకెత్తు'ననునట్లు నిలిపి రచట. 127

శా. పూతాత్ముం డగుచంద్రగుప్తబుధుఁడంభోరాశినాఁబొంగి,సు
స్నాతుండై కలధౌతధౌతఘటరత్నస్వర్ణభూషాభృతుం
డై తాత్పర్యమెలర్పఁగాఁ బ్రథమసంధ్యాకృత్యముల్ దీర్చియా
నీతజ్ఞాతిహితాప్తబంధు లలరన్ విచ్చేసెఁ దద్వేదికిన్. 128

ఆ. సభకు వినయ మెనయ సాష్టాంగముగ మ్రొక్కి
యడుగు మోవ నూతనాంబరమునఁ
గప్పఁబడిన పెద్దగద్దియపై సమా
సీనుఁ డయ్యెఁ దత్సభానుమతిని. 129

సీ. తీఁగతీఁగెను బ్రాఁకి లేగాలి మెదలుకై
వడి బోఁటికై దండ నడక లమర
తొలివాన నిగ్గుచునీపలతికవలెఁ బరి
పుష్టాంగకములఁ సొమ్ములు వెలుంగ
నాస్తికవాదుల కాస్తికత్వము నేర్పఁ
గ్రమపుష్టిమై వలగ్నమ్ము దోఁప
నడు గామడగ మంద మగుయానమున నూర్పు
గాడ్పుల ముక్కుముంగలు చలింప

గీ. వదనపాండిమ చిఱుబంతిపసుపుపూఁత
మఱుఁగుపడఁ గుంకుమపుబొట్టు మసృణపక్ష్మ
కజ్జలవినీలిమంబుపైఁ గాలుద్రవ్వ
వచ్చె నవ్విప్రకులునగ్రపత్ని యటకు. 130

మ. ఫలపుష్పాక్షత ఖండపూగఫలసంపన్నంబు తాంబూల మం
జలి రంజిల్ల నిజేశుదక్షిణపుఁ బార్శ్వంబందుఁ దత్పితృ సూ
ర్పులు వాసింపఁగఁ గూరుచుండెఁ బవనాపూర్ణజాత వేదుద్యదు
జ్జ్వలతేజం బిడి గర్భమోముమనిసంప్రార్థించుచందంబునన్.

గీ. పాఠులు 'ఫలంమనోరథఫల' మటంచుఁ
జదువ ఫలయుక్తవీటికల్ జంపతులు పు
రోధ కర్పించి సభకును మ్రొక్కి తదను
మతి వడసి యాచమించిరి స్మృతిహితముగ. 132

ఉ. ఐదువపేరఁటాండ్రు సకియల్ సవతుల్ దరహాసచంద్రికల్
పాదుకొనన్ గనుంగొనఁ దలన్ నునుసిగ్గిసుమంత వంప న
ప్పైదలి యాచమించెఁ బతిపాణిసమర్పితవారి బాలసూ
ర్యోదయసాఖిబుద్ధజలజోపమితాగ్రకరంబు సాచుచున్. 133

గీ. ఆదిపూజ్య విఘ్నేశుఁ బూజాదిఁ దనిపి
సజలచూతాంకురము కలశత్రయంబు
రత్నముల నింపి చదివించె బ్రాహ్మణుండు
బాడబులచేతఁ బుణ్యాహవాచనంబు. 134

చ. కలశయుగంబు మోముసరిగా నిరుగేలను నెత్తి క్రిందియ
క్కలశిని రెండుధారలు నొకం డగునట్టుల నించుకాంతు చే
ష్టలఁ గడకంటఁ గాంచి పయఁటఁ సవరించి త్రపానతాస్యనై
పొలఁతుకగర్భ మారసి విభుఁ గడగంటను గాంచె వాఁడిగన్

గీ. స్వస్తిపుణ్యాహవాచకబ్రాహ్మణులకు
దక్షిణోదాత్తతాంబూలతతు లొసంగి
సభ్యులయనుజ్ఞ వడసి పుంసవనసంస్క్రి
యకును సంకల్ప మొనరించె నాగృహస్థు. 136

క. గురుఁడు కుడిచేత ధరణీ
సురునకు రక్షార్థముగను సూత్రము గట్టన్
దరుణి కతఁ డెడమకరమునఁ
గరము గరం బుసురఁ గట్టెఁ గంకణ మంతన్. 137

సీ. ఔపాసనాగ్ని నుద్దీపితం బొనరించె
ధ్యానించెఁ దైసేసె నక్షతముల
బర్హిరగ్రముల నుపస్తరించెను నాచ
మనముఁ బ్రాణాయామమును బొనర్చెఁ
బుంసవనస్మృతహోమములకు సంకల్పించె
నగ్నిప్రతిష్ఠాపనాది నడపె
పట్పాత్రసహిత మాసాదించెను పటాంకు
రధృవత్సులములు వస్త్రము విసూత్న

గీ. మాజ్యభాగాంతకర్మమ్ము నాచరించె
సుదతి యందీయ నాజ్యమ్ము స్రుక్కునను గ్ర
హించి 'ధాతా దధాతు నో' యంచు మంత్ర
ములు పఠించు చెన్మిదిహోమములను సలిపె. 138

ఉ. ఆజ్యము నారఁగ్రోలి జ్వలనాఖ్య యథార్థముగా హుతాశుఁడుర్
వ్రాజ్యశిఖాకలాపములఁ బల్మఱు దత్పతిగర్భమున్ సుప
ర్వేజ్యుని మించి మించుల మహిన్ వెదజల్లుచు సర్వభూమిభృ
త్పూజ్యునిగా నొనర్చుటకుఁబో యనఁ జేసెఁ బ్రదక్షిణక్రియర్

శా. ధూమాచ్ఛాదన నల్లనయ్యె నని పాథోజాస్యదేహంబు ను
ద్దామంబై నస్వదామచక్రములఁ గాంతం బాచరించెర్ గ్రమ
క్షామం బౌచును వహ్ని; సుందరియు గ్రీష్మద్వాదశాత్మాతప
క్షామం బౌనవమాలికాలతికకున్ గల్పింప నల్పత్వముర్.

గీ. ఇధ్మములఁ బూజచేసి యభీష్టసిద్ధి
కగ్నిహోత్రమునందు జయాదిహోమ
మవధిగా వేల్చి, బ్రహ్మత్వ మవధరించి
యున్నగురు దక్షిణాపూర్వ ముపచరించె. 141

మ. అనవస్నాత కుమారి చిర్నగవుతో న్యగ్రోధశుంగంబు నా
సనకంటన్ నెలకొల్పి పాత్రమునఁ బిష్టంబౌనటుల్ నూఱి యి
చ్చినఁ జేలాంచలమందుఁ బట్టి బుధుఁడున్ జెన్నారఁగాఁ బిండెవం
గనకున్ దక్షిణనాసికాపుటిని జొక్కల్ పోయు దత్సారముర్.

సీ. అర్ధమీలితనయనాబ్జాతములతోడ
దరహాసచుంబితాధరముతోడఁ
జిఱుగుంతవడినలేఁ జెక్కుటద్దములతో
మృద్గంధినిశ్వాసవృత్తితోడఁ
బులకకంచుకితాంగములతోడ నానంద
బాష్పసంప్లుతపక్ష్మపాళితోడఁ
గించిదుత్క్షిప్తకరాంచలమ్ములతోడ
దళ మైనమానసోత్కంఠతోడఁ

గీ. బావకోద్దిశాస్థలిఁ బ్రాఙ్ముఖముగ
వెలయ నుత్తానశయన యావెలఁదుకకుడి
ముక్కుగూఁటను బిడిచెఁ విప్రుఁడు వటఫల
దళరస మ్మంగుటమున బొట్టులుగ రాల. 143

క. నవ్వుకొనుచుఁ జెలికత్తెలు
పువ్వారుంబోఁడివక్త్రమును బన్నిటన్
మవ్వ మెసఁగఁ దుడుచుచుఁ బతి
కివ్వలగద్దియను నిలిపి రెప్పటియోలెన్. 144

గీ. మంగళారాత్రికములు సుమంగళీజ
నంబు మధురస్వరముల గానములు మీఱఁ
బట్టి రామ్నాయవిమలదీవనలు సోదు
ముట్టె వాద్యధ్వనులఁ దూఁటుగట్టె దివము. 145

క. సీమంతినీలలామకు
సీమంతోన్నయనవిధిని జేయఁగఁ గులవృ
ద్ధామోద మెసఁసి యపుడే
భూమీసురుఁ డాచరింపఁ బూనెం దీక్షన్. 148

గీ. అంత దర్భపుంజీలత్రయంబుఁ ద్రేణి
నైనశలలియు గ్రథితయవాంకురములు
జంతుఫలశాఖతోడ నాసాదనం బొ
నర్చె పట్నాత్రసన్నిధానమున నొజ్జ. 149

క. మంగళవాద్యధ్వనులు న
భోంగణము దిగంతరములు నలమె నయిదువల్
పొంగుచుఁ బాడిరి ధవళము
లం గెరకి వసంతకోకిలాకాకలితోన్. 150

గీ. బీజగర్భసముద్భవవృజినశాంతి
కలిగి ప్రతిగర్భసంస్కార మమరుకొఱ క
టంచు సీమంతమున కాచరించె విప్రుఁ
డెలమి సంకల్పమును బురోహితునిమాట. 151

సీ పూజించె విఘ్నేశుఁ బుణ్యాహవాచనం
బేతదంగముగ గ్రహించి చేసె
జతగూర్చెఁ బాణి రక్షాబంధనమ్ము నా
భ్యుదయికకర్మార్థ మర్వ్యసురుల

నాసన మొసఁగి యర్ఘ్యం బిచ్చి గంధాక్ష
తాలంకృతులఁ జేసి యర్హరీతిఁ
గనకగోదానాదికములఁ దృప్తులఁ జేసెఁ
బుణ్యాహవాచనాంబువులఁ బత్ని

గీ. తనువు జల్లన మాళి మార్జన మొనర్చెఁ
దడయ కౌపాసనాగ్నిహోత్రమున సక్ర
మంబుగాఁ జేయఁ దొడఁగె సీమంతహోమ
మాజ్యమును స్రుక్స్రువంబుల నందికొనుచు. 150

సీ. నీలాంబుదాంతరోన్మీలితసౌదామి
నీవల్లికాశోభ నివ్వటిలఁగ
వారాంనిధితరంగవారసందృశ్యమా
నౌర్వకీలాదీప్తి యావహిల్ల
హరినీలమణికిరణాచ్ఛన్నసౌవర్ణ
భూషావిశేషంబుపోలుపు మమరఁ
దరుణపత్త్రాంతరాంతరభాసమానచం
పకమంజరీద్యుతి మైకొనంగఁ

గీ. దేజరిల్లె సీమంతాహుతిప్రవృద్ధ
జాతవేదోర్చిరసకృదుద్భూతసురభి
ధూమపటలీవిభాగసందోహవిస్ఫు
రితధగద్ధగితాంగదీధితుల గరిత. 151

గీ. శ్రద్ధ కడలొత్త ఋగ్యజుస్సామవేద
మంత్రములను సీమంతహోమము జయాది
హోమ మొనరించి గురుని విధ్యుక్తదక్షి
ణాదులను బూజసేసి బ్రాహ్మణుఁడు వార్చి. 152

క. దరిసె సుముహూర్త మని ప్రాం
ద్దరసి గణకు లపుడు తెలుప నగ్ని కుదగ్ది
క్కారసికొని ప్రాఙ్ముఖముగా
సరసిజముఖి గద్దె నునిచి సంభ్రమ మొదవన్. 153

గీ. తాను బశ్చిమముఖుఁడై సదర్భపుంజ
జంతుఫలశాఖకముగఁ దచ్ఛలలకంట
కమ్ము కేల్దమ్మిఁ గొనియో'రాకామహా'మ్మ
టంచు మంత్రమ్ము పఠియించుకొంచు ద్విజుఁడు. 154

పొలఁతుల్ గేరుచుఁ జప్పటల్ చఱచి నవ్వుల్ రువ్వఁగా బాంధవుల్
తిలకింపన్ శలలీశితాగ్రమున నొత్తెన్ నాభి కూర్ధ్వంబుగాఁ
జెలికిన్ మై పులకింప సాంద్రకబరీసీమంతరేఖాంత ము
జ్జ్వలరత్నాభరణాయితార్కశశిబింబస్థేమసీమాంతమున్.

ఉ. పొక్కుట నిక్కయూ రొరసి పోయి చనుంగవ నక్కి యెట్లొపై
కెక్కి గళంబు సోఁకి స్పృశియించుచు గడ్డము నాసికాగ్రమున్
ద్రొక్కి తటానఁ గూర్చుముచు న్రోసి లలాటము దాఁటి పాపటన్
జక్కనొనర్చుచున్ శలలి జాతెఁ బిఱుందు గ్రహించి వెక్కసున్.

ఉ. అంగన మాళి నుద్ధితయవాంకురపుంజము దాల్చి పింఛికా
లింగితకైశ్యమై శబరిలీల నటించుభవాని కుద్ది య
య్యాం గనకాభమై మును రహించుతనూలత హోమధూమధూ
మం గతివన్నెయాట నుపమానము పూర్ణత గాంచిమించఁగన్.

సీ. నాల్గువేదములమంత్రములతోఁ బరిపాటి
నాశీర్వదించిరి యవనిసురులు
దాల్చిరి తలలఁ దద్దంపతుల్ తన్మహా
దాశీర్వచోహరిద్రాక్షతమ్ము
లందిరి తత్సదస్యవ్రజంబు సదక్షి
ణాకఫలప్రదానములు వరుసఁ
బాండిత్యపరిమితిఁ బట్టిసంభావన
సలిపె విప్రుఁడు వేదశాస్త్రవిదుల
జాతవేదున కపులఁ దజ్జంపతులకు
రమణు లెత్తిరి మంగళారార్తికముల
మిహిరునకు మ్రొక్కి పీఁటలమీఁదనుండి
లేచి రయ్యాల్మగలు జనుల్ మెచ్చి గాంచ. 158

క. మాధుర్య మొలుకువీణా
గాథకయుగవేదమంత్రగానము వినుచున్
సాధుమతి మాన మూని ప్ర
బోధమ్మున ద్విజుఁడు దివసమును గడపుచ్చెన్. 159

గీ. ఆత్మజారయాకచాకీర్ణ మైనకుసుమ
సంతతులఁ బోలి దివిని నక్షత్రగణము
గాన రాఁ జూచి విడిచె నమ్మానముద్ర
పరిహసింపంగ వియ్యాలవాలివారు. 160

క. తూరుపుదిశగాఁ జని య,
న్వారబ్ధీభూతవత్సుఁడై వ్యాహృత్యు
చ్చారణ మొనర్చి వార్చి యు
దారుఁ డతఁడు వహాన ముడిగి యలయక మఱియున్. 161

ఉ. బందుగు లాప్తమిత్రులు ప్రభావనిధుల్ విబుధుల్ సహస్రమ
మ్మందిరచత్వరంబుల సమంచితవేదుల వేఱ బంతులై
విందును నారగింపఁ దగువిస్తరముల్ సమలంకరించి రా
నందమునన్ బుధుండు స్వజనంబులు భక్తిని బిల్చి తేరఁగన్.

సీ. మల్లెపువ్వుల మించి జల్లనిరాలుక
ర్పూరభోగుల మేలిబువ్వములును
దోరగా వేఁగి బంగారుచాయలఁజిమ్ము
కమ్మనినునుముద్దకందిపప్పు
జీరకోషణశృంగబేరాద్యుపస్కర
సంస్కృతాద్భుతనైకశాకవితతి
కుస్తుంబురుసుగంధనిస్తులోర్వారుకా
మ్లికలశలాటులలేహ్యములును

శాయసంబు లపూపాదిపంచభక్ష్య
రాశి గదళీఫలాశాంతరములఁ గన్న
దనియ వడ్డించి రిసుమంతతటికి బోన
క్షత్రియులు కంకణాంగదక్వణన మొలయ. 163

క. సంతోషంబున భూసుర
సంతతి షడ్రససమేతచతురాహారా
త్యంతాభ్యవహారంబుల
సంతృప్తిం గనిరి ద్విజుఁ బ్రశంస సలుపుచున్. 164

క. మోహన మగుసూడిద ల
ద్దోహదవతి కంత హితతతుల్ బాంధవసం
దోహమ్ము లొసఁగి చని ర
వ్యాహతహర్ష ద్విజేశ్వరార్చితు లగుచున్. 165

ఉ. క్షోణిసురుం డనుక్రమము చొప్పడ నొప్పుగ క్షత్రియాణి క
ర్యాణికి వల్లవాన్వయజ యానతికిన్ స్మృతిచోదితక్రమ
ప్రీణితలోకుఁ డౌచు సలిపెన్ మఱి పుంసవనాదిసంస్క్రియల్
జాణతనంబుమీఱ శుభలగ్నములం దుచితంపువేళలన్. 166

క. నెచ్చెలుల సేవలను మది
నచ్చెడెలుక్లమమెఱుంగ కలరఁగఁ బ్రొద్దుల్
పొచ్చుదు నొప్పులఁబడఁగాఁ
బొచ్చెను బ్రాహ్మణి యలంత సోలుచుఁ దొలుతన్. 167

ఆ. శుభముహూర్తమెంచి సూతికాగృహమునఁ
బురుటిమంచ మాదిఁ బొందుపఱుప
నట్టుఁ గడుపు చల్లనై నట్టిముత్తైదు
వలను దెచ్చి పనిచి రెలమిఁ జెలులు. 168

సీ. మంత్రసాని కిఁకొక్కమాఱింపరే వార్త
యాలసించిన దేమొ యరయుఁ డనుచుఁ
గ్రచ్చఱ నారణ్యకశ్రుతిమంత్రోద
కముల సంపాదింపఁ గడఁగుఁ డనుచు
నిలువ లేకున్నది మెలఁత శివాలయం
బున నందిఁ ద్రిప్పిరాఁ జనరె యనుచుఁ
గార్తాంతికులు ప్రొద్దు కట్టుకోఁదగు సమ
యంబు శీర్షోదయం బయ్యె ననుచుఁ

గీ. జల్లరే కలిసీళ్లు కంచంబు గొట్టి
చెచ్చెరఁ బరుండఁ బెట్టరే చేఁటలోనఁ
జూచెద రదేమొ వేన్నీళ్లు కాఁచ రనుచుఁ
జెలులమెలుఁగులు పురుటింటఁ గలయఁ గ్రమ్మె. 169

గీ. మగశిశువు పుట్టె నంచు జా నగునరిష్ట
గృహము వెలువడి చెలులు పర్వెత్తి వచ్చి
చంద్రగుప్తుసంవ్యానవస్త్రంబు గొనిరి
పూర్ణపాత్రం బటంచు నుబ్బునను నగుచు. 170

ఉ. చేడెలు పొత్తులంబొదివి చిన్నికుమారుమొగంబుసూప నా
మ్రేడితమైన వేడ్కఁగని మేనురసమ్మదవారిరాశి నో
లాడుచు నీరమాడి శుచియై ద్విజకోటికనేక దానముల్
తోడనెయాచరించి విబుధుండొనరించెను జాతకర్మమున్.

ఆ. బొడ్డు కోసి దాది బోరుకాడించి దు
వ్వలువఁ జెమ్మ నొత్తి తిలకముగను
గాలిఁద్రేలిమృత్తికను ఫాలమునఁ బెట్టి
బిడ్డఁ బవ్వళింపఁ బెట్టె యపుడు. 172

క. బాలెంతరాలిఁ గని నీ
బాలకు నీకిచ్చుమా కుపాయనములు వే
వే లీఁదగు నని నగుచును
లాలితగతిఁ జనిరి కాన్కలను గొని ద్విజుచే. 173

క. మఱియును గ్రమముగ ముప్పరు
తరుణులు కని శౌరపన్నిదము వైచినయ
క్కరణిని; సుతుల సబాంధవ
పరివారముగా ద్విజుండు ప్రమదము గాంచెన్. 174

గీ. రేయుఁ బవలును దాదు లరిష్టగృహము
వేయికన్నులఁ గావ నుర్వీసురునిక
ళత్రములు పురుడోమిరి పుత్రు లంక
ముల నలంకారములుగ రంజిల శుభాప్తి. 175

ఉ. భూదివిజాండమును బురుడు పుచ్చి ముదంబునస్నానమాడి యే
కాదశవాసరంబుల సుఖంబుగ స్నాన మొనర్చి వస్త్రభూ
షాదివిభూషితాంగు లగునాత్మకళత్రము లొక్క రొక్క రే
దాదులచేతికందువులఁ దామ గ్రహించి వహింపఁ బ్రక్కగన్.

సీ. కాత్యాయనుని యెడఁ గలగౌరవము పేర్మి
బ్రాహ్మణీసుతునకు వరరుచి యని
యర్కవిక్రమ మూని యలరు వీఁ డనిక్షత్రి
యాణిబిడ్డకు విక్రమార్కుఁ డనియు
భటిధాతుకర్మత ఘటియించుధర కని
వైశ్యప్రసూతికి భట్టి యనియు
ధర భరించి హరించు నురగేంద్రునాఖ్య శూ
ద్రాత్మజునకు భర్తృహరి యటంచు
నామకరణం బొనర్చి నానందమగ్న
చిత్తుఁడై వేదవేదాంగవేత్తృ భూసు
రోత్తమాశీస్సుమాలంకృతోత్తమాంగుఁ
డగుచుఁ బుణ్యాహపూర్వకం బవనిసురుఁడు. 177

క. చతురామ్నాయములో హరి
చతుర్భుజంబులో విరించిచతురాస్యములో
చతురుదధులో యన విప్రుని
చతురాత్మజు లింపు గొలుపసాఁగిరి ప్రజకున్. 178

చ. క్రమముగ శైశవం బరుగఁగా ద్విజమాళి త్రివర్ణజాత్యప
త్యములకు శాస్త్రసమ్మతపథంబునఁ దా నుపనీతులన్ బొన
ర్చి మమత వేదశాస్త్రములఁ జెప్పుచు నంతిమవర్ణజాత్యప
త్యమునకుఁగూడవిద్యలుచిత్రక్రియనేర్పఁగఁజొచ్చెఁబ్రీతితోన్

గీ. అవరవర్ణాంగనోద్భవుం డగుట భర్తృ
హారిని విడనాడి ముప్వుర కాత్మజుల క
హర్నిశము దీక్ష వేదవేదాంగములను
గఱపు విప్రుండు శిష్యసంఘమునఁ గలిపి. 180

క. మఱియును షడ్దర్శనములు
పరిపాటిని నేర్పఁ దలఁచి పాఠం జల మం
దఱ కారంభించుటఁ దా
నరసి యిటు లెడంద భర్తృహరి చింతిల్లెన్. 181

శా. వైమాత్రేయులతోఁ బ్రదయాపఠనసౌభాగ్యంబు లేదా యెనం
చేమాత్రంబు మనంబునన్ వగవఁ గానీ పాపమో పుణ్యమో
యామూలాగ్రమహీంద్రభాష్య మొకమాఱాలింప లేకున్కి నా
కీమే నేటి కటంచు నిత్య మెదలో నెంతేని జింతిల్లెదన్. 182

క. అని గోడ్వడి యేకతమున
జనకుని గని వేఁడె మానసవ్యథ దీర్పం
గను నీకంటె శరణ్యుం
బనఘా యొకఁ డున్నె ప్రోవవా దయ నన్నున్. 183

గీ. పాణినీయంబునకు మహాభాష్య మొనర
సంతరించి పతంజలిసంయమీంద్రుఁ
డే తదీయప్రచారార్థ మిటు త్వదాకృ
తిని జనించె నటందురు మునిజనంబు. 184

ఉ. అంతటినీకు నందనుఁడనై పఠియించుట మాట కేమి యా
ద్యంతము నొక్క మారలపతంజలిభాష్యము నాలకింప వాం
ఛింతు విమాతృజుల్ దరికిఁ జేరఁగ నీమి జఘన్యకన్యకా
సంతతి నేల యైతి నని సంతపియింతు నిరంతరం బెదన్. 185

గీ. ఎన్ని వేలజన్మంబుల నెత్తినను భు
జంగనాథగవీసుధాచాంతిభాగ్య
మమర దంద్రుఁడు నీయట్టిభాష్యాశయజ్ఞు
పట్టినై పుట్టి యిటు దుఃఖపడుట తగునె. 186

క. కావున మీచదువుకొనెడు
తావున వివరం బొకండు త్రవ్వికొని యటన్
దేవా! వసించి వినియెద
నీవే యీవరముమాత్రమే సదయుఁడవై. 187

చ. అనుటయుఁ దండ్రి భర్తృహరి నాదరణంబునఁ బల్కు బిడ్డ నీ
వని నటు చేయుమయ్య! హృదయాంతరదుర్భరశోకవహ్ని నె
ల్లను దిగఁద్రావి స్వస్థత మెలంగఁగదే యవధానయుక్తివై
విను గురుసంప్రదాయపదవీహిత మైనమదీయసూక్తులన్.

గీ. ఖలులచే గౌతమమతంబు ఖండిత మగుఁ
గాక జైమినిమతమును గలఁగుఁ గాక
వ్యాసమతము నిరాసను వడయుఁ గాక
పోఁక శక్యమె ఫణిరాజసూక్తి సుంత. 189

చ. ఇతరము లైనశాస్త్రముల నెల్ల రచించినవారు మర్త్యులం
దతిమతిశక్తు లౌమునులు; వ్యాకృతిభాష్యవిధాత యన్న నీ
క్షితితలమున్ భరించి యడఁగించెడునాభగవంతుఁ డైన ధృ
త్క్ష్మతిపతి కానఁ దద్వచనకోటిఁ బ్రమాణము లేశలేశమున్.

గీ. అశుచియు శఠుండు విషయులోలాత్ముఁ డాస్తి
కాహితుఁడు గురుశాస్త్రభక్త్యనభిగముఁడు
నైనవానికి భాష్య మావంత గలుప
యహిపతి విషాస్యుఁడై తోఁచి యపుడ కూల్చు. 191

క. ప్రయుతు జితేంద్రియు నమలహృ
దయు గురుశాస్త్రాతిభక్తు ధార్మికు శిష్యున్
నియతిఁ జదివింప భాష్యం
బయ మగు నఘ ముడుఁగు గురున కనుకూలుఁ డగున్. 192

గీ. ఎఱుఁగవే సూత్రవార్తికకృన్మునీంద్ర
చరిత మేరీతి నయ్యెనో యెఱుఁగవే ఫ
ణీంద్రశిష్యునికథఁ జెప్ప నేల వ్యాక
రణము బహుళాంతరాయాకరం బటంచు. 193

గీ. కుశలమునకై మునిత్రయి కూర్చె 'వృద్ధి'
యనియు'సిద్ధ'యనియు 'అథ'యనియు మొదట
నాత్మకృతులందు సొరిది;నిరాగసు లగు
పఠితలకు దాన మంగళావాప్తి గలుగు. 194

క. ప్రథమోత్తరాహ్నికమునకుఁ
బృథకుపతి విధించుఫలమునే చెప్పిరి గా
బుధు లఖిలాహ్నికములకున్
ప్రథితం బుపలక్షణముగఁ బ్రస్ఫుటఫణితిన్. 195

గీ. యక్షరక్షోగణగ్రహవ్యాధివితతి
బాధితుం డగువిప్రుఁ డీభాష్యపఠన
మహరహము భక్తియుక్తుఁడై యాచరింప
సర్వకాలంబు శ్రేయసములఁ బడయు. 196

ఉ. వ్యాకృతిభాష్య మెన్న నిగమాంగముతుర్యకులాంగనోద్భవుం
డేకరణిన్ బఠింపఁ దగు నెక్కుడియర్హత లంద్రు గాక సు
శ్లోకులు నాత్మవేత్తలును సూనృతవాదులు నాభవాదృశుల్
సేకొన నెంచుచో విధినిషేధము లంచుఁ దలంపఁ బోలునే.

ఉ. అంతియ కాదు నీజనని యవ్వని నత్తఱి వత్సదంతఘా
తాంతరితోరగేశ్వరమహాకృతివర్ణనిరీక్షణోదితా
నంతశుగాశుగక్షతహృదంతరు నన్ బ్రదికింప; నేఁడుత
త్సంతతి నిన్నుఁ దప్పక కృతఘ్నతకున్ దలయొగ్గఁ నేర్తునే.198

చ. అనుజనకోక్తులన్ విని మహాత్ముఁ డతం డెద విస్మయంబునన్
మునిఁగి ఫలించెఁ గోర్కులని మోదమునొందిధరిత్రిగర్భమం
దున వసియించుచున్ జనకుతోడఁ బతంజలి భాష్య మెల్ల న
ల్లనఁ బఠియించె మించె విమలం బగుజ్ఞానము పేర్మి నన్నలన్.

ఉ. ఈక్రియఁ జంద్రగుప్తుఁడు నిజాత్మజులన్ భుజగేంద్ర భాష్యని
ర్వక్రవిచక్షణత్వచతురత్వసమేతులఁ గా నొనర్చి ధ
ర్మక్రియ దారసంగ్రహధురంధరులన్ బచరించి యాశ్రమ
ప్రక్రమ మెంచి సంసృతివిరక్తి వహించిచనెన్ ముముక్షువై.

గీ. సర్వసంగపరిత్యాగధూర్వహత్వ
మెనసి యటు చని శుకశిష్యు ననఘు గౌడ
పదమహర్షి ని గాశికాపట్టనస్థఁ
జేరి చరమాశ్రమంబును స్వీకరించె. 201

క. గోవిందయతీంద్రుఁ డనం
గా వెలసె నతండు కాశికాపురిపొంతన్
ద్యోవాహినీతటీస్థలి
నావాసము గాంచి తపసియై పెక్కేఁడుల్. 202

సీ. ఎవ్వాఁడు ధర జనియించె షణ్మతముల
స్థాపించి లోకరక్షణము సేయ
నెవ్వాఁడు బాల్యమం దెలమి సాంగముగ బ్రా
మిన్కుల నొక్కవేల్మిడి గ్రహించె

నెవ్వాఁడు సన్యాస మెసఁగి నక్రగృహీత
చరణుఁడై మాత్రనుజ్ఞప్తిఁ గాంచి
యెవ్వాఁడు సాక్షాన్మహేశ్వరుం డని పద్మ
పాదాదులకు స్తుతిపాత్రుఁ డయ్యె
నట్టిశ్రీశంకరాచార్యనంతవాని
కాత్మవిజ్ఞానబోద్ధయై యఖిలజగము
నుద్ధరించినగోవిందయోగిచంద్రు
మహిమ మెన్నఁ దరంబె సామాన్యులకును. 203

ఉ. ఎందుల నద్వితీయత మహిన్ బ్రథ కెక్కిన శంకరార్యుఁడుర్
ముందుగఁ బూర్ణదర్శనముఁబొందఁగఁజాలెనెభూమిభృద్గుహా
మందిరవర్తిమందుఁ బదమాత్రము కాంచిప్రదక్షిణించి గో
విందయతీంద్ర యంచు మొఱవెట్టెకదా కనఁగల్గెఁదత్కృపన్.

సీ. జీవితాపేక్షఁ ద్యజించి యహీంద్రభా
ష్యము నేర్చి బ్రహ్మరాక్షసునియొద్ద
నమ్మహాభాష్యమ్ము వ్యాప్తి నొందఁగ నెల్ల
క్షితి నింపె శిష్యప్రశిష్యకోటి
నన్యస్తకాముఁడై చతురాత్మభవులకు
సంసార మర్పించి చనియె ధృతిని
నద్వైతమతరహస్యజ్ఞాతయై యోగ
నిష్ఠాగరిష్ఠుఁడై నెగడెఁ దమిని

షణ్మతస్థాపనాచార్యశంకరార్య
గురుపదం బయి వెలసె దుష్కరతపఃక్రి
యోత్సుకుం డయ్యె గోవిందయోగి సర్వ
గతులఁ గాంచె జనుస్సార్థకత్వ మార. 205

ఉ. ఆకరణిన్ దపస్వియయి యద్రిగుహాంతరమందు నొంటిమై
నాఁకలి దప్పి లేక సతతాహితయోగసమాధియై బుధా
నీకవతంసితాంఘ్రి యయి నిత్యసుఖస్థితిఁ జంద్రగుప్తుఁ డ
స్తోకతపోధనార్జనరతుం డయి భాసిలుచుండు నయ్యెడన్.

ఉ. ఇక్కడ నుజ్జనిన్ జనకుఁ డేఁగుట కాత్మల నల్వు రాత్మజుల్
పొక్కి తమంతఁ దాము పరిపూర్ణవివేకులు కావునన్ ధృతిన్
జిక్కఁగఁ బట్టి స్రుక్కుజననీతతి ధైర్యవివేకముగ్ధమా
వాక్కులఁ దేర్చి మించిరి శుభస్థితి నాంధ్రను గూడి వేడుకన్

ఉ. సంతత మింద్రియంబుల వశస్థితిఁ గ్లేశముపెట్ట నట్లె య
త్యంతము స్వైరవృత్తి విషయంబులఁ బాఱఁగ నీక ధీర మా
స్వాంతములన్ భజించిరి త్రివర్గము శాస్త్రపథాధ్వనీనులై
చింత నెఱుంగ కవ్వరరుచిప్రముఖుల్ గృహమేధిసింహులై.

చ. సకలదిగంచలంబులు విశాలత భాసిలినన్ దివాకరుం
డొకతొలిదిక్కునందవిధృతోదయుఁడౌనటు వేదశాస్త్రముల్
సకలమెఱింగియున్ గణితశాస్త్రమునందునెగ్రంథముల్ రచిం
చి కనెయశంబులన్ వరరుచిద్విజరాజు కళాభిరాముఁడై. 209

క. తదనుజుఁడు విక్రమార్కుఁడు
విదితాఖిలవేదశాస్త్రవివిధలిపికళా
హృదయుఁడు ప్రతాపవిస్ఫుర
ణదళితరిపుతిమిరుఁ డొప్పు సరసఖుఁ డనఁగన్. 210

సీ. చేతి కెమ్మొక్క లేనిరీతి నర్థార్థుల
కాంక్షితంబు లొసంగఁ గలుగుదాత
వె న్నిచ్చు టెఱుఁగక వేటాఱు తునియలు
గా రిపుసేనలఁ గడపుజేత
యగ్ని దూఁకుట కేని యడుగు వెన్కకుఁబెట్ట
నట్టి యప్రతిమసాహసవిధాత
యాడినమాట సూర్యాచంద్రములగతుల్
దప్పినం దప్పని ధర్మపాత

గీ. చక్కఁదనమునఁ గందర్పశతముతాత
యప్రమేయమతిప్రభావాప్తి ధాత
సకలహరిదంతలగ్నయశఃప్రణేత
విక్రమార్కమహీలోకవిబుధనేత. 211

ఉ. ప్రాణము గడ్డిపోఁచవలె భావనసేసి పరోపకారపా
రీణత సాహసాంకము ధరించి శిశుత్వమునందె విక్రమ
క్షోణివిభుండు కీర్తిసుమగుచ్ఛములన్ హరిదేణలోచనా
వేణులఁ జెక్కుఁగానిపగబింబఫలోష్ఠులఁ గన్నమొక్కఁడాన్.

సీ. తెలియఁ డేమో కాని నళినజులిపి యొండు
చదువ వ్రాయఁగ నేర్చు సకలలిపులు
నాడఁ డేమో కాని యమృతభాష నొకండ
యఖిలభాషావ్యవహార మూను
నేర్వఁ డేమో కాని నెలలోనికళ యొండు
గడిదేఱ భువిఁ గలకళల నెల్లఁ
దలఁపఁ డేమో కాని తనచేయుదానముల్
వినిన దెల్లఁ దలంపునను ధరించు.

గీ. బుద్ధిని బృహస్పతియ రూపమున మరుండ
శౌర్యమున రాఘవుఁడ యీవి సౌరతరువ
తేజమున నర్కుఁడే యనఁ దేజరిల్లు
విక్రమార్కుం డమానుషవిక్రముండు. 213

క. దోహలబహుళుం డాతేఁ
డాహవమున మహి ననన్వయాలంకారో
దాహరణం బౌతటి నొక
యాహర్ముఖవేళ యద్భుతావాపముగన్. 214

ఉ. బాలసరోజినీరమణబాంధవమై యనిలాతిగస్యద
శ్రీలతురంగమం బయి ధరిత్రికి దివ్వన డిగ్గి వచ్చు తే
ఖాలయశాతకుంభరథ మభ్రమునన్ గనుపట్టి యంతలో
నే లలితాకృతిన్ వసుమతీంద్రునిమ్రోలను నిల్చెఁ గ్రుక్కునన్.

చ. అది గని విక్రమార్కుఁ డుదితాద్భుతుఁడై కదియంగ నేఁగిన
మ్మదమున నుబ్బి మ్రొక్కిడుమాతలిపల్కుల నింద్రుఁడంపిన
ట్టిది యరదం బటం చెఱిఁగి డెందమునన్ ముద మొందియేల న
న్ని దివిజభర్త తేఁ బనిచెనో వివరంబుగఁ దెల్పు నావుడున్.

క. మాతలి వినీతి నిటు లను
భూతలదేవేంద్ర ! స్వర్గమున నాట్యకళా
రీతుల యచ్చరచెలువల
కాతతగతిఁ గలహ మొదవె సహామహామికలన్. 217

ఉ. అయ్యెడ నారదుండు కలహాశనుఁ డయ్యు వివాద మాఁపి యో
తొయ్యలులార యెల్లవిబుధుల్ విన నొండొరుఁ దూలనాడుకో
న్యాయ్యమె మీకు మీనటనమందలి భేద మెఱింగి చెప్పువాఁ
డియ్యెడ లేఁడు విక్రమమహీపతి దక్క నటంచుఁ బల్కఁగన్.

ఉ. వైళమ నిన్నుఁ దోడుకొని వచ్చుట కిచ్చటి కంపె నన్నుదోత్ర
పాలకుఁ డీవు జాగు సలుపన్ దగ దెక్కుము స్యందనంబు భూ
పాలక ! శ్రీఘ్రమే మరలి వత్తువు వారలతారతమ్యముల్
హేలగఁ జూచి తెల్పఁదగు నెవ్వఁడు త్వాదృశుఁ డివ్వసుంధరన్

చ. అనుటయు మోదమానహృదయమ్మున నాధరణీంద్రుఁ డారథం
బున నుపవిష్టుఁడై త్రిదివమున్ క్షణకాలమునందుఁ జేరి య
య్యనిమిషనాయకాదరసమంచితదోఃపరిరంభణాద్యుపా
యనములఁ గాంచి దేవసభ యందు వసించెఁ దదాజ్ఞ చొప్పునన్

ఉ. అత్తఱి నింద్రునాజ్ఞ గొని యచ్చరలొక్కొక రేఁగుదెంచి రా
జోత్తముఁ బారిజాతకుసుమోచ్చయవృష్టులముంచి పాత్రలై
నృత్తముపక్రమించిరి యనేకవిధం బగుమండలభ్రమిన్
జిత్తముతోడ సభ్యులకు నేత్రములున్ భ్రమియింపఁగిట్టుచున్.

క. ఆగతిఁ దౌర్యత్రికసం
యోగమ్మగునాట్యకళఁ బయోధరవేణుల్
రాగిలుచుఁ బ్రదర్శింపఁ ద
దాగమహృదయజ్ఞుఁ డగుధరాధిపు నెదుటన్. 222

సీ. ఆంగికాభినయంబునం దుత్తమయె రంభ
కాని గీతము నేలొ మాన మఱచె
నాహార్యకాభినయంబున మేనక
హెచ్చెఁ గాని ప్రవేశ మేలొ తప్పె
వాచికాభినయంబు వరుసఁ దిలోత్తమ
మిగిలెఁ గాని నిజోక్తి మ్రింగివైచె
సాత్వికాభినయంబుసరణి నూర్వశి మేలు
బంతియే కాని హావము గణింప

దనుచు నయ్యచ్చరలవివిధాభినయవి
శేషములఁ దెల్పి యందలిదోషములును
జూపి యందఱగర్వముల్ రూపుమాపి
పార్థివుఁడు సభ్యసంస్తవపాత్రుఁ డయ్యె. 223

ఉ. నర్తనగీతికాభినయనాగరకత్వములన్ జగత్త్రయీ
వర్తితనర్తకీజనము వంతుల గెల్చిన యప్సరస్తతిన్
గీర్తన కెక్క లెస్స పరికించి తదంతర ముగ్గడించు భూ
భర్తను నాకభర్త కయివారముసేసియు వందికైవడిన్. 224

శా. ఓరాజన్య! గమించె నిప్పటికి నాయుల్లంబు స్వర్గానకీ
వారంబందలితారతమ్యములఁ జెప్పన్ నేర్చువానిన్ ద్రిలో
కీరాజన్యులలో నినుం దొఱఁగి లక్షింపం దరంబే బహూ
కారం బేమి యొసంగఁ జాలెద మనర్ఘం బైననీశక్తికిన్. 225

శా. ఈసింహాసన మెక్కి భూతలము వే యేండ్లేలు మం చిచ్చె ను
ల్లాసం బంది శచీధవుండు మణిమాలాకీలితంబై ప్రభా
వాసం బై సురకింకరౌఘ మయి దివ్యం బైనరత్నాసనం
బాసౌపర్వణసంసదంతరమునం దర్థిన్ ధరాజానికిన్. 226

ఉ. వాసవునాజ్ఞఁ బూని త్రిదివంబుననున్నసురౌఘ మష్ట సం
తోసమునన్ జెలంగుచు మనుష్యజగంబున కాకళానిధిన్
జేసిరి రాజుగాఁగ నభిషేకము పట్టము గట్టి దివ్యసిం
హాసనమందు నుంచి సకలాంబుధిశైవలినీజలంబులన్. 227

ఉ. అంతట నింద్రదత్తమహితాసనసంయుతుఁ డౌచు వచ్చుభూ
కాంతుని గాంచి భట్టి కుతుకంబునఁ దా నెదు రేఁగి నాఁటివృ
త్తాంత మెఱింగి పొంగి "యటులైన నిఁకొక్కశరత్సహస్రమే
లింతు సమస్తధారుణిబళీ" యనిపల్కె స్మితాంచితాస్యుఁడై.

క. అది యెటు లని రా జనుగన్
జనరుం డగు భట్టి యనె 'విశాంపతివర ! యా
త్రిదివపతి వేయియేఁడులు
గద యీపీఠిక వసింపఁ గల వని పలికెన్. 228

ఆ. ఏఁటి కాఱు నెలల యిది యెక్కి ధర నేలు
మఫ్రుల నాఱు నెలలు నవనిఁ దిరుగు
మట్టిలేని దిగ్గుణితాయుష్యమున మించి
వరలె దే నొసంగు వర మి దెన్న'. 229

చ. అన విని భట్టిసూక్ష్మమతి కచ్చెరువొందుచు విక్రమార్కుఁ డ
య్యనుజుని మాటఁబట్టి శరదర్ధము రాజ్యము సేయుచాఱ్నెలల్
వనులఁ జరించు చిట్లు ప్రతివత్సర మిమ్మడియాయువొంది ధా
త్రిని బరిపాలనంబు వొనరించె నిరీతిగ నీతిమంతుఁడై. 230

చ. కుడిభుజమై నిజాగ్రజునకున్ క్షితి నిస్తులధర్మపద్ధతిన్
నడపుచు దుష్టశత్రుల నణంచుచు భట్టి యజస్ర మప్రమ
త్తుఁ డగుప్రధానుఁడై బుధహితుండయి రామచరిత్రకావ్యమా
మనువునఁ జెప్పె వ్యాకరణపఙ్క్తికి లక్ష్యము లౌపదంబులన్.

గీ. అన్న దేశాటనంబుకై యరుగునాఱు
నెలలు రాజ్యమ్ము నేలు నిర్నిద్రుఁ డగుచు
నన్న రాజ్యమ్ము పాలించునాఱు నెలలు
వ్యాకరణశాస్త్రలక్ష్యకావ్యము రచించు. 232

క. ఉర్విఁ గలయంతకాల ము
ఖర్వగతిన్ వెలుఁగ భట్టి ఘటియించె నహో

గీర్వాణవాణిశిరమున
నర్వాచీనముగ మణిమయకిరీటంబుగ. 233

క. కందర్పధనూరసములఁ
జిందునుడుల భర్తృహరి రచించె శతకముల్
పొందుగ మూఁడిటి శృంగా
రేందిర నీతియు విరక్తి నృత్యము సేయన్ 234

మ. ఫరణిం బ్రోవ సపాదలక్ష మగుగ్రంథమ్మానటుల్ దక్షుఁడై
విరచించెన్ భుజగేంద్ర భాష్యమునకున్ విఖ్యాతమా వ్యాఖ్యదు
ష్కరవత్సక్షతవర్ణపూర్తి మతివైశద్యంబునన్ జేయుచున్
నరమాత్రుం డనుటెట్లు భర్తృహరినెన్నన్ బన్నగేంద్రుఁడగున్.

క. సకలమనీషివతంసా
లికి దుర్గ్రహమగుపతంజలికృతి నరసి యి
ట్లకలంకఫణితి వివరణ
మకట! రచించుటకు గర్వ మంది యిటు లనన్. 236

ఆ. ఏమి భాష్య మూర యేమి మహాభాష్య
మేమి మేము బళిర! యేమి మేము
నన్నుఁ గాంచ కుండ నాకంబునకుఁ బతం
జలి యధన్యుఁ డగుటఁ జనియె మున్న. 237

మ. అని గర్వోన్మదసూక్తిఁ బల్కుటయునయ్యాచార్యధిక్కారసం
జనితాఘంబునఁ దత్కృతం బయి ప్రశంసాపాత్ర మాటీక చ
య్యనఁ జేరేనియుధాత్రి లేకడఁగెఁ; విద్యల్ మాయమై పోవఁగో
వినయాపాయము చేత నాస తెగఁ దస్వీచారిమంబట్టులై.

చ. వరరుచి జ్యౌతిషశ్రుతివివర్ధనముల్ బచరింపఁగా నిరం
తరమును సాహసాంకవసుధాపతి విద్యల నెల్లఁ బ్రోవ; వ్యా
కరణము భట్టి కావ్యవినిబద్ధము సేసి వెలార్ప; భాష్యవి
స్తర మెఱిఁగింపభర్తృహరిధారిణియయ్యెను శాస్త్రపూర్ణమై.

శా. సౌభ్రాత్రంబును సౌహృదయ్యము సముచ్ఛ్రాయంబుఁ జెం
దన్ యశ
శ్శుభ్రచ్ఛాయల దిక్కులన్ గమిచి సంశుద్ధాత్ములానల్వురున్
సుభ్రూరత్నములన్ సుతుల్ హితులు సంతోషింపఁ బెంపొందిన స్వ
ర్గభ్రాంతిన్ ఘటియింతు రుజ్జనికి భోగత్యాగవిస్ఫూర్తులన్.

సీ. నడచు ధర్మము నాలుగడుగులఁ గృతయుగ
మున శుద్ధి యని జగంబులు నుతింపఁ
గురియును సస్యానుకూలంబుగా వాన
లేకోనయును వఱ పెఱుఁగకుండ
విధివిహితక్రియాన్వితమై వెలయుఁ జా
తుర్వర్ణ్యమును సమృద్ధుల వహించి
శత్రుధాటీరుజాక్షామతస్కరపీడ
లలమ వేఁకి స్వప్నమందు నేని

గీ. వరరుచిపురోధగా మంత్రిపదము భట్టి
పూనఁగా భర్తృహరి మైత్ర్యమున భజింప
నుజ్జయిని విక్రమార్కుఁ డుండి ధరణి
పాలనము సేయు నాశుభోద్వేలవేళ. 241

క. ఇది వ్యాకరణాగమ మ
భ్యుదయము గాంచంగ హేతుభూతులయి జగ

ద్వైదితు లయినవై యాకర
ణాదిగ్గజంబులచరిత్ర నా నుతికెక్కన్. 242

చ. పరమమునీంద్రులై ధరణిభాగమునన్ జనియించువాణినిన్
వరరుచినిన్ బతంజలి సభక్తి త్రిమూర్తులు గాఁ దలంచి త
చ్చరిత వెలుంగువారికి రసప్రచురం బగుశుద్ధభాషణ
స్ఫురణముతోఁ లభించు ధనముల్ పురుషాయువమున్ యశం
బులున్. 243

ఆశ్వాసాంతము.

శా. సర్వాశాంతరజగ్మివన్నిజయశశ్చంద్రప్రభాతస్థివ
త్సర్వాజాండవివిశ్వదాగమవివిదద్వచ్ఛిమ్యభాషోక్పదే
శోర్వానందదదృశ్వదప్రతిమభాగ్యోపే యువర్ధిర! వి
శ్వోర్వీభృన్మకుటీజగద్వదనఘోందోర్యగాంఘ్రిపద్మద్వయా!

పృథ్వీవృత్తము.

మనీషిమణిచక్రసంమదనిరంతరోక్తిప్రతి
ధ్వనిప్రబలగర్తపత్తనవరాంచితశ్రీనికే
తనేశయతిపాభిషిక్తపదశాస్త్రసామ్రాజ్యపా
లనగ్రథితపట్టఫాలతల! సత్కృపాశీతలా. 245

ఇది శ్రీగురు కరుణాసమాసాదిత కవిత్వ వెంపరాల
సూర్యనారాయణ నామధేయ ప్రణీతంబయిన
మునిత్రయ చరిత్రంబునఁ జతుర్థాశ్వాసము
సర్వముసంపూర్ణము.

# తప్పొప్పులపట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 7 | 8 | నొనరించు | నొనరింతు |
| 15 | 5 | కుతికంటి | కుతికంటు |
| 17 | 12 | కారాతిన్ | కారాదిన్ |
| ... | 14 | నెట్లు దప్పది | నెట్లు దన్పది |
| 21 | 18 | వర్ష గురుదర్శన | వర్ష గురుఁగన్గొను |
| 22 | 18 | దలంచుమా | దలంపుమా |
| 23 | 17 | పుష్ట | ప్లుష్ట |
| 38 | 17,18 | విశ్రుతి ... వై | విశ్రుతుండయి ఋగ్యజు షశ్రుతిజ్ఞుఁ, డై ... |
| 43 | 11 | దప్పదటంచువారి | దప్పదటంచు వచించి వారి |
| 53 | 13 | షట్త్రయంబున | షట్తయంబున |
| 75 | 7 | బాగిలితి జిరము | బాగిలితిఁజిరము |
| 82 | 4 | ఋగ్యజు రాదికముల | ఋగ్యజుషాదికముల |
| 84 | 2 | రచియించె నెల్ల శాస్త్రము | కూర్చె శాస్త్రమెల్లను |
| 86 | 17 | ఈవుపాధ్యాయుని వను టెల్లు తల్లి | ఈవునాకుపాధ్యాయాని వే జననిరో |
| 87 | 12 | ప్రతినాద్యురు | ప్రతివాద్యురు |
| 88 | 20 | అధరస్పందంబు | అధరస్పందంబు, |
| 94 | 2 | వారి నా | వారి యా |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 96 | 4 | లప్పాణిర్ | లప్పాణినిన్ |
| 106 | 9 | రహస్స్యలై | రహస్యలై |
| 110 | 15 | బ్రతిద్రయోదశి | బ్రతిత్రయోదశి. |
| 112 | 6 | శరదంభోదర | శరదంభోధర |
| 119 | 18 | మేలుకొనుఁడుఁ | మేలుకొనుడుఁ |
| 120 | 17 | వేడు | వేఁడు |
| 129 | 8, 9 | నొక్కపతియు కటకటా | నొక్కపతియుఁగటకటా |
| 131 | 13 | మూనె దా | మూనెఁ దా |
| 136 | 10 | లుదితత్వర | లుదిత్వర |
| 139 | 7 | శైలిసుతా | శైలసుతా |
| ... | 14 | రనుటర్ | రనుటల్. |
| 147 | 9 | వ్రాఘ్ర | వ్యాఘ్ర |
| 150 | 1 | వాఘ్ర | వ్యాఘ్ర |
| ... | 9 | డౌర్మస్య | డౌర్మనస్య |
| 153 | 19 | వాక్యవారుండు | వాక్యకారుండు |
| 159 | 16 | నొనర్పుమూఢుఁడ | నొనర్పుఁడజ్ఞుఁడ |
| ... | 19 | శీలత | శీతల |
| 160 | 3 | వయ్యున్ | వయ్యున్ |
| ... | 4 | తొలంగున్ | తొలఁగున్ |
| ... | 15 | ముహ్వాని | మహ్వాని |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 161 | 3 | మూంగుండై | మూంగుఁడై |
| 164 | 2 | దారిసత్వ | దారితస్వ |
| 165 | 6 | ప్రతిభ | ప్రతిమ |
| 166 | 17 | శాబ్ధికుండైన | శాబ్దికుండైన |
| 171 | 11 | బీతిల్ల | భీతిల్ల |
| 174 | 11 | తరంగణి | తరంగిణి |
| 181 | 12 | రదనచ్ఛవి | రదచ్ఛవి |
| 184 | 13 | గాత్రలోకక్ష | గాల్దొరికక్ష |
| 193 | 5 | గర్భణాం | గర్భధారణా |
| 195 | 6 | ధాతఘట | ధాతపట |
| 200 | 12 | గెరకి | గెరలి |
| 201 | 9 | సౌదామినీ | సౌదామనీ |
| 202 | 13 | పౌలఁతుల్ | ము, పౌలఁతుల్ |
| 203 | 10 | రార్తికముల | రాత్రికముల |
| 209 | 2 | దా-వనీతులఁ | దానుపనీతులన్ |
| 210 | 5 | నంద ...ఁడనై | నందనుఁడనై |
| 213 | 3 | వసియింరుచున్ | వసియించుచున్ |
| ... | 19 | సాంగముగ బ్రా | సాంగముగఁబ్రా |
| 217 | 12 | విక్రనూర్కుం | విక్రమార్కుం |
| 218 | 2 | స,మ్ముద్రమున | స,మ్ముద్రమున |
| 221 | 7 | మట్టిలేని | మట్టులేని |
| ... | 16 | ఫక్కి-కి-తుల్యము | ఫక్కికిలతుల్యము. |

*For copies apply to :—*


**Vemparala Suryanarayana Sastry,**

**TELUGU PANDIT,**

**Board National High School,**

**RAMACHANDRAPURAM,**

East Godavari Dt.